అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక

ARUNATARA

సంపుటి: 44 సంచిక: 5 హైదరాబాద్ 325 జూన్, 2016 పేజీలు: 68 వెల: రు. 20

కొన్ని సాయంత్రాలు నల్లని ఆకాశపు కొక్కానికి
ఒంటరి వెన్నెల ఉరిపోసుకుంటుంది
ఇప్పపూల వనం రాలిపోతూ
నిబ్బరాన్ని వదిలి నివురు కప్పుకుంది
తూరుపింకా తెలవారక నీ పేరు
తలుస్తూ పొలమారుతుంది
కొండు బాలుడొకడు గొడ్డలి నూరుతూ
నియాంగిరీ సానువుల్లో సాగిపోతున్నాడు

ఏప్రిల్ 24న కర్నూలులో పాణి రచన 'జనతన రాజ్యం' పుస్తకావిష్కరణ సభలో పాల్గొని ప్రసంగిస్తున్న
పి. వరలక్ష్మి, కె. శ్రీనివాస్, అల్లం రాజయ్య, పాణి

మే 3న హైదరాబాద్‌లోని లామకాన్‌లో జరిగిన కా. సత్యాం సంస్మరణ సభలో
ప్రసంగిస్తున్న వరవరరావు, వేదికపై గీతాంజలి, కె. బాల్‌రెడ్డి



ఏప్రిల్ 16న కర్నూలులో అరుణ్ రచన 'సీమగొంతుక వినండి'
పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్న భాస్కర్, జి. వెంకటకృష్ణ, అరుణ్,
బొజ్జా దశరాథ రామిరెడ్డి, ఎస్.జె. రవిప్రకాశ్, ఎం. రాఘవాచారి



మే 8న విజయవాడలో విరసం ఆధ్వర్యంలో జరిగిన వేముల రోహిత్‌పై
వచ్చిన 3 పుస్తకాల ఆవిష్కరణ సభలో పాల్గొన్న కోయి కోటేశ్వరరావు,
పచ్చల కిరణ్ కుమార్, భాస్కర్, షేక్ బాజీసైదా, కాకాని సుధాకర్

KLVA101M188

అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

325

సంపుటి : 44 ◈ సంచిక : 5 ◈ జూన్, 2016 వెల : రు. 20/-

సంపాదక లేఖ..

సత్నాం అంటే తెలుగు వాళ్లకు జంగల్‌నామా. దండకారణ్యం నుంచి 1990ల ఆరంభంలో సరిహద్దు, రాగో వంటి నవలలు వచ్చాయి. ఇంకా ఎన్నో కథలు వస్తున్నాయి. సత్నాం దండకారణ్యాన్ని జంగల్‌నామాగా 2002లో పంజాబీ పాఠకులకు, 2010లో ఇంగ్లిషులో పరిచయం చేశారు. 2012లో ఈ పుస్తకం తెలుగులోకి వచ్చింది. బయటి నుంచి దండకారణ్యానికి వెళ్లి మావోయిస్టు గెరిల్లా జోన్‌లోని నూతన ప్రపంచ నిర్మాణ ప్రయత్నాలను అక్షరబద్ధం చేసిన తొలి రచయిత సత్నామే కావచ్చు. అలాంటి పని అవసరమని రచయితగా, విప్లవాభిమానిగా గుర్తించడంలోనే ఆయన విశిష్టత ఉన్నది. దండకారణ్యం పట్ల తీవ్రమైన అనురక్తి ఉన్నందు వల్లే ఈ పని చేయగలిగారు. విప్లవ యుద్ధం జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి, ఆ యుద్ధపు అంతస్సారంలో మానవ వికాసక్రమం ఎలా ఉన్నదో ఆయన మనకు చెప్పదల్చుకున్నారు.

అందుకే ఈ పనికి ఆయన కల్పనారూపాన్ని ఎంచుకున్నారు. జంగల్‌నామా పుస్తకం కింద 'మావోయిస్టు గెరిల్లా జోన్‌లో అనుభవాలు' అనే ఉపశీర్షిక ఉంటుంది. ఆయన పొందిన అనుభవాలు ఎలాంటివంటే.. జంగల్‌నామా ఒక వాస్తవిక కల్పనా రూపంగా, కాల్పనిక వాస్తవికతగా కనిపించడం వెనుక అలాంటి మానవ సంబంధమైన అనుభవాలు ఉన్నాయి. విప్లవమనే గడ్డు వాస్తవంలో భాగమై, దాన్ని నిర్మిస్తున్న మానవుల సహచర్యంలో ఒక రచయిత పొందిన అనుభవాలు అలాంటివి. రక్తసిక్తమైన, కఠినమైన, సునిశితమైన యుద్ధ ఆచరణలోని సృజనాత్మకతను పట్టుకోగల విప్లవ దార్శనికత ఆయనకు ఉన్నదని ఆ రచన చదివితే అనిపిస్తుంది.

జంగల్‌నామా గురించి ఆయన 'ఇది పరిశోధనాత్మక పుస్తకం కాదు, కాల్పనిక సాహిత్యమూ కాద'ని అన్నారుగాని .. మావోయిస్టు గెరిల్లా జోన్‌లో ఆయన పొందిన అనుభవాలను తరచి చూసుకుంటే అందులో ఆ రెండూ ఉన్నాయి. ముఖ్యంగా దండకారణ్యంలో మావోయిస్టుల ఆచరణ గురించి ప్రతి దశలో అసంఖ్యాకంగా కథలు వస్తున్నా.. రాగో నవల తర్వాత మళ్లీ అంత విస్తృత రూపంగా జంగల్‌నామా వచ్చింది. ఆయన చెప్పినట్లు యాత్రానుభవంగానే గాక నవలా లక్షణాలూ ఉన్న జంగల్‌నామా 2002 నాటి దండకారణ్య ఉద్యమ దశను గొప్పగా చిత్రించింది.

దండకారణ్య ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా చిగురించి మారాకు వేస్తున్న కాలం అది. అన్ని రంగాల్లోకి ఆదివాసీ నాయకత్వం ఎదుగుతుండిన కాలం కూడా. యుద్ధంలో, ఉత్పత్తిలో, కళా సాంస్కృతిక రంగాల్లోని ఈ వికాస క్రమాన్ని సత్నాం చాలా సూక్ష్మస్థాయిలో పట్టుకోగలిగారని ఇప్పుడు మళ్లీ జంగల్‌నామా చదివితే అనిపిస్తుంది. నూతన సామాజిక, రాజకీయార్థిక, సాంస్కృతిక ప్రక్రియల్లోకి మనుషులు ఎలా పరివర్తన చెందుతారు? లేదా ఆ ప్రక్రియలు మనుషులను ఎలా తీర్చిదిద్దుతాయి? మనుషులు తమ చైతన్యవంతమైన ఆచరణ ద్వారా అలాంటి ప్రక్రియలను ఎలా నిర్వహించగలుగుతారు? అనే ప్రశ్నలకు జంగల్‌నామాలో సమాధానాలు వెతుక్కోవచ్చు.

ఎప్పటికైనా మనం ఒక కొత్త ప్రపంచాన్ని నిర్మించుకోగలం అనే భరోసా దండకారణ్యంలో ఉన్నది. రచయితగా సత్నాం జంగల్‌నామా ద్వారా కూడా అలాంటి భరోసానే ఇచ్చారు. సామూహికతలోని సృజనాత్మకత ఎంత బలమైనదో, అజేయమైనదో ఎవరికంటే సత్నాంకు తక్కువ తెలుసు? కానీ ఎందుకో ఆయన ఒంటరితనంలోకి ఒరిగిపోయారు. అత్యంత విషాదకరంగా నిష్క్రమించారు. బతుకును వివరించినంతగా కూడా ఆత్మహత్యను ఎవ్వరూ వివరించలేరు. ఇది హింసామయ ప్రపంచమనడానికి ఇలాంటి బలవన్మరణాలు దు:ఖకరమైన దాఖలా. ఎందుకంటే ప్రతి ఆత్మహత్యలోనూ అంతులేని ప్రశ్నల పరంపర ఉంటుంది. కేవలం సమూహంలో నుంచి ఒక వ్యక్తి రద్దయిపోవడమే కాదు. ఆ సమూహపు ఆత్మిక, సామాజిక, రాజకీయ సంబంధమైన ఒకానొక స్థితికి ఆత్మహత్య నిదర్శనం. సత్నాం మనకు ఈ వైపు నుంచి ఎన్నో ప్రశ్నలు వదిలి వెళ్లిపోయారు. ప్రశ్నల్లోంచి పుట్టి, ప్రశ్నలను రేకెత్తించి, ప్రశ్నల జడివాన మధ్యనే సమాధానపు తీరం చేరుకొనే విప్లవోద్యమంలో సత్నాం జీవితం, రచన, విప్లవాచరణ, బలవన్మరణమూ విడదీయలేని భాగం. అర్థాంతర, బలవన్మరణాలు రద్దయిపోయి, పరిపూర్ణ జీవితం వెల్లివిరిసే రోజు వస్తుందనే కలను కూడా సత్నాం మనకు ఇచ్చి వెళ్లారు. ఆ స్వాప్నికుడిని మన జ్ఞాపకాల్లో సజీవం చేసుకుందాం.

ఎడిటర్
దువ్వూరి వెంకట రామక్రిష్ణారావు
12-15-963, మాణికేశ్వరినగర్,
ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్, తార్నాకా,
హైదరాబాద్-500007.

రచనలు పంపించాల్సిన చిరునామ:
ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా, మౌలాలి,
హైదరాబాద్ - 500 040.

* కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా రచనలు పై చిరునామాకూ, ఇ-మెయిల్ ద్వారా **arunatara1977@gmail. com** కూ పంపవచ్చు

సంపాదకవర్గం :
ఉజ్వల్, బాసిత్, కూర్మనాథ్

మేనేజర్
యాటెల్లి రామచంద్రం
12-15-963, మాణికేశ్వరినగర్,
ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్,
తార్నాకా, హైదరాబాద్-500007.
సెల్ : 9949391028
(ఫోన్ చేయాల్సిన సమయం
ఉ. 9 గంటల లోపు, సా. 8 గంటల తర్వాత)

విరసం కార్యదర్శి చిరునామా
పి. వరలక్ష్మి
5-1820, గీతాశ్రమం వీధి,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.

డి. టి. పి. అండ్ లే అవుట్
ఆర్. భాగ్యలక్ష్మి, డి. వైజయంతి
కవర్ డిజైన్ : పి. వరలక్ష్మి,
ఆర్. భాగ్యలక్ష్మి
ఫొటోలు : క్రాంతి, విరసం మిత్రులు

Like Page://viplava rachayitala sangham arunatara

facebook ://viplava rachayitala sangham virasam

Virasam website : *www. virasam. org, www. virasam. in*

సంచిక - 325

అరుణతార నిర్వహణకు విరాళాల కోసం మా ప్రకటన చూసి ఎస్. సుధాకర్ శర్మ రూ. 5,000/-, సిద్దెంకి యాదగిరి రూ. 300/-లు విరాళంగా ఇచ్చారు. వారికి ఉద్యమాభినందనలు. - సం.

సంపాదకీయాలు (5)

విద్యార్థులపై మంద్రస్థాయి యుద్ధం - **పి. వరలక్ష్మి**

నివాళి (6-7)

జంగల్‌నామా - సత్నామ్ వీలునామా - **వరవరరావు**

కవిత్వం (7-10)

ఒక గదికో లేక ఒక మంచానికో పరిమితమైనపుడు **- పలమనేరు బాలాజీ**

ఈ కవిత పేరు...? - **కెక్యూబ్ వర్మ**

ఓ సిన్నబ్బీ... - **పొదుం శ్రీకాంత్**

'ప్రేమ అనే విస్ఫోటనం' - **వి.వి.**

కథలు (11-26)

ఉండవలసిన తీరు - **పద్మకుమారి**

కొండ చిలువ - **పాపినేని శివశంకర్**

తరతరాల దుఃఖం - **డా. ఎం. హరికిషన్**

వ్యాసం (27-30)

సిద్దేశ్వరం అలుగు - రాయలసీమకు వెలుగు - **పాణి**

అనువాద వ్యాసాలు (31-34)

ముగ్గురు బాధితులు! - **డా. బి.ఆర్. అంబేద్కర్;** అనువాదం : **సి.ఎస్.ఆర్. ప్రసాద్**

వీర సావర్కర్........ వీరత్వం అర్ధ సత్యమే! - **రాం పునీయా;** అనువాదం : **సి.ఎస్.ఆర్. ప్రసాద్**

వ్యాసం (35-38)

రాజ్యహింసకూ, విస్థాపనకూ వ్యతిరేకంగా మార్చి 8 జరుపుకున్న దండకారణ్య మహిళలు - **వి. శృతి సాగర్**

అనువాద వ్యాసం (38-40)

సాహిత్యం, కళలపై రచయితలతో స్టాలిన్ చర్చ (1946) - **నాగభూషణ్**

వ్యాసం (41-50)

అమెరికా అనుకూల వాణిజ్య ఒప్పందాలు (టిపిపిఎ- టిటిఐపి) - **ఎ. నర్సింహ్మారెడ్డి**

రాయలసీమ - చిన్న రాష్ట్రాలు - **అరుణ్**

నివాళి (51)

బోయ జంగయ్యకు నివాళి - **విరసం**

వ్యాసం (52-53)

'సఫాయీ'ల విముక్తి ఎన్నడు? - **గీతాంజలి**

పుస్తక సమీక్షలు (54-59)

పాలమూరు వ్యథార్థ బతుకు చిత్రాలు - **మాతంగి**

'జనతన రాజ్యం' - **బి.ఎస్.రాజు**

వ్యాసం (60-63)

ఇది రాజ్యం తెచ్చిన కరువు - **ఎం. రాఘవాచారి**

సీరియల్ (64-66)

మార్క్స్ పెట్టుబడి - రచనా క్రమం - 9 - **ఫ్రాన్సిస్ వీన్,** అనువాదం : **ముక్తవరం పార్థసారథి**

గమనిక : మిత్రులారా, కామ్రేడ్స్! అరుణతార డిటిపి, డిజైనింగ్, ప్రింటింగ్, పోస్టింగ్, రవాణా ఇలా అన్ని ఖర్చులు చాలా పెరిగిపోయాయి. అనివార్య పరిస్థితులలో విడి ప్రతి వెలను ఫిబ్రవరి 2016 సంచిక నుంచి రూ. 20 కు పెంచవలసి వచ్చింది. ఇది గమనించగలరు. ఎప్పటిలానే మీ ఆదరాభిమానాలను, సహకారాన్ని ఆశిస్తున్నాం. అలాగే ఫిబ్రవరి 2016 సంచిక నుంచి అరుణతార సంచికల క్రమాన్ని సంపుటి 44 గాను సంచిక 1 గాను సరిచేసాం. ఈ విషయాన్ని గమనించగలరు. - సం.

అరుణతార చదవండి! చదివించండి! చందాదారులు కండి!

చందాలు, బకాయిలు మనియార్డర్, డి. డి. ల రూపంలో మేనేజర్‌కు పంపించండి.
డి. డి. లను వై. రామచంద్రం, హైదరాబాద్ పేర తీయండి.
విడి సంచిక వెల - రు. 20; సంవత్సర చందా - రు. 240;
రెండు సంవత్సరాల చందా - రు. 450; మూడు సంవత్సరాల చందా - రు. 680;
ఐదు సంవత్సరాల చందా - రు. 1100; దశాబ్ది చందా - రు. 2200/-

అరుణతార చందాదారులకు విజ్ఞప్తి!

ఏ కారణం చేతనైనా మీకు అరుణతార అందకపోతే పిన్‌కోడ్‌తో సహా మీ చిరునామాను మరోసారి 8500809250 మొబైల్ నంబర్‌కు మెసేజ్ పెట్టగలరు. గమనిక : ఈ నెంబర్ కేవలం మెసేజ్‌ల కొరకు మాత్రమే! - సం.

విద్యార్థులపై మంద్రస్థాయి యుద్ధం

పి.వరలక్ష్మి

"నన్ను క్షమించండి. నాకి జీవితం నచ్చటం లేదు. నా మీద నాకే ద్వేషం కలుగుతోంది." పదిహేడేళ్ళ అమ్మాయి కాలేజీ బిల్డింగ్ పై నుండి దూకి ఆత్మహత్య చేసుకోబోయే ముందు రాసిన వాక్యాలివి. ఆ లేఖలో తన చిట్టచివరి వాక్యం ఏమిటంటే "ప్రభుత్వం, మానవ వనరుల శాఖ ఏదో ఒకటి చేయండి. ఈ కోచింగ్ సెంటర్లన్నీ మూసేయాలి, ఇవి మమ్మల్ని పీల్చి వేస్తున్నాయి" అని. (ఆ శాఖ ఉన్నదే అట్లా పీల్చుకు తినే మానవ వనరుల్ని తయారు చేయాడానికని ఆ అమ్మాయి ఎలా గ్రహిస్తుంది) ఏప్రిల్ ఆఖరున రాజస్థాన్‌లో ఈ సంఘటన జరిగింది. దేశంలోనే పేరు పొందిన ఆ కోచింగ్ సెంటర్‌లో గత మూడేళ్లలో 43మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. పరీక్షల ఫలితాలు, ర్యాంకులు, విద్యావ్యాపార సీజన్ మొదలైంది. పిల్లల్ని మింగేసే ఆత్మహత్యల రుతువు భయపెడుతోంది.

ఏదైనా సంచలనాత్మకం అయితే గాని ఆలోచించలేక పోవడమూ సామాజిక సంక్షోభమే. గతేడాది నారాయణ కాలేజీల్లో వరుస ఆత్మహత్యలతో మంత్రిని బర్తరఫ్ చేయాలనే ఆందోళనల నేపథ్యంలో, ఇది మంత్రిగారి తప్పు కాదు, మొత్తంగానే విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి కాబట్టి వాటి మీద అధ్యయనం చేయాలని ఆంధ్రప్రదేశ్ లో ఒక కమిటీ ఏర్పాటైంది. ఎప్పుడో నెలల క్రితమే నివేదిక కూడా వచ్చింది. ఇప్పుడు దాని గురించి ఎక్కడా చర్చలేదు. యథావిధిగా కార్పొరేట్ కాలేజీలు వేలకోట్ల వ్యాపారం చేసుకుంటున్నాయి. విద్యార్థుల ఆత్మహత్యల మీద అధ్యయనం చేసిన కమిటీ వారికే దిగ్భ్రాంతి కలిగే స్థాయిలో విద్యార్థుల మరణాలున్నాయని చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో (13 జిల్లాలు) గత పదేళ్ళ గణాంకాల్ని పరిశీలిస్తే 3,267 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తేలింది. ఏడాదికి సగటున 326 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకుంటున్నారు. అంటే సుమారుగా రోజుకొక్కరు రాలిపోతున్నారు. ఏడాదికేడాదికి ఈ సంఖ్య పెరిగిపోతున్నది. దేశంలో ఎక్కువ చర్చనీయాంశంగా ఉన్న, మనల్ని కలవరపెడుతున్న రైతుల ఆత్మహత్యల స్థాయిలోనే ఇది దరిదాపుగా ఉన్నది. తెలంగాణలో ఇంతకు భిన్నంగా లేదు. ఇట్లా చనిపోతున్న విద్యార్థుల్లో ఎక్కువ మంది దళితులు లేదా పేద వర్గాలకు చెందిన వారు. ఆంధ్రప్రదేశ్ లోనైతే ఎక్కువగా అనంతపురం జిల్లాకు చెందినవారు. కరువు కారణంగా పంటలు పండక ఫీజు కట్టలేని స్థితిలో తల్లిదండ్రులుంటే, రోజా స్కూల్లో జరిగే అవమానం భరించలేక పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కరీంనగర్ జిల్లాలో జరిగింది. అధిక మొత్తంలో ఫీజులు చెల్లించిన తల్లిదండ్రుల ఆశలకు, అంచనాలకు చేరుకోలేని ఒత్తిడిని ఆర్థిక స్తోమత అంతగా లేని కుటుంబాల పిల్లలు భరించవలసివస్తోంది. విద్యతో వ్యక్తిత్వ వికాసం, శాస్త్రీయ దృక్పథం మాట అట్లా ఉంచితే కనీసం జీవించి ఉండగలిగే ఆత్మస్థైర్యం కూడా కోల్పోయి, జీవితం అసలంటూ మొదలు కాకుండానే అంతం చేసుకునేంత విరక్తిని కలిగిస్తున్నాయి చదువులు. ఇట్లా మొత్తంగా భారతదేశంలో 2013 లెక్కల ప్రకారం ఆ ఏడాది సుమారు రెండున్నర వేల మంది విద్యార్థులు చదువుల ఒత్తిడి తట్టుకోలేక చనిపోయారు. ఆత్మహత్యల మీదే అధ్యయనం చేస్తున్న ఒక సంస్థ భారతదేశంలో ప్రతి 90 నిమిషాలకొక టీనేజీ అబ్బాయి/అమ్మాయి ఆత్మహత్యాయత్నం చేస్తున్నారని ప్రకటించింది.

ఒకటి, రెండు, మూడు అని వరుస ర్యాంకుల గురించి ప్రకటనలు గుప్పించే పత్రికలు చావుల్లో కూడా ర్యాంకులు ప్రకటిస్తే బాగుండును. ఏ ఎడ్యుకేషన్ కంపెనీ ఎంత 'శిక్ష'ణ ఇస్తున్నదో తల్లిదండ్రులకు తెలిసిపోవును. విషాదం ఏమిటంటే పిల్లల మీద అమలయ్యే హింస గురించి తెలిసే తల్లిదండ్రులు ఆ కాలేజీల్లో చేర్చుతున్నారు. ఇంత హింసను సమాజం ఎందుకు నెత్తికెత్తుకుంది? ఎక్కడి నుండి ఎక్కడికి ప్రయాణించాం? బ్రిటిషువాడికి గుమాస్తాలను తయారుచేసే విద్యావిధానం అని నిరసించిన దశ నుండి ఉపాధినిచ్చే విద్య కావాలని పెట్టుబడికి ఊడిగం చేసే విద్యను అందించారు. అక్కడి నుండి విద్యే గుత్తపెట్టుబడి అయ్యింది. విద్యే పెట్టుబడి అయ్యాక ఇక మాట్లాడ్డానికి ఏముంది? పెట్టుబడికి ఏ ఆదర్శమూ లేదు. లాభం తప్ప ఏ నీతీ లేదు. సహజంగానే పిల్లల పట్ల కూడా జాలి ఉండదు. అటువంటి కర్కశమైన పెట్టుబడి చేతుల్లో నిర్దాక్షిణ్యంగా మన పిల్లల్ని పెట్టేశాం.

వెనక్కు చూడ్డానికేముంది? ప్రభుత్వ స్కూళ్ళలో చదువులు సున్నా చుట్టేసి, ఉన్న సర్కారు బడులను కూడా నారాయణలకు అప్పగించి, ఇంకోవైపు నుండి విదేశీ పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నారు. మరి పేదపిల్లలేం కావాలి? సరస్వతి శిశు మందిరాలకు, మదరసాలకు అప్పగిద్దామా? ప్రభుత్వం సర్కారు పాఠశాలలు మూసేస్తుంటే మత సంస్థలు స్కూళ్ళు నడపడానికి ముందుకొస్తున్నాయి. కేజీ టు పీజీ ఉచిత విద్య, కామన్ స్కూల్ విధానం కేవలం ఎన్నికల హామీలు, ఆదర్శాలేనా? ఎటువంటి పౌరుల్ని తయారుచేయాలో ప్రభుత్వాలకు స్పష్టత ఉంది. ప్రజా ఉద్యమాల ముందు ఇదొక సవాలు.



జంగల్‌నామా - సత్నామ్ వీలునామా

వరవరరావు

'జంగల్‌నామా' రచయిత 'సత్నామ్' ఆత్మహత్య వార్త నన్ను షాక్‌కు గురిచేసింది. కోల్పోయిన ఆ స్నేహం గుండెల్లోకి ఇంకుతున్న క్రమంలో పదిహేనేళ్లుగా ఎంతో సన్నిహితంగా ఆయన వ్యక్తిగత జీవితాన్ని కూడా పంచుకున్న నాకు ఆశ్చర్యం కలగలేదు. సమూహంలో ఒంటరిగానే పరిచయమై, నా ఒంటరితనాన్ని పోగొట్టి లేదా తన ఒంటరితనంతో పంచుకొని ఇరువురం నా ప్రవాస కాలంలో ఉపశమనం పొందామా తెలియదు. కాని ఢిల్లీ జీవన్ చెప్పినప్పుడయినా ఆయనకు, నాకు ప్రాణస్నేహితుడు డాక్టర్ దర్శన్ పాల్ పంచుకున్నప్పుడయినా 'మనకు తెలియనిదేమున్నది ఆయన ఫ్రస్టేషన్స్' (నిరాశా నిస్పృహలు) అనేదే ఒకరికొకరం చెప్పుకున్న ఓదార్పు.

ఆ సంభాషణలు ముగిసాక నిన్నటి నుంచే కాసేపు మనకూ మయకోవ్‌స్కీలు ఉంటారా? అని మనసులో మథన పడిపోయాను. 1928లో అది విప్లవం విజయవంతమయ్యాక సోవియట్ రష్యా అనుభవం అయినపుడు ఎన్నో ఆటుపోట్లతో సుదూరంలో ఉన్న మన విప్లవోద్యమంలో ఉండటంలో ఆశ్చర్యమేమిటి!. అయినా రోహిత్ వేముల వంటి యువమేధావుల నవనవోన్మేష స్వప్నాలు ఆత్మహత్య చేసుకుంటున్న మోడిత్వ వ్యవస్థలో సత్నామ్ వంటి సున్నిత మనస్కుని అస్తమయాన్ని ఇంకెలా ఊహించగలం విషాదమే కానీ విస్మయమేమీ లేదు.

గత శతాబ్దపు ఎనభైలలో, తొంభైలలో తొణికిసలాడే విప్లవ తాత్వికతను, సృజనాత్మకతను, తన కవిత్వం ద్వారా, తాత్విక కళాదృక్పథం ద్వారా జెఎన్‌యూలో నాకు పంచి ఇచ్చిన గోరఖ్ పాండే ఎందుకు ఆత్మహత్య చేసుకున్నట్లు? ఒక కెరటంలా ఎగిసిన విలాస్ గోఘ్రే ఒక కెరటంలాగే విరిగిపడటానికి తక్షణ కారణాలున్నాయి. అన్నీ ఒకేసారి వచ్చాయి. కష్టాలు ఒంటరి గూఢచారివలెరావు. సైనిక పటాలంవలె విరుచుకపడతాయనట్లు. 1982లో బొంబాయి వస్త్ర పరిశ్రమ కార్మికుల చారిత్రాత్మక సమ్మెను నిండా ఏడాదిపాటు నిలబెట్టింది ఆవాన్ నాట్యమంచ్ మిల్లుగేట్ దగ్గరి పాటలు, ప్రదర్శనలు కూడ, నవ జవాన్ భారత్ సభ పోరాట వ్యక్తీకరణకు, ఆవాన్ నాట్యమంచ్‌కు ముఖ చిత్రం విలాస్ గోఘ్రే. 1985-87లో పీపుల్స్‌వార్‌లో వచ్చిన సంక్షోభంతోపాటే ఆయన కుటుంబ భారం పెరిగింది. బొంబాయి మురికివాడల్లో ఆరవై గజాల స్థలంలో కట్టుకున్న ఇంట్లోకి తన పిల్లలు రావడమే కాదు కొడుకు పెళ్లి చేసుకొని వస్తే వాళ్లనెక్కడ ఉంచాలని ఆందోళనపడుతున్న సమయంలోనే రమాబాయినగర్‌లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి ఎవరో దుండగులు చెప్పుల దండవేయడం, దళిత ఆగ్రహోద్యమం, పోలీసుకాల్పులు, పదకొండు మంది దళితుల మరణం. ఈ అన్నిటికన్నా ఆయనను కలిచివేసిన కంట్రాస్ట్ (వ్యత్యాసం) ఒక వైపు భారత ప్రభుత్వ ప్రథమ పౌరుణ్ని ఏడు గుర్రాల రథంపై రాష్ట్రపతి భవన్‌కు చేర్చిన వ్యవస్థయే, ఈ పదకొండు శవాలను ఈడ్చి వ్యాన్‌లో వేసి ప్రభుత్వ ఆసుపత్రి వరండాలో విసిరేసిన దృశ్యం. రాశిగా ఈ దేశంలో అంటరాని జీవితాలు ఇట్లా పుట్టుకయే ప్రమాదంగా ముగుస్తాయి కదూ. దళిత విప్లవ శక్తుల ఐక్యతా కాంక్ష మరణవాంగ్మూలంగా ఆయన ఉరివేసుకున్నాడు.

ఇప్పుడు 'జంగల్‌నామా' సత్నామ్. హోవర్డ్‌ఫాస్ట్ స్పార్టకస్ నవలను పంజాబీలోకి అనువాదం చేసిన సత్నామ్. అద్భుతమైన మేధావి. ఆలోచకుడు. యాక్టివిస్టు. 'సత్నామ్' పేరుతో 'పీపుల్స్‌మార్చ్'లో మరెన్నో పత్రికల్లో రాజకీయ వ్యాఖ్యానాలు రాసాడు. హిందీలో, ఇంగ్లీషులో కూడా కవిత్వం రాసాడు. కథలూ రాసాడు. 'అముఖ్'లో రాసాడు. పంజాబీ, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో నిష్ణాతుడు. విస్తృతంగా దేశం తిరిగినవాడు. ముఖ్యంగా పంజాబ్, కశ్మీర్ చరిత్ర భూగోళాలు కరతామలకంగా తెలిసినవాడు. పలుమార్లు కశ్మీర్‌కు వెళ్లి కశ్మీరియత్, సూఫీ తత్వాలను ఒంటబట్టించుకొని ఆజాదీ గురించి రాసినవాడు. మాట్లాడినవాడు. పంజాబ్ ప్రజా ఉద్యమాల్లో, సంఘాల్లో, ప్రజాజీవితంలో భాగమైనవాడు.

1993లో సంగ్రూర్‌లో ఎఐఎల్ఆర్‌సి 'కులసమస్య' పై సదస్సు ఏర్పాటుచేసినపుడు డాక్టర్ దర్శన్‌పాల్ పరిచయం చేసాడు. అప్పటినుంచీ ఢిల్లీలో, వేరేప్రాంతాల్లో ఎఐఎల్ఆర్‌సి, ఎఐపిఆర్ఎఫ్ సభల్లో కలుస్తూనే ఉన్నాం. రాజకీయ సిద్ధాంతాలతోపాటు సాహిత్య కళాతాత్విక సిద్ధాంతాలు చర్చించేవాళ్ల పరిచయం తొందరలోనే ప్రగాఢమవుతుంది.

అయితే మనుషులు వాళ్ల రక్తమాంసాలతో, కలలు కన్నీళ్లతో పరిచయం కావడానికి ఇది చాలదు. ఎపిసిఎల్‌సి నాయకుడు పురుషోత్తం హత్య (నవంబర్ 23,2000) ఎపిసిఎల్‌సి నలగొండ జిల్లా నాయకుడు, కవి ఆజం అలీ హత్య (18 ఫిబ్రవరి 2001)లో మూడు నెలల వ్యవధిలో జరిగి, నాగురించి రెక్కీ చేసారని తెలిసిన గడ్డు కాలంలో బొంబాయి వెళ్లి అటునుంచి మార్చ్ 23 నాటికి పంజాబ్‌కు చేరుకున్నాను. నెలల తరబడి అక్కడ తలదాచుకున్నాను. ఎక్కువకాలం పటియాలలో గుర్మీత్ (సత్నామ్) ఇంట్లోనే. అప్పటికే ఆయన ఒంటరి. భార్య ఎప్పుడు విడిపోయిందో తెలియదు. ముసలి తల్లి, తాను ఒకే ఒక్క కూతురు ఎక్కడో చదువుకుంటున్నది. తల్లీ కొడుకులే ఒకరికొకరు తోడు. తల్లి చాలా దృఢమైన, స్వతంత్రమైన,

వ్యక్తిత్వం గల కష్టజీవి అనిపించింది. ఆ నీడన ఊర్ధ్వ ముఖంగా ఒంటరిగా పెరిగిన మొక్కవలె అనిపించాడు గుర్మీత్. ఆయనకామె తిట్లు ఇష్టం. ఆ తిట్లలోని ప్రేమ ఇష్టం. ఆమె కోసం పనిచేయడం ఇష్టం. నీకు పని తెలియదు, సోమరివని తనచేతిలోంచి ఆమెపని తీసేసుకోవడం ఇష్టం. ఆయన ఆ వయసులో తల్లి చాటు పసివాడనిపించాడు. ఆమెకు కొడుకు తప్ప జీవితం లేదు. తన కంటూ ఆయనకూ అంతే. రాజకీయాలు, సాహిత్యం, బహుముఖ అభిరుచుల వల్ల ఆయనకు పంజాబ్ నిండా పరిచయస్తులున్నారు కానీ నాకు తెలిసి ఆయన తన రహస్యాలన్నీ పంచుకున్న ఒకే ఒక్క మిత్రుడు డాక్టర్ దర్శన్‌పాల్. ఆయనకేమో చేసినంతకాలం వృత్తి, దానితోపాటు రాజకీయ వృత్తిలో సత్నామ్‌కు ఇవ్వగలిగిన కాలం ఇరవై నాలుగు గంటల్లో ఎప్పుడోగానీ రాదు.

ఆ తర్వాత 2002-2004 కాలంలో 2004లో నేను ఢిల్లీ వదిలాక బహుశా మరో ఐదారేళ్లు ఆయనకు తూర్పు ఢిల్లీ జీటీబీ ఎంక్లేవ్‌లో, దిల్షాద్ గార్డెన్‌లో, నందనగర్‌లో కొందరు యువమిత్రులు దొరికినమాటనిజమే. వాళ్లంతా కార్యకర్తలు. సాహిత్యంలో, సైన్స్‌లో, కళల్లో కూడా అభిరుచి ఉన్నవాళ్లు. కాని ఆ పరిణత మేధావి మనసులో సుళ్లు తిరుగుతున్న ఆలోచనలనందుకోగల వారెందరు. ఆ తరాల అంతరాన్ని ఎవరు పూడ్చాలి. అటువంటి ఒంటరి తనంలో ఆయనకు దండకారణ్యానికి వెళ్లే అరుదైన అవకాశం వచ్చింది. అరుంధతీరాయ్, యాన్‌మిర్డాల్, గౌతమ్ నవలఖాల కన్నా ఎంతో ముందుగా వచ్చిన అవకాశం. డిసెంబర్ 2002లో. ఆయన మాటల్లోనే చెప్పాలంటే "జంగల్‌నామా అడవులపై రాసిన పరిశోధనాత్మక పుస్తకం కాదు. అలా అని అది కాల్పనిక సాహిత్యమూ కాదు. బస్తర్ అడవుల్లో పర్యటించినప్పుడు అక్కడ నేను స్వయంగా చూసిన కమ్యూనిస్టు గెరిల్లాల ఆదివాసుల జీవన విధానాలను ఈ పుస్తకం వివరిస్తుంది. ఇది నా డైరీలాగానో లేదా ఒక యాత్రానుభవంలాగానో భావించవచ్చు. ఇందులోని పాత్రలన్నీ నిజమైనవే. పాలకుల చేత చట్టవ్యతిరేకులుగా ముద్రపడిన వీరు తమ స్వప్నాలను నిజం చేసుకునేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు. ఒక కొత్త జీవితం...ఒక కొత్త యుగం...అదే వారి స్వప్నం వారి భవిష్యత్తు ఎలా ఉండబోతుందో కాలమే నిర్ణయిస్తుంది. వారు చరిత్రను తిప్పాలనుకుంటున్న మలుపు గురించి వారి మాటల్లోనే విందాం. నమ్మిన సిద్ధాంతాల కొరకు జీవితాలను తృణప్రాయంగా అర్పించే వారి జీవితం ఎలా వుంటుందో ఈ పుస్తకం చదివితే అర్థం అవుతుంది".

డిసెంబర్ నెల ఆఖరి వారంలో ఆయన అడవినుంచి బయటకి వస్తూ ఉంటే వీడ్కోలు పలకడానికి వచ్చిన గ్రామస్తులలో ఒక ఆదివాసీ అమ్మాయి కొత్తబట్టలు వేసుకొని తలకొక రంగురంగుల దస్తీ చుట్టుకొని సింగారించుకొని వచ్చిందట. కానీ ఆమె కొత్తగా దళంలోకి చేరడానికి వచ్చింది. గ్రామస్తులు ఇటు సత్నామ్ లూటీ ప్రపంచంలోకి వెళ్లడానికి, ఆ అమ్మాయి జనతన రాజ్యానికి వెళ్లడానికి అల్విదా చెప్పడానికి వచ్చారని ముగిస్తాడు. పంజాబీలో ఆయన ఆ పుస్తకం రాసినప్పుడు మేం కలిసే ఉన్నాం. పంజాబీలో పుస్తకం వెలువడక ముందే జంగల్‌నామాలో ప్రతిఘటనను, ప్రతి దృశ్యాన్నీ మాకాయన విప్లవ వర్ణాల్లో ఎన్నిసార్లు చూపాడో. పంజాబీ సాహిత్యంలో జ్ఞానపీఠ్ అవార్డ్ పొందిన గురుదయాల్ సింగ్ ఆ స్క్రిప్ట్ చదివి మొదటిసారి ఆయనే ముద్రణ బాధ్యత చేపట్టాడు. ఇప్పటికది పంజాబీలో ఎన్నిసార్లు అచ్చయిందో. హిందీతోపాటు ఏడు భారతీయభాషల్లో వెలువడిన 'జంగల్‌నామా' 2010లో ఇంగ్లిష్‌లో పెంగ్విన్ ప్రచురణగా వెలువడింది. ఆయన నాతో ఆఖరిమాట (ఆఫ్టర్ వర్డ్) రాయించుకున్నాడు.

తర్వాత కూడా ఆయన దండకారణ్యానికి వెళ్లివచ్చాడు. గ్రీన్‌హంట్ ఆపరేషన్ పేరిట ప్రజలమీద యుద్ధం ప్రారంభమయ్యాక. ఈ సారి ఇంగ్లిషులోనే రాస్తానని సిస్టమ్ మీద కూర్చునేవాడు. పటియాలలో అట్లే ఆయన పక్కన కూర్చొని ఆయనను ప్రోత్సహిస్తూ కొద్ది రోజులున్నాను. అరవై పేజీల దాక టైపుచేసినట్లున్నాడు. కాని క్రమంగా సినికల్ అయిపోయాడు. ఆయననుంచి నేర్చుకున్న పంజాబీ భాషలో దండకారణ్య నాయకత్వం నుంచి ఆయనకు పంజాబీ భాషలోనే మళ్లీ రమ్మని ఆహ్వానం వచ్చింది. నాకు చూపాడు. కాని పోనన్నాడు. అప్పుడు కాకపోతే మరోనెలకని ఉంది అందులో. అప్పుడూ వెళ్లలేదు. ఆయనింక వెళ్లడని తెలిసిపోయింది. వెళ్తే తప్ప పటియాలలోను, ఢిల్లీలోనూ కాంక్రీట్ జంగల్‌లో శుష్కించిపోతున్న ఈ ప్రాణం మళ్లీ జంగల్‌నామాకాదని తెలుసు. కాని సూర్యోదయంవైపు ఎగబాకడానికి మొక్కకాదు గదా మోడుబారిపోతున్న బతుకు. తనవలెనే స్వప్నభంగంతో అమరుడైన సంత్‌రామ్ ఉదాసీ సంస్మరణోపన్యాసం ఇవ్వడానికి 2015లో పంజాబ్ వెళ్లినపుడు ఆఖరిసారి కలిసాను 'సత్నామ్'ను - మనిషిలో జీవితేచ్ఛ శిథిలమవుతున్న ఒక సాయంత్రం. ఒక పగలు. ఆశ్చర్యం కదూ. మనకు స్పార్టకస్, జంగల్‌నామాలు ఇచ్చి తానిట్లా విషాదంగా నిష్క్రమించడం. ఆశ్చర్యం కన్నా ఎక్కువ బాధే. 'దాదా' అని నోరారా పిలిచే ఆత్మీయ స్వరం ఇంక వినిపించదు. ☆

విరసం కరపత్రాలను, స్టేట్‌మెంట్లను, అరుణతార పత్రికలను, విరసం ప్రచురణలను **www.virasam.org** వెబ్‌సైట్‌లో చూడవచ్చు. సాఫ్ట్‌కాపీలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలాగే వివిధ సాహిత్య పత్రికల బ్లాగులు, సైట్‌ల లింకులను కూడా చూడవచ్చు. - సం.

కవిత్వం

ఒక గదికో లేక ఒక మంచానికో పరిమితమైనపుడు

పలమనేరు బాలాజీ

గాల్లో, గాలిలా హుషారుగా కదలాడేటప్పుడు
వీధులు, ఊర్లు, స్వేచ్ఛగా తిరిగేటప్పుడు
బస్సులు, రైళ్ళు, విమానాల్లో దూసుకుపోయేటప్పుడు
నడుస్తూ, తిరుగుతూ, పరుగెడుతూ,
ప్రవహిస్తూ, పరవశిస్తూ -
మనుషులు పక్షులై - భూమినో ఆకాశాన్నో
లెక్క చెయ్యలేనంత యవ్వనంలో ఉన్నప్పుడు
అప్పుడెప్పుడూ...
చలనంలోని సాంద్రత ఏమిటో - మనిషికి తెలియదు
సమూహంలోని, సామూహికతలోని, చలనంలోని
ఆర్ద్రత, గాఢత, సాంద్రతలేవీ తెలియనిదే యవ్వనం

గలగలా నదుల జాతర్లా మనుషులు
కళకళా - పువ్వుల్లా, పిట్టల్లా మనుషులు
మనుషుల్ని చూడకపోవటం,
అసలు మనుషుల్ని గుర్తించకపోవటమే -
యవ్వనం

కాలు చేయి, మాట మనసూ కదలక
చలనం, గమనం, ఆశా, ఆలోచన ఆగిపోయినప్పుడు
చీకటి గుహలాంటి, ఒంటరి ద్వీపంలాంటి
మనిషొక పద్మవ్యూహంలాంటి
ఒకానొక గదికో, మంచానికో లేక వృద్ధాప్యానికో
పరిమితమైపోయినప్పుడు,
పలకరించే మనిషి, స్పర్శించే మనిషి
ఎదుట లేనప్పుడు
అప్పుడు కదా - తెలుస్తుంది!

మనం పలకరిస్తేనే మనుషులు పలుకుతారని
మనం కలవరిస్తేనే మనుషులు పలవరిస్తారని
మనం పలవరిస్తేనే మనుషులు పరవశిస్తారని
మనం స్పందిస్తేనే మనుషులు ప్రతిస్పందిస్తారని

ముసలితనం ముప్పేమీ కాదు కానీ
యవ్వనంలో కూడా మనుషులకింత వృద్ధాప్యం
ముందుగానే రావాలేమో
వృద్ధాప్యాన్నో, అవిటితనాన్నో, మనసు తడిలేని
అసలు మనుషులే లేని ఒంటరితనాన్నో - అంతో ఇంతో
మనిషి ముందుగానే అనుభవించాలేమో!

అమ్మకో, నాన్నకో, అమ్మమ్మలు, నానమ్మలు, తాతయ్యలకో
మనకన్నా ముందు నడచిన వాళ్ళకు
ఎవరికేం లేదో - ఎవరికేం కావాలో
మనిషికి ముందుగానే అనుభవంలోకి రావాలి
అయినా
యవ్వనంలో వృద్ధాప్యాన్ని అనుభవించినవాడే
వృద్ధాప్యంలో కూడా యవ్వనవంతుడవుతాడు
ఒక గదికో లేక ఒక మంచానికో
పరిమితమైపోయినపుడు
మనిషికి - మనుషుల్లోని, సమూహంలోని, చలనంలోని
సాంద్రత, గాఢతా, ఆర్ద్రతా కొంచెమైనా తెలిసివస్తాయి

మనుషులతో మనుషులు కలవటాన్ని
మానవ సమూహంలోని కొత్త కొత్త చిగుర్లని
మనిషికి, సమూహానికి గల తేడాని
తెలుసుకున్న వాడ్నే మనిషంటారు
ఉండటం అంటే వేరేమీ కాదని
ఉండటం అంటే మనుషులతో ఉండటం అని
మనుషులతో కలవటం అని
సమూహపు మనుగడే మనిషని
మనిషెప్పుడూ తెలుసుకోవాలి
పారాడలేని పాపాయిల్లాంటి వృద్ధులకు
పాలిచ్చే తల్లులే బిడ్డలు

ఈ కవిత పేరు...?

కెక్యూబ్ వర్మ

కొన్ని సాయంత్రాలకు నల్లని ఆకాశపు కొక్కేనికి
ఒంటరి వెన్నెల ఉరిపోసుకుంటుంది

అలముకొన్న సదురు నుండి ఆత్మ
వేరుపడక పొక్కిలిగా పిగిలి పోయింది

నెత్తుటి ధారలన్నీ సిరాగా మారి
చరిత్రను పేజీలలో మడతపెట్టాయి

ఇంత నమ్మకాన్ని పంచిన
ఉదయాలేవీ నీ కనుపాపలు చేరలేదు

ఈ ఇప్ప పూల వనం రాలిపోతూ
నిబ్బరాన్ని వదిలి నివురు కప్పుకుంది

తూరుపింకా తెలవారక నీ పేరు
తలుస్తూ పొలమారుతొంది

కొందు బాలుడొకడు గొడ్డలి నూరుతూ
నియాంగిరీ సానువులలో సాగిపోతున్నాడు

(కామ్రేడ్ సత్నాం స్మృతిలో)

ఓ సిన్నబ్బీ...

సొదుం శ్రీకాంత్

సిన్నబ్బీ...
కడుపునిండా కూడుబెట్టని దేశాన్ని
గుండెలనిండా ఎట్లా బెట్టుకున్నావబ్బీ?
ఓటు కుక్కలు చించేసిన బతుకులో
అమ్మ ఆకలి ముక్కాయ
నాయ్న కరువు డెక్కాయ
ఐనా
పంచాయతి ఆఫీసులో ఎగిరేసిన పతాక పిట్ట
రెక్కలిప్పి ఎగర్లాక అల్లాడ్తాందన్జెప్పి
సిక్కుదీసి దాన్ని తిరిగి ఎగిరెయ్యాలన్జెప్పి
ఎంత ఆరాటపన్నావబ్బీ
అబ్బీ
అసలు ఇరుక్కున్నెది జెండా కాదబ్బీ
ఢిల్లీ ఓట్ల పెట్టెలో
కోటాను కోట్ల మట్టి సేతులు ఇరుక్కున్నాయి
పార్లమెంటు పాముల పుట్టలో
కాడిమాను ఇరుక్కున్నాది
పపంచ బాంకోని కాళ్ళ కింద
పల్లె పీకె ఇరుక్కున్నాది
తన్నుకులాటబ్బీ, తన్నుకలాట
యాడజూసినా బతుకు తల్లకిందులై
పానం గిల గిలా తన్నుకులాడ్తాంది
ఐనా ఎంత ఆశబ్బీ నీకు!
సూన్నీకి పిల్లగానివైనా
ఎంత పెద్ద మనసబ్బీ నీది!
ఏలెడంత లేకున్నా
ఎంత తెగింపబ్బీ నీది!
ఒరిగిపోతాండే జెండానే ఒర్సి పట్టుకుని
ఏకంగా దేశాన్నే ఎగిరెయ్యాలని సూసినావ్
సిన్నబ్బీ...
ఈడ నీకో తాయం సెప్పాల
ఈన్నే నీకో సిక్కుముడి కూడా ఇప్పాల
ఈ దేశాన
మడకబట్టి సేను దున్నాలనుకున్నోడు
మడికయ్యలో సెమట గింజలు పోసి
మందికి కడుపు నింపాలనుకున్నోడు
'జన'జెండా ఎత్తుకుని
గుండెలపై నిలబెట్టాలనుకున్నోడు
ఒరిగి పోవడమేగానీ
తిరిగి బట్టగట్టింది లేదబ్బీ
ఓబ్బీ
నీకు నా గురించి గూడా
ఓ నాలుగు మాటలు సెప్పాలనపిచ్చాందిబ్బీ
గుండె బరువు రొంత
దించుకోవాలనిపిచ్చాంది
యా అదృష్టం జేసినామో ఏమోగానీ
ఈపాడు కరువు నుంచి
మా గూడు సెదరకుండా
గడ్డనపన్నాదిబ్బీ
అనగనగనగా ఒకప్పుడు
అప్పు వెంటాడని క్షణమంటూ లేదు
అమ్మ ఏర్పని రాత్రంటూ లేదు
ఆకాశం నుంచి సుక్కలు రాల్నెట్టు
అమ్మ మొకం నుంచి కన్నీళ్ళు రాలేయి
అన్నానికి గింజలు లేనాపొద్దు
ఆ కన్నీళ్ళే మా పొట్ట నింపినాయి
మా పెద్దన్న పెద్ద సదువు
మా సిన్నన్న డాకిటేరు కల
కరువు రాక్షసి మింగేసిందబ్బీ
కప్పను పాము మింగేసినట్లు
ఐనా
ఇయ్యన్నీ నేను సెప్పాల్నాబ్బీ
రాయలసీమ రాళ్ళ గుట్టలన్నీ
రాలిపోగా కుప్వేసిన కలల కుప్పే కదబ్బీ
ఓ...సిన్నబ్బీ
యామాటకామాటే సెప్పుకోవాల
అప్పుడింగా పల్లెల్లో
పాడిన్నాది, గాడున్నాది
తాగుడు గడపముందర ల్యాకుండా
యాన్నో సాటుమాటుగా
నాటుసారాగా సాగుతన్నాది
గాటిన గొడ్డో గోదో ఉన్నాది గాబట్టి
మెల్లో తాడో బొంగరమో యాలాడతన్నాది
ఇన్నానికి నీకు అర్థమయ్యేగా ఉన్నా
ఈడ నీకోమాట సెప్పాల సిన్నబ్బీ
నేను సదువుకున్నెది
యా బళ్లోనో గాదబ్బీ
నాకు సదువు సెప్పింది
యా అయ్వోరో కాదబ్బీ
మా గాటిపాటే నా బడి
మా పెద్దెనుమే నా హెడ్మాస్టరు
మా సిన్నెద్దే నా సవాసగాడు
సారీ అబ్బీ
నీ కత సెప్పబోయి
నా కత సెప్పబట్టి
ఐనా ఓబ్బీ
నీది నాది అనకుండా
మన రాయలసీమ అబ్బిగాళ్ళందర్దీ
ఒకటే కత గదా-కరువు వ్యథ
ముగిచ్చేముందు ఓ సిన్న మాటబ్బీ
ఈమద్దెన ఈ దేశంలో అన్నీ పిరెమైనాయి
తినే తిండి కాన్నుంచి కట్టే బట్ట దాకా

నూకలకంటే ఏటిసిక పిరెమంట
మందుకంటే మంచినీళ్లు పిరెమంట
కానీ సన్నా సపకోళ్ళ పానం మాత్రం
శానా అగ్గువైయ్యిందిబ్బీ
ఇయ్యన్నీ సూసి
ఎన్నిటికని ఏర్సలు!
ఏర్సడం మర్సిపోడం
అలవాటుగా మార్సుకున్నా
ఐనా ఓబ్బీ
నిన్నందరి మాదిర్లా
గుంతలో బూర్సడం గాదురా అయ్యా
నా గుండెలో బూర్సుకోవాల
నా గొంతు పాటలో బూర్సకోవాల
నా పద్యంలో పదాల మధ్య
పాదుదీసి బూర్సుకోవాల.

(అనంతపురం జిల్లా కావేటి సముద్రంలో ఈ ఏడాది జనవరి 26న ఇరుక్కున్న జాతీయ జండాను తిరిగి రపరెపలాడించే క్రమంలో ప్రమాదావశాత్తు విద్యుతాఘాతానికి గురై మృతి చెందిన వంశీకి)

ప్రేమ అనే విస్ఫోటనం'

వి.వి.

'దేశమును ప్రేమించుమన్నా
మంచియన్నది పెంచుమన్నా
దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్'

దేశాన్ని ప్రేమిస్తే చాలదట భక్తి కావాలట
'భారత్ మాతాకి జై' దేశభక్తి
మనుషుల్ని ప్రేమించి మట్టిని అమ్ముకుంటే
భారతమాత పట్ల భక్తి పెరుగుతుందా?

'ఇదేం ప్రేమ?'
దేశం పట్ల మనకుండే ప్రేమ ఎటువంటిప్రేమ?
ఇదేం దేశం?
ఎన్నడూ మన స్వప్నాలను సాకారం చేయలేని దేశం
ఇవేం స్వప్నాలు?
సదా భగ్నమయ్యే స్వప్నాలు'

'గొప్ప జాతుల గొప్పతనాలు ఎప్పుడూ
వాటి నిర్దాక్షిణ్యమైన మారణ సామర్థ్యానికి
ప్రత్యక్ష సమతూకంతో ఉంటాయికదూ'

'ఒక దేశ విజయం
సాధారణంగా దాని నైతిక వైఫల్యంలో ఉంటుంది కదూ.'

'మన వైఫల్యాల సంగతేంటి?
రచయితలు, కళాకారులు, రాడికల్స్, జాతి ద్రోహులు, పిచ్చివాళ్ళు
వ్యవస్థలో ఇమడలేనివాళ్ళు-
వీళ్ళ భావాల, స్వప్నాల వైఫల్యాల సంగతేమిటి?'

'జెండాల, దేశాల భావాన్ని
ప్రేమ అనే ఒక విస్ఫోటన పదార్థంతో
మార్చలేకపోతున్న మన వైఫల్యాల సంగతేమిటి?'

'మనుషులు యుద్ధాలు లేకుండా జీవించలేకపోతున్నారా?'
కాందిశీకులు, కరువు బాధితులు కాకుండా,
వలసలు, ఆత్మహత్యలు లేకుండా
ఎన్‌కౌంటర్లు, అసహజ మరణాలు లేకుండా జీవితం లేదా?'

'మనుషులు ప్రేమలేకుండా కూడా జీవించలేరుకదా
ప్రేమకోసం యుద్ధాలకు మరణాలకు వెనుకాడరు కదా
యుద్ధాల బహిర్గంగ పగలు రహస్య ప్రేమ రాత్రులు'

'కనుక ప్రశ్న ఏమిటంటే
మనం దేన్ని ప్రేమించాలి?
ప్రేమంటే ఏమిటి? ఆనందమంటే ఏమిటి?
అవును నిజంగానే దేశమంటే ఏమిటి?'
మనుషులమధ్య ప్రేమేకదా
అంతేనా?
'మన ప్రేమకు ప్రాధామ్యాలేమిటి?'
మనుషులం కనక మానవత్వం సరే-
మరిమట్టిని ప్రేమించవద్దా?

'అత్యంత అర్వాచీనమైన దట్టమైన అడవి
పర్వతశ్రేణులు, నదీలోయలు'
భూగర్భజలాలు, ఖనిజాలు
మానవశ్రమ, ప్రకృతి సంపద
అవును-ఆకాశమూ సూర్యుడూ చంద్రుడూ, గ్రహాలు
గాఢాంధకారంలో ఇనుమిక్కిలి నక్షత్రాలు
ఇంకిన, కారుతున్న కన్నీళ్లు, పారుతున్న, గడ్డకట్టిన నెత్తురు
'దేశంకన్నా ప్రేమించదగినవి కదూ.'

నేను పోగొట్టుకున్న నదీలోయలను
పోరాడుతున్న పడమటి కనుమలను
పోగొట్టుకున్న నల్లమలను
పోరాడుతున్న దండకారణ్యాన్ని
ప్రేమించినంతగా
దేశభక్తి, జాతీయత అనే భావనలను ప్రేమించగలనా?
అబద్ధమాడలేను,
ఎందుకంటే,
ప్రేమ విస్ఫోటనం చెందే సత్యం.

(ఆంగ్లమూలం: అరుంధతీ రాయ్ . తెలుగు, మార్పులూ చేర్పులూ- వి.వి. ఇందులో అరుంధతీరాయ్ వాక్యాలను ఆమె శైలి తెలిసిన ఎవరైనా పోల్చుకోగలరు)

ఉండవలసిన తీరు

పద్మకుమారి

మధ్యాహ్నం పన్నెండు గంటలకు ధనలక్ష్మి రైల్వే స్టేషన్లో దిగింది. అప్పటికే ట్రైన్ అరగంట ఆలస్యమైంది. తన కోసమే ఎదురుచూస్తున్న గౌతమి వచ్చి గట్టిగా కౌగిలించుకుంది. బ్యాగు అందుకొని ఆటో ఎక్కారు. దారిలో అక్కడక్కడా మరాఠి మహిళలు సంప్రదాయక వేషధారణలో కనిపించారు. గంట ప్రయాణం తర్వాత నగర శివారులోని ఒక డాబా ఇంటి ముందు ఆగారు. తమకోసమే ఎదురు చూస్తున్నాడేమో.. గౌతమి భర్త సతీష్ నవ్వుతూ ధనలక్ష్మిని పలకరించాడు. 'ఎప్పుడో మా పెండ్లిలో చూశాను. బాగున్నారా?' అన్నాడు.

సమాధానంగా చిన్నగా నవ్వింది ధనలక్ష్మి.

గౌతమి చేతిలోని బ్యాగ్ తీసుకుని లోపలికి వెళ్లిపోయాడు సతీష్.

ముందు రూంలోని సోఫాలో ధనలక్ష్మి కూచుంది.

గౌతమి వంటగదిలోకి వెళ్లింది. ఆ ఇంట్లో అన్ని వస్తువులూ నీటుగా సర్ది ఉన్నాయి. ఓ వైపు అలమరాలో చాలా పుస్తకాలు కనిపించాయి. గౌతమి కాఫీ కప్పుతో వచ్చింది. 'రెస్ట్ తీసుకో వంట కావడానికి టైం పడుతుంది' అన్నది.

ధనలక్ష్మి పుస్తకాల అలమరా వైపు నడిచింది. కాఫీ తాగుతూ పుస్తకాలు చూస్తోంది. పై వరుసలో తన కిష్టమైన సింహాసేనాపతి పుస్తకం కనిపించింది. దాన్ని చేతులోకి తీసుకుంది. దాన్ని తాకడంతోనే మనసులో ఏదో జ్ఞాపకం కదిలాడింది. అన్నయ్య ఆ రోజుల్లో తనకు చదవమని ఇచ్చిన మొదటి పుస్తకం ఇదే. అంత వరకు తనకు తెలియని ఒక కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది.

'చాలా మంచి పుస్తకం తీశారే..' సతీష్ మాటలతో ఆలోచనలను తెంపుకొని టక్కున వెనక్కి తిరిగింది.

ఆమె చేతిలోని కాఫీ కప్పు తీసుకుంటూ 'మనం రేప్పొద్దున బయల్దేరాలి. దూర ప్రయాణం. ఈ రోజంతా నిద్రపోండి...' అని చెప్పి తన గదిలోకి వెళ్లిపోయాడు.

ధనలక్ష్మి పక్కనే ఉన్న గదిలోకి వెళ్లిపోయింది. డబుల్ కాట్, ఆ పక్కనే స్టడీ టేబుల్, దాని పైన కొన్ని పుస్తకాలు ఉన్నాయి. ఆ పక్కనే గోడకు వేలాడుతున్న తల్లీ బిడ్డల టెడ్డీ బేర్ బొమ్మ కనిపించింది. పొట్టపైన బిడ్డను హత్తుకొని ఉంది. అది చూడగానే ధనలక్ష్మికి బాబు గుర్తుకు వచ్చాడు. వికాస్ అని పిలవగానే పరిగెత్తుకుంటూ వచ్చి ఇలాగే తన ఒళ్లో వాలి గారాలు పోయేవాడు. వాడికి ఐదేళ్లు కూడా నిండలేదు. అప్పుడే వాణ్ని చూడక కొన్ని గంటలైంది. వాడి అమాయకపు ముఖాన్ని నిన్న ఎంతసేపు చూసినా తనివి తీరలేదు. నిద్రపోతున్న వాడి తలపైన చెయ్యి వేసి ముంగురులు సవరిస్తూ బయల్దేరే వరకు ఉండిపోయింది. రేపటి నుంచి తన కోసం ఎంత ఏడుస్తాడో కదా పిచ్చితండ్రి అనిపించింది. నిన్నటి వరకు అన్నయ్య కనిపించక తల్లి బాధపడుతూ ఉండేది. ఇక నుంచి తను కనబడక వికాస్ కూడా అంతే బాధపడతాడేమో. అమ్మకు ఈ వయసులో కడుపున పుట్టిన ఇద్దరు బిడ్డలు దూరమైన బాధతోపాటు బాబును పెంచాల్సిన బాధ్యత కూడా నెత్తినపడింది.

మంచం మీద పడుకుంది గాని మనసంతా అలజడిగా ఉంది. పుస్తకం చేతిలో ఉన్నమాటేగాని ఒక్క పేజీ కూడా ముందుకు సాగడం లేదు.

తనది ఎంత చిన్న జీవితం? ఈ ఊరికి వస్తానని ఊహించనేలేదు. అసలు గౌతమి ఈ వైపు ఎట్లా వచ్చింది? చదువుకొనే రోజుల్లో సొంత విషయాలు తప్ప పక్కవాళ్లను పట్టించుకొనేదే కాదు. హైస్కూలు వరకు కలిసే చదువుకున్నారు. అన్నయ్య ఒక సంవత్సరం పెద్ద. ముగ్గురూ కలిసే తిరిగినా ఎవరి తీరు వారే అన్నట్లుండేవారు. ఇప్పుడెలా అందరం ఒకేలా ఆలోచిస్తున్నాం. ఈ మార్పు అన్నయ్య వల్లేనేనా? ఏమో. తను మాత్రం మారలేదా? అన్నయ్య తిరుగుళ్లు మొదట్లో అమ్మ నాన్నల్లాగే తనకూ నచ్చలేదు. తన బతుకు బండలైపోయి పెళ్లయిన ఏడాదికే పుట్టింటికి చేరుకుంటే అన్నయ్య ఎట్ల చూసుకోవాలి? అప్పట్లో అన్నయ్య తీరు నచ్చలేదు. భర్త, అత్తమామల మీద కేసు వేసి ఆస్తి రాబట్టమని కొందరు అన్నారు.

అన్నయ్య అది కూడా పట్టించుకోలేదు.

'వాడ్నే కాదనుకున్నాక వాడి ఆస్తి మనకెందుకు?' అనేవాడు.

అన్నీ ఇలాంటి మాటలే. ఇవేవీ తనకు నచ్చేవి కాదు.

మరి బాబు, తను ఎలా బతకాలి? వాడి భవిష్యత్ ఏం కావాలి? ఈ రంధి ఉన్నట్లు కనిపించేవాడే కాదు. అలా తేలిగ్గా వదిలేయడం తనకు ఇష్టం లేదు. వాణ్ని కోర్టుకులాగి, ఆస్తిలో భాగం అడగాలి. కట్నం కింద, లాంఛనాల కింద ముట్టచెప్పింది కూడా తీసుకోవాలి అని తనకు బలంగా ఉండేది.

'ఆస్తి గొడవలు దేనికిరా. నీవు ఇట్ల ఇంట్లో బాధపడుకుంటూ ఉండిపోతే ఎన్ని లక్షల ఆస్తి ఉన్నా ప్రయోజనం లేదు. బైటికిపోయి నీ కాళ్ల మీద నీవు నిలబడాలి... ' అనేవాడు.

'నేను బైటికిపోయి సంపాదించుకోవాల్సిందేగాని, నీవేమీ చెయ్యవా?' అని ఆ రోజుల్లో అమాయకంగా అడిగింది.

దానికి అన్నయ్య నవ్వుతూ 'నీ ఖర్చులకు నవ్వు సంపాదించుకోడానికి ఉద్యోగం చెయ్యమనడం లేదు. నీ జీవితాన్ని నీవే తిరిగి బాగు చేసుకోడానికి బైటికి పొమ్మంటున్నా. బైటికిపోతే లోక జ్ఞానంతోపాటు ధైర్యం వస్తుంది. ఆ రోజు చదువు పూర్తి కాకముందే ఈ పెళ్లి ఏందని నేను బాపుతో గొడవపడ్డానా? లేదా?

జీవితంలో ఇలాంటివి జరుగుతుంటాయి. ఆ రోజుల్లో నీ చేతుల్లో ఏమీ లేదు. ఈ రోజు నీవు ఇంత ఉదాసీనంగా మారిపోయి సర్వం కోల్పోయానని భారంగా బతకాల్సిన పని లేదు. ధైర్యంగా అందరి మధ్య తిరగాలి. అది అలవాటు కావాలి..' అన్నాడు.

అవన్నీ గుర్తుకు వస్తోంటే ధనలక్ష్మికి తన జీవితమే ఆశ్చర్యకరంగా కనిపిస్తోంది. అన్నయ్య సపోర్టుతో మళ్లీ చదువు మొదలు పెట్టి పంతులమ్మ అయి నలుగురికి చదువు చెప్పగలుగుతోంది. బాబుకు, తల్లిదండ్రులకు అండగా ఉండాల్సిన తను కూడా లోపలికి రమ్మని ఎలా రాయగలిగాడు. తన మీద అంత నమ్మకం ఎలా కలిగింది? ఉత్తరం రాసి రమ్మని అనగానే బయల్దేరుతానని? తను మాత్రం ఈ నిర్ణయం ఎలా తీసుకోగలిగింది? అన్నయ్యను అంతగా ప్రేమించడం వల్లనా? లేక అన్నయ్య రాజకీయ విశ్వాసాలను తనూ అంతగా ప్రేమించడం వల్లనా?

అన్నయ్య రమ్మని ఉత్తరం రాశాడని, దాని పైన ధనలక్ష్మి నిర్ణయం చెప్పినప్పుడు పోచమ్మ, లింగయ్య నవనాడులు కుంగిపోయినట్లు డీలాపడిపోయారు. తల్లి అయితే కాళ్లూ చేతులు పట్టుకొని ఏడ్చింది. వాడూ పోయి, నీవు పోతే మేమేం కావాలి? మేం చనిపోతే నీ కొడుక్కు దిక్కెవరు? అని తండ్రి వలపోసుకున్నాడు.

నిజమే. బాబుకు తండ్రి ఉన్నా లేనట్టే. తను వెళ్లిపోతే తల్లి కూడా దూరమైనట్టే. ఈ చివరి రోజుల్లో అమ్మా నాన్నలను చూసుకోవడం కూడా తన బాధ్యతే. కానీ ఇక్కడే ఉంటే కొడుకుకు తల్లిగా, తల్లిదండ్రులకు బిడ్డగా బతికిన సంతృప్తి తప్ప మరేమీ ఉండదు. జీవితానికి ఇంకో అర్థమేమీ ఉండదు. అన్నయ్య అజ్ఞాతంలోకి వెళ్లడానికి ముందు రోజుల్లో పెరిగిన సాన్నిత్యం, తనను కూడా ఉద్యమంలోకి తీసికెళ్లాలనే రమేష్ బలమైన కోరిక నుంచి ఈ కొత్త ఆలోచనలు కలిగాయి.

కొడుకు గురించి, అమ్మానాన్నల గురించి, తన భవిష్యత్తు గురించి బతకడం కాకుండా ఇంకా అర్థవంతమైన జీవితం కావాలని ఉంది. ఎందుకో అందరిలాగా తన జీవితం సాఫీగా సాగలేదు. పెండ్లయిన నెల నుంచే కష్టాలు. ఇద్దరివి భిన్న మనస్తత్వాలు. అతడు చెడ్డవాడని కాదు. బతుకు ఉండాల్సిన తీరు గురించి తనకు కొన్ని అభిప్రాయాలు ఉన్నాయి. వాటితో ఆయనకు పొసగలేదు. అక్కడి నుంచి గొడవలు మొదలయ్యాయి. అవి చాలా దూరం పోయాయి. దాంపత్యమంటేనే వెగటు కలిగింది. తను మారుతాడని ఏడాదిపాటు కనురెప్పల కింద కన్నీరు దాచుకొని గడిపింది. బాబు పుట్టాడు. వాడికి ఏడాది వయసు వచ్చేనాటికి తెగతెంపులు చేసుకొని ఇంటికి వచ్చింది. తను కలలుగన్న జీవితమంతా తల్లకిందులైపోయింది. ఆ బాధ చాలా కాలం వెంటాడింది. ఇప్పుడు బాబును చూసుకుంటున్న ఆనందం తప్ప మరేమీ లేదు. కానీ చాలా అసంతృప్తి.

సింగరేణి ప్రాంతంలో బహిరంగంగా విప్లవోద్యమంలో పని చేయలేని పరిస్థితి వచ్చింది. అప్పటి వరకు సెమీ లీగల్‌గా పని చేసిన అన్నయ్య రమేష్ పూర్తి కాలం అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు.

ఒక రోజు రమేష్ కుటుంబాన్ని మారుమూల గ్రామానికి పిలిపించుకున్నాడు. ఆ రోజంతా కలిసే ఉన్నారు. అప్పుడు రమేష్ తను ఇక ముందు కలవడం కుదరకపోవచ్చని చెప్పాడు. పూర్తిగా లోతట్టు అడవిలోకి ఉద్యమ అవసరాల రీత్యా బదిలీ అయ్యానని చెప్పాడు. కోల్ బెల్ట్ లో శత్రువు ఇన్‌ఫార్మర్ నెట్ వర్క్ పెంచుకొని భారీ నష్టాలు కలిగించాడు. ఇక్కడ ఇంతకు ముందే మహిళల్ని మూమెంట్ లో కదిలించలేని పరిస్థితి. ఇక ఇప్పుడైతే మరీ దుర్భరం. ఇక్కడ బూర్జువా ట్రేడ్ యూనియన్లు తప్ప మనం పని చేయలేని స్థితి వచ్చింది. కాబట్టి నీవు కూడా ఇక్కడే ఉంటే ఉద్యమానికి అభిమానిగా తప్ప కార్యకర్తగా పని చేయలేవు. నీవు మంచి రాజకీయ కార్యకర్తవు కావాలని నా కోరిక అన్నాడు.

ఆరోజు తర్వాత రమేష్ మళ్లీ కనిపించలేదు. అప్పుడప్పుడూ ఉత్తరాలు వచ్చేవి. ప్రతిసారీ చివర్లో ధనలక్ష్మిని పుస్తకాలు చదవమని రాసేవాడు. ఆమె లేకపోయినా కుటుంబం ధైర్యంగా నిలబడ్డానికి తగ్గట్టు సిద్ధం చేయమని చెప్పేవాడు. దీంతో తాను పూర్తి కాలం ఉద్యమంలో భాగం కావాలనే అతని కాంక్ష బైట పడేది. అన్నయ్య అంటే ఉన్న అమితమైన ఇష్టం వల్ల కూడా ధనలక్ష్మి అతని మాటల్ని తేలిగ్గా తీసేయలేకపోయేది.

తనింకా ఇల్లూ.. ఉద్యమం మధ్య ఊగిసలాడుతుండగానే రమేష్ నుంచి వచ్చేయమని ఉత్తరం వచ్చింది.

రమేష్ కలవమని చెప్పిన గడువుకు మధ్యలో ఉన్న ఇర్వై రోజులూ ఆలోచించింది. రాత్రింబవళ్లు మధనపడింది.

'నీ అవసరం అక్కడి కంటే ఇక్కడే చాలా ఉంద'ని స్పష్టంగా రాశాడు రమేష్.

ఇంతకాలం ' నాలాంటి వాళ్లు అక్కడ చేసే పని ఏముంటుంది?' అని కూడా అనుకునేది. చాలా ప్రత్యేకమైన మనుషులు మాత్రమే లోపలికి వెళ్లి పనిచేస్తారని ఉండేది. దానికి రమేషే కారణం. తనకు ఊహ తెల్సినప్పటి నుంచి అన్నిట్లో భిన్నంగానే ఉండేవాడు. ఆలోచలన్నీ కొత్తగా ఉండేవి. అలాంటి వాళ్లే అంత సాహసమైన నిర్ణయాలు తీసుకుంటారని అనుకునేది.

"అదే మాట రమేష్‌తో ఓసారి అంటే - అదేం కాదు. అందరం ఒకటే. చాలా మామూలు మనుషులే పెద్ద పెద్ద పనులు చేస్తారు" అని ఏవేవో పుస్తకాలిచ్చి చదవమన్నాడు.

ధనలక్ష్మి నవలల్ని చదివి, మొదట ఇవన్నీ కథల్లే అనుకుంది. తర్వాత అవి నిజంగానే జరిగినవని అర్థమయ్యాక, వాటిలోని విలువలకు ఆకర్షితురాలైంది. మనుషులు ఇలా కూడా జీవిస్తారా? అని విస్మయం కలిగింది. అదే ఇక్కడి దాకా నడిపించింది. అన్నయ్య రాసిన ఉత్తరం చదివి, పసి బిడ్డను, కన్నవాళ్లను వదిలి బ్యాగ్ తీసుకుని ఎలా వచ్చేసింది...? ధనలక్ష్మికి ఇప్పటికీ తన నిర్ణయం తలుచుకుంటే కొంచెం ఆందోళనగా ఉంది. ఆశ్చర్యంగానే ఉంది. అయితే స్థిరమైన నిర్ణయంతోనే బయల్దేరింది.

* * *

'వంట అయిపోయినట్టే... స్నానం చేసిరా తినేద్దాం...' అని గౌతమి బైటి నుంచే పిలిచింది.

అన్నం తినేటప్పుడు సతీష్ తన తునికాకు వ్యాపారం గురించి

లాభనష్టాల గురించి చెప్పుకొచ్చాడు. గౌతమి మరాఠీ వాళ్ల ఆలోచనలు, ఆచారాలు చెప్పింది. పార్టీ గురించి, ఇంటి గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

భోజనాలయ్యాక సతీష్ బైటకి వెళ్లిపోయాడు.

ఇంట్లో ఇద్దరే మిగిలారు.

లోపలి గదిలోకి కిటికీలోంచి ఎండ పడకుండా కర్టెన్ లాగుతూ గౌతమి 'బాబు ఎట్లున్నాడు? అమ్మ నాన్న వాళ్లేమన్నారు?' అని నేరుగా మొదలు పెట్టింది.

ధనలక్ష్మి కొంచెం సేపు మౌనం.

గౌతమి తల తిప్పి చూస్తే ఆమె కళ్లలో నీళ్లు కనిపించాయి.

'ఇదేమిటి?...' గౌతమికి అర్థం కాలేదు. దగ్గరికి వెళ్లి భుజం మీద చెయ్యి వేసింది.

'గుర్తు చేసి బాధ పెట్టానా ధనలక్ష్మీ..?' అని అడిగింది.

ఆమె చిన్నగా ఏడ్చింది.

గౌతమి ఆందోళన పడిపోయింది. అయినా ఆ స్థితిలో ఏమీ అనలేకపోయింది. కొన్ని క్షణాలయ్యాక ధనలక్ష్మి మాట్లాడుతూ.. 'ఇదంతా లోపలికి పోతున్నందుకు కాదు. నేను పూర్తి ఇష్టంగానే ఈ నిర్ణయం తీసుకొని వచ్చాను. ఉద్యమంలో భాగం కావాలనే ఉంది. అయితే ఈ నిర్ణయం తీసుకున్నాక ఈ మధ్య బాబును అమ్మకు మరింత దగ్గరయ్యేలా చేశాను. కానీ ఏదో వదిలేసి వెళ్తున్న వెలితి...' అని ఇంక కొనసాగించలేక చిన్నగా నవ్వేసి కళ్లు తుడుచుకుంది.

'ఆ వెలితి వికాసే కదూ' అంది గౌతమి

'కాదు .. అమ్మా బాపు కూడా'

'మొదట్లో అమ్మవాళ్లు నాకు మళ్లీ పెళ్లి చేద్దామనుకున్నారు. అన్నయ్య ఇంటి దగ్గర ఉన్నప్పుడు ఎన్నో సంబంధాలు తెచ్చారు. నాన్న ఓ సంబంధం తెస్తే ఆ అబ్బాయి వల్ల నా జీవితం బాగుపడదని అన్నయ్య వద్దన్నాడు. నాకూ నచ్చలేదు. ఈలోగా అన్నయ్య వచ్చేశాడు. ఇక ఆ సంగతి ఆలోచించలేదు. బాబును చూసుకుంటూ ఉండిపోదామనే అనుకున్నా. కానీ అదీ నచ్చలేదు. ఈ లోగా లోపలికి రమ్మని ఉత్తరం రాశాడు. ఇట్ల వెళ్లిపోతానని అన్నప్పుడు అమ్మా నాన్న బాగా ఏడ్చారు. అన్నం తినకుండా మొండికేశారు. కడుపు నిండా ఇద్దర్ని కంటే ఇద్దరికిద్దరు మమ్ముల ఆగం చేస్తరా? ఈ వయసులో నీ కొడుకును ఎట్ల పెంచాలె? పగోనికి కూడ వద్దు ఈ పాపం జన్మ అని దు:ఖపడ్డారు...' అని ఆగిపోయింది.

అవును కదా! ఇద్దరు పుడితే... ఇద్దరూ ఇట్లా వెళ్లిపోతే ఎంత కష్టం? అనుకుంది గౌతమి. ఇంతలో ఎవరో వస్తే గౌతమి హాల్లోకి వెళ్లింది.

ధనలక్ష్మికి ఎప్పటెప్పటివో గుర్తుకు రాసాగాయి.

* * *

పొద్దున్నే లేచి బయటికి వెళ్లడానికి సైకిల్ తీస్తున్న కొడుకును పోశమ్మ ఆపింది. 'చెల్లెను చూడనీకి వస్తున్నారని చెప్పిన. ఇయ్యల్ల కూడా ఇంట్లో ఉండవా?' అన్నది.

రమేష్ ఒక క్షణం ఆలోచించి, సైకిల్ స్టాండ్ వేశాడు.

మంచినీళ్ల బిందె తీసుకుని లోపలికి పోతున్న చెల్లితో 'ధనమ్మా! ఒక నిమిషం... బిందె లోపల పెట్టిరా' అంటూ ఇంటి ముందున్న రేకుల షెడ్ కింద కుర్చీలో కూచున్నాడు.

బొగ్గు పొయిలో పొగ తగ్గి నిప్పులు కణకణ మండుతున్నాయి. గుట్టలా పేర్చిన బొగ్గు పెళ్లల్ని కట్టెపుల్లతో పొయ్యిలోకి దిట్టంగా కుదించి వచ్చి రమేష్ కుర్చీ పక్కనే ఉన్న మంచంలో కూర్చుంది పోశమ్మ.

ధనలక్ష్మి వచ్చి తల్లి పక్క కూచుంది.

'అమ్మా.. నేనింతకు ముందే చెప్పిన. ఈ సంబంధం మీరు బరువు దించుకోడానికేగాని దాని బతుకు బాగుపడానికి కాదని. చెల్లెకిట్లయిందని తెలిసి కూడా వాళ్లు ముందుకు వచ్చిన్రు. అంత వరకు మంచిదే. నాకు తెలిసి ఆ పిలగాడితో సమస్యలు వస్తయి. మళ్లీ అట్లనే అయితది. బాబును వదిలిపెట్టి రావాలని వాళ్లంత కరాఖండిగా చెబుతున్నరంటే వాళ్ల మనస్తత్వమేందో తెలుస్తంది. దీన్ని వదిలించుకోడానికి మీరేమో బాబును మేం చూసుకుంటంలే అంటున్నరు. పుట్టింటికి రాకపోకలు లేకుండా ఉంటాయా? బాబు మన దగ్గరేనాయె ఉండేది. వాళ్లు బాపు పెట్టిస్తాననే ఉద్యోగానికి ఆశపడి వస్తున్నరు గాని బాబును అంగీకరించే పెద్ద మనుసుతో కాదు' రమేష్ మాటలు పూర్తి కాకముందే..

పోశమ్మ అందుకోని.. 'ఇంకెవడో కన్నోడ్ని వాళ్లెందుకు పెంచుకుంటరు?' అన్నది.

రమేష్‌కు తల తిరిగిపోయింది.

చెల్లెలి దిక్కు చూసిండు. ధనలక్ష్మి ముఖం అవమానంతో మాడిపోయింది. కళ్లెంబడి బొటబొట నీళ్లు కారిపోయాయి.

'అమ్మా నువ్వే ఇట్లన్నవంటే.. వాళ్లు ఇంకెట్లంటరో ఆలోచించు. అది చూడు ఎంత బాధపడుతున్నదో. ఇంతకూ బాబును వదిలి వెళ్లడానికి ధనాలు సిద్ధంగా ఉందా? దాన్ని ఒక్క మాట అడగకుండా బాబును మేం పెంచుకుంటామని వాళ్లకు మీరే చెప్పి పంపించిండ్లు... అంతే. అందుకే వాళ్లు ముందుకు వచ్చిండ్లు. మీరు, నేను, వాళ్లూ కాదు. అదేమనుకుంటుందో ముఖ్యం. ఇప్పుడు అంతా చెల్లె మీద ఆధారపడి ఉంది. ఇప్పటికే అది ఒకసారి దెబ్బతిన్నది. జాగ్రత్తగా తనే నిర్ణయం తీసుకోవాలి. బాబును వదులుకోడానికి సిద్ధపడితేనే ఈ సంబంధం గురించి ఆలోచించాలి. లేదంటే ఇంకో సంబంధం చూసుకోవాల్సిందే' అన్నాడు.

'ఇంకెంత కాలం ఆగుతాం బిడ్డా. పిలగానికి ఇప్పికే మూడేళ్లు వచ్చినై. ఈ లెక్కలు తేలకనే కదా ఇన్ని రోజులైంది' అన్నది పోశమ్మ.

"ధనాలు నువ్వేమంటావు?" అని సూటిగా అడిగాడు రమేష్

'నేనసలు ఇవేమీ ఆలోచిస్త లేను. బాబును ఇచ్చిపోవడం నా వల్ల కాదు' అంది ధనలక్ష్మి.

'కొడుకును ఇచ్చిపోవడం ఇష్టం లేదా? అసలు పెళ్లే ఇష్టం లేదా?" అని పోశమ్మ రోశంగా మాట్లాడింది.

ధనలక్ష్మి పలకలేదు.

విడాకులతో ఇంటికి వచ్చినప్పటి నుంచి ఇంకో అయ్య చేతిలో పెట్టాలని వాళ్లు చేస్తున్న ప్రయత్నాలు ముందుకు సాగడం లేదు. ఈ సంబంధమైనా ఉట్టిగనే వచ్చింది కాదు. లింగయ్య మెడికల్ అన్ ఫిట్ అయి డిపెండెంట్ కింద తన స్నేహితుడి కొడుకు

కుమారస్వామికి ఉద్యోగం ఇప్పించే వొప్పందం మీద కుదిరింది. ఆ లెక్కన లక్షలు పోసి అల్లుణ్ణి కొనుకున్నట్టే. ఈ ఉద్యోగం బైట వాళ్లకు అమ్ముకున్నా ఐదారు లక్షలు వస్తాయి.

మళ్ళీ పోశమ్మే అందుకుంది.

'మీ అన్నను ఉద్యోగం చేయమంటే దేశాలు పట్టి పోతనంటున్నడు. వంశానికి ఒక్కడు. ఇంతితోనే నా వంశం ఆగిపోయినట్టే. ఇంత పాపిష్టి జన్మ నాకు తప్ప ఇంకెవరికి ఉండదు. ఇద్దర్ని కంటే ఇద్దరికి ఇద్దరు బతుకు ఆగం చేసుకుంటుండ్లు. మీకు మీరు బాగుపడేది లేదు. ఒకరు చెబితే చెవికెక్కేది లేదు' అన్నది కూతుర్ని ఉద్దేశించి.

రమేష్‌కు మనసు చివుక్కుమన్నది.

కొడుకు ఏమీ మాట్లాడకపోయే సరికి పోశమ్మ మరింత గట్టిగా 'వాళ్లు వస్తుండ్లు. నువ్వు కూడా కచ్చితంగా ఉండాలె' అని పట్టుబట్టింది.

"అమ్మా.. అన్నకు పనుంటే పోనివ్వు. బాపు, నీవు ఉన్నరు గదా' అని ధనలక్ష్మి తనకా సంగతే ఇష్టం లేనట్టు చరచర లోపలికి వెళ్లిపోయింది. చిన్నప్పటి నుంచి ధనలక్ష్మి అన్నకు ఏ కష్టం రానిచ్చేది కాదు.

* * *

రాత్రి తొమ్మిది గంటలైంది.

తలుపు చప్పుడైతే పోశమ్మ వెళ్లి తీసింది. కొడుకు కోసమే ఎదురు చూస్తున్నట్టుగా లింగయ్య ముందు రూంలోనే కూచున్నాడు. రమేష్ లోపలికెళ్లి కాళ్లూ చేతులు కడుక్కొని తండ్రి పక్కనే కూర్చుంటూ చెల్లెలి కోసం అటూ ఇటూ చూశాడు. ఆమె కనిపించలేదు. బహుశా లోపలి గదిలో ఉందేమో.

'ఏమైంది బాపూ! వాళ్లు పొద్దున వచ్చిండ్లా? ఏమైంది?' అని తండ్రిని అడిగాడు.

లింగయ్యది పోశమ్మలా దూకుడు స్వభావం కాదు.

'ఆ.. అచ్చిపోయిండ్లు' అన్నాడు.

ఆ తర్వాత కూడా బాపే చెప్తాడని చూస్తుండిపోయాడు రమేష్ ఆయన కాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

'వాళ్లకు మనం ముందే మాట ఇచ్చినం కదా. పిల్లగాన్ని ఉంచుకుని పెళ్లి జేస్తమని. ధనాలు ఏమో ససేమిరా అంది. నీకు మేం చూసే సంబంధాలు ఇష్టం లేనట్లే దానికీ ఇష్టం లేకపోయె. పైగా ఒకసారి చదువు ఆపి గొంతు కోసింది చాలదా? అని అందరి ముందే అనె. ఇంకేం మాట్లాడతం. అవతలి వాళ్లు రడీగా ఉన్నా చేసేదేముంది? మిమ్మల్ని కన్నం కాని మీ రాతల్ని కనలేదు కదా. మా చేతిలో ఏముంది చెప్పు. ఎట్లయితే అట్లయితదితియ్..." అని నిర్లిప్తంగా ముగించాడు.

పోశమ్మకు ఇద్దరి పిల్లలమీద పట్టరానంత కోపంగా ఉంది.

ఆ పూట ఇంట్లో వండలేదు. తినలేదు.

* * *

ధనలక్ష్మి బాగా బిజీ అయిపోయింది. తనంతకు తనుగా ఎంచుకున్న పనులు కొన్ని, అన్న అప్పగించిన చిన్న చిన్న పనులు మరి కొన్ని. పొద్దున్నే బాబును స్కూల్లో వదిలేసి తను స్కూలుకు వెళ్తుంది. సాయంకాలం నాన్న వచ్చి బాబును ఇంటికి తీసికెళ్తాడు. రాత్రిళ్లు పొద్దు పోయేదాకా చదువు, రాత పనులు కూడా పెట్టుంది. ఆమె కోసం ఒక రెండు సార్లు పోలీసులు స్కూలుకు వచ్చారు.

'ధనలక్ష్మి ఎవరనుకున్నారు? వాళ్ల అన్న ఇప్పుడు పెద్ద నక్సలైట్ నాయకుడు. ఈమె కూడా వాళ్లతో సంబంధాల్లో ఉంది. వాళ్ల పనులు చేస్తుంది. ఆమె ఉంటే మీ స్కూలుకు ఇబ్బంది' అని చెప్పారు.

అన్న ఉన్నప్పుడు తనతో చాలా విషయాలు మాట్లాడేవాడు. ఇప్పుడు పూర్తి ఒంటరిగా ఫీలవుతోంది. ఈ వెలితిని భర్తీ చేసుకోడానికి పుస్తకాలు చదవడం మొదలుపెట్టింది.

ఇప్పుడు లింగయ్య, పోశమ్మ కూతుర్ని చిన్న పిల్లలా చూడటం మానేశారు. ఆమె తనంతకు తాను బతకగలదనే నమ్మకం కుదిరింది. అన్నికీ బేలగా తలకిందులయ్యే ధనలక్ష్మి ఇప్పుడు వాళ్లకు కొత్తగా కనిపిస్తోంది. అడపాదడపా పోలీసులు ఇంటికి వచ్చి రమేశ్ కోసం ఎంక్వైయిరీ చేసి వెళ్తున్నారు. కొడుకును సరెండర్ చేయించమని వొత్తిడి తీసుకొని వస్తున్నారు. ముసలి ప్రాణాలకు కొడుకును చూడాలని ఎంతగానో ఉండేది. కానీ బైటకి చెప్పుకోలేరు.

స్కూలుకు మళ్లీ పోలీసులు వచ్చారు.

ఆమె కోసం ఎవరైనా వస్తున్నారా? వస్తే తమకు చెప్పాలని హెడ్మాస్టర్‌కు చెప్పి వెళ్లారు. రమేష్ గురించి తెలుసు కాబట్టి ధనలక్ష్మిని పిలిచి హెడ్మాస్టర్ ఈ సంగతి చెప్పాడు.

'తన కోసం ఎవరొస్తారని?' నవ్వుకుంది ధనలక్ష్మి.

ఈ సంఘటన జరిగిన రెండు రోజుల తర్వాత ఆమె దగ్గరికి తన చిన్న నాటి స్నేహితురాలు గౌతమి వచ్చింది. తనను చూచి రెండేళ్లు కావస్తోంది. ఆమెను మహారాష్ట్రలోని గడ్చిరోలికి ఇచ్చారు. చాలా కాలం తర్వాత గౌతమి రావడంతో ఆ పూట స్కూలుకు సెలవు పెట్టి ఇంటికి వచ్చింది ధనలక్ష్మి.

* * *

'ఏం బిడ్డా అల్లుడు ఎట్లున్నడు?' అడిగింది పోశమ్మ.

"అందరూ బాగున్నారు చిన్నమ్మా' అన్నది.

'అన్నం తిని పోదువుగాని ఉండు. ఎన్నాళ్లకు కలిసిండ్రో. ఇద్దరు దోస్తులు కలిసినాక ముచ్చట్లకు తక్కువా?' అని మరో మాటకు అవకాశం లేకుండా పోశమ్మ మార్కెట్ కు వెళ్లిపోయింది.

"ఏంటి విశేషాలు?" అని అడిగింది.

"విశేషాలా? ఉండవా? చాలా రోజులకు వచ్చాను కదా?" అని పర్స్ లోంచి ఒక కవర్ తీసి ఇచ్చింది గౌతమి.

"ఏమిటది?"

"చదివితే కదా తెలిసేది."

ఉత్తరం తెరవగానే ధనలక్ష్మి కళ్లు విప్పారాయి.

అది రమేష్ నుంచి వచ్చింది.

గతాన్ని తల్చుకుంటూ ధనలక్ష్మి నిద్రలోకి జారుకుంది.

* * *

సతీష్ టీ కప్పుతో గదిలోకి వచ్చి పంజాబీ డ్రెస్సులో, పాపిట సింధూరంతో ఉన్న ధనలక్ష్మిని చూచి "ఓకే... చీర కట్టుకున్నారేమో...

చెప్పలేదే అని గుర్తుకొచ్చింది. మన ట్రావెలింగ్‌కు ఇదే మంచిది. వెహికల్ రెడీగా ఉంది. ఇక్కడి నుంచి నాలుగు గంటల ప్రయాణం. మనం అడవి చూడానికి వెళ్తున్నాం. ఎవరైనా తెలిసిన వాళ్లకు మీరు నా చెల్లెలని చెప్తాను..." అన్నాడు.

మాట్లాడుకుంటూ ఓ మారుమూల గ్రామం చేరుకున్నారు. అక్కడ ఓ చిన్న హోటల్‌లో టీ తాగడానికి ఆగారు. దాంట్లో ఐదారుగురికి కంటే ఎక్కువ మంది లేరు. ఆడమనిషి రావడంతో ఒక్కసారి చూసి మళ్లీ మాటల్లో పడిపోయారు. పర్వాలేదు.. అంతా ప్రశాంతంగానే ఉంది. రండి టీ తాగుదాం.. అన్నాడు ధనలక్ష్మితో.

ఓ మూలన టేబుల్ ముందు కూర్చొని టీ తాగుతోంటే అక్కడికి ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వాళ్లను చూసి సతీష్ పలకరింపుగా నవ్వాడు. వాళ్లిద్దరిని ధనలక్ష్మికి వసంత్, రాజా అని పరిచయం చేశాడు. ఇద్దరికీ ముప్పైలోపే వయసు ఉంటుంది. బక్క పల్చగా చామన చాయలో ఉన్నారు. వాళ్లిద్దరు కూడా టీ తాగారు.

సతీష్ బిల్లు కడుతూ తమను ఎవరైనా గమనిస్తున్నారా? అని చుట్టూ చూశాడు. అక్కడున్న వాళ్లు ఎవరి మాటల్లో వాళ్లు ఉన్నారు.

ఇక బయల్దేరుదామా? అన్నట్లుగా ఆ ముగ్గురి వైపు చూసి బైటికి నడిచాడు. వాళ్లు అతడ్ని అనుసరించారు. కాస్త రోడ్డు మీద ముందుకు వెళ్లగానే, 'మీరు నడుస్తూ ఉండండి. నేను ఇక బయల్దేరుతాను' అని సతీష్ అన్నాడు.

ధనలక్ష్మి గతుక్కు మంది ·

మీరు మాతో రారా? అని అడిగింది బేలగా.

మళ్లీ కలుద్దాం.. అని సతీష్ వీడ్కోలు చెప్పి వెళ్లిపోయాడు.

ధనలక్ష్మి దిగులుగా ఉండటం చూసి రాజా 'అక్కా, మనం ఈ రోజు ఎక్కువగా నడవాల్సి ఉంటుంది. పర్వాలేదా?' అన్నాడు.

ఇబ్బంది ఏమీ లేదని అంది ధనలక్ష్మి.

* * *

పొద్దువాలుతూ ఉన్నప్పుడు అడవి దారిలో ముగ్గురూ నడుస్తున్నారు. ధనలక్ష్మికి ఇలాంటి నడక అలవాటు లేదు. అడవిని అసలు చూడనే లేదు. తార్రోడ్డు మీదిలా ప్రయాణం సాఫీగా సాగడం లేదు. ఎత్తు వంపుల్లో, రాళ్ల మీద నడక చాలా కష్టంగా ఉంది. అది గమనించి ఆ ఇద్దరు కామ్రేడ్స్ ఆమెకు అడవి గురించి చెప్పడం మొదలుపెట్టారు.

రాజా 'వర్షాకాలమైతే అడవి పచ్చగా చిక్కదనంతో అందంగా ఉంటుందక్కా. అయితే వానల్లో తడుస్తూ బురదలో దిగబడుతూ నడవడం కష్టమే. ఎండాకాలంలో నడక సుఖంగా ఉంటుంది. అయితే ఎప్పుడూ ప్రమాదం పొంచి ఉంటుంది. అడవి పల్చపడటం, నీళ్లు ఇంకిపోవడంతో కామ్రేడ్స్ చాలా ఇబ్బందిపడాల్సి వస్తుంది..' అని చెప్పసాగాడు.

ఏ చెట్టూ ఎప్పుడు పువ్వులు పూచేదీ, అవెంత మంచి వాసన వేసేదీ చెప్తున్నారు. వాగులు, వంకలు ఎప్పుడూ ఎట్లా పారేదీ చెప్పాడు వసంత్.

ధనలక్ష్మి నడకను బాలెన్స్ చేసుకుంటూనే వాళ్లు చెబుతున్న వాటిని ఆసక్తిగా వింటోంది.

ఆదివాసులు ప్రకృతిలో పాటు ఎట్లా పరవశించేది కూడా వాళ్లు చెప్పసాగారు.

గంట నడిచాక ఒక గ్రామానికి చేరుకున్నారు. ఇప్పుడే కదా అడవిలోకి చేరుకున్నాం. అంతలోనే చెట్ల మధ్యలో గ్రామం. ధనలక్ష్మికి చాలా చిత్రంగా తోచింది. అడవి చెట్లను అనుకొనే దడి కట్టి దానికి కర్రలతోనే గేటులాంటిది ఏర్పాటు చేశారు. అది తీసుకొని ఆ ముగ్గురు లోపలికి వచ్చారు. అంతా కలిపి పది ఇండ్లు ఉంటాయేమో. మొదటి ఇంటి ముందుకు రాగానే ఆగిపోయారు.

వసంత్ 'జంగుబాయి... జంగుబాయి' అంటూ పిలిచాడు.

లోపలి నుంచి ఆ.. అంటూ ఓ మహిళ వచ్చి లాల్‌సలాం దాదా అని ముగ్గురికి చేతులు కలిపింది. వసంత్ ఆమెను కాస్త పక్కకు తీసికెళ్లి ఏదో మాట్లాడాడు. ఆమె ఇంటి తలుపు దగ్గరికి వేసి వసంత్‌తోపాటు వెళ్లింది.

మనవాళ్లు ఇప్పుడు ఇక్కడే ఉన్నారక్కా.. వాళ్ల కోసమే వెళ్లారు అన్నాడు రాజా ధనలక్ష్మితో.

అన్నయ్య ఈ రోజే కలుస్తాడా? మనసులో అనుకుంది.

'భీమాల్ దాదా కూడా కలుస్తాడా?' అని రాజును అడిగింది.

'తను ఇంకో రెండు రోజులకు గాని కలవడు. అంత దాకా మనం నడవాలి. .. అంటుండగానే ఇద్దరు సాయుధులైన కామ్రేడ్స్ అక్కడికి వచ్చారు.

మళ్లీ నడక మొదలైంది.

ఇందాక వచ్చిన దారిలోనే మళ్లీ వెనక్కి నడవడం మొదలుపెట్టారు. పది నిమిషాలయ్యాక దారి నుంచి కాస్త పక్కకు దిగారు. నాలుగు అడుగులు వేయగానే అవతలి వైపున చెట్టు చాటునుంచి సెంట్రీ కామ్రేడ్ బయటికి వచ్చి దళం ఉన్న డైరెక్షన్ చూపించాడు.

ఆ చెట్టు దాటి కొంచెం దూరం వెళ్లగానే కామ్రేడ్స్ కలిశారు. వాళ్లు ఆత్మీయంగా కరచాలనం చేసి ఎప్పటి నుంచో తెలిసిన వాళ్లలాగా పలకరించారు.

'దారిలో ఇబ్బంది పడ్డారా?' అని కమాండర్ అడిగారు.

ఏం చెబుతుందో అని ఆమె వైపే రాజు, వసంత్ చూశారు.

లేదన్నట్లుగా తలూపింది ధనలక్ష్మి.

'ఇప్పుడు ఇక్కడే పడుకొని చీకటితోనే లేచి బయల్దేరుతాం. రేపు సాయంత్రం భీమాల్ వాళ్లను కలుస్తాం. మీరు ఈ రోజు కామ్రేడ్ సోని దగ్గర పడుకోండి' అన్నాడు.

ఆ రాత్రి అక్కడే పడుకున్నారు.

అంత మంది గెరిల్లాలను ఒకేచోట చూడటంతో ధనలక్ష్మికి వింత అనుభూతి కలిగింది. ఇక నుంచి తను కూడా వీళ్లలో భాగం. ఆ ఊహే మరింత వింతగా, ఉద్రేకంగా అనిపించింది. అలా పడుకొని ఆలోచిస్తోంది.

రాత్రి పదకొండు గంటల తర్వాత నెల పొడిచింది. దట్టమైన అడవిలో చెట్ల మధ్య అక్కడక్కడ వెన్నెల వెలుగు పరుచుకుని ఉంది. ధనలక్ష్మికి నిద్ర పట్టలేదు. అడవిలోకి ఇట్లా వచ్చి సాయుధ కామ్రేడ్స్ మధ్య పడుకుంటానని కలలో కూడా అనుకోలేదు. అమ్మ గుర్తుకొచ్చింది.

* * *

ఉదయం లేచిన వెంటనే నడక ప్రారంభించారు.

చీమల బారులాగా అందరూ వరుసుగా ఫార్మేషన్‌లో నడవడం చూసి ధనలక్ష్మి .. ఎంత పద్దతిగా నడుస్తున్నారు? అనుకుంది. అయితే ఇలాంటి దృశ్యాలు టీవీల్లో చూసింది. ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తోంది. ఆమెకు ఎక్కడ లేని ఆనందంగా ఉంది. ధనలక్ష్మి కూడా తన బ్యాగును కిట్ లాగా రెండు భుజాలకు తగిలించుకొని కమాండర్ వెనకాలే నడుస్తోంది. కామ్రేడ్స్ అందరూ తుపాకీ, కిట్ బ్యాగులతోపటు తలా ఒక వాటర్ క్యాన్ తగిలించుకున్నారు. కొందరు బరువైన మూటలను తలపైన పెట్టుకొని మోస్తున్నారు. అవి సరుకులు కావచ్చు.

నడక మొదలు పెట్టినప్పుడే రేపటి దాకా తన వెనకాలే ఉండాలని కమాండర్ చెప్పాడు. ఫైరింగ్ జరిగితే గాబరాపడకూడదని, నీ వెనకాలే ఉన్న సోని, రాజా రక్షణగా ఉంటారని, వాళ్లను వదలిపోకూడదని చెప్పాడు. ఆ సంగతి వాళ్లకు కూడా చెప్పాడు.

దట్టమైన అడవి మధ్య నుంచి ప్రయాణం సాగింది. గంట తర్వాత అడవి పల్చబడసాగింది. మొదట చలి అనిపించినా రాను రాను నడకలో వేగం పెరగడంతో చెమటతో బట్టలు తడిసిపోతున్నాయి. అలవాటులేని నడక మూలాన ధనలక్ష్మికి ఆయాసంగానూ, కష్టంగానూ ఉంది.

రెండు గంటల ప్రయాణం తర్వాత ముందు నడుస్తున్న పైలెట్ సైలెన్స్ అన్నాడు.

అందరూ అలర్ట్ అయినట్లు ధనలక్ష్మి గుర్తించింది.

ఇంకొద్ది దూరం నడిచాక తాము ఇంత వరకు నడిచింది కొండ ప్రాంతమని ధనలక్ష్మికి అర్థమైంది. కొండ కింద గ్రామం కనిపించింది.

'కామ్రేడ్స్ భోజనానికి ఇక్కడే ఆగుదాం.. టైం పదకొండు గంటలవుతోంది..' అన్నాడు కమాండర్. ఒక కామ్రేడ్‌ను పిలిచి నీవు గూడేనికి వెళ్లి జానకిరాం, లింగు దాదాలను పిల్చుకొని రా.. అని చెప్పాడు. ఆ లోపు ఇక్కడ వంట అయిపోతుంది..' అని పంపించాడు.

పక్కనే ఉన్న సోనీతో ధనలక్ష్మి మనం దారిలోనే ఉన్నాం కదా? ప్రమాదం ఏమీ లేదా? అని అడిగింది. అందుకు సోని ఇది దారి కాదు. ఆవులు తిరిగే దారి అని చెప్పింది. శత్రువు ఇటు వైపు రాలేదని, అందుకే ఇక్కడ ఆగామని చెప్పింది.

* * *

గూడేనికి వెళ్లిన కామ్రేడ్‌తోపాటు ఇద్దరు యువకులు వచ్చి ఏదో సమాచారం ఇచ్చి వెళ్లారు. వాళ్ల గొంతును బట్టి ఏదో ప్రమాదం పొంచి ఉందేమో అని అనుమానం కలిగింది. అడగడానికి ధనలక్ష్మి మొహమాటపడింది. మిగిలిన అన్నం మూట కట్టుకొని బయల్దేరుతుండగా కమాండర్ పరిస్థితిని వివరించాడు.

'ఇందాక వచ్చిన గ్రామస్థులు చెప్పిన దాని ప్రకారం ఒక వంద మంది వరకు పోలీసులు రాత్రి ఈ గ్రామం పక్క నుంచి వెళ్లారు. వాగు ఒడ్డున ఉదయం వంటలు కూడా చేసుకున్నారట. అయితే వాళ్లు ఆ తర్వాత కనిపించలేదని చెబుతున్నారు. అందుకని మనం జాగ్రత్తగా అడవి లోపలికి వెళ్లి గ్రామాలు తగలకుండా రేపటి అపాయింట్‌మెంట్ కు వెళ్లాలి. ఏదైనా జరిగితే మనం నిన్న అనుకున్న గ్రామానికి చేరుకోవాలి..' అన్నాడు.

అక్కడి నుంచి గంట నడిచాక... ఒక చిన్న గుట్ట దాపున విశ్రాంతిగా కూచున్నారు. ధనలక్ష్మికి కొంచెం ఆందోళనతో వేగంగా నడవడం వల్ల అలసటగా ఉంది. ఒత్తిడి అనిపించింది. అయితే అక్కడ ఆగటం వల్ల ఇక ఇబ్బంది ఏమీ ఉండకపోవచ్చు... అనుకుంది.

చిన్నగా కునుకుపట్టింది. ఢాం అన్న చప్పుడుకు ఉలికిపడి లేచింది.

అవతలి నుంచి ఫైరింగ్ మొదలైంది. అసలు అది తుపాకీ మోత అని ధనలక్ష్మి అనుకోలేదు. ఆమె తేరుకునే లోపే మిగతా కామ్రేడ్స్ మెరుపు లాగా అలర్ట్ అయ్యారు. అందరూ కవర్‌లోకి వచ్చారు. కమాండర్, ఆయన గార్డు, మరో నలుగురు కామ్రేడ్స్ అర్ధ చంద్రాకారంలో పొజిషన్‌లోకి వచ్చి కాల్పులు జరుపుతూ గట్టిగా అరవడం మొదలు పెట్టారు. అవతలి నుంచి గుండ్లవర్షం కురుస్తోంది. ఇటు నుంచి ఆచితూచి ఫైరింగ్ చేస్తున్నారు. అవతలి వైపు ఫైరింగ్ విరామంలో ఇవతలివైపు నుంచి ఒక్కసారిగా కాల్పులు జరపడం మొదలు పెట్టారు. శత్రువు వైపు నుంచి కాల్పులు జరుగుతున్నా మోత దూరమైపోయింది. ఇటువైపు నుంచి కాల్పులు చేస్తూనే రిట్రీట్ అయ్యారు.

ఈ మొత్తంలో ధనలక్ష్మికి తుపాకి మోతలు తప్ప మరేమీ కనిపించలేదు. రాజా ఫైరింగ్ చేస్తుండగా సోని ధనలక్ష్మి చేయి పట్టుకుని చెట్టు చాటుకు లాక్కపోయి తనూ ఫైరింగ్ మొదలుపెట్టింది. ఆ కామ్రేడ్స్ తనను ఎట్లా లాక్కుపోతున్నారో కూడా అర్థం కాలేదు. అప్పుడామెను తుపాకీ మోతలతోపాటు భయాందోళనలూ చుట్టుముట్టాయి. కిందపడ్డంతో మోకాలికి గాయమైంది. చేతి వేళ్లు నలిగిపోయి నెత్తురు కారుతోంది. అవన్నీ గమనించే స్థితిలో ధనలక్ష్మి లేదు. పడిపోయినప్పుడు ఎవరో కామ్రేడ్ అమాంతం పైకి లేపి తనతో పాటు పరుగు తీయించాడు.

అరగంటయ్యాక అవతలవైపు నుంచి ఫైరింగ్ ఆగిపోయింది.

దళంలోని ఇరవై రెండు మంది అటూ ఇటూ చెల్లాచెదరైనా ఒక చోట తిరిగి కలిశారు. కండ్లతోనే ఒకరి నొకరు పరామర్శించు కున్నారు. మొత్తం మీద ఎవరూ తప్పిపోలేదు. చిన్న చిన్న గాయాలైనా బుల్లెట్ గాయాలెవరికీ కాలేదు. అందరిలోకి ధనలక్ష్మే బాగా గాయపడింది. ఆమె స్థిమితంగా నిలబడి మాట్లాడలేకపోతోంది. ఈ గాబరాలో చున్నీ ఎక్కడో పడిపోయింది. ఓ కామ్రేడ్ నీళ్ళ బాటిల్ తీసి తాగమని మొదట ధనలక్ష్మికి ఇచ్చాడు.

కుడి చేయికి గాయం కావడంతో బాటిల్ ఎత్తలేక ఎడం చేత్తో అందుకుంది. మాట బైటికి రానంతగా గొంతు ఎండిపోయింది. ఆ సీసా నీళ్లు తాగేసింది. ఆ తర్వాత మిగతావాళ్ల సంగతి గుర్తుకొచ్చింది. అది గమనించిన ఆ కామ్రేడ్ ఏం ఫర్వాలేదు అన్నట్లు చూశాడు.

మళ్లీ నడక మొదలైంది.

సంజ చీకట్లలోంచి నడుచుకుంటూ వెళ్లారు. ఆ తర్వాత రెండు గంటలకు సురక్షిత ప్రాంతానికి చేరుకున్నారు. నాలుగు సెంట్రీలను ఏర్పాటు చేసి అందరినీ పడుకోమని చెప్పాడు. ఎవ్వరినీ మాట్లాడవద్దని చెప్పి కమాండర్ ముఖ్యులతో సమావేశమయ్యాడు.

* * *

ఇది అడవిలో రెండో రాత్రి.

ధనలక్ష్మి ఆకాశంలోకి చూస్తూ పడుకుంది. ఎదురు కాల్పుల స్థితి నుంచి మిగతా కామ్రేడ్స్ అప్పుడే బయటపడ్డారు. అసలు ఇదేమీ జరగనట్టుగా గాఢ నిద్రలో ఉన్నారు. బయటి ప్రపంచానికి ఎదురు కాల్పులనే మాట కేవలం టీవీ స్క్రోల్. అంతే. ఎదురు కాల్పులు ఎలా ఉంటాయో ధనలక్ష్మి ఇంకా అర్థం చేసుకుంటూనే ఉంది. ఇంత భయానకంగా ఉంటుందా? అనుకుంది. ఈ సంఘటనలో తనకేమైనా జరిగి ఉంటే..? ఆ ఊహతో ఆమె వణికిపోయింది. అడవిలోకి చేరకముందే మరణించడమా? తనకు ఇలా ముగిసిపోవాలని లేదు. ఇష్టపూర్వకంగా విప్లవంలో భాగం కావాలని వచ్చాక ఏదో కొంత పని చేశానన్న సంతృప్తి ఉండాలి కదా? తనకే కాదు.. తన వాళ్లకు కూడా. బాబుకు ఎక్కడో ఒక చోట అమ్మ లేకుండా...

... ఇలా ఆలోచిస్తుంటే దు:ఖం వచ్చింది. ఎందరు ఇలాంటి ఘటనల్లో అమరులవుతున్నారో కదా? తన అన్నయ్యే ఇలాంటి జీవన్మరణ పోరాటాన్ని ఇన్నేళ్లుగా కొనసాగిస్తున్నాడు. తను కొనసాగగలదా? అనే చిన్న అనుమానం ఎక్కడో కదిలినా.. వెంటనే దాన్ని తుడిచేసింది. ఇదంతా తెలిసీ అన్నయ్య రమ్మన్నాడు. ఆయన చెప్పాడని కాదు... తను ఇవన్నీ తెలిసే ఈ జీవితాన్ని ఎంచుకుంది. ఎంతగానంటే ఆసరాలేని తల్లిదండ్రులను కడుపున పుట్టిన బిడ్డను ఈ జీవితం కోసం, ఆశయం కోసం వదులుకుంది. తను వెనక్కి తిరిగి చూడకూడదు. తనచుట్టున్న కామ్రేడ్స్‌లో ఎనిమిది మంది మహిళలు ఉన్నారు. వాళ్లు తనకంటే శారీరకంగా దృఢంగా ఏమీ లేరు. అయితే మానసికంగా బలంగా ఉన్నారు.

ఇలా ఆలోచిస్తూ నొసటి మీద చెయి వేసుకోబోయింది. కుడి చేయి భరించలేని నొప్పి అనిపించింది. పడుకునే ముందే దళం డాక్టర్ అంతా శుభ్రం చేసి ఇన్‌జెక్షన్లు కూడా చేశాడు. దాని ప్రభావం తగ్గుతోందో, తనే ఆలోచనలతో పట్టించుకోలేదో.. కొద్దిగా అలా కదిలితేనే చెయి సలపరం పెడుతోంది.

తను ఎనిమిదేళ్లప్పుడు మామిడి చెట్టు మీదికెల్లి పడి సరిగ్గా ఇలాగే కుడి చేతి వేళ్లు చితికిపోయాయి. తనతోపాటు చెట్టు మీద ఉన్న అన్నయ్య గాబరాగా దిగి తనను చేతుల్లో మోసుకొని ఇంటికి తీసికెళ్లాడు. తన తప్పేమీ లేకపోయినా బాపుతో బాగా తన్నులు తిన్నాడు.

'నువ్వు చెడిందిగాక ఆడపిల్లను ఇట్ల చెట్లు పుట్టల ఎంబడి తిప్పుతావా? ఏ కాలో చెయ్యో విరిగితే ఎవడు చేసుకుంటాడు?' అని అమ్మ కూడా తిట్టింది.

నిజంగానే ఏదో తప్పు చేసినవాడిలా తన చేతిని అన్నయ్య తన చేతిలోకి తీసుకొని తలమీద నిమురుతూ ఇంకెప్పుడు నీకు ఇట్ల కానియ్యనురా.. అని ఏడుస్తూ అన్నాడు.

ధనలక్ష్మికి నవ్వొచ్చింది.

అన్నయ్యకూ ఈ సంఘటన తప్పకుండా గుర్తుండే ఉంటుంది. ఆ తర్వాత ఎప్పుడూ తనకు చిన్న ఇబ్బంది కలిగినా గిలగిలలాడేవాడు. బాగా చిన్నప్పుడైతే మాట ఇచ్చాను కదా అని దెప్పిపొడిచేవాడు. అప్పుడు ఇచ్చిన మాట ఇప్పుడు తప్పిన్నా..? ఇప్పుడు తనతో పాటు ఏకంగా ఈ అడవిలోకే వచ్చేసింది.

ధనలక్ష్మికి ఆ క్షణాన ఎందుకో అన్నయ్యను చూడక ముందే తనకు ఇందాక జరిగిన కాల్పుల్లో ఏమైనా జరిగి ఉంటే..? ఈ ఊహ రావడంతో అన్నయ్యను ఎప్పుడెప్పుడు చూస్తానా? ఇంట్లో సంగతులు చెప్తానా? అని ఆదుర్దాగా ఉంది. ఎట్లాగైనా వీలు చేసుకొని అమ్మాబాపులను పిలిపించమని అడగాలని అనుకుంది. ఎందుకంటే వాళ్లు అన్నయ్యను చూడక మూడేళ్లవుతోంది. అమ్మ చాలా దిగులుగా గడుపుతోంది ఈ మధ్య. ఎక్కడ ఎన్‌కౌంటర్ అయినా చనిపోయింది ఎవరో తెలిసే వరకు టీవీ ముందు నుంచి లేవడం లేదు. ఆలా తల్లిని తల్చుకుంటూ నిద్రలోకి జారుకుంది.

* * *

ముఖం మీద సూర్య కిరణాలు పడటంతో నిద్ర లేచింది. అప్పటికే మిగతా కామ్రేడ్స్ టీ తాగుతూ కనిపించారు. ధనలక్ష్మి పక్కనే సోని కూర్చొని తుపాకీ తుడుచుకుంటోంది.

'నువ్వు టీ తాగావా?' అని అడిగింది సోనీని.

'నాకు వేడి వేడిగా తాగడమే ఇష్టం. అందుకే పొయ్యి దగ్గరే కూర్చొని తాగొచ్చాను. మరి నీకు తేనా?' అని అడిగింది.

'అయ్యో వద్దొద్దు. నేను వెళ్లి ముఖం కడుక్కొని తాగి వస్తా ' అని లేచింది.

అందరూ టీలు తాగి నడక ప్రారంభించారు.

ఎండతోపాటు కడుపులో ఆకలి కూడా పెరగసాగింది. ఈ రోజు నడక పూర్తయ్యే సరికి అన్నయ్యను చూస్తాననే ఊహ రాగానే ఉత్సాహం దానంతట అదే శరీరాన్ని ఆక్రమించసాగింది. మోకాలు నొప్పి పూర్తిగా తగ్గిపోయింది. మిగతా కామ్రేడ్స్ తో పోటీపడ్డట్లు నడవసాగింది.

ఓ రెండు గంటల ప్రయాణం తర్వాత బాగా అలసట అనిపించింది. ఆకలిగా ఉంది. మనిషి బాగా డీలాపడిపోయింది. నిన్న మధ్యాహ్నం తిన్న తిండి. ఎదురు కాల్పుల తర్వాత రాత్రి వంట చేసే పరిస్థితి లేకుండె. దగ్గర్లో ఉన్న గ్రామంలోకి వెళ్లిన కామ్రేడ్స్ వచ్చే సరికి ఏడు గంటలు దాటింది. అంతా బాగానే ఉందని సమాచారం రావడంతో ఇక నడక మొదలు పెడితే మంచిదని బయల్దేరారు.

దట్టమైన అడవి మధ్య నడుస్తున్నారు. నిన్నటిలా గోవుల బాటలో కూడా నడవడం లేదు. ఇవన్నీ జాగ్రత్తలేమో. ముందు ముందు వీటన్నికీ అలవాటుపడాలేమో. ఆలోచనల మధ్య కాలికి రాయి తగిలింది. అమ్మా అంటూ పడబోయింది. సోనీ చేయి ఆసరా ఇచ్చింది. కృతజ్ఞతగా ఆమె వైపు చూసింది. కమాండర్ వెనక్కి

తిరిగి మనం దగ్గరికి వచ్చేశాం. ఇది మనకు బలమైన ప్రాంతం. ఇంకో అరగంటలో గ్రామం అంచులోకి చేరుకుంటాం. ప్రయాణం ఒక రోజు లేటైనా రెండో రోజు ఏపీటీకి అందుకోగలిగాం. లేదంటే మరో రెండురోజులు పట్టేది... అంటూ నడుస్తూనే చెప్పాడు.

ఈ మాటతో ధనలక్ష్మి ప్రయాణ బడలిక మర్చిపోయింది. రెట్టింపయిన ఉత్సాహంతో నడవసాగింది.

చదునైన ప్రాంతంలో దళం విశ్రమించింది. వేగంగా నడవడంతో గుండె వేగంగా కొట్టుకుంటోంది. చమటతో బట్టలు తడిసిపోయాయి. మాడుపై నుంచి చెమట కారి పడటంతో కళ్లు మండాయి. అలా తల వెనక్కి వాల్చి రిలాక్స్ అయింది.

అప్పుడు గమనిస్తే గ్రామం దగ్గర్లోనే ఉన్నట్లు చప్పుడు వినిపిస్తోంది. పిల్లల అరుపులతో సందడిగా ఉంది.

ఇద్దరు కామ్రేడ్స్ ఊళ్లోకి వెళ్లి పది నిమిషాల్లో తిరిగి వచ్చారు. మన వాళ్లు వచ్చారు. అవతలివైపున ఉన్నారట.. అనడంతో దళం తిరిగి నడక ప్రారంభించింది.

సెంట్రీ ప్లేస్‌ను దాటుకొని ముందుకు వెళ్లారు. అక్కడ గ్రామస్థులు గుమిగూడి ఉన్నారు. అంత దూరంలో ఉండగానే అక్కడి నుంచి ఓ కామ్రేడ్ ఎదురుగా వచ్చి నిన్న తెల్లవారుజామున దళం ఫార్మేషన్లో ఉన్నప్పుడు ఫైరింగ్ అయిందని చెప్పాడు.

ఎవరైనా గాయపడ్డారా? అని కమాండర్ అడిగాడు.

'అవును.. భీమాల్ దాదాకు సీరియస్‌గా ఉంది. అటువైపున ఒక పోలీసు గాయపడి మనకు దొరికాడు. నిన్న ఇదే బ్యాచ్‌పైన కాల్పులు జరిగాయట. వెను తిరిగిపోతున్నప్పుడు మళ్లీ మనకూ వాళ్లకూ ఫైరింగ్ అయింది. ఇదంతా మనకు దొరికిన పోలీసు ద్వారా తెలిసింది. మీరెలా ఉన్నారో అని ఆందోళనతో ఉన్నాం. అందరూ క్షేమమేనా? అని అడిగాడు' ఆ కామ్రేడ్.

ఆయన ఆ ప్రాంతపు డివిజన్ సభ్యుడు.

ఆ మాటలు విని ధనలక్ష్మి అచేతనమైపోయింది. కమాండర్ ఆ మాటలు వింటూనే ధనలక్ష్మి వైపు చూస్తున్నాడు. సోనీ వెళ్లి కదిలించే వరకు ఆమెలో చలనం కలగలేదు. మెల్లగా ఆమెను వదిలించుకొని ముందుకు నడిచింది.

పదడుగుల దూరంలో రమేష్ మంచంలో అపస్మారకంగా ఉన్నాడు. పార్టీ డాక్టర్లు వైద్యం చేస్తున్నారు. పొత్తి కడుపులో తూటా తగిలి కిడ్నీ భాగం నుంచి వెళ్లిపోయింది. బాగా రక్తస్రావం అవుతోంది. పరిస్థితి చేయి దాటిపోయిందని భీమాల్‌దాదాకు కూడా అర్థమైంది. అందుకే బయటికి పంపించే ఏర్పాట్లు వద్దన్నాడు. మధ్యలో రెండు సార్లు మాత్రం 'మనవాళ్లు వచ్చారా? అంతా క్షేమమేనా?' అని అడిగాడు.

మనిషి అపస్మారకంలోకి వెళ్తూ.. ఉలిక్కిపడి లేస్తున్నాడు. ఏదో వెతుకుతున్నట్లుగా చూస్తున్నాడు.

ఊరి జనమంతా అక్కడే ఉన్నారు. అందరి కళ్లలో విషాదం గూడుకట్టుకొని ఉన్నది. ఏమవుతుందో అనే భయంతో ఉన్నారు.

ధనలక్ష్మి ఆ స్థితిలో అన్నయ్య రమేష్‌ను చూసి పోల్చుకోలేకపోయింది. తనకు తెలిసిన అన్నయ్య పోలికలను వెతుక్కునే ప్రయత్నం చేసింది. కనురెప్పలు సగం మాత్రమే తెరుచుకొని ఉన్నాయి. కడుపులోంచి రక్తం కారుతూనే ఉంది. ఆ స్థితిలో అతడ్ని చూసి భీతిల్లింది. అడుగు ముందుకు పడలేదు. పక్కనున్న కామ్రేడ్ ఆమె స్థితిని గమనించి ధనలక్ష్మి భుజం మీద చెయి వేసింది.

ఆమెను చూసి అతడి పెదవులపై సన్నని చిరునవ్వు కదలాడింది. కండ్లు మెల్లగా మూసుకపోయాయి.

(బిడ్డల్ని వదిలి, తోబుట్టువులతోపాటు యుద్ధరంగాన అమరులవుతున్న జాడి అన్నపూర్ణలాంటి వాళ్ల స్మృతిలో..)

కవులకు విజ్ఞప్తి!

అరుణతార విప్లవసాహిత్యానికి వేదిక. గత నలభై ఏళ్లుగా ఎందరో రచయితలు తమ రచనను ఈ పత్రిక ద్వారా మెరుగు పర్చుకున్నారు. తెలుగునేలలో విప్లవ కవిత్వం, పాట, కథ, నవల, వ్యాసం, నాటిక మొదలైన ప్రక్రియలలో లబ్ద ప్రతిష్ఠులైన వారందరికి ఇది వేదికగా ఉంది. ఈ ప్రక్రియలలో కవిత్వం తక్షణ స్పందనగా వ్యక్తమవుతుంది. నలభై ఏళ్ల విప్లవ సాహిత్య చరిత్రలో కవిత్వం వస్తు-రూప పరిణతి ఎంతో సాధించింది. ఈ క్రమంలోనే ఎన్నో వైవిధ్యం గల కవితలు-పాటలు అరుణతారకు విరివిగా వస్తున్నాయి. కేవలం కవిత్వానికే పరిమితం చేసి అరుణతారను ప్రచురిస్తే ఆరునెలలకు సరిపడ కవితలు స్టాక్ ఉన్నాయి. కనుక వచ్చిన వాటిలో నుంచి సమకాలిత కలిగిన వైవిధ్య భరితమైన వాటిని ప్రచురిస్తూ పోతున్నాము. కొన్ని సమకాలితను కోల్పోవటం వలన ప్రచురించలేకపోవచ్చు. ఈ విషయాన్ని పాఠకులు గమనించాలి.

పత్రిక ఒక ఆర్గనైజర్ లాంటిది. ఆర్గనైజర్స్ ఎలాగైతే కార్యకర్తలను, రచయితలను తయారు చేస్తారో, పత్రిక అదే పనిని చేయాలి. కనుక కవులు తమ పాటలను, కవితలను రాసిన తర్వాత కొన్నాళ్లు మాగపెట్టి రెండో సారి తమ రచనను చదువుకొని, తగిన మార్పులు చేసి ప్రచురణ కోసం పంపిస్తే బాగుంటుందని కవులకు విజ్ఞప్తి. అలాంటి రచనలను సమయానుకూలంగా ప్రచురించగలం. అరుణతారకు వచ్చే చాలా రచనలకు చిరునామాలుండవు. కనుక ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశం లేదు.

- సంపాదకవర్గం

కొండ చిలువ

పాపినేని శివశంకర్

'నా రాజధాని...ధాని...ధాని' అనే పాట చెవుల్లో మార్మోగుతుండగా వసంత్ ఢిల్లీనుంచి గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో దిగాడు. స్పైస్ జెట్ అనబడే ఎయిర్‌క్రాఫ్ట్ చెవులు దిబ్బిళ్లు పడే పెనుమోత కూడా ఆ పాట అతని చెవుల్లో మార్మోగకుండా చెయ్యలేకపోయింది. ఎయిర్‌పోర్ట్‌నుంచి బెజవాడదాక రహదారికి అటు ఇటు మొలిచిన ఏడురంగుల ఇంద్రధనుస్సు మొలకలు (పూలు లేక పోయినా) అతనికి కనువిందు చేసినియ్. ఇదుగో అదుగో అని అప్పుడే నాలుగేళ్లయిపాయె సొంతూరికి వచ్చి. ఊపిరి సలపని ఉద్యోగబాధ్యతలు.

నాన్న పోయినాక కొన్నాళ్లు అమ్మ తన దగ్గరే ఉంది. నగర వాతావరణం నచ్చలేదు. ఊళ్లో ఉంటానికే మొగ్గింది. బాగోగులు చూట్టానికి బావమరిది ఉంటాన తనూ అడ్డు చెప్పలేదు. మధ్య మధ్య భార్య, పిల్లలు సెలవుల్లో అక్కడికి వెళ్లిరావటం, అమ్మ యిక్కడికి రావటం జరుగుతూనే ఉంది. ఇప్పుడు ఈ పొలం సర్వే పేచీలో వసంత్ అర్జంటుగా ఊరికి రావాల్సి వచ్చింది.

రెండెకరాల పొలం సంతోషంగా పూలింగ్‌కి ఇచ్చాడు వసంత్. తండ్రి తదనంతరం స్వయంగా సాగు చేసే వాళ్లు లేరు. తన ఉద్యోగం తనది. పొలమేమో కౌలుకి. దానిమీద రాబడీ పెద్దగా లేదు. అనుకోని అవకాశం వచ్చింది. పొలం బదులు ప్లాటు. రాజధాని గనక రేటు పెరుగుతుంది. తేలిగ్గా అమ్ముకోవచ్చు. రేప్పొద్దున ఏ వ్యాపారానికైనా లీజుకియ్యొచ్చు. ఇదంతా మహానగరమై మధ్యలో మన స్థలం ఉందంటే ఎంత విలువ!

అమ్మ ఆరోగ్యంగానే ఉంది. 'ఒక్కడివే వొచ్చావు. కోడలు, పిల్లలేర్రా?' అడిగింది. శారదమ్మ మొహంలో సగం సంతోషమే.

కాసేపటికి బావమరిది శీను వచ్చాడు. ఆ మాటా ఈ మాటా అయినాక సర్వే సంగతి చెప్పుకొచ్చాడు. వసంత్ పొలానికి కాడిగట్టు పొలం కోటేశ్వర్రావుది. రాజధాని కోసం ఇద్దరూ తమ పొలాలు పూలింగ్‌కి ఇచ్చారు. పొలం తల్లి పేరుతో ఉంది గనక శారదమ్మే సంతకాలు పెట్టింది. ఇప్పుడు ఇద్దరి పొలాల కొలతల్లో తేడా రావటంతో ఏదీ తేలక పోవటాన ఫైనల్ సర్వేకి రమ్మని వసంత్‌కి కబురు చేశాడు శీను.

'ఏందో ఒరిగి ఒళ్లో పడిద్దని పూలింగ్‌కి ఒప్పుకొన్నాం. ఇప్పుడు బయటపడతంది బండారం.' అన్నాడు శీను.

'ఇప్పుడేమైంది?'

'అటు జూస్తే పొలమూ పోయింది. ఇటు జూస్తే పనులూ లెవ్వు. ఏం జెయ్యాలో తోసటంలా.' శీను ముటముటలాడతన్నాడు.

'కావాలనే యిచ్చావ్‌గా నీ పొలం?' అడిగాడు వసంత్.

'నిజమే.'

'ఉగాది రోజు అనంతారం సభలో ముఖ్యమంత్రి ప్రసంగం నేను నెట్‌లో చూశా. ఆయన 'నా మీద నమ్మకంతో భూములిచ్చారు రైతులు. వారి ఋణం తీర్చుకుంటా' అని పదే పదే నొక్కి చెప్పాడు గదా?'

'ఆ మాటా నిజమే.' ఒప్పుకొన్నాడు శీను.

'మరిప్పుడు ఈ తెగులేంటి నీకు?' నవ్వుతూ అడిగాడు వసంత్.

'ఈ తెగులు నా ఒక్కడిదే కాదు బావా! ఊరంతటిదీ. పొలాలు మేమే యిచ్చాం అన్నది నిజమే. కానీ మా అంతట మేమే యిచ్చామనటం పచ్చి అబద్ధం. గొంతుమీద మెత్తగా కత్తి పెట్టి, 'మర్యాదగా' అడిగితే ఎవుడైనా యియ్యక సస్తాడా? మర్యాదకి మర్యాద, బెదిరింపుకు బెదిరింపు. పొమ్మనక్కర్లా, పొగబెడితే సాలు.'

'గొంతుమీద కత్తేంటి? అడ్డు తగిలాడు వసంత్.

'చానా తెలివిగా వలేసింది గవర్మెంటు. రాజధాని అంటే ఒక వరమంది. దేశంలో అన్ని ప్రాంతాలూ వదిలేసి ఇక్కడికి రావటం మీ అదుష్టమంది. భూ సేకరణ గాదు, సమీకరణ అంది. సమీకరణ ప్రచారం కూడా తమ పార్టీకి తిరుగు లేని తుళ్లూరు, నేలపాడు మొదలైన ఊళ్లనుంచే తెలివిగా మొదులుబెట్టారు. ఎకరానికి వెయ్యి గజాలు ఇళ్ల స్థలం, రొండొందలు వాణిజ్యస్థలం ఇస్తామంది. రైతులు బంగారం కళ్ల జూస్తారన్నాడు ముఖ్యమంత్రి. (ఈ రైతులందరికీ విడతలుగా గాకుండా ఒక్కమాలే రుణమాఫీ కూడా చేస్తామన్నాడు.) గజం కనీసం పదేలు లెక్కలేశారు జనం. ఎకరం పొలానికి కోటి రూపాయలు తేలిద్దన్నమాట.

ఇటేపు జూద్దామా అంటే ఏ యేటికాయేడు తగిలేదే గాని మిగిలేది లేదు. గ్రామీణబ్యాంకులో బాకీ లేని రైతులు ఎవురో నూటికి కోటికి. ఏం జెయ్యాల? రైతుబిడ్డలెవురూ యవసాయం జెయ్యటంలా. చేసేవాడికి ఎవుడూ పిల్లనియ్యటంలా. మనూళ్లో పెళ్లికెదిగిన మగపిల్లలు పదిమందున్నారు! ఆడపిల్లలు వాళ్లవంక కన్నెత్తి చూట్టంలా. కొంతమంది ఊరొదిలి ఎయ్యెయ్యో ఉద్దోగాలకోసం దేశాలమీద బొయ్యారు, నీకు మల్లే. పెద్దాళ్లేమో ఆ యిళ్లు వాకిళ్లకి కాపలాగా మిగిలారు. కౌళ్లు సరిగా రావు. కాడిగట్టు తగాదాలు సరే సరి. ఇయ్యన్నీ పడలేక అందొచ్చిన బేరం గదా అని పెద్దాళ్లొప్పుకున్నారు. గడ్డ పలుగులే గాలికెగిరి పోతంటే పులిస్తరాకు నా సంగతేంది అందంట. అట్టనే పెద్ద పెద్దాళ్లే యిచ్చేస్తానంటే మనమెంతని నాలాంటి సిన్నా సితకా రైతులూ ముందుకొచ్చారు.

భూసమీకరణకి ఒప్పుకోకపోతే భూసేకరణ తప్పదని మంత్రులేంది, కలెక్టరేంది, అంతా పురెక్కిచ్చారు. అప్పుడైతే గవర్మెంటు ఎంత రేటు గడితే అంతే గదా? అదీ పొగ బెట్టటమంటే.

అంతకు దప్పితే పొలమంటే రైతుకు పేణం గదా! అంత

తెలిగ్గా వొదులుకోటానికి మొగుస్తాడా? ఒక్క లోనుకి పదిసార్లు పెదక్షిణం జెయ్యాల బ్యాంకుల చుట్టూ. పెద్ద పెద్ద దొంగనాయాళ్లకి కోట్లు కోట్లు రుణాలిచ్చి, ఆళ్ల చుట్టూ కుక్కలల్లే తిరుగుతియ్ బ్యాంకులు. యవసాయానికి ఎగనామం బెట్టి దాన్ని జూదంగా జేసింది గవర్మెంటు. ఇత్తనాల దగ్గిర్నుంచి పంటదాకా అంతా మోసమే గదా! పంటకి గారెంటీ లేదు. పండిందానికి రేటుండదు. ఎనకటి మాదిరి గాదు. యవసాయం మీద బెమ తగ్గిపోయింది రైతుకి. వొదులుకోక ఏం జేత్తాడు?'

ఇన్నాళ్లు ఉగ్గబట్టుకుందంతా బావముందు కక్కేశాడు శీను.

'ఇప్పుడు పొలాల రేట్లు గూడా విపరీతంగా పెరిగినియ్ గదా! దండగేముంది?' ప్రశ్నించాడు వసంత్.

'ఎందుకు పెరిగినియ్? సందులో సందుగా రాజధాని అనంగానే రియల్ ఎస్టేట్ వాళ్లు రంగంలోకి దిగారు. లక్షలు పలికే పొలం కోట్లలోకి యెళ్లిపోయింది. తుళ్లూరు సెంటర్ గనక అక్కడ ఎకరం కోటిన్నర. చుట్టుపక్కల ఊళ్లల్లోనైతే కోటికి పై మాట. జరీబు పొలాల సంగతి యేరులే. రాయిపూడి, లింగాయపాలెం, ఉద్దండ్రాయపాలెం, కృష్ణాయపాలెం, ఉండవల్లి - ఇయ్యన్నీ ఏటొడ్డు ఊళ్లు. నువు జూశావుగా. అరిటేంది, జామేంది, మావిడేంది, పసుపేంది, మొక్కజొన్నేంది - ఏడాదికి మూడు పంటలు. అయి అంతకు మునుపే కోటిన్నర పలికేవి. అయి మొత్తం ఈ దెబ్బకి గోయిందా. పార్టీలమూలాన రైతుల్లో కట్టుబాటు లేదాయె. కనక గవర్మెంటు పని తేలికైంది.'

శీను అసలు బాధ వేరే ఉంది. ఇన్నేళ్లనుంచీ బావ పొలం తనే కౌలుకు చేస్తున్నాడు. పండినేడు ఇస్తే తీసుకుంటారు. లేదంటే లేదు. శీను ఎంతిస్తే అంతే. అట్లాగని శీను బావనెప్పుడూ మోసం చెయ్యలేదు. 'బావమరిది బతకగోరతాడు' అనే సామెత ఉండనే ఉంది. అయితే ఇప్పుడు నోటికాడ కూడు గద్ద తన్నుకు పోతున్నట్టుంది అతనికి. ఇకనుంచి ఈ పొలం కౌలు చెయ్యలేడు. ఇదే కాదు, ఇంకే పొలమూ ఊళ్లో మిగలటం లేదు. మరింకేం చెయ్యగలడు తను? ఎద్దు ముడ్డి పొడవటం తప్ప ఇంకే పనీ చేతగాదు తనకి. అక్కాయ్ కట్నం కింద మూడెకరాలు పోతే, ఇన్నేళ్ల యవసాయంలో అప్పులకింద రొండెకరాలు అమ్మేస్తే యింకేం మిగిలింది? అరెకరం చెండ. తోడుగా కౌలు పని ఉంటాన ఏదో అట్లా జరిగిపోతంది.

పోరంబోకు బీళ్లన్నీ ఎవురెవురో దున్నేసుకున్నాక ఎడ్ల మేత, సాగుబడి తలకు మించిన బరువైంది శీనుకి. బట్టకోడెలు రెంటినీ నిలువునా అమ్మేశాడు. ఇంకొంత లోను తీసుకొని మహీంద్ర ట్రాక్టర్ కొన్నాడు. లోను ఇంకా తీరలా. ఇప్పుడు ఉట్ర ఉడియంగా రాజధానికి పూలింగ్ వచ్చింది. చేతిలో పొలం జారిపోయె. 29 ఊళ్లల్లో వ్యవసాయం బంద్. కొట్టంలో ట్రాక్టర్, నాగలి సెట్టు, గొర్రు సెట్టు తుప్పు బట్టి దీనంగా చూస్తన్నయ్. అమ్ముదామన్నా కొనే నాథుడు లేడు. ఇయ్యాలో రేపో వాటిని పాత యినుం కింద కాటా బెట్టాల్సిందే. నట్టింట్లో ఇద్దరు ఎదిగిన కూతుళ్లు. అంత ఎండలోనూ అంతా చిమ్మ చీకటిగా కనపడుతుంది శీనుకి.

ఆ సాయంత్రం బావమరిది భోజనానికి పిలిస్తే వెళ్లాడు వసంత్.

'మంచినీళ్లు బాగుండయ్యే. బావుల్లో నీళ్లు మారినియ్యా ఏంటి?' అన్నం తింటా అడిగాడు వసంత్.

నవ్వాడు శీను బావ అమాయకత్వానికి.

'కాదన్నయ్యా! బాయిల్లో నీళ్లేడుండయ్? ఊరబాయిలు ఎండిపొయ్యి, పూడిపొయ్యి చానా ఏళ్లైంది. వాటర్ కాన్‌లే గతిప్పుడు.' చెప్పింది ఈశ్వరి.

* * *

తెల్లారి ఇద్దరూ ఊరికి పడమట ఉన్న పొలం కేసి వెళ్లారు. సర్వేయర్లు ఇంకా రాలేదు. చేనొడ్డున కుంట మాత్రం అట్లాగే ఉంది. అయితే చుక్క నీళ్లు లేవు అందులో. రెండు మూడు పచ్చపిట్టల (గిజిగాడి) గూళ్లు కుంట ఒడ్డున పడి ఉన్నాయి.

'నానా! ఆ గూళ్లేందే?' చిన్నప్పటి వసంత్ అడుగుతున్నాడు. కుంట ఒడ్డున చిన్న నల్ల తుమ్మచెట్టు కొమ్మలు నీళ్లకాన వంగి ఉన్నయ్. వాటికి చానా గూళ్లు వేలాడుతున్నాయి.

'అయ్యి గిజిగాడి గూళ్లురా' చెప్పాడు నాన్న. బుల్లి బుల్లి పచ్చపిట్టలు ఎగురుకుంటూ వాలుతున్నయ్. అసలే ముళ్ల చెట్టు. లోతైన కుంట. నీళ్లపైన వేలాడే గూళ్లు వసంత్‌ని అబ్బుర పరిచినియ్. అదే అడిగాడు తండ్రిని.

'వాటికక్కడే బద్రంగా ఉంటదిరా. వాటిని తింటానికి పాములు, పిల్లులు ఆ ముళ్లచెట్టు కొమ్మలదాక పోలేవు. ఇక గొంతు తడుపుకోవటానికైనా దూరం పోనక్కర్లేదు.'

'క్లె! క్లె! ఆ పీసుల్తో అట్టాంటి గూడు ఎట్ట అల్లినియ్యా!' ఆశ్చర్యపోయాడు వసంత్.

నాన్న నవ్వాడు. 'అరే! మడుసులేసే మారాముళ్లకింద ఈ గూళ్లు బలాదూరేరా!'

ఆ సంగతి ఇన్నేళ్లకి అర్థమైంది.

వసంత్ పొలం సర్వే నెం. 27 లో ఉంది. అందులో 27/ఎ, 27/బి అని రెండు సబ్ డివిజన్‌లు. తాతల కాలం నాడు అన్నదమ్ముల వాటాలు అవి. 27/ఎ లో కోటేశ్వర్రావుకి రెండెకరాలు, 27/ బి లో వసంత్ పొలం రెండెకరాలు ఉండాలి. పాసు పుస్తకాల్లోనూ అట్లాగే ఉంది. గట్టు రాళ్ల ప్రకారం కొలిస్తే రెండెకరాల లెక్కన తేలుతుంది. సర్వే లెక్కల ప్రకారమైతే సబ్ డివిజన్ లైను వసంత్ పొలం లోకి తంతుంది. 20 సెంట్లు తక్కువ తేలుతుంది. ఆ డివిజన్ ఒప్పుకోనంటాడు వసంత్ తరుపున శీను. సర్వే ప్రకారమే జరగాలంటాడు కోటేశ్వర్రావు. అదే తగాదాకి కారణం. ఏనాడో తాతల కాలం నాటి పంపకాలు. ఏభై ఏళ్లు గడిచిపొయ్యాయి. గట్టురాళ్లు కదల్లేదు. చేలూ కదల్లేదు. ఇప్పుడు మార్చాలంటే ఎట్లా? ఇరవై సెంట్లంటే మాటలా? ఒకప్పుడైతే పెద్ద లెక్కలోది కాదు. ఇవాళ 20 సెంట్లంటే ఇరవై లక్షలు. ఎన్నడూ లేంది ఇట్లాంటి సరికొత్త తగాదాలు ఊళ్లో చానా మొదలైనియ్. అవే ఎటూ తేలకుండా మిగిలినియ్.

ఉత్తరాన దూరంగా వెంకన్న వెలిసిన అనంతారం కొండ. అంత లావు కొండని చుట్టుకొని పెద్ద కొండచిలువేదో కదులుతున్నట్టుంది. అదేంటని అడిగాడు వసంత్.

అదో రకంగా నవ్వాడు శీను.

'ఈ పని అవంగానే గట్టుమీదకి వెళ్లిరావాల' అనుకొన్నాడు వసంత్.

ఇప్పటికి రెండుసార్లు సర్వేయర్ల కొలతలైనియ్. పేచీ తెగలా. బుల్లి సర్వేయర్లు తప్పుకొని, ఇప్పుడు డి.ఐ. స్వయంగా రంగంలోకి దిగాడు. ఊరికి మైలు దూరంలో పొలం. దారి సరిగ్గా లేదు. వాగు దాటి చానా దూరం నడవాల. 2015 జనవరిలో జనం పూలింగ్‌కి తమ పొలాలిచ్చారు. ఏడాది గడిచింది. ఇప్పటికీ కొన్ని సర్వేలు, గ్రామకంఠాల సమస్య తేలలేదు. ప్లాట్ల సంగతి అతీ గతీ లేదు. 9.3 అంగీకార పత్రాలు ఇచ్చినాక లెక్కలు తేలిన రైతులకి ఎకరానికి తలా ముప్పయ్ వేలు లెక్కన కౌళ్లు అందాయి. ఇక వాళ్లు తమ పొలం సాగు చెయ్యరాదు. అయితే ఆ తర్వాత వ్యవహారం ఈడిగిలబడింది. జూన్ నాటికి అందరికీ ప్లాట్లు అన్న మంత్రులు అయిపు లేరు. మొత్తం తంతు ఎంతకాలం దేకుతుందో ఏడాదిగా ఊళ్లో మకాం వేసిన తాసీల్దారు, డిప్యూటీ కలెక్టర్ మొదలు ఎవ్వరికీ తెలీదు. పేచీలున్న నెంబర్లలో సర్వేలకి బయల్దేరిన వాళ్లని అడువులైపోయిన పొలాలు వెక్కిరించినియ్. ఏ రైతునడిగినా సంగతి చెప్పేవాడే. కనీసం ఈ ఏడాది పొలం చేసుకొమ్మని చెప్పినా కోట్ల విలువ చేసే పంట దక్కేది. ఇప్పుడు రెంటికీ చెడింది. ఎటేపు జూసినా పిచ్చిబెండలు, లంజ తుమ్మ (ఇంగ్లీషు తుమ్మ) చెట్లు అడివికిమల్లే పెరిగిపోయినియ్. వాటిని మళ్లీ ప్రొక్లెయిన్లతో పీకితే గాని సర్వే కుదరలా. పిచ్చి చెట్ల మధ్య పొలంలో నడవలేక నానా అవస్థ బడతన్నారు సర్వేయరు, అసిస్టెంట్లు. కొలతలైనాక కంప్యూటర్‌లో అన్నీ సరి జూసి, ఫైనల్‌గా ఎవరిదెంతో తేల్చి చెపుతామన్నారు.

* * *

శీను, వసంత్‌తో పాటు ఇద్దరు చిన్నప్పటి సావాసగాళ్లు అనంతారం గట్టుమీదకి బయల్దేరారు. గట్టిగా మైలున్నర. కొండ మయాన చిన్న గుహలాంటి చోట వెలిశాడు వెంకటేశ్వరుడు. ఏటేటా ఫాల్గుణ మాసంలో ఉగాదిముందు శనివారాలు భక్తులతో కోలాహలంగా ఉంటది. చుట్టుపక్కల ఊళ్లనుంచి ఎడ్లబళ్లమీద, ట్రాక్టర్ల మీద జనం తండోపతండాలుగా తర్లి వస్తారు. ప్రభలు గడతారు. కోలాటాలాడతారు. చిన్నపాటి తిరనాలే. వసంత్ చిన్నప్పుడు సావాసగాళ్లంతా ఆటల బండిమీద బుల్లి బుల్లి ప్రభలు కట్టుకొని గట్టుమీదకి వెళ్లేవాళ్లు. దేవుడు, భక్తి అని కాదు. మెట్లు లెక్కబెడుతూ కొండెక్కటం, కోనేరు చూడటం, అందులో బుల్లి బుల్లి చేపపిల్లల్తో ఆడుకోవటం బలే సరదా. కొండమీదనుంచి చూస్తే తూర్పుదిక్కు తప్ప అన్నీ అవపడతయ్. కనుచూపు మేర ఆకుపచ్చ పొలాలు, పలకలు పలకలుగా. ఎంత ఆనందం!

ఇప్పుడు కూడా వసంత్, మరో స్నేహితుడు మెట్లు లెక్కబెడుతూ పైకెక్కారు. చివరికి లెక్క తేలలేదు ఎప్పుడుమల్లే. 367 అని వసంత్ అంటే కాదు, 366 అన్నాడు స్నేహితుడు. మెట్లు గాకుండా ఇప్పుడు కార్లు పైకెళ్లే దారి కూడా ఉంది. రాజధాని నేపథ్యంలో గుడి తిరుపతి దేవస్థానం నిర్వహణలోకి వెళ్లింది. కొత్తగా మెట్లమీద కొంతదూరం పై కప్పు, దీపాలంకరణ కనపడుతున్నయ్. అప్పటిదాకా అచ్చంగా ఉన్న వాతావరణం రాజకీయనాయకుల రాకతో కలుషితమై పోయిందన్నాడు స్నేహితుడు. చిన్న గుహలో వెంకటేశ్వరుడు శ్రీదేవి, భూదేవులతో పక్కన పన్నిద్దరు ఆళ్వారులతో హాయిగా ఉన్నాడు. ఏటవాలు రాతిమీద చెక్కిన బొమ్మలు. ఒక్కసారి కొండమీదనుంచి చుట్టూ చూశాడు. ఒకప్పుడు అక్కడినుంచి తూర్పు, దక్షిణం, పడమట - మూడుదిక్కులా ఆకుపచ్చని చేలు పలకలు పలకలుగా కనువిందు చేసేవి. ఇప్పుడు మూడు దిక్కులా కనుచూపుమేర (అక్కడక్కడ తాడిచెట్లు తప్ప) పైర్ల పచ్చదనం జాడే లేదు. అంతా పిచ్చిచెట్లతో విస్తరించిన చిట్టడవి. ఈ జరుగుతున్న పరిణామాలన్నీ ఆ దేవుడు బిక్కు బిక్కుమంటా చూస్తున్నాడేమో. తనెత్తు మించిపోయిన ఆకాశభవనాలు లేస్తే చూసి ఏమనుకొంటాడు?

పై నుంచి చూస్తుంటే అదే కొండచిలవ అట్లాగే కొండని బిగించి చుట్టుకోని ఉంది. నిగనిగలాడతా భయంకరంగా ఉంది. దాని బుసలు పైదాక వినపడుతున్నయ్. ఇక దేవుడు కూడా వలస పోక తప్పదేమో. అదేంటని సావాసగాళ్లని అడిగాడు. అదో రకంగా నవ్వారు. గట్టు దిగినాక అది కనపడలా.

తిరిగి వచ్చేటప్పుడు ఊరికి, కొండకి మధ్య ముచ్చబోడు దగ్గిర ఆగారు. అనంతారం కొండలో మూడో వంతు ఉంటదేమో. ఇప్పుడు సగమైపోయింది. శీను చెప్పాడు, 'ఇలువైన రాళ్లకోసం రాత్రింబగుళ్లు తవ్వుతున్నారు. ఆ దుమ్ము తెరల్తో చుట్టు పక్కల చేలు గూడా పాడుబడతన్నయ్. ఎన్ని కంప్లెయింట్లు చేసినా లాబం లేకపోయింది.'

ముచ్చబోడుమీద చిన్న కోనేరు. ఒకచోట చక్కగా చెక్కిన పాదముద్ర. సీతమ్మవారి పాదం అనేవాళ్లు. ఆ ముద్రలో ఎవరి పాదం పెట్టినా సరిపోయిద్దంటారు. బోడెక్కిన పిల్లలు కుశాలగా కాలు బెట్టి చూస్తారు. అబద్ధమే కావచ్చు కానీ అదొక ముచ్చట. అవన్నీ యిప్పుడు పాత జ్ఞాపకాలు. ఏ ఆనవాలూ మిగల్లేదు. వసంత్‌లో ఏదో దిగులు మొదలైంది. కాలం గడిచేకొద్దీ అన్నీ మారిపోతాయి, నిజమే. కాని ఈ మార్పు ఎటేపు?

మళ్లీ అనంతారం గట్టు వైపు తిరిగి చూశాడు. అదే కొండచిలవ, గట్టును చుట్టుకొని, భయంకరంగా.

* * *

'నాయనా! ఎంకట్రామయ్య పెదనాన్నకి బాగుంటంలా. ఎట్టాగూ వొచ్చావు. ఒకడుగు అటేసి చూసి రారాదా?' అమ్మ అడిగింది.

'నేనూ అనుకుంటానే ఉండానే! చూడకుండా ఎట్లా? చిన్నప్పుడు సూరి, నేను ఆడుకునే వాళ్లంగా.'

మాపటేళ వసంత్, శీను తూర్పు వీధిని వెంకట్రామయ్య యింటికి బయల్దేరారు. తూర్పు వీధి మలుపు తిరుగుతుండగా కోదండం ఇంట్లోంచి పెద్ద పెద్దగా మాటలు వినపడుతున్నయ్.

'నాన్నా! సివరాకరగా జెపుతున్నా. ఇది తేల్చుకోకుండా మీ అల్లుడు నన్ను గడప తొక్కనియ్యడు. ఇంటి ఆడపడుచుగా నాకు రావల్సిన వాటా ఎంతో ఏందో తేల్చి చెప్పు. లేకపోతే ఇక్కడే ఏ నుయ్యో గొయ్యో సూసుకుంటా.'

వసంత్‌కేమీ అర్థం కాలా. శీనే చెప్పాడు.

'ఈ మద్దెన ఇయ్యన్నీ మామూలై పోయినియ్‌లే. ఏడేళ్లనాడు కూతురికి పెళ్లి చేశాడు కోదండం మావ. ఇయ్యాల్సిన కట్నమేదో అప్పుడే యిచ్చేశాడు. ఇప్పుడు పొలాల రేట్లు పెరిగేతలికి ఆస్తిలో వాటాకొచ్చింది కూతురు. ఇట్టాంటి కొత్త కొత్త తగాదాలు రోజుకొకటి. నీ అదుష్టాన మంచి చెల్లెలు దొరికింది. లేపోతే మీకూ ఈ ఆగం తప్పేది గాదు.'

వసంత్ నివ్వెరపోతుండగా వెంకట్రామయ్య యింటి దగ్గరికొచ్చారు. పెంకుటిల్లు. ముందు పంచపాళీ. వేపచెట్టు. ఏళ్లనాడు ఎట్లా ఉందో యిప్పుడూ అట్లాగే. కాకపోతే వెంకట్రామయ్యే మరీ వడిలిపొయ్యాడు. డెబ్బయ్యేళ్లుంటయ్.

'దా దా. కూకో' అని నులక మంచం చూపిచ్చాడు. 'మొన్నే వచ్చావంటగా? పూలింగు పున్నెమాని యిట్టాగైనా అవపడ్డావు. ఏమేయ్! ఎవురొచ్చారో సూడు' అని పెళ్లాన్ని కేకేశాడు. లోపల్నుంచి రత్తమ్మ వచ్చి పలకరించింది. సన్నగా చిక్కిపోయి ఉంది. పాత చీరలో, గుంటకళ్లతో, ముఖంలో దిగులు నీడతో ఏదోగా ఉంది.

'ఏయ్యా! బాగుండావా?' అని పలకరించినా అందులో పొడితనమే. ఇద్దరూ ఏదో దిగులుతో ఉన్నట్టు అర్థమవుతూనే ఉంది. పలకరింపులైనాక సూరి గురించి అడిగాడు వసంత్.

'ఆడా? ఇయ్యాల్టికి ఇరవై రోజులైంది దేశాలమీదకి బొయ్యి. ఏందో చేసి లచ్చల్లచ్చలు ఒళ్లో పోత్తాడంట. ఇక్కడుందంతా ఊడ్చేశాడు. ఈ వొయిసులో మాకీ కట్టం తెచ్చి పెట్టాడు.' వెంకట్రామయ్య చెపుతుంటే రత్తమ్మ కళ్లల్లో నీళ్లు దిరిగినియ్.

రాజధాని అనంగానే రియల్ ఎస్టేట్ వాళ్లు దిగారు. ఎక్కడెక్కడ మాయదారి డబ్బంతా ఇటేపు మళ్లింది. పొలాలకి రేట్లు విపరీతంగా పెరిగినియ్. యాభై లక్షలు మొదులుకోని రోజుకో రేటు లెక్కన పెరుగుడల. రాజధాని ఊళ్లల్లో ఇది ఒక చివర నైరుతి మూలన ఉంది. కనక ఇక్కడ ఆఖరి బేరం కోటి, ఇరవై లక్షలు పలికింది. ఇంకోవైపు ఇంటిమీద బాకీ తన్నుకొస్తంది. అయ్య ఒప్పుకోకపోయినా సూరి ఉన్న ముప్పాతిక ఎకరం అమ్మాడు. బాకీ తీరింది. తక్కిన డబ్బుల్తో దూరంగా బొయ్యి ఐదెకరాలు కొందామన్నాడు. అట్లా కొనుక్కొని సరిపుచ్చుకొన్న వాళ్లున్నారు. కొనుగోలు కుదరక అదుగో ఇదుగో అని సరిపెస్తంటే డబ్బు తిమ్మిరి ఆగనిస్తదా? పేకాట, తాగుడు - రెండూ పూరాగా ఉన్నయ్ సూరికి. రెండునెల్లు దిరిగేపాటికి చేతిలోదంతా హుష్ కాకీ అయ్యింది. ఇంక ఊరొదిలి ఏదో చేద్దామని ఎక్కడికో పొయ్యాడు. రెంటికీ చెడ్డాడు. వెంకట్రామయ్య మాటల్లో ఇంకా చాలా సంగతులు తెలిసినియ్.

భూములిచ్చిన రైతులు ఏ జెయ్యాల? పొగలిగిన వాళ్లు చుట్టుపక్కల ఊళ్లలో పొలం కౌలుకు తీసుకొని గడుపుతున్నారు. పోలేని వాళ్లు రచ్చబండల దగ్గర గోళ్లు గిల్లుకొంటున్నారు. కూలీ జనానికి కొత్త నైపుణ్యాలు నేర్పి రాజధానిలో కొత్తపనులు చూపిస్తామన్నారు. అదంతా వట్టిమాటై పోయింది. నైపుణ్యాలూ లేవు, పనులూ లేవు. కాస్త సత్తవ ఉన్న ఆడవాళ్లు పొరుగూళ్ల పొలాలకి కూలికి పోతున్నారు. మగవాళ్లు కరెంట్ పనులకో, బేల్దారి పనులకో గుంటూరో, బెజవాడో పొద్దున్నే వెళ్లి రాత్రికి ఇంటికి జేరతన్నారు. అంత ఓపిక లేని ఆడవాళ్ల పరిస్థితేంటి? ఇంతకు మునుపు ఊళ్లో కూలో నాలో చేసుకొనే వాళ్లు ఇప్పుడు ఇంటిముందు కబుర్లతో కాలం గడుపుతున్నారు. మొత్తానికి ఊరు చెల్లాచెదురైంది. ఇంక కుటుంబాల్లో తగాదాలు సరే సరి. ఏ నాడూ లేని కల్లోలాలు.

'ఎన్నడూ కళ్లజూడని డబ్బు అవపడేపాటికి జనానికి ముడ్డిమీద గుడ్డ నిలవటంలా. ఈ మారుమూల పల్లెటూళ్లో ఐదంతస్తుల బవంతులు కల్లో అయినా ఎరుగుదుమా? ఇప్పటికి ఊళ్లో మూడు లేసినియ్. ఉంకోటి రెడీగుంది. అప్పుడే ఇదంతా పేద్ద నగరమైపోయినట్టు, మనమేందో సొర్గంలో ఉండట్టు కల గనే వోళ్లు కంటన్నారు. అంతా మాయ. కలి మాయ' అన్నాడు వెంకట్రామయ్య.

'బర్రె సచ్చినాక పాడి బైటపడిద్ది. అట్టనే పోయినాకే దేని యిలవైనా తెలుసుద్ది. అరే, ఎవుడెన్ని జెప్పినా సిమెంటు కన్నా మట్టి శానా యిలువైందిరా' అన్నాడు మళ్లీ.

'ఔ. ఐదంతస్తుల బవంతి ఐదు వడ్లగింజలకి బలాదూర్ మావా!' అన్నాడు శీను.

వసంత్ ఏమీ మాట్లాడలేదు గానీ తన ఆలోచనల్లో లోపం అర్థమవుతుంది. ఉన్నట్టుండి 'పెద నానా! అనంతారం గట్టును చుట్టుకోని ఆ చిలవేంటి?' అనడిగాడు.

అదో రకంగా నవ్వాడు వెంకట్రామయ్య.

* * *

ఆ మధ్య అంతా రాజధాని, రాజధాని అంటుంటే తను కూడా ఉద్దండ్రాయపాలెం వెళ్లొచ్చాడు శీను. ఊళ్లో రైతులందరికీ ఆహ్వానాలిచ్చారు. పట్టుపంచెలు, పట్టుచీరలు అంటూ మామూలు నూలు బట్టలిచ్చారు. పెద్ద కోలాహలం. అన్ని ప్రాంతాలనుంచి మట్టి సేకరించారు. మూడు మతాల వాళ్లూ మంత్రాలు చదివారు. ప్రధాని స్వయంగా తళతళలాడే పాత్రల్లో మట్టి, గంగాజలం తెచ్చాడు. శంకుస్థాపన అయింది. గొప్ప గొప్ప ఉపన్యాసాలు. ఇంతకీ రాజధాని వస్తే ఎవరికేం ఒరిగిద్దో శీనుకి బోధపడలా.

ఇప్పుడు రాజధాని ప్రాంతం చూడాలన్నాడు వసంత్. పొద్దున్నే శీను, తను తుళ్లూరు మీదగా రాయపూడి, లింగాయపాలెం రోడ్డు దాటి, మోదులెంకాయపాలెం మీదగా ఉద్దండ్రాయపాలెం చేరారు. రోడ్డుమీదనే 'అమరావతి రాజధానికి దారి' అనే బోర్డు కనపడింది. ఉద్దండ్రాయపాలేనికి ఈశాన్యంగా ఉంది ఆ ప్రాంతం. ఒక షెడ్డు ముందు ఇద్దరు పోలీసులు కాపలా ఉన్నారు. లోపల విశాలమైన బల్లమీద రాజధాని ప్రాంతంలోని 29 ఊళ్ల వివరాలున్నాయి. ఎక్కడ వంతెనలు, మెట్రోలు. రహదారులు, ప్రధాన నిర్మాణాలు వస్తాయో మినియేచర్‌లో చూపిస్తున్నారు. తర్వాత హోమం జరిగిన పాక చూశారు. దానికి కుడివేపు దేశదేశాలనుంచి సేకరించిన మట్టి, నీటిపాత్రలు ఉన్నయ్. హోమవేదికకి తూర్పుగా శంకుస్థాపన జరిగిన చోట పది అడుగుల శిలాఫలకం కూడా గర్వంగా నిలబడి ఉంది. అయితే దానిమీద ఒక్క తెలుగు ముక్క లేదు. మరి అది ఎవరికోసమో అర్థం కాలేదు.

అన్నిటినీ మించి వసంత్‌ని, శీనుని బాధించిన అంశం వేరు. శంకుస్థాపన తావుకు చుట్టుపక్కల పచ్చదనమంతా అదృశ్యమైపోయింది. ఉత్తరం కరకట్ట, పడమట లింగాయపాలెం, తూర్పున వెలగపూడి. ఇంతకు మునుపు ఈ తావంతా పచ్చటి అరటితోటల్తో చల్లచల్లగా ఉండేది. ఇప్పుడు అదంతా ఎడారైపోయింది. మొత్తం ఇప్పుడు విషపూరితమైన ఒయ్యారిభామ (పార్థీనియం) మొక్కల పూలవనం! దూరంగా వెలగపూడి కవతల లేస్తున్న సచివాలయ భవనం పునాదులు.

'ఎవుడికోసం ఈ రాజధాని? ఏ సింగపూరోడో వొచ్చి ఈడ బిల్డింగులు గడితే మనకేం ఒరిగిద్ది? వందలొందల యెకరాలు

దేశదేశాలకి కట్టబెట్టి, కోట్లు కోట్లు సేతులు మారటానికే బావా! యిదంతా' శీను ఆవేదన.

వసంత్ మనస్సులో ఆలోచనలేవో కదలబారుతున్నయ్. ప్రపంచస్థాయి రాజధాని అనేది ఒక కల్పన. అంతకుమించి అది ఒకే ఒక్క వ్యక్తి కల. అది ఎవరి అవసరాలు తీరుస్తుంది? అందుకోసం 33 వేల ఎకరాలా? అది చాలక 15 వేల ఎకరాల అడవులు డీ నోటిఫై చెయ్యాలా?

చెయ్యి. పచ్చని పొలాలు బీళ్లు చెయ్యి; అడవులు డీ నోటిఫై చెయ్యి. ఆ పైన హెలికాప్టర్ మీదనుంచి కొండలమీద విత్తనాలు చల్లు. (పైనుంచి నేల బలే అందంగా కనపడిద్ది.) వానలకి వీడ్కోలు చెప్పి. నీటిమట్టం కోసం ఇంకుడు గుంటలు తవ్వు. అందరి మీదా అభివృద్ధి మంత్రజలం చల్లు. సుజలాం, సుఫలాం ఉపన్యాసాలియ్యి. జనం తెలివితేటల్ని ఎగతాళి చెయ్యి.

* * *

....ఒకటే చీకటి. కళ్లు పొడుచుకున్నా కనపడని చీకటి ముసురు. దట్టంగా మబ్బులు. కాని వాన చినుకు లేదు. అంతలో ఒకటే వడగాలి. అదేదో మహాసర్పం ముక్కుల్లోనుంచి వీస్తున్నట్టుగా. భయంకర నిశ్వాస. ఇళ్ల కప్పులు లేచిపోతున్నయ్. చెట్లు కూలిపోతున్నయ్. రామాలయం ముందు ధ్వజస్తంభం గజగజలాడింది. గొడ్డూ గోదా ఒకటే అరుస్తున్నయ్. కళ్లల్లో, ఒంటినిండా ఇసుక. తెరలు తెరలుగా ఇసుక. అంతా కటికి చీకటి. మనుషులు కొట్టుకుపోతున్నారు. తను ఊరమ్మటి తాడిచెట్టును కావిలించుకొని, కొట్టుకుపోకుండా ఆగాడు. అమ్మ ఏమై పోయింది? ఎటు కొట్టుకుపోయింది? ఎటు.....

ఉలిక్కిపడి లేచాడు వసంత్. చుట్టూ చూశాడు. ఎదురుగా గోడమీద నాన్న ఫొటో. పక్కన కాలెండర్. మరో వైపు గోడ గడియారం. పై కప్పు మూలన బూజు. పంచపాళీలో బట్టలు మడతేస్తూ అమ్మ. ఊపిరి పీల్చుకొన్నాడు వసంత్.

లేచి మెల్లగా అమ్మ పక్కన కుర్చీలో కూర్చున్నాడు. 'అమ్మా! పొలం పూలింగ్‌కి ఇచ్చి తప్పు చేశామా?'

శారదమ్మ ఒకసారి కొడుకేపు తేరిపార జూసింది. 'మీ నానకి పొలమంటే పంచప్రాణాలు. అందరం దానిమీదే బతికాం. ఇయ్యటం నాకూ ఇష్టం లేదు. జనమంతా సరేనంటే మనం ఒక్కళ్లం ఆపితే ఆగదు గదా! ఇంక తప్పంటావా? అది అందరిదీ నాయనా!'

'అమ్మా! అనంతారం గట్టు చుట్టూ ఆ కొండచిలవేందే?'

శారదమ్మ అదో రకంగా నవ్వింది.

వసంత్ కెందుకో తన చిన్నతనం గుర్తొచ్చింది. జొన్నచేలు, కందిచేలు, మిరపచేలు, లేగదూడలు, కోడిగిత్తలు, బీళ్లు, గడ్డి పూలు, రంగు రంగుల సీతాకోక చిలకలు, వానమబ్బుల కింద ఎగిరే ఎర్ర తూనీగలు, గడ్డి మొక్కల మీద బులుగు తూనీగలు, ఆరుద్ర పురుగులు, వానపాములు, పంటపొలాల మీద రివ్వున వాలే పిచ్చికలు, రామ చిలకలు - ఇయ్యన్నీ ఏమై పోయినియ్? ఒక్కసారి ఒళ్లు జలదరించింది. ఆలోచిస్తున్న కొద్దీ కడుపులో దేవుతున్నట్టు తోచింది.

ఊళ్లోకి సిమెంట్ రోడ్డొచ్చింది. బస్సులు, కార్లు వచ్చినియ్. చల్లలు పోయి, కూల్ డ్రింకులు వచ్చినియ్. బెల్ట్ షాపులు, బీర్లు వచ్చినియ్. గుడిసెలు, పెంకుటిళ్లు పోయి డాబాలు వచ్చినియ్. ఇదంతా నిజంగా అభివృద్ధే అయితే మనుషులెందుకు సంతోషంగా లేరు? మనసులెందుకు ఇరుకై పోయినియ్?

ఇది అభివృద్ధా? విధ్వంసమా? బాధలు తెలుస్తున్నయ్. బాధ్యులూ తెలుస్తున్నారు. ఈ పట్టునెట్లా తప్పించుకోవాలి?

ఈ ఆలోచనలతోనే ఆ సాయంత్రం వసంత్ శీనుతోపాటు రాములవారి గుడికాడికెళ్లాడు. గుడి మండపంలో కనుచీకట్లో ఎవరో ముగ్గురు రైతులు లోకాభిరామాయణం చెప్పుకొంటున్నారు. వాళ్లతో మాటలు కలిపాడు వసంత్.

కాస్త ఎడంగా ఒంటిమీద గుడ్డ సరిగ్గా లేని ఎవరో తాగుబోతు. చేతులూపుతూ బ్రహ్మం గారి కాలజ్ఞానం కల్తీ చేసి పాడుతున్నాడు.

'మీసాము లేనోడు దేశానికొచ్చీని, మహి కొండలకు జెండ వేసీని మా. చెరువులెండీ పోయి దొరువులెండీ పోయి నెత్తుటీ వానలు కురిసేను మా. యేనుగుకు పంది బుట్టీని. పందికి యేనుగు పుట్టీని. ఏలిక కడుపున ఏలిక పుట్టీని. మట్టి కడుపున బూడిద పుట్టీని. మట్టి మనుషులు తుదకు మట్టిపాలయ్యేరు, ఏలికలు నాలికలు సాచేరు మా. కల్లదేవతలాను గొలిచేటి వారెల్ల నిల్వ పేరు లేక పొయ్యేని. స్త్రీల కన్నుల నెత్తురు కురిచీని. పంచాంగాలు మూలబడును. పైర్లు నాశనమగును. నీతి వర్తనములు తప్పి నడిచేరు. చోరుల బాధలు హెచ్చీని. వుల్లి గడ్డాలకు ఉపదేశమిచ్చేటి కల్ల నేతలు కలిలో నుండేరు మా. శ్రీశైల శిఖరమున నిప్పులు రాలేని. బసవేశ్వరుని కంట నీళ్లు గారీని. కటకటా యని రంకె వేసీని. ధణం ధణం యని కాలు దువ్వీని. పూని పౌర్ణమి అమావాస్య అయ్యీని. పూని పౌర్ణమి అమావాస్య అయ్యీని. పూని పౌర్ణమి.....

చదవండి! చదివించండి!



మార్క్సిజం లెనినిజం మావోయిజం
స్టడీ నోట్స్
వెల : రు. 100/-
న్యూ విస్టాస్ పబ్లికేషన్స్

మార్క్సిస్టు తత్వశాస్త్రం
ఒక పరిచయం
వెల : రు. 80/-
న్యూ విస్టాస్ పబ్లికేషన్స్



మా ప్రచురణలు : నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ ఎదురుగా, కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్‌లోనూ లభిస్తాయి. ఫోన్ నెం: 040-24652387
నవ తెలంగాణ, 1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాదు-500020. ఫోన్ నెం: 040-27608107, 9490099373

తరతరాల దుఃఖం

డా. ఎం.హరికిషన్

"అన్నా... ఇన్ని రోజులు ఆగినావు. మరో సమచ్చరమాగు. నువ్వే చూస్తావున్నావుగదా.... ఈసారి గూడా వానల్లేవు. పెట్టిన పెట్టుబడి గూడా మన్నులో కల్సిపోయింది" నెమ్మదిగా తలొంచుకోని చెప్పినాడు నారాయణ.

"సూడు ఇట్లాగే మూడు సమ్మచ్చరాల నుంచీ రేపు రేపంటానే తిప్పుతా ఉన్నావు. వరుసకు దూరపు బంధువు అవుతావు. నేనూ రైతునే. అందుకే వడ్డీ గూడా వదిలేసి అసలిమ్మంటున్నా. ఈ రోజు అటో ఇటో తేలిపోవాల్సిందే. అవతల కూతురి పెండ్లుంది" తెగేసి చెప్పినాడు రాజన్న.

"అది కాదనా...సేతిలో దుడ్లుండి నేను వెనకడుగు వేయడంల్యా. నువ్వు తిట్టినా, తన్నినా, మొగమ్మీద ఉమ్మేసినా...ఒక్క పైసా గూడా లేదు. ఇక నీ ఇష్టం" అన్నాడు నారాయణ వంచిన తల ఎత్తకుండా.

నెమ్మదిగా మాటా మాటా పెరిగింది. బంధుత్వాలు, మర్యాదలు పక్కకు పోయినాయి. అంగీ అంగీ పట్టుకునేదాకా వచ్చింది. దాంతో పంచాయితీ ఊరి పెద్దల నుడమకు చేరింది.

"చూడు....నీకు నెలరోజుల గడువిస్తావున్నాం. ఉన్నది కాస్తా అమ్ముకుంటావా లేక ఎవని కాళ్ళయినా పట్టుకుంటావా అనేది మాకనవసరం రోషముంటే సరిపోదు. తీసుకున్నాక తల తాకట్టు పెట్టయినా సరే తెచ్చి ఇయ్యాల్సిందే. అవతల మనిషేం రాచ్చసుడు గాదు. అసలు ఇయ్యిమంటున్నాడంతే. ఈ భూమ్మీద ఇంతకన్నా ధర్మంగా ఎవడూ మాట్లాడ్డు. నీకు నెల రోజులు గడువిస్తావున్నాం. అవతల ఆడకూతురి పెండ్లుంది. జాగ్రత్త" అంటా పెద్ద మనుషులు అందరి ముందూ ఏలెత్తి హెచ్చరించినారు.

నారాయణకు తల కొట్టేసినట్లయింది. వీధిలో అందరూ నవ్వుతున్నట్లుగా ఉంది. ఎలా ఇంటికి చేరాడో నారాయణకే తెలీదు. అట్లాగే మంచమ్మీద వాలిపోయినాడు. కళ్ళలోంచి ఆగకుండా నీళ్ళు కారుతూనే ఉన్నాయి. ఇంట్లో ఎవరూ లేరు. అమ్మా, వదిన పని యాడన్నా దొరుకుతుందేమోనని తెదుక్కుంటూ పోయినారు.

వదిన గుర్తుకు రాగానే దుఃఖం మరింత పొంగింది. అన్ని గోపాల్ గుర్తుకు వచ్చినాడు. థూ....థూ....అంతా వానివల్లే. నడి సముద్రంలో వదిలేసి చెప్పాపెట్టకుండా మాయమైపోయినాడు. పది సమ్మచ్చరాలు అయింది. వెదకని ఊరు లేదు, అడగని మనిషి లేడు. వదినకు నుదుట బొట్టు ఉంచుకోవాల్నో తీసేయాల్నో గూడా తెలీదు. ఇద్దరు సన్నపిల్లల్ని, పెళ్ళాన్ని, ముసలి తల్లిని అందరినీ వదిలేసి పన్నుకున్నోడు పన్నుకున్నట్టే మాయమైపోయినాడు. అంతే....ఒక్కసారిగా కలలన్నీ తలకిందులైపోయినాయి. ఎక్కడి చదువు అక్కన్నే వదిలేసి కాడి భుజమ్మీదకు ఎత్తుకోవాల్సి వచ్చింది.

ఇంగ నా సేతగాదు. గుత్తలు కట్టడానికే తల ప్రాణం తోకకొస్తోంది. ఎవడు కౌలుకి గూడా ఇవ్వడం లేదు. ఇంక అప్పెవడిస్తాడు. ఈ బదుకు బదకడంకన్నా సావడం మేలు. నెమ్మదిగా పైకి లేచినాడు. అటక మీదున్న పశువులను కట్టే తలుగు బైటకి తీసినాడు. పశువులు అమ్మేసినాక ఆ తాడుతో ఎప్పుడూ పనిబడక పైన పడేసినారు. దుమ్ము విదిలించి, గట్టిగా లాగి చూసి దాన్ని ఒక సంచీలో వేసుకున్నాడు.

కావ్య కళ్ళముందు మెదిలింది. "చేతగాని నా కొడకా....నీ కెందుకురా ప్రేమ" అంటా 'థూ' అని మొగాన ఉమ్మేసినట్లని పించింది.

తలెత్తి పైకి చూసినాడు. గోడ మీద వరుసగా ఒకదాని పక్కన ఒకటి మూడు ఫోటోలు వేలాడుతా ఉన్నాయి. రెండు నలుపు తెలుపుల్లో, ఒకటి రంగుల్లో. మొదటి ఫోటో చానా పాతది. చిన్న ఫోటోను పెద్దదిగా చేసి పెన్సిలుతో దిద్దినట్లుంది. మొదటి రెండింటికి దండలు వేసి బొట్లు పెట్టినారు. మూడవది వాళ్ళన్న గోపాల్‌ది.

అన్న ఫోటోనే చూస్తా ఉన్నాడు. ఒక్కసారిగా జాలనిపించింది. నిజమే...ఎవనికి మాత్రం చాతనవుతాది ఇన్ని కష్టాలు భరించడం. ఈరోజు నేను చేయబోతున్నది గూడా అదేగదా. అన్న పడిన కష్టాలు, నిద్రపోని రాత్రుళ్ళు గుర్తుకొచ్చి కళ్ళు చెమ్మగిల్లినాయి.

రేపు...ఈ మూడు ఫోటోల పక్కన నా ఫోటో గూడా మెడలో దండతో, నుదుటన బొట్టుతో, అగరబత్తుల వాసనల నడుమ వేలాడబడుతాదా...లేక కోపంతో అన్నీ తీసుకోని పోయి ఇసిరి మూలన పడేస్తారా...

అమ్మ, వదిన, అన్న పిల్లలు గుర్తుకు రాగానే మనసంతా బాధతో నిండిపోయింది. ఇంట్లో మొగాళ్ళే లేకుండా వరుసగా అందరూ ఒక్కొక్కరుగా పాపం ఎలా....తట్టుకుంటారో....వద్దొద్దు. మళ్ళీ ఆ ఆలోచనల్లో పడితే కాలుకదలదు. వద్దు..ఇక సాలు. ఈ పది సమ్మచ్చరాల్లో ఏ పూట కాపూట అన్నట్లు బదకడమే గానీ ఒక అచ్చటా లేదు ముచ్చటా లేదు.

కావ్య తోడుంటే...తెగించి పోరాడుతుంటినేమో. కానీ ఆ ఒక్క ఆశ కూడా సచ్చిపోయింది. ఏమన్నాడు వాళ్ళ నాన్న సంబంధం మాట్లాడ్డానికి తల్లితో కలిసి వెళితే....

"చూడమ్మా....మా పిల్లని అడుక్కు తినేటోనికన్నా ఇస్తానేమో గానీ మీవోనికి మాత్రం ఇయ్యను. ఏం చూసి ఇయ్యమంటావు. కనీసం గజం భూమి గూడా లేనోనికి"

"అది గాదన్నా...పిల్లలు ఒగరంటే ఒగరు ముచ్చట పడుతున్నారు. వరుసగూడా అవుతారు. ఆ కోరికేదో తీరిస్తే వాళ్ళ బదుకు వాళ్ళు బదుకుతారు గదా" నసిగింది నారాయణ తల్లి.

"ఓ....బలే చెప్పొచ్చినావు లేమ్మా...పిల్లలకేముంది. ఆకాశంలో మెబ్బుని చూసి ఇంట్లో నీళ్ళు ఒలకబోసుకునే రకం. ప్రేమలు కూడు బెట్టవు గదా...నీ పెద్ద కోడలు గతి ఏమయ్యిందో అందరికీ తెలుసు. చూసి చూసి నా కూతురి గొంతు కొయ్యలేను" అన్నాడు కరాఖండీగా.

ఆ తర్వాత నెల తిరిగేసరికాల్లా టౌన్లో నుంచి ఒక సంబంధం తీసుకోనొచ్చి "చేసుకుంటావా...బాయిలో దూకి సావమంటావా" అని బెదిరించి కూతురికి పెండ్లా చేసి పింపిచ్చేసినాడు.

కావ్య ఆలోచనల్తో గుండె మరింత బరువెక్కింది. కొలిమిలో వేసి కాల్చినట్లనిపించింది. సంచీ చేతిలోనికి తీసుకొని తలుపు దగ్గరకేసి బైలుదేరినాడు. అది సంతరోజు. చుట్టుపక్కల ఊళ్ళ నుంచి జనాలంతా నందికొట్కూరుకు చేరుకుంటున్నారు. ఎవరి పనుల్లో వాళ్ళున్నారు. ఎవరూ ఎవరి గురించీ పట్టించుకోడం లేదు. మాటి మాటికీతడవుతా ఉన్న కండ్లను తుడుచుకుంటా అట్లాగే ముందుకు సాగినాడు.

కావ్య వాళ్ళ నాన్న "రేయ్...గజం భూమి గూడా లేదు, నీకెట్లా ఇస్తారంరా పిల్లను" అంటూ ఎగతాళిగా అన్న మాట పదేపదే గుర్తుకు రాసాగింది నారాయణకు.

"రేయ్...ఒగప్పుడు మేమూ భూమున్న రైతులమేరా...ఈ దేశం కోసం బలవంతంగా త్యాగం చేసి సర్వనాశనమై పోయినోళ్ళలో మేమూ ఒక్కళ్ళంరా" అంటూ గట్టిగా దిక్కులు పిక్కటిల్లేలా అరవాలనిపించింది.

నారాయణకు పొలం గుర్తుకు వచ్చింది. జేజి నాయన గుర్తుకు వచ్చినాడు. పుట్టిన ఊరు గుర్తుకు వచ్చింది. ఇంట్లో గోడ మీద మసకమసకగా వేలాడుతున్న జేజినాయన ఫోటో గుర్తుకు వచ్చింది.

జేజినాయన అప్పట్లో శంకర్రావు ఇంట్లో గాసం చేస్తా ఉండేటోడు. శంకర్రావు అప్పట్లోనే 'లా' చేసి స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా తిరుగుతా ధర్నాలకు, ర్యాలీలకు మద్రాసుకు పోయేటోడు. కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొనేటోడు. శంకర్రావు ఎక్కడుంటే జేజినాయన అక్కడన్నే. నమ్మినబంటు.

జేజినాయన ఒకసారి ఆడాఈడా అప్పుదెచ్చి ఊర్లో ఉన్న రెండెకరాలు అమ్మేసి ఊరి బయట చానా దూరంగా ఉన్న పదెకరాల మెట్ట కొన్నాడు. అది చూసి అందరూ "రేయ్...తొండలు గూడా గుడ్లు పెట్టని పనికామాలిన భూములవి. అంత దూరం ఎందుకు కొంటూ ఉన్నావు. పిచ్చి గాని తలకెక్కిందా" అని నెత్తీ నోరూ కొట్టుకున్నారు. కానీ జేజినాయన నోరిప్పలేదు. కొనడం ఆపలేదు.

ఇంట్లో దాని గురించి రోజూ గొడవలే. పెండ్లాం బిడ్డల పోరు తట్టుకోలేక ఒకరోజు రాత్రి జొన్న సంగటి ఊరగాయతో కలిపి తింటా "ఒసేవ్ నేనేం అంత తెలివి తక్కువోన్ని కాదు. ఏలికేస్తే కాలికి, కాలికేస్తే ఏలికి ఏసే శంకర్రావు ఈ నడుమ ఊరిబైట నూటాయాభై ఎకరాలు కొన్నాడు. ఏమంటే దుడ్లు శానా ఉన్నాయి. భూముంటే ఎప్పుడో ఒగప్పుడు పనికొస్తాది గదా....అందుకే...అని పైకి అందరిలో వగలమాటలు మాట్లాడ్తున్నాడు గానీ నీడలెక్క వెనకుండే నాకు తెలీదా అసలు సంగతి.

పైన కృష్ణా పెన్నా అని అదేదో ఒక ఆనకట్ట వస్తా ఉందంట. అది గనుక కడితే కర్నూలు, కడప, నెల్లూరు, తమిళనాడుల్లో చాలా భాగం పచ్చగా పైటేస్తాదంట. చూస్తుండండి....ఇప్పుడు నోట్లోకి నాలుగు వేళ్ళు పోవడమే కష్టంగా ఉన్న మన ఇండ్లల్లో లచ్చిందేవి ఘల్లుఘల్లు మంటాది" అన్నాడు. అందరూ ఆని తెలివికి నోళ్ళు ఎళ్ళబెట్టినారు.

కొద్ది రోజులకు మద్రాసు నుంచి వచ్చిన బ్రిటీషోళ్ళ సర్వేలు మొదలయ్యేసరికి అందరికీ నెమ్మదిగా తెలిసిపోయింది. గోదావరి పల్లెల్లో నీళ్ళు పరవళ్ళు తొక్కినట్లు సీమలో గూడా మూడు పంటలు పండుతాయని కొందరు, ఒక పంటకు నీళ్ళొచ్చినా సాలు హాయిగా కాలు మీద కాలేసుకోని బతికేయొచ్చునని కొందరు...ఏ రైతు కళ్ళలో చూసినా పచ్చని పంటలే...ఎవరి నోట విన్నా నీళ్ళ గలగలలే.

కానీ ఆ సంబరం ఎంతో కాలం నిలబల్లేదు. అదిగో వచ్చే ఇదిగో వచ్చే అంటానే పదేళ్ళు గడిచిపోయింది. ఆ ప్రాజెక్టు పూర్తయితే తమిళనాడుకి నీళ్ళు పోతాయని, మన నీళ్ళు వాళ్ళకెందుకు ఇవ్వాల అంటా ఆ ప్రాజెక్టుకి పురిట్లోనే సంధి కొట్టేరంట కొందరు. ఇది ఇంకా జనాలకు తెలీనప్పుడే శంకర్రావు కూతురి పెండ్లి దగ్గర పడుతుందంటా తాను కొన్న నూటాయాభై ఎకరాలు మంచి ధరకు అమ్మేసినాడు.

"థూ..దీనెమ్మ మన బతుకింతే" అనుకుంటాజనాలు మళ్ళా ఆకాశమొంక చూస్తా ఆ మట్టిలోనే తనకలాట మొదలు పెట్టినారు. జేజినాయన కన్న కలలన్నీ ఒక్కసారిగా కుప్ప కూలిపోయినాయి. తొండలు గూడా గుడ్లు పెట్టని భూమి ఒక పక్క, అప్పులు మరోపక్క. ఆ బాధల్లో తాగుడుకి అలవాటుపడి తాగీ తాగీ ఒకరోజు ఆ పొలంలోనే పడి చచ్చిపోయినాడు. ఇంటి బాధ్యతలన్నీ వాళ్ళ నాయన శివయ్య నెత్తిమీద పన్నాయి. అప్పటికే తెల్లోళ్ళ పాలన పోయి నల్లోళ్ళ పాలన గూడా దేశంలో వచ్చేసింది.

శివయ్యది చిన్నప్పటి నుంచీ బాగా కష్టపడే ఒళ్ళు. ఎద్దయినా ఒక్క క్షణం ఆగుతుందేమో గానీ శివయ్య ఆగడు. ఊరి బైటి పొలాన్ని సాగు చేయడం కాన్ని కూలికి పోవడం మేలు అనేటోడు జేజినాయన.దాంతో ఆయనున్నంత వరకూ ఆ పొలంకెళ్ళి ఎవరూ కన్నెత్తి చూడలేదు. కానీ శివయ్యకు తనకుంటూ ఒక పొలం ఉండాలని ఒకటే కోరిక. దాంతో ఏది ఏమైనా సరే ఊరిబైటి పొలాన్ని సాగులోనికి తెచ్చుకోవాలనుకున్నాడు. ఎప్పుడు తీరికి దొరికినా పొలానికి పోయి రాళ్ళు ఏరి, పెద్ద పెద్ద బండలు పగలగొట్టి, కంప చెట్లు మూలంతో బాటు పెకళించి, నెమ్మదిగా దాన్ని సాగులోనికి తెచ్చినాడు. వాని కాళ్ళు వీని కాళ్ళు పట్టుకోని అప్పు తెచ్చిన డబ్బుల్తో బావి తవ్వించినాడు. దశ తిరిగి జల పొంగుకొచ్చింది. శివయ్యను చూసి అందరూ నక్కను తొక్కినావురా అని తెగ మెచ్చుకున్నారు. అప్పు నెత్తిమీదుంటే బ్రహ్మరాక్షసి నట్టింట్లో ఉన్నట్లే అనుకుంటా వచ్చింది వచ్చినట్లు అప్పు కట్టసాగినాడు. నాలుగు పంటలు పండేసరికి అంతా తీరిపోయింది. వాని కష్టం చూసి ఊళ్ళో మర్యాద పెరిగింది. పంచాయితీలలో పెద్ద మనుష్యుల మధ్య చోటు దొరికింది. ఈ సారి పంట వస్తే పాత మట్టి మిద్దె పీకి కొత్తగా రెండు గదులు వేయాలనుకున్నాడు.

కానీ అంతలో....

* * *

ఊరిలో ఎవరిని కదిపినా దుఃఖమే. అందరి మొగాలు పాలిపోయి ఉన్నాయి. అందరి సమస్యా ఒక్కటే. కాళ్ళకింద మట్టి తమది గాకుండా పోతోంది. పుట్టి, పెరిగి, మన్నులో మన్నులా కలిసి ఆనందాలు, విషాదాలు, జ్ఞాపకాలు, అనుబంధాలు కలగలసిన ఊరు. ఒక్కసారిగా జలసమాధి అయిపోతావుంది. ఎక్కడికి పోవాలి. అందరి కళ్ళ ముందు అదే ప్రశ్న. ఒళ్ళు ఒణుకుతా ఉంది.

కొత్త ఊరులో కొత్త మనుషులతో కలిసిపోవడం ఎంత కష్టం. ఈ ఊరిలో గడప గడపా తెలుసు. వాళ్ళు చేసే పనులు తెలుసు. మాటతీరు, మనసు తీరు, ఎవరితో ఎట్లా ప్రవర్తించాల, ఏ పనికి ఎవర్ని పిలవాల, ఏవి పాలు, ఏవి నీళ్ళు అన్నీ తెలుసు.

అధికారులు, పోలీసులు రోజా వస్తున్నారు. శ్రీశైలం డ్యాం కింద మీ ఊరు మునిగిపోతా ఉంది. ప్రభుత్వం మీకు వేరే చోట ఇండ్లు పొలాలూ నష్ట పరిహారం అందజేస్తా ఉంది. ఒక నెలకల్లా కదలకపోతే బలవంతంగా నన్నా ఖాళీ చేయించాల్సొస్తాది. హెచ్చరికల మీద హెచ్చరికలు. ఎకరాకు మూడు నాలుగు వేలు ఇస్తున్నారు. అక్కడక్కడా చిన్న చిన్న గొడవలు జరిగినా ఎవరూ త్యాగం చేయకపోతే అభివృద్ధి ఎట్లా సాధ్యం. మర్యాదగా ఖాళీ చేస్తారా...లేక..." అంటూ పోలీసులతో బెదరిస్తున్నారు.

కొందరు చదువుకున్నోళ్ళు, డబ్బున్నోళ్ళు, తెలివైనోళ్ళు గుంపయినారు. "ఎవరూ సంతకాలు చేయకండి. మరీ ఇంత తక్కువనా ఇచ్చేది. త్యాగాలు మనం చేస్తే ఎక్కడో ఎవడో పంటలు పండించుకుంటాడంట. మనవాటా మనకు తేలాల్సిందే. ఇంటికో ఉద్యోగం, న్యాయమైన పరిహారం కోసం కోర్టులో కేసు వేద్దాం" అంటున్నారు. కానీ చానా మందికి ఇవేమీ అర్థం కావడం లేదు. చేతికందుతున్న ఈ పైసలు గూడా వదిలేస్తే మళ్ళా ఎప్పుడొస్తాయో ఏమో. అసలు వస్తాయో రావో..అన్న భయంతో ఎంత ఇస్తే అంత తీసుకోని...గూట్లో బతికిన పిట్టలు గుట్టల పాలైనట్లు కళ్ళల్లో నీళ్ళు దాచిపెట్టుకుంటా చెట్టుకొకరు పుట్టకొకరుగా చెదిరిపోతున్నారు.

శివయ్యకు కాలూ సేయీ ఆడ్డం లేదు. కౌలుకు గానీ, కొనడానికి గానీ భూమెక్కడయినా దొకుతుందేమోనని చుట్టు పక్కల బంధువుల ఊళ్ళకంతా పోయొచ్చినాడు. ఒక్కసారిగా తనలాగే చానామంది రైతులు ఎగబడడంతో ధరలుకొండెక్కి కూచున్నాయి. పోలవరం గిరిజనానికి అడవి తప్ప ఏమీ తెలీనట్టు శివయ్యకు వ్యవసాయం తప్ప ఏమీ తెలీదు. అక్షరం ముక్క రాదు. ఏమి చేయాలో ఊపిరాడ్డం లేదు.

పక్కనున్న చాకలి రంగన్న గుడిసె వైపు చూసినాడు. తలుపులు ఖాళీగా బోసిపోయి ఉన్నాయి. మూడు రోజుల కిందట రంగన్న అన్న మాటలు గుర్తుకు వచ్చినాయి. "సూడు మామా..మాతో పోల్చుకుంటే కొంతలో కొంత మీ పరిస్థితే మేలు. ఇండ్లు భూములున్నాయి కాబట్టి సేతిలో ఎంతో కొంత దుడ్లన్నా పడతాయి. కానీ వృత్తి పనులు చేసుకుంటా ఊరి మీద ఆధారపడి బతికే మాలాంటోళ్ళ పరిస్థితి ఏమి. ఏ ఊరికి పోయినా ఎవరిండ్లు వాళ్ళకున్నాయి. నోటి కాడి కూడు పంచుకోడానికి ఎవడిష్టపడతాడు సెప్పు. టౌనుకి పోయి కూలీలుగా మారడం తప్ప గతిలేదు. చెరువు నుంచి చేపను వేరు చేసినట్లుంది మీ పరిస్థితి" అన్నాడు కండ్ల నీళ్ళతో.

శివయ్యకు రంగన్నను తలచుకుంటే మనసు కలుక్కుమనింది.ఊళ్ళో అందరూ తట్టాబుట్టా సర్దుకుంటున్నారు. ఒక్కొక్క ఇల్లే ఖాళీ అయిపోతా ఉంది. ఏమి చేయాలో తోచక శివయ్య ప్రభుత్వమిచ్చిన ఆ అరకొర పరిహారం తీసరుకోని పెళ్ళాం బిడ్డల్తో నందికొట్కూరులో అడుగుపెట్టినాడు. ఒక స్నేహితుని సలహాతో ఇంకొకనితో కలిసి నూనె గానుగ మొదలు పెట్టినాడు. మొదట్లో బాగానే జరిగింది. పదికి పది లాభమొచ్చింది. కానీ అది కొద్దినాళ్ళే. యాపారంలో అఆలో కూడా తెలియక పోవడంతో జరుగుతున్న మోసం అర్థం చేసుకునే లోపల ఉన్నదంతా ఊడ్చుకుపోయి కట్టుబట్టల్తో నడీధిలో నిలబడాల్సొచ్చింది.

శ్రీశైలం జలవిద్యుత్ డ్యాం పనులు పూర్తయి నీళ్ళు గలగలగల కిందికి దుంకినాయి. పచ్చని కోస్తాలో మరిన్ని పల్లెలు పచ్చగైనాయి. జలవిద్యుత్ డ్యాం కావడంతో గొంతువరకూ నీళ్ళున్నా సీమకు ఒక్క చుక్క నోటికందడం లేదు. కేవలం నాగార్జునసాగర్‌కు ఓవర్‌హెడ్ ట్యాంకులుగా మారిపోయింది. బహుళార్థ సాధక ప్రాజెక్టుగా మార్చి ఎండిన సీమ గొంతు తడపాలని ఎన్నెన్నో గొడవలు.

ముంపు బాధితుల కష్టాలను ఎవరూ పటిచ్చుకోవడం లేదు.పరిహారం పెంచుతున్నారని, ఇంటికో ఉద్యోగం వస్తుందని అప్పుడప్పుడు వార్తలు కనీసం కొడుక్కి ఉద్యోగం వచ్చినా కుటుంబం గట్టెక్కుతుందని శివయ్య ఎదురు చూసినాడు. రోజులు గడుస్తున్న కొద్దీ ఆశలు అడుగంటసాగాయి. అప్పులు పెరిగిపోతా ఉన్నాయి. కొత్తగా ఎక్కడా అప్పులు పుట్టడం లేదు. దాంతో భవిష్యత్ భయంకరమై ఒకరోజు శివయ్య ఆ శ్రీశైలం డ్యాం పైకెక్కేసి అందులోకే దూకేసినాడు. దాంతో ఇంటి బరువు పెద్దకొడుకు గోపాల్ మీద పడింది. కొందరి నిరంతర పోరాటాలతో డ్యాం కట్టిన ముప్పయి ఏళ్ళకు అదీ తెలుగోడు ఆ ప్రాంతం నుంచి ప్రధానమంత్రిగా ఎన్నికయినాక మరికొంత పరిహారం అందింది గానీ....అప్పటికే చిన్న చిన్న కుటుంబాలన్నీ కోలుకోలేనంతగా చితికిపోయినాయి. అనేకమంది ఆచూకీ తేలలేదు. ఉన్నవాళ్ళలో చానా మంది పేర్లు రికార్డుల్లో లేవు. గోపాల్ చేతికి కొంత డబ్బు అందింది గానీ అది అప్పటికే పెళ్ళీడు దాటుతా ఉన్న చెల్లెలి పెండ్లికి ఖర్చుయిపోయింది.

* * *

నారాయణకు గాయాలన్నీ పచ్చిగానే సలుపుతా వున్నాయి. గోడమీది ఫోటోలు గిర్రున తిరుగుతా ఉన్నాయి. బతుకు మీద విరక్తి అంతకంతకూ పెరిగిపోతా ఉంది. సంచీ చేతబట్టుకోని బెరబెరా అడుగులు వేస్తా ఉన్నాడు.

ఊరి చివర ఒక పాడుబన్న గుడి కనిపించింది. చివరిసారిగా దేవునికి మొక్కుకోవాలని పించింది. లోపలికి అడుగు పెట్టినాడు. ఎవరూ లేదు. బీడుపడిన భూమిలా ఉంది. మధ్యలో విగ్రహం పూజలు లేక ఎవరూ పట్టించుకోక ఒంటరిగా దిక్కుతోచని రైతులా భక్తుల కోసం ఎదురు చూస్తా ఉంది. నారాయణ పెదవులపైకి విరక్తిలో చిరునవ్వు మెరిసింది. రెండు చేతులూ జోడించి

సిద్ధేశ్వరం అలుగు - రాయలసీమకు వెలుగు

పాణి

సిద్ధేశ్వరం ప్రాజెక్టు గురించి ఈ తరంలో చాలా మందికి తెలియదు. అక్కడ ఒక ప్రాజెక్టు కట్టాల్సి ఉండె. నాగార్జునసాగర్ డ్యాంను చూస్తే అలాంటి ప్రాజెక్టు మనకూ ఉంటే ఎంత బాగుండని రాయలసీమ జనానికి అనిపిస్తుంది. అలా అనిపించడం న్యాయం. సిద్ధేశ్వరం డ్యాంకు సమాధికట్టి కోస్తా నాయకులు నాగార్జున సాగర్ కట్టుకున్నారు. నాగార్జున సాగర్ ఆ ప్రాంత ప్రజలకు అవసరమే. కానీ తమకు మేలు చేసే సిద్ధేశ్వరం డ్యాంను కోస్తా నాయకులు దొంగిలించుకొనిపోయారని తెలిస్తే రాయలసీమ వాళ్లకు కడుపు మండుతుంది. రాయలసీమ పల్లెలు వల్లకాడుగా మారడానికి, కరువుతో వ్యవసాయం చేయలేక రైతులు ఉరేసుకోడానికి, పెళ్లాం బిడ్డలతో వలస వెళ్లిపోవడానికి కారణం ఇదే. ఆ రోజు సిద్ధేశ్వరం ప్రాజెక్టే కట్టి ఉంటే రాయలసీమలో 15 లక్షల ఎకరాలకు నీళ్లు అందేవి.

మరి ఇంత అన్యాయం జరుగుతుందా? అని ఎవరికైనా అనిపించవచ్చు. అభివృద్ధి చెందిన ప్రాంతాల పాలకులు ఇలాగే చేస్తారు. వాళ్ల చేతిలోనే అధికారం ఉంటుంది. దాన్ని అడ్డం పెట్టుకొని వెనకబడిన ప్రాంతాలను ఎంతగానైనా దగా చేస్తారు. ఏకంగా సిద్ధేశ్వరం ప్రాజెక్టే లేకుండా చేశారు. అందుకే.. ముందు ఆనాటి సిద్ధేశ్వరం ప్రాజెక్టు ఎలా దూరమైపోయిందో తెలుసుకుంటే ఇప్పుడు సిద్ధేశ్వరం అలుగు కావాలని ఎందుకు అడుగుతున్నదీ అర్థమవుతుంది.

* * *

బ్రిటిష్ పాలకులు క్రిష్ణా పెన్నార్ అనే ప్రాజెక్టులో భాగంగా సిద్ధేశ్వరం కట్టాలని అనుకున్నారు. సర్వే కూడా చేయించారు. వరుసగా ప్రపంచ యుద్ధాలు రావడంతో వాళ్లు సిద్ధేశ్వరం కట్టలేకపోయారని అంటారు. ఏదేమైనా అప్పటికి అది అలా ఆగిపోయింది.

తెల్లవాళ్లు వెళ్లిపోయాక 1951లో సిద్ధేశ్వరం ప్రాజెక్టు కట్టడానికి ప్లానింగ్ కమిషన్ అనుమతి ఇచ్చింది. అప్పుడు రాయలసీమ, కోస్తా ప్రాంతాలు మద్రాసు రాష్ట్రంలో ఉండేవి. మామూలుగా అయితే సాటి తెలుగు వాళ్లుగా కోస్తా నాయకులు ఈ ప్రాజెక్టు కోసం కృషి చేయాలి కదా? పైగా ఆంధ్ర రాష్ట్ర ఉద్యమంలో భాగంగా శ్రీబాగ్ ఒప్పందం చేసుకున్నారు. దాని ప్రకారం క్రిష్ణా నది నీటిలో రాయలసీమకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ వాళ్లకు ఆ ఒప్పదం మీద గౌరవం ఏమీ లేదు. ఒప్పందంపై సంతకాలు పెట్టిన వాళ్లందరినీ ఇలా అనాల్సిన పని లేదు. ఆ తర్వాత వచ్చిన కోస్తా నాయకత్వం శ్రీబాగ్ ఒడంబడికను చిత్తు కాగితం కింద జమ కట్టింది. మూకుమ్మడిగా సిద్ధేశ్వరం ప్రాజెక్టు ఆచరణలోకి రాకుండా అడ్డుపడ్డారు. రెండు తెలుగు ప్రాంతాలకు మేలు చేసేలా ప్రాజెక్టులను నిర్మించాల్సిందిపోయి రాయలసీమకు అన్యాయం చేసి తమ ప్రాంతానికి నీళ్లు వచ్చేలా నాగార్జునసాగర్ కట్టుకున్నారు. పైగా నాగార్జునసాగర్ తెలుగుజాతి కీర్తి సిగలో కలికితురాయిలాంటిదని పద్యాలు రాయించారు. పాటలు పాడించారు. రాయలసీమ మోసం జరిగిన విషయం బైటపడకుండా ఆ ప్రాంతం వాళ్లను కూడా ఈ బృందగానంలో కలుపుకొని పోయారు.

ఇంత జరుగుతోంటే రాయలసీమ ప్రాంత నాయకులు ఏం చేస్తున్నారు? అనే సందేహం కలగొచ్చు. వెన్నెముకలేని సీమ ప్రాంత నాయకులూ ఈ మోసంలో భాగమయ్యారు. ఇతరత్రా వీళ్లంతా చాలా శక్తివంతమైన నాయకులే. కానీ రాయలసీమ ప్రయోజనాల గురించి పట్టించుకోలేదు. కొంత మందికైతే సొంత ప్రయోజనాలు వేరే ఉన్నాయి. వాటి కోసం కోస్తా నాయకులు ఇంత చేస్తున్నా రాయలసీమకు అన్యాయం జరుగుతోందని మాట్లాడలేదు.

ఇదంతా దాపరికం లేకుండా జరిగిపోయింది. ఇంత మోసం ఎలా జరుగుతుంది? అని మీకు అనుమానం రావచ్చు. కోస్తా నాయకులు ఇట్లాంటి పనులే చేశారు. ఇప్పటికీ రాయలసీమ విషయంలో ఇలాగే చేస్తున్నారు. మధ్యాంధ్ర ప్రాంత పాలకులు కోస్తాలోని పల్నాడు, ప్రకాశం జిల్లాలోని పాత రాయలసీమ ప్రాంతం, ఉత్తరాంధ్రలాంటి వెనుకబడిన తెలుగు ప్రాంతాలకే ఇలాంటి నష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకూ ఇలాగే అన్యాయం చేశారు.

సిద్ధేశ్వరం కత అక్కడితో పూర్తి కాలేదు. ఇంకా ఉంది.

కోస్లా కమిటీ ఆ తర్వాత కూడా సిద్ధేశ్వరం ప్రాజెక్టు కట్టాల్సిందే అని ప్రభుత్వానికి చెప్పింది. అప్పటికైనా కట్టారా? అంటే అదీ లేదు.

"సామీ...వచ్చే జన్మలోనన్నా ఈ సీమలో రైతుగా పుట్టించమాకు" అంటూ మొక్కుకున్నాడు. గుండె బాధతో బరువెక్కిపోతా ఉంది. వెనక్కి తిరిగినాడు. ఎంత ఆపుకుందామన్నా దుఃఖం ఆగడం లేదు.

అంతవరకూ ఎర్రటి ఎండతో కాల్చేసిన ఆకాశం నెమ్మదిగా మబ్బులతో నిండిపోసాగింది. భూమంతా చిక్కటి నీడ ఆవరిస్తా ఉంది. మబ్బులు ఒకదానితో ఒకటి కలసి పోతావున్నాయి. కాసేపటికే ఒక్కొక్క చినుకు భూమాతను హత్తుకొని ఐక్యం కాసాగింది. వాన నెమ్మది నెమ్మదిగా పెరగసాగింది.

నారాయణ అడుగుల వేగం మరింత పెరిగింది. కళ్ళలోంచి కారుతున్న నీళ్ళు వాననీళ్ళలో కలసిపోసాగినాయి. వేలవేల కన్నీటి చుక్కలు ఒకదానితో ఒకటి కలిసి కాలువై వంకై వాగై ప్రవాహమై తుంగభద్రా నదిలో కలసి శ్రీశైలం వైపు నిశ్శబ్దంగా సాగిపోతా ఉన్నాయి.

రాయలసీమకు నీళ్లు వచ్చే డ్యాం కడితే తమకు ఎక్కడ నీళ్లు తగ్గుతాయో అని వాళ్ల భయం. అందుకని కోస్తా కమిటీ చెప్పిన మాట కూడా వినలేదు. ఇంతకంటే ఇంకో మోసం చేశారు. అదేమంటే సిద్దేశ్వరం కట్టకుండా దాని బదులు శ్రీశైలం ప్రాజెక్టు నిర్మించారు. పోనీ అదేమైనా రాయలసీమకు నీళ్లిచ్చే ఉద్దేశంతో కట్టారా? జల విద్యుత్ ఉత్పత్తి చేయడానికి దాన్ని కట్టారు. దీన్ని తెలుగు జాతి కంటి వెలుగు అని, ఆధునిక దేవాలయం అని బుకాయించారు. కరెంటు కూడా అవసరమే. శ్రీశైలం డ్యాం నిజంగానే ఒక అపురూప కట్టడం. సందేహం లేదు. అయితే సిద్దేశ్వరం ప్రాజెక్టులాగా రాయలసీమకు నీళ్లు ఇవ్వాలనే ఉద్దేశం అందులో లేదు.

ఒక ఇక్కడి నుంచి సిద్దేశ్వరం కత పూర్తిగా ముగిసిపోయి శ్రీశైలం కత మొదలవుతుంది. దీన్నుంచి కరెంట్ ఉత్పత్తి చేసినా.. కోస్తా నాయకులు తమ ప్రాంతానికి నీళ్లు అందించే ఓవర్ హెడ్ ట్యాంకుగా దీన్ని భావించారు. డ్యాం రాయలసీమలో ఉన్నా తమ ప్రాంతానికి నీళ్లు తీసకపోవడానికి దాంట్లో నిలువ చేసుకోదలిచారు. ఆ ప్రకారమే శ్రీశైలం డ్యాంను డిజైన్ చేశారు. సరిగ్గా సిద్దేశ్వరం ప్రాజెక్టు కట్టాలనుకున్న ప్రాంతానికి 86 కిమీ కింద దీన్ని నిర్మించారు. మనం ఇంటి మీద ఓవర్ హెడ్ ట్యాంకు ఏర్పాటు చేసుకున్నట్లు కోస్తా పాలకులు తమ అవసరాలు తీర్చుకోడానికి శ్రీశైలం కొండల మధ్య ఈ డ్యాం కట్టుకున్నారు. ఎక్కడైతే సిద్దేశ్వరం కట్టాల్సి ఉండెనో ఆ ప్రాంతానికి కొంచెం దూరంలో రాయలసీమకు నీళ్లు అందకుండా తమ ప్రాంతానికి నీళ్లు వచ్చేలా నిర్మించుకున్నారు. ఒక రకంగా ఇది వెక్కిరింత కదూ. 'మీకు రావాల్సిన సిద్దేశ్వరాన్ని నాగార్జునసాగర్‌గా మార్చి మా ప్రాంతంలో కట్టుకున్నాం. మీ ప్రాంతంలో సిద్దేశ్వరం దగ్గరే శ్రీశైలం ప్రాజెక్టు కట్టాం. ఇదీ మీ కోసం కాదు, మా కోసమే..' అని రాయలసీమ వాళ్లను అపహాస్యం చేయడమే. ఇంత అన్యాయం చేస్తే రాయలసీమ జనాలకు ఎందుకు కోపం రాదు. 'మేం పైకి రాకుండా నెత్తి మీద ఒక మేకు కొట్టేసి, మా కళ్లెదుటే నీళ్లు తీసుకపోతున్నార'ని రాయలసీమ వాళ్లు ఆగ్రహిస్తున్నారు. మన ఓవర్ హెడ్ ట్యాంకులోని చివరి నీటి చుక్క కూడా అవసరమైతే కిందికి తీసుకున్నట్లు కోస్తా నాయకులు డ్యాంలో అట్టడుగున ఉన్న నీళ్లను కూడా ఊడ్చుకొని పోతున్నారు. మధ్యలో పోతిరెడ్డిపాడు నిర్మాణమైంది. దాన్నుంచి నీళ్లు తీసుకోవడం రాయలసీమ ప్రజల హక్కు. అయినా కోస్తా నాయకులు మాత్రం శ్రీశైలం డ్యాంను తమ సొంతం అనుకుంటూ వచ్చారు. దాన్ని అలాగే వాడుకుంటూ ఉన్నారు.

ఈ మాట అనడానికి పెద్దగా చరిత్రలోకి వెళ్లాల్సిన పని లేదు. తాజాగా 2015 ఆగస్టులో శ్రీశైలం డ్యాంలో 801 అడుగుల్లో కేవలం 30 టిఎంసిల నీరు ఉంటే కూడా కోస్తా ప్రాంతానికి నీళ్లు తీసుకొనిపోయారు. వాస్తవానికి అప్పుడు నాగార్జునసాగర్‌లో 131 టిఎంసిల నీరు ఉండేదని అంటారు. అయినా 'శ్రీశైలం నుంచి మాకు నీళ్లు కావాల్సిందే' అన్నారు. కేంద్రం మీద ఒత్తిడి తెచ్చి ఆ కాసిని నీళ్లనూ ఊడ్చుకొనిపోయారు. ఆ టైంలో రాయలసీమ తాగునీటికి కటకటలాడుతుండె. ఆ ప్రాంతానికి మంచి నీళ్లయినా కావాలి కదా అని కోస్తా నాయకులు అనుకోలేదు. ఆ మాట రాయలసీమ నాయకులు అడగనూ లేదు.

ఇలాంటి పనులు కండబలంతో చేయాల్సిన పని కోస్తా నాయకులకు లేదు. ఎందుకంటే వాళ్లకు అధికార బలం ఉంది. ఏకంగా 15.6.1996లో జీవో 69 తెచ్చారు. అప్పుడు ముఖ్యమంత్రి ఎవరు? చంద్రబాబునాయుడే. మామూలు మాటల్లో ఈ జీవో గురించి సింపుల్‌గా ఇలా చెప్పుకోవచ్చు. డ్యాంలో ఎన్ని నీళ్లు ఉన్నాయి? రాయలసీమకు పారుతున్నాయా? ఆ నీళ్ల మీద వాళ్లకు కూడా హక్కు ఏడ్చింది కదా? అనేవేవీ పట్టించుకోకుండా కోస్తా ప్రాంతానికి నీళ్లు తీసుకొని పోవచ్చు. ఇంత దుర్మార్గమైన జీవో రాయలసీమ ప్రాంతానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వచ్చింది. అధికారంలో ఉన్న వాళ్లు ఏ ఒక్క ప్రాంతానికో చెందిన వాళ్లలా ప్రవర్తించకూడదు. అన్ని ప్రాంతాల పట్ల సమదృష్టి ఉండాలి. రాయలసీమ నుంచి వెళ్లిన ముఖ్యమంత్రులకు తాము పుట్టి పెరిగిన ప్రాంతంపట్లే సమదృష్టి లేదు. దీనికి కారణం ఏమిటి? ప్రాంతాలపరంగా తెర వెనుక దరిద్రమైన రాజకీయాలు నడుస్తున్నాయి. అవే అన్నిటినీ శాసిస్తున్నాయి. ఒక్కోసారి అవి జీవో 69లాగా బరితెగించి బయటపడతాయి.

శ్రీశైలం డ్యాంలో నీటి మట్టం 854 అడుగులు. సిల్ లెవల్‌తో పోతిరెడ్డిపాడును 841 అడుగులతో కట్టారు. మామూలుగా అయితే శ్రీశైలంలో 854 అడుగుల నీరు ఉంటేనే కోస్తా ప్రాంతానికి నీళ్లు వదలాలి. 834 అడుగుల్లో నీరు ఉన్నా నాగార్జునసాగర్‌కు వాళ్లకు నీళ్లు ఇవ్వాలని ఈ జీవో 69 చెబుతుంది. దీని ప్రకారం డ్యాంలోకి వచ్చిన నీళ్లు వచ్చినట్లు కోస్తా వాళ్లు తీసుకొని పోతున్నారు. పోతిరెడ్డిపాడు 841 అడుగుల ఎత్తులో ఉన్నందు వల్ల రాయలసీమకు నీళ్లు రావడం లేదు.

కోస్తా పాలకులు దురుద్దేశంతోనే ఆ రోజుల్లో సిద్దేశ్వరం ప్రాజెక్టు కట్టాల్సిన చోట శ్రీశైలం డ్యాం కట్టలేదు. అంతేకాదు. పోతిరెడ్డిపాడును 841 అడుగుల్లో కట్టడంలో కూడా కోస్తా పాలకుల దుష్టబుద్ధి ఉంది. దీనివల్ల డ్యాంలోకి నీళ్లు రాగానే గేట్లు తెరిచి దర్జాగా కోస్తా ప్రాంతానికి నీళ్లు తీసుకొనిపోవచ్చు. రాయలసీమ వాళ్లు మాత్రం శ్రీశైలం బ్యాక్ వాటర్ తీసుకోవాలి. దాని కోసం పోతిరెడ్డిపాడు కట్టారు. అదీ 841 అడుగుల ఎత్తులో. రాయలసీమకు కేటాయించిన క్రిష్ణా నీళ్లను తీసుకోడానికి పోతిరెడ్డిపాడు తప్ప మరో దారే లేదు. దాన్నేమో అలా కట్టారు. డ్యాంలో 854 అడుగులు ఉన్నప్పుడైనా నీళ్లు వస్తాయిలే అని ఆశపెట్టుకోడానికి లేకుండా జీవో 69 దాపురించింది. దీంతో ప్రతి ఏటా నికర జలాలు కూడా రాయలసీమకు అందడం లేదు. 1990 నుంచి 2015 దాకా సగటున 500 టిఎంసిల నీళ్లు కిందికి పోయాయి. కోస్తాలోని కొన్ని ప్రాంతాల్లో అయినా క్రిష్ణా జలాలతో రెండు, మూడు పంటలు పండించుకొని మిగతా నీళ్లను సముద్రంలోకి వదిలేస్తున్నారు.

ఇది ప్రతి ఏటా జరుగుతున్న తంతు. ఎల్లకాలం ఇది ఇలాగే నడవడానికి వీల్లేదు. ఒక నదీ పరీవాహకంలోని అన్ని ప్రాంతాల మధ్య చట్టం ప్రకారం నీటి పంపిణీ జరగాలి. ఇది ప్రాంతాల ప్రజాస్వామిక హక్కు. ఏ ప్రాంతానికి అన్యాయం జరిగినా సహించడానికి లేదు. రాయలసీమకు నీటి కేటాయింపులు ఉన్నాయి.

వాస్తవానికి రాయలసీమలో తీవ్ర కరువు ఉంది. భూగర్భ జలాలు తక్కువ. ప్రాజెక్టులు కట్టుకోడానికి మరే నీటిపారుదల సౌకర్యం లేదు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని క్రిష్ణా నదిలో నీళ్లు కేటాయించాల్సి ఉండె. అదీ జరగలేదు. కేటాయించిన నీళ్లనయినా వాడుకోకుండా ఇన్ని రకాలుగా అన్యాయం జరుగుతున్నది. దీనికి పరిష్కారం సిద్దేశ్వరం అలుగు కట్టడమే.

అయితే సిద్దేశ్వరంతోనే రాయలసీమ మొత్తం నీటి పారుదల సమస్య తీరదు. సీమలోని అన్ని ప్రాంతాలకు ప్రజాస్వామిక దృష్టితో సాగు, తాగు నీరు అందించడం ఎలా? అనేది వేరే చర్చ. మొత్తంగానే రాష్ట్రంలో రైతులు సాగు చేసుకుంటున్న ప్రతి ఎకరా పొలానికి ఒక పంటకయినా నీళ్లు ఇవ్వడం ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాల కనీస బాధ్యత. ఇదంతా చాలా పెద్ద విషయం. అయితే సిద్దేశ్వరం ప్రాజెక్టు కట్టకపోవడంతో గత అరవై ఏళ్లుగా జరుగుతున్న అన్యాయానికి పరిష్కారం సిద్దేశ్వరం అలుగు నిర్మాణమే.

* * *

ఇక సిద్దేశ్వరం అలుగు గురించి తెలుసుకుందాం. పాత సిద్దేశ్వరం ప్రాజెక్టు ప్రతిపాదిత స్థలానికి నదిలో 86 కిమీ దూరంలో శ్రీశైలం ప్రాజెక్టు నిర్మించారని ఇందాక చెప్పుకున్నాం. దీంతో సిద్దేశ్వరం ప్రాజెక్టు ప్రతిపాదన రద్దయిపోయినట్టే. ఇప్పుడు ఆ అవకాశమూ లేదు. అవసరమూ లేదు. అయితే కృష్ణా నది నుంచి రాయలసీమకు హక్కుగా రావాల్సిన నీళ్లు కూడా శ్రీశైలం డ్యాం నుంచి అందడం లేదు. కాబట్టి అలుగు కట్టాలనే ప్రతిపాదన వచ్చింది. ఇది కూడా ఇప్పటిది కాదు. 2003 జూలై 13న ప్రభుత్వానికి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. సుబ్బరాయుడు ప్రతిపాదించారు. అంటే ఇప్పటికి 13 సంవత్సరాల వ్యవహారమన్నమాట. అప్పటి నుంచి దీని గురించి ఆయన మాట్లాడుతునే ఉన్నారు. 2011 ఆగస్టు 19న చీఫ్ ఇంజనీర్ల కమిటీ సిద్దేశ్వరం అలుగు నిర్మాణం గురించి రెకమెండ్ చేసింది. కానీ గవర్నమెంట్ చీఫ్ సెక్రెటరీకి ఈ ప్రతిపాదనలు అర్థం కాలేదు. సిద్దేశ్వరం అలుగును మరో డ్యాం అనుకొని, అలాంటి నిర్మాణం అవసరం లేదని తోసిపుచ్చారు. సిద్దేశ్వరం అలుగు అంటే అక్కడ ఇంకో డ్యాం కట్టడం కాదని ఇంజనీర్ స్పష్టం చేశారు. రిజర్వాయర్‌కు-అలుగుకు ఉన్న తేడా ఏమిటో కూడా వివరించారు. అలుగుకు గేట్లు ఉండవు, శ్రీశైలం డ్యాం నీటి నిలువ సామర్థ్యం పెంచేది కూడా ఉండదని చెప్పారు. అయినా ప్రిన్సిపల్ సెక్రటరీ అంగీకరించలేదు. నీటిపారుదల రంగ నిపుణుల మాటలు ఐఏఎస్ చదువుకున్న అధికారికి అర్థం కావడం కష్టమే మరి.

వాస్తవానికి అలుగు నిర్మాణంలో పెద్ద ఇంజనీరింగ్ వ్యవహారం కూడా ఏమీ లేదు. ఊళ్లలో రైతులకు కూడా అలుగు కట్టడమంటే ఏమిటో తెలుస్తుంది. మిట్ట మీద ఉండే పొలాలకు వాగులోని నీళ్లు పారించుకోడానికి రైతులు అలుగు కడుతూ ఉంటారు. ఇంత చిన్న విషయం ప్రిన్సిపల్ సెక్రటరీకి అర్థం కాలేదు.

అలుగు ఎందుకు కట్టాలో మామూలు మాటల్లో ఇలా చెప్పుకోవచ్చు. శ్రీశైలం డ్యాం బెడ్ లెవల్ 820 అడుగులు. అంటే అడుగు భాగం మట్టం. రిజర్వాయర్ ఎఫ్ఆర్ఎల్(ఫుల్ రిజర్వాయర్ లెవల్) 885 అడుగులు. పోతిరెడ్డిపాడు 841 అడుగుల్లో ఉంది. లెక్క ప్రకారమైతే శ్రీశైలంలో 854 అడుగుల నీరు ఉండేలా చూస్తే 841 అడుగుల్లో ఉండే పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ ప్రాజెక్టులకు నీళ్లు తీసుకోవడం కష్టమేమీ కాదు. కాకపోతే పై దిక్కున వర్షాలు కురవనప్పుడు నీటి ప్రవాహం తగ్గితే డ్యాంలో 841 అడుగుల దాకా నీళ్లు రావు. అప్పుడు పోతిరెడ్డిపాడు నుంచి నీళ్లు తీసుకోవడం సాధ్యం కాదు. ఈ సమస్య ఒకటి ఉండగా జీవో 69 వచ్చింది. దీని ప్రకారం డ్యాంలో 834 అడుగుల్లో నీళ్లు ఉన్నా గేట్లు తెరిచి కోస్తా పాలకులు కిందికి తీసుకొనిపోతున్నారు. శ్రీశైలం సిల్ లెవల్ 830 అడుగులు. డ్యాంలో ఇంతకంటే తక్కువ నీళ్లు ఉన్నా.. కింద ఉండే రివర్ స్లూయిజ్ నుంచి 760 అడుగుల వరకు కోస్తా ప్రాంతానికి వదులుతున్నారు. 2002, 2003లో ఇదే జరిగింది. ఈ ఏడాది కూడా 780 అడుగుల్లో నీళ్లు ఉంటే కూడా కిందికి తీసుకొనిపోయారు. ఇలా డ్యాంలోకి వచ్చిన నీళ్లు వచ్చినట్లు కిందికి వెళ్లిపోతే రాయలసీమకు వెనుకతట్టు నీళ్లు ఎట్ల అందుతాయి? అందుకని జీవో 69 రద్దు చేయాలని రాయలసీమ ప్రజలు ఎప్పటి నుంచో అడుగుతున్నారు. ఈ డిమాండ్ చేస్తూనే సిద్దేశ్వరం అలుగు కడితే ఈ సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని డిమాండ్ చేస్తున్నారు. 860 అడుగుల దగ్గర రెండు కొండల మధ్య 1350 అడుగుల పొడవున, సుమారు 40 అడుగుల ఎత్తులో అలుగు కట్టాలి. అప్పుడు పై నుంచి ఎక్కువ నీటి ప్రవాహం వచ్చినప్పుడు నీరు పోతిరెడ్డిపాడు వైపు ఎగదన్నుతుంది. 841 అడుగుల ఎత్తులో ఉండే హెడ్ రెగ్యులేటర్ నుంచి నీరు తీసుకోడానికి వీలవుతుంది.

శ్రీశైలం డ్యాం కట్టినప్పుడు దాని కెపాసిటీ 308 టిఎంసిలు(ఒక టిఎంసి అంటే 10 వేల ఎకరాల మెట్ట పొలాలను, 6 వేల ఎకరాల తరి పొలాలను సాగు చేయడానికి అవసరమైనన్ని నీళ్లు). ఇన్నేళ్లుగా పూడిక పెరిగి ఇప్పుడు డ్యాం కెపాసిటీ 215 టిఎంసిలకు పడిపోయింది. రిజర్వాయర్‌లో సుమారు 100 టిఎంసిల నీళ్లు ఎప్పుడూ ఉంచాలి. డ్యాంలో 854 అడుగుల నీళ్లు ఉంటేనే ఇది సాధ్యం. కానీ నీటి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో 100 టిఎంసిలు నిలువ ఉంచడం కష్టమైంది. పులిచింతల ప్రాజెక్టు నుంచి వచ్చే 54 టిఎంసిల నీటిలో ఆంధ్రప్రదేశ్‌కు, తెలంగాణకు 27 టిఎంసిల ప్రకారం అందుతుతుంది. అలాగే పట్టిసీమ ద్వారా క్రిష్ణా బేసిన్‌లోకి వచ్చే 45 టిఎంసిల నీటిలో ఆంధ్రప్రదేశ్‌కు, తెలంగాణకు చెరి 22 టిఎంసిల నీరు వస్తుంది. ఆ రకంగా ఏపీకి (27+22) సుమారు 50 టిఎంసిల నీరు అందుతుంది. ఈ నీరు క్రిష్ణా డెల్టాకు వెళతాయి కాబట్టి శ్రీశైలం డ్యాం నుంచి కోస్తాకు వెళ్లాల్సిన 80 టిఎంసిల్లో ఈ 50 తగ్గుతుంది. సిద్దేశ్వరం అలుగు కట్టడం వల్ల డ్యాం నీది నుంచి సుమారు 50 టిఎంసిల నీటిని రాయలసీమ వాడుకోవచ్చు. అలుగు కట్టకపోయినా డ్యాం నుంచి రావాల్సిన నికర జలాలు రాయలసీమకు అందడం లేదు. అందుకని అలుగు కట్టడం; పులిచింతల, పట్టిసీమల నుంచి 50 టిఎంసిల నీళ్లు కోస్తాకు వస్తున్నందు వల్ల ఆ నీళ్లను శ్రీశైలం డ్యాం నుంచి ఆ ప్రాంతానికి తగ్గించడం .. అనే రెండు పనులు చేస్తేగాని 841 అడుగుల ఎత్తులో ఉన్న పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమకు నీళ్లు అందవు.

ఈ 50 టిఎంసిలతోపాటు, రిజర్వాయర్‌లో ఆవిరి కింద కేటాయించిన 11 టిఎంసిల్లో కొద్దిగా మిగిలితే సుమారు 60 టిఎంసిల నీరు రాయలసీమ వాడుకోవచ్చు. దీనికితోడు రిజర్వాయర్‌లో 60 టిఎంసిలను క్యారీ ఓవర్ కింద ఉంచాలని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ చెప్పింది. 65 శాతం డిపెండబిలిటీ ప్రకారం ఇందులో 30 టిఎంసిలు నికర జలాలు, 30 టిఎంసిలు వరద జలాలు. ఈ నికర జలాల్లో కూడా ఓ 20 టిఎంసిలు రాయలసీమ, 10 టిఎంసిలు తెలంగాణ తీసుకోవచ్చు. ఆ రకంగా సుమారు 80 టిఎంసిల నికర జలాలు రాయలసీమకు వస్తాయి. వీటిని గాలేరు-నగరి, హంద్రీ-నీవా ప్రాజెక్టులకు పంచితే రాయలసీమ నాలుగు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలకైనా సాగునీరు, తాగు నీరు అందుతోంది. తెలుగు గంగ, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్‌కు కేటాయించిన నీరు ఇప్పుడు అరకొర మాత్రమే వస్తోంది. అలుగు కడితే ఆ నీటిని పోతిరెడ్డిపాడు వద్ద నిలువ చేసుకోవచ్చు. దీని వల్ల నది మీద పై దిక్కు ఉండే తెలంగాణకు ఏ నష్టం లేదు. కింది దిక్కు ఉండే కోస్తా వాళ్లకు హక్కుగా వెళ్లాల్సిన నీటికి ఆటంకమూ ఉండదు. 1996 నుంచి ఇప్పటి దాకా నది నుంచి ప్రతి ఏటా కిందికి వెళ్లి కోస్తా అవసరాలు తీరాక సముద్రంలో కలుస్తున్న సుమారు 500 టిఎంసిల్లో కేవలం 50 టిఎంసిల నీటిని పోతిరెడ్డిపాడు వద్ద నిలువ చేసుకోవచ్చు. దీని వల్ల పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీళ్లు వచ్చే ప్రాజెక్టుల కింది రైతులు ఎప్పుడు నీళ్లు వస్తాయా? అని ఎదురు చూసే పరిస్థితి ఉండదు. ఒక మాటలో చెప్పాలంటే - రాయలసీమలో నికర జలాలు ఉన్న ప్రాజెక్టుల స్థిరీకరణకు సిద్దేశ్వరం అలుగు ఉపయోగపడుతుంది. రైతులు పంటలు వేసుకున్నాక నీళ్లు రాక ఎండిపోవడం అనే దుస్థితి తప్పుతుంది. క్రిష్ణా నదీ జలాల మీద ఆధారపడ్డ రాయలసీమలోని కొన్ని ప్రాంతాల రైతులు తమ హక్కును స్థిరపరుచుకున్నట్లవుతుంది. మార్చి మొదటి వారంలోనే రిజర్వాయర్‌లో 854 అడుగులు ఉండేలా చూడటానికి తగిన నీరు నిలబడుతుంది.

అప్పుడు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి మద్రాసుకు 15 టిఎంసిల మంచినీళ్లు(మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లు 5 టిఎంసిల ప్రకారం), కేసీ కెనాల్‌కు 10 టిఎంసిలు(ఈ కాలువకు రావాల్సిన నీళ్లలో 10 టిఎంసిలు తుంగభద్ర డ్యాం నుంచి అనంతపురంలోని పెన్న అహోబిలం రిజర్వాయర్‌కు ఇచ్చినందు వల్ల), ఎస్సార్బీసీకి 19 టిఎంసిలు, తెలుగుగంగకు బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కల్పించిన సరాసరి నీటిలో 25 టిఎంసిల నీరు తీసుకోవచ్చు. 38 టిఎంసిల గాలేరు-నగరికి, 40 టిఎంసిల హంద్రీ నీవాకు ఒక పద్ధతి ప్రకారంగా తగినంత నీరు అవసరమైనన్ని రోజులు ఇవ్వవచ్చు. దీని వల్ల పొలాలకు వేసవిలో కూడా నీటి ఎద్దడి ఉండదు.

ఈ మొత్తం వ్యవహారంలో కేటాయించిన నీటి కంటే కొత్తగా రాయలసీమ ఒక్క చుక్క నీరు తీసుకొనేది ఉండదు. అలుగు కట్టడమంటే శ్రీశైలం డ్యాం నీటి నిలువ సామర్థ్యం పెంచడం కూడా కాదు. ఈ విషయం అర్థం కాక కొత్తగా డ్యాంలో డ్యాం కట్టడమని భ్రమపడాల్సిన పని లేదు. వ్యతిరేకతతో ఏడవాల్సిన పని కూడా లేదు.

ఇంత ప్రయోజనకారి అయిన సిద్దేశ్వరం అలుగు నిర్మాణానికి అప్పట్లో 300 కోట్లు ఖర్చయ్యేది. ఇప్పుడైతే 600 కోట్లు కావచ్చు. అలుగు కడితే కలిగే ప్రయోజనం వల్ల రాయలసీమ వ్యవసాయంలో ప్రతి ఏటా రూ. 1500 కోట్ల ఆదాయం ఉంటుందని అంచనా. దీన్నుంచి రకరకాలుగా ప్రభుత్వానికి ఏటా రూ. 300 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

ఇంతేగాక అలుగు వల్ల ఇంకొన్ని లాభాలు ఉన్నాయి. సిద్దేశ్వరాన్ని అలుగు, బ్రిడ్జిగా కూడా కట్టాలనే ప్రతిపాదన ఉన్నందు వల్ల ప్రకాశం జిల్లా నుంచి హైదరాబాదుకు రోడ్డు మార్గంలో 50 కిమీ దూరం తగ్గుతుంది. భూగర్భ జలాలు పెరుగుతాయి. వర్షాలు తక్కువ కావడంతో రాయలసీమలో భూగర్భ జలాలు తగ్గిపోవడం ప్రధాన సమస్యగా మారింది. చంద్రబాబు చెప్పే ఇంకుడు గుంతల కంటే ఇది ఎన్నో రెట్లు నయం. గతంలో తుంగభద్ర నదికి వరద వచ్చినప్పుడు శ్రీశైలం డ్యాం మీద దాని ప్రభావం పడిందని, 8 మిమీ ఆనకట్ట ఒరిగిందని నిపుణులు అన్నారు. నదిలో ఏ కారణం వల్ల వరద ప్రవాహం ఎక్కువైనా అది డ్యాం మీదే మొత్తం పడకుండా అలుగు సపోర్టు చేస్తుంది. ఇంత కంటే మరో ముఖ్యమైన ప్రయోజనం ఉంది. అదేమంటే శ్రీశైలం డ్యాంలో పూడిక క్రమంగా పెరిగిపోతున్నది. ప్రతి ఏటా 3 టిఎంసిల సామర్థ్యం తగ్గిపోతున్నది. దీన్ని తొలగించడం చాలా కష్టమని, భారీ ఖర్చవుతుందని, పూడిక ఎత్తేయడానికే చాలా భూమి కావాల్సి వస్తుందనీ నిపుణులు అంటున్నారు. అలుగు కడితే ..అలుగుకు ఆనకట్టకు మధ్య పూడిక ఏర్పడదు. అలుగు ముందు ఏర్పడే పూడిక తీయడం సులభం కూడా. రాయలసీమకు ఇంత మేలు చేసే ఈ ప్రాజెక్టును ప్రభుత్వం కట్టదు. ఈ మాట చెప్పడానికి పెద్ద తెలివితేటలు ఏమీ అవసరం లేదు. ఎందుకంటే కోస్తా నాయకులు కట్టనివ్వరు. అయినా ఇది రాయలసీమ వాళ్ల ప్రజాస్వామిక హక్కు. వెనుకబడిన ప్రాంతంగా రాయలసీమ తరతరాలుగా దగా పడుతూ వచ్చింది. దానికి ఒక పరిష్కారంగా సిద్దేశ్వరం అలుగు నిర్మాణం ముందుకు వచ్చింది. దీంతోనే రాయలసీమలోని తీవ్ర కరువు ప్రాంతాలన్నిటికీ నీళ్లు ఏమీ రావు. వాటికి ఇలాంటి ప్రయత్నాలు ఎన్నో చేయాలి. ఇతర ప్రాంతాలకు నష్టం కలగకుండా, తమ ప్రాంతానికి న్యాయంగా రావాల్సిన నీటిని రాయలసీమ ప్రజలు సాధించుకోవాలి. లెక్కలు వేసి నీటిని చూపించినంత మాత్రాన సమస్య పరిష్కారం కాదు. రిజర్వాయర్లు నిర్మించాలి. ఉదాహరణకు కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంత అవసరాలు తీరడానికి గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, అనంతపురంలో హెచ్ఎల్‌సీ సమాంతర కాలువ.. ఇలా ప్రతి జిల్లాలో రిజర్వాయర్లు, కాలువలు నిర్మించాలి. కృష్ణా, గోదావరి బేసిన్ల కింద తెలుగు ప్రాంతాల్లోని అన్ని జిల్లాల రైతులందరికీ సాగు నీరు అందాలి. తాగు నీరు అందాలి. ఈ ప్రజాస్వామిక దృక్పథంతో చూస్తే సిద్దేశ్వరం అలుగు నిజంగానే రాయలసీమకు కొంచెం వెలుగునిస్తుంది.

ఈ వెలుగు రాయలసీమకు ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు రాదు కాబట్టి మే 31న సిద్దేశ్వరం అలుగు శంకుస్థాపనకు సీమ రైతులు రంగంలోకి దిగారు. ఇది మంచి పరిణామం. వాళ్ల న్యాయకాంక్ష నిజం కావాలని కోరుకుందాం.

ముగ్గురు బాధితులు!

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
తెలుగు: సీఎస్ఆర్ ప్రసాద్

(భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను ఉరి తీసిన సందర్భంగా 13-4-1931న "జనత" అనే పత్రికలో డాక్టర్ అంబేద్కర్ రాసిన సంపాదకీయం)

మొత్తానికి భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురులను ఉరితీసారు. శాండర్స్ అనే ఒక ఆంగ్లేయ పోలీస్ అధికారిని, చమన్‌సింగ్ అనే ఒక సిక్కు పోలీస్ సిపాయిని హత్య చేసారన్న నేరం వాళ్ళ మీద మోపారు. ఇదే కాక, బెనారస్‌లో ఒక పోలీస్ ఇన్స్పెక్టర్‌ను హత్య చేయటానికి ప్రయత్నించారని, అసెంబ్లీలో బాంబు విసిరారని మౌలీమియా గ్రామంలో ఒక ఇంట్లో దొంగతనం చేసి, ఖరీదైన వస్తువుల్ని దోచుకున్నారని, మూడు నాలుగు అదనపు ఆరోపణలు కూడా ఉన్నాయి. అసెంబ్లీలో బాంబు విసిరాడన్న ఆరోపణను ఇప్పటికే భగత్సింగ్ అంగీకరించాడు. ఈ నేరానికి గాను, ఆయనకూ, భటుకేశ్వర దత్తుకూ యావజ్జీవ శిక్ష విధించారు. భగత్‌సింగ్ తదితరులతో కలిసి విప్లవకారులైన తాము శాండర్స్‌ను హత్య చేశామని భగత్‌సింగ్ సహచరులలో ఒకడైన జైగోపాల్ ఒప్పుకున్నాడు. ఈ ఒప్పుకోలుపై ఆధారపడి, ప్రభుత్వం భగత్‌సింగ్, ఆయన సహచరులపైన ఒక కేసు పెట్టింది. అయితే ఆ ముగ్గురు నిందితులు విచారణలో పాల్గొనలేదు. ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులతో కూడిన ట్రిబ్యునల్ కేసు విచారించి, వాళ్ళపై ఏకగ్రీవంగా మరణశిక్ష విధించింది.

ఈ శిక్షను అమలు చేయవద్దనీ, కావాలనుకుంటే దాన్ని అండమాన్‌లో యావజ్జీవ శిక్షగా మార్చమనీ భగత్‌సింగ్ తండ్రి చక్రవర్తికీ, వైస్రాయ్‌కీ క్షమాభిక్ష పిటీషన్‌ను పెట్టుకున్నాడు. ఈ అంశం గురించి కొందరు ముఖ్య నాయకులతో సహా చాలామంది ప్రభుత్వానికి నచ్చజెప్పటానికి ప్రయత్నించారు. గాంధీ, లార్డ్ ఇర్విన్‌ల మధ్య జరిగిన చర్చలలో భగత్‌సింగ్ ఉరిశిక్ష ప్రస్తావనకు వచ్చి ఉంటుంది. దీనికి సంబంధించి, లార్డ్ ఇర్విన్ ఎలాంటి ఖచ్చితమైన హామీ ఇవ్వకపోయినప్పటికీ ఆ మధ్య కాలంలో గాంధీ ఉపన్యాసం ఈ ముగ్గురు యువకుల జీవితాల్ని కాపాడటానికి లార్డ్ ఇర్విన్ తన అధికార పరిధిలో శాయశక్తులా కృషి చేస్తాడనే ఆశ కలిగించింది. అయితే ఈ విజ్ఞప్తులు, జోక్యాలు, ఆశలు అన్నీ నిరాధారమని తేలింది. 23-3-1931న, రాత్రి 7 గంటలకి లాహోర్ సెంట్రల్ జైలులో వాళ్ళను ఉరి తీసారు. వాళ్ళలో ఏ ఒక్కరూ తమ ప్రాణాలు కాపాడమని విజ్ఞప్తి చేయలేదు. అయితే ఇప్పటికే పత్రికల్లో వచ్చినట్లు, భగత్‌సింగ్ తనను ఉరి తీయవద్దనీ, తుపాకీతో కాల్చి చంపమనే కోరికను వ్యక్తం చేసాడు. అతడి ఈ చివరి కోరికను కూడా అంగీకరించకుండా వాళ్ళు ట్రిబ్యునల్ తీర్పును అక్షరాలా అమలు పరిచారు. మెడకు ఉరితాడు కట్టి చనిపోయేంత వరకు వేలాడదీయమని తీర్పులో ఉంది. వాళ్ళని కాల్చి చంపితే, తీర్పు అమలులో న్యాయస్థానానికి అక్షరాలా కట్టుబడినట్లు కాదు. న్యాయదేవత ఆదేశానికి సంపూర్ణంగా విధేయులై ఆమె చెప్పిన పద్ధతిలోనే ఆ ముగ్గుర్నీ ఉరితీసారు.

ఎవరి కోసం ఈ బలి?

న్యాయదేవత పట్ల ఖచ్చితమైన విధేయతను, విధి నిర్వర్తన పట్ల తమ నిబద్ధతను చూసి ప్రజలు ఈ హత్యలను అంగీకరిస్తారని ప్రభుత్వం అనుకుంటే అంతకంటే మించిన అమాయకత్వం మరొకటి ఉండదు. బ్రిటిష్ న్యాయ వ్యవస్థ గౌరవానికి మచ్చ కలగకుండా చేసే ఉద్దేశంతోనే ఈ బలి తీసుకున్నారని ఎవ్వరూ నమ్మరు. ఇలాంటి అవగాహనతో ప్రభుత్వం కూడా స్వీయ సంతృప్తి చెందదు. అలాంటప్పుడు ఈ న్యాయదేవత ముసుగుతో ఇతరులను ఎట్లా ఒప్పిస్తుంది? బ్రిటన్‌లోని ప్రజాభిప్రాయం, కన్సర్వేటివ్ పార్టీ భావనల పట్ల భయంతోనే గాని, న్యాయదేవత పట్ల విధేయతతో ఈ బలిదానం అమలు కాలేదని యావత్తు ప్రపంచానికే కాదు, ప్రభుత్వానికి కూడా తెలుసు. గాంధీ లాంటి రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయటం, గాంధీగారి పార్టీతో ఒప్పందాలు చేసుకోవటం వంటి చర్యల ఫలితంగా బ్రిటిష్ సామ్రాజ్య ప్రతిష్ట దెబ్బతిన్నదని వాళ్ళు గ్రహించారు. అధికారంలో ఉన్న లేబర్ పార్టీ మంత్రిమండలి దాని అడుగులకు మడుగులొత్తుతున్న వైస్రాయ్ దీని కంతటికీ బాధ్యులని కన్సర్వేటివ్ పార్టీ సాంప్రదాయక నాయకులు కొందరు ప్రచారం ప్రారంభించారు. ఇలాంటి స్థితిలో ఒక ఇంగ్లిష్ అధికారిని హత్య చేసినందుకు శిక్షపడిన రాజకీయ విప్లవకారులకు లార్డ్ ఇర్విన్ క్షమాభిక్ష ప్రసాదించటమంటే ప్రతిపక్ష నాయకుల చేతికి మండుతున్న కాగడాను అందించడమే! ఇప్పటికే లేబరు పార్టీ స్థితి స్థిరంగా లేదు. ఇలాంటి పరిస్థితిలో ఇంగ్లిష్ వ్యక్తిని హత్య చేసిన నేరస్తులకి లేబర్ ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదించిందనే ఎలిబీ కన్సర్వేటివ్ పార్టీ నాయకులకు లభిస్తే, ప్రజాభిప్రాయాన్ని లేబర్ పార్టీకి వ్యతిరేకంగా రెచ్చగొట్టడం తేలిక. ఇలాంటి సంక్షోభాన్ని నివారించటానికి, మితవాద నాయకుల విమర్శనా జ్వాలల్ని తగ్గించటానికి ఈ ఉరిశిక్షలు అమలయ్యాయి.

అందుచేత ఇది ఇంగ్లాడ్‌లో ప్రజాభిప్రాయాన్ని సంతృప్తి పరచటానికే గాని, న్యాయదేవతను సంతృప్తి పరచటానికి కాదు. సమస్య లార్డ్ ఇర్విన్ ఇష్టాయిష్టాలకు సంబంధించిదైతే అతడు తన అధికారాలకు లోబడి, మరణశిక్షను రద్దు చేసి యావజ్జీవ శిక్షని విధించేవాడు. ఇంగ్లాండ్‌లోని లేబర్ పార్టీ మంత్రి వర్గం, లార్డ్ ఇర్విన్ నిర్ణయాన్ని సమర్థించి ఉండేది. గాంధి, ఇర్విన్ ఒడంబడిక సందర్భంగా అనుకూల ప్రజాభిప్రాయం సృష్టించుకోవటం కూడా వాళ్ళకు అవసరమయ్యేది. దేశాన్ని వదిలి వెళ్తున్న సమయంలో ఈ పరపతిని

సంపాదించుకోవటానికి ఇర్విన్ ఇష్టపడేవాడు. అయితే ఇంగ్లాండ్‌లోని మితవాద రక్త సంబంధీకులు, కుల దృష్టికోణంతో తొణికిసలాడుతున్న భారత అధికారవర్గాల క్రోధాగ్నికి ఆయన బలై ఉండేవాడు. అందుచేత ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకోకుండా లార్డ్ ఇర్విన్ ప్రభుత్వం భగత్‌సింగ్‌ను, సహచర కామ్రేడ్స్‌ను హత్య చేసింది. ఇది కూడా కరాచీలో కాంగ్రెస్ మహాసభ జరగటానికి కేవలం రెండు నుండి నాలుగు రోజుల ముందు భగత్‌సింగ్, అతడి సహచర కామ్రేడ్ల ఉరితీతకు సమయం ఎంచుకున్నది. ఈ రెండూ గాంధీ, ఇర్విన్ ఒడంబడికలోని అంశాలను, దాని కోసం జరిగిన ప్రయత్నాలను బలహీనం చేస్తున్నాయి. ఈ ఒడంబడికను భగ్నం చేయాలని లార్డ్ ఇర్విన్ కోరుకుని ఉంటే ఇంతకు మించిన మరో మంచి అవకాశం వచ్చేదికాదు. ఈ కోణం నుండి చూస్తే ప్రభుత్వం, తీవ్రమైన తప్పిదం చేసిందని ఎవరైనా అంటారు. గాంధీ కూడా అలానే భావించారు.

మొత్తంమీద ఇంగ్లాండ్‌లో కన్సర్వేటివ్‌ల క్రోధాగ్నికి లోను కాకుండా ఉండటానికే కాకుండా, గాంధీ, ఇర్విన్ ఒడంబడికకు ఏ గతి పడుతుందనేది కూడా ఆలోచించకుండా, ప్రజాభిప్రాయాన్ని పట్టించుకోకుండా వాళ్ళు భగత్‌సింగ్‌నూ, అతని సహచర కామ్రేడ్స్‌ను బలి చేసారు. తాను ఎంత నగిషీలు చెక్కినా, ముసుగు కప్పటానికి ప్రయత్నించినా ఈ సత్యాన్ని తానెన్నటికీ దాచి ఉంచలేనని ప్రభుత్వం జ్ఞప్తికి ఉంచుకోవాలి!

క్విట్ ఇండియా ఉద్యమం పట్ల అప్పటి సంఘ్ పరివార్ శక్తుల అభిప్రాయం

09-08-1942న క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమైంది. రాష్ట్రాల్లో ఉన్న మంత్రి వర్గాలన్నీ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఆ సమయంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ...ముస్లిం లీగ్ నాయకుడైన ఫజల్‌హక్ నాయకత్వంలోని బెంగాల్ ప్రభుత్వంలో ఆర్థికమంత్రి. బెంగాల్‌లో క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకిస్తూ ఆయన ఇలా అన్నారు. "బెంగాల్‌లో ఈ ఉద్యమాన్ని ఎలా ఎదుర్కోవాలన్నది ప్రశ్న. కాంగ్రెస్ ఎంత కృషి చేసినప్పటికీ ఈ ఉద్యమం ఈ రాష్ట్రంలో వేళ్ళూనకుండా ఉండేలా ఈ రాష్ట్రంలో పాలన సాగాలి. స్వాతంత్ర్యం కావాలని కాంగ్రెస్ ఈ ఉద్యమాన్ని ప్రారంభించింది. అయితే స్వాతంత్ర్యం ఇప్పటికే ప్రజాప్రతినిధులకు లభించిందని బాధ్యతాయుతమైన మంత్రులంగా మనం ప్రత్యేకంగా ప్రజలకు చెప్పగలగాలి. అత్యవసర కాలంలో కొన్ని రంగాలలో అది (స్వాతంత్ర్యం) పరిమితమైనది కావచ్చు. బ్రిటన్ కోసం కాకపోయినా, బ్రిటన్‌కు లాభదాయకం కలిగించటం కోసం కాకపోయినా.. ఈ రాష్ట్ర రక్షణ కోసం, స్వాతంత్ర్యం కోసం భారతీయులు బ్రిటన్‌ను విశ్వసించాలి. గవర్నరుగా మీరు, ఈ రాష్ట్రానికి నామ మాత్రపు అధికారిగా ఉంటూ, పూర్తిగా మీ మంత్రుల సలహాల మీద ఆధారపడి పనిచేయాలి"

హిందూ మహాసభ అధ్యక్షుడైన సావర్కార్ మంత్రులు తమ పదవులకు రాజీనామాలు చేయవలసిన అవసరం లేదని ఆదేశించారు. హిందూ మహాసభ సభ్యులెవ్వరూ పదవులకు రాజీనామా చేయకూడదని, క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించాలని 31 ఆగస్టు, 1942న హిందూ మహాసభ తీర్మానించింది. (గోవింద్ సహాయ్ రాసిన ద జెనిసిస్ ఆఫ్ ఆర్ఎస్ఎస్ అనే పుస్తకం నుంచి)

క్షమాభిక్ష ప్రసాదించవలసిందిగా బ్రిటిష్ ప్రభుత్వాన్ని వేడుకుంటూ సావర్కర్ 14-11-1913 నాడు రాసిన ఉత్తరంలో నుండి కొన్ని భాగాలు.

గౌరవనీయులైన అయ్యా!

నాకు క్షమాభిక్ష ప్రసాదించమని 1911లో మీకు నేను పంపిన విజ్ఞప్తిని మంచి మనస్సుతో పరిశీలించాలని, దాన్ని భారత ప్రభుత్వానికి పంపించడానికి అనుమతి ఇవ్వాలని కోరినట్లు మీకు గుర్తుండే ఉంటుంది. భారత రాజకీయాలలో ఈ మధ్య కాలంలో వచ్చిన మార్పులు, ప్రభుత్వం అనుసరిస్తున్న రాజీ ధోరణి కారణంగా రాజ్యాంగ బద్ధ పంథాకు మరోసారి తలుపులు తెరుచుకున్నాయి. 1906-1907 కాలంలో భారతదేశంలో నెలకొని ఉన్న నిరాశాజనక స్థితి మమ్మల్ని ఉద్రేకపరచి శాంతి, అభివృద్ధి మార్గాల నుండి దారి మరల్చింది. అయితే ప్రస్తుతం భారతదేశ శ్రేయస్సు దృష్ట్యా మానవత ఉన్న ఏ వ్యక్తి అయినా అలాంటి ముళ్ళ బాటపై గుడ్డిగా అడుగు వేయడు. అందుచేత ప్రభుత్వం తన విశేషమైన దయా దాక్షిణ్యాలతో నన్ను విడుదల చేస్తే, నేను రాజ్యాంగబద్ధ అభివృద్ధికి కృషి చేస్తాను. ఆ అభివృద్ధికి ముందస్తు షరతు అయిన బ్రిటిష్ ప్రభుత్వ విధేయతతో ఉంటాను. నీటి కన్నా రక్తం సాంద్రమైంది. మేం అందరం జైళ్ళలో ఉన్నంత కాలం ఘనత వహించిన చక్రవర్తి గారికి విధేయులైన వందల, వేల భారత ప్రజల కుటుంబాలలో నిజమైన సుఖ సంతోషాలు ఉండవు. మమ్మల్ని గనుక విడుదల చేస్తే ప్రజలు తమంతట తాముగా సహజంగానే సంతోషాన్ని వ్యక్తీకరిస్తారు. తీవ్రంగా శిక్షించటం, ప్రతీకారం తీర్చుకోవటం కంటే క్షమించటం, తప్పుల్ని సవరించటం ఎలానో తెలిసిన ప్రభుత్వం పట్ల వాళ్ళు కృతజ్ఞులై ఉంటారు. అంతేకాదు, నేను రాజ్యాంగబద్ధ పంథాలోకి మారిపోతే భారతదేశంలోనూ, విదేశాలలోనూ ఒకప్పుడు నన్ను తమ మార్గదర్శిగా ఎంచుకున్న యువకులందరూ రాజ్యాంగ పంథాలోకి మారతారు. నాలో కలిగిన మార్పు అంతరాత్మ సాక్షిగా జరిగిన మార్పు! భవిష్యత్తులో నా నడవడిక ఇలానే ఉంటుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం ఏ రూపంలో సేవ చేయమంటే, ఆ రూపంలో సేవ చేయటానికి నేను సిద్ధంగా ఉన్నాను. నన్ను జైల్లోనే ఉంచితే, ఇంతకంటే ప్రభుత్వానికి మంచి ఏమీ జరగదు. శక్తివంతులు మాత్రమే దయా స్వభావాన్ని కలిగి ఉంటారు. అందుచేత తండ్రి వంటి ప్రభుత్వం వైపుకి తిరిగిరాక దారి తప్పిన ఈ కుమారుడు ఎక్కడికి పోగలడు?

గౌరవనీయులైన మీరు ఈ అంశాలన్నింటినీ దయతో ఆలోచిస్తారని ఆశిస్తున్నాను. (ఇది ఆర్‌సీ మజుందార్ రాసిన పీనల్ సెటిల్‌మెంట్ ఇన్ అండమాన్ అనే పుస్తకంలో 211'213 పేజీల నుంచి)

వీర సావర్కర్.. వీరత్వం అర్ధ సత్యమే!

రాం పునియా
తెలుగు: సీఎస్ఆర్ ప్రసాద్

(పార్లమెంటులో సావర్కర్ చిత్రపట ఆవిష్కరణ సందర్భంగా రాసిన వ్యాసమిది. మణిశంకర్ అయ్యర్, సంఘ్‌పరివార్‌ల మధ్య ఈ మధ్య ప్రారంభమైన వివాదం సందర్భంగా, ఈ వ్యాసాన్ని పునర్ముద్రించారు. అంతర్జాలంలోని పబ్ రంగ్ అనే పత్రిక నుంచి)

బ్రిటిష్ పాలకులకు క్షమాపణ చెప్పటం కంటే, ఉరిశిక్షనే కోరుకున్న భగత్‌సింగ్‌ను, క్షమాపణ చెప్పి విడుదల అయిన సావర్కర్‌తో పోలుస్తూ వచ్చిన ట్విటర్ కారణంగా దీన్ని మళ్ళీ ప్రచారంలో పెడుతున్నాం. తాను దేశ స్వాతంత్ర్యం కోసం పని చేయటానికి వీలుగా విడుదల కోరుకున్నాడని సావర్కార్ అనుచరుల కొంతమంది అంటున్నారు. అయితే, అండమాన్ జైలు నుండి విడుదల అయిన తరువాత, ఆయన ఎప్పుడూ బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమంలో భాగస్వామి కాలేదు.

సావర్కర్‌పై తీసిన సినిమా త్వరలో విడుదలవుతోంది. విడుదలకు పూర్వమే అది ఎంతో ఉత్సుకతను రేకెత్తించింది. హిందూత్వ భావజాల ఆది పురుషుణ్ణి శ్లాఘిస్తూ వచ్చిన మొదటి అతి పెద్ద ప్రయత్నం అది. ఆయన్ను ధైర్యశాలియైన స్వాతంత్ర్య యోధుడుగా ప్రచారం చేసి ఒక పవిత్ర పురుషుడుగా ఇప్పటికే ప్రజల్లో చిత్రీకరించారు. అందువల్ల సావర్కర్‌పై ఉద్రేకంతో సంబంధం లేకుండా, నిష్పక్షపాతంగా చర్చ జరపటం సాధ్యం కాదని అందరికీ తెలుసు. ఆయన పేరు ముందు "స్వాతంత్ర్య వీరుడు" అనే బిరుదు కూడా తగిలించబడుతోంది. ఇది అర్ధసత్యం మాత్రమే.

ఈ బ్రిటిష్ వ్యతిరేక విప్లవకారుడు హిందూత్వ సిద్ధాంతకర్తగా పరిణమించటాన్ని అర్థం చేసుకోవాలంటే, ఆయన జీవితం సాగిన తీరును పరిశీలించాలి. అండమాన్‌లో నిర్బంధంలో ఉండగా, సావర్కర్ జీవితం పెద్ద పరిణామానికి గురయ్యింది. జైలు జీవితానంతరం ఆయన మారిన మనిషి అయ్యాడు. అండమాన్ ద్వీపానికి ప్రవాసిగా పంపబడటానికి ముందు ఆయన నిబద్ధుడైన బ్రిటిష్ వ్యతిరేక విప్లవకారుడు. కాని ఆ తరువాత బ్రిటిష్ వ్యతిరేక అంశ కలిగిన ఎలాంటి చర్యతో గాని, సంస్థతో గాని ఆయనకు సంబంధం లేదు. న్యాయశాస్త్రం చదవటానికి ఆయన లండన్ వెళ్ళాడు. అయితే, ఆయన అనుసరించిన బ్రిటిష్ వ్యతిరేక వైఖరి కారణంగా బారిష్టర్ కోర్సు చదవటానికి అనుమతి లభించలేదు. సావర్కర్ ఇంగ్లండ్‌లో భారతదేశంలో బ్రిటిష్ పాలనను కూలదోయటానికి నిబద్ధమైన "ఫ్రీ ఇండియన్ సొసైటీ" అనే సంస్థను స్థాపించాడు. తాను రాజకీయాలలో పాల్గొనబోనని ప్రమాణం చేయమన్న బ్రిటిష్ ప్రతిపాదనను ఆయన తిరస్కరించాడు. ప్యారిస్‌లోని ఒక రష్యన్ విప్లవకారుడి ద్వారా అతడి బృందం బాంబుల తయారీని నేర్చుకున్నది. ఆ బృందంలోని ఒక సభ్యుడు, లండన్‌లోని ఇండియా ఆఫీస్‌కు చెందిన ఒక ఉన్నతాధికారిని హత్య చేసాడు. అతనికి మరణశిక్ష విధించారు. ఈ ఘటనలో జోక్యం చేసినందుకు, భారతీయ న్యాయస్థానాల్లో ఆయన మీద కేసులున్నందుకు సావర్కర్‌ను అరెస్టు చేసి, యావజ్జీవిత కారాగారవాస శిక్ష విధించారు. ఆయన్ను ఇంగ్లండ్ నుండి బలవంతంగా ఇండియాకు పంపారు. అతడు ప్రయాణిస్తున్న ఓడ మార్సెయిల్స్‌లో ఆగినప్పుడు ఆయన సముద్రంలోకి దూకి, తీరం చేరి ఫ్రెంచి భూభాగం మీద ఆశ్రయం కోరాడు. ఆయన్ను తిరిగి నిర్బంధించి, యావజ్జీవ శిక్ష అనుభవించటానికి అండమాన్‌కు పంపారు.

అండమాన్ జైళ్ళలో పరిస్థితులు చాలా బాధాకరంగా ఉన్నాయి. ఆయన్ను తీవ్రంగా హింసించారు. జైలు జీవితంలోని దుర్భరత్వం ఆయన చైతన్యాన్ని నిర్వీర్యం చేసింది. ఆయన్ను బేషరతుగా విడుదల చేయాలని 1920లో భారత జాతీయ కాంగ్రెస్ కోరింది. కాని సావర్కర్ క్షమాపణ పత్రం రాసి ఇచ్చి, జైలు నుండి విడుదల కావాలని కోరుకున్నాడు. అందుకు గల కారణాలేమిటో ఆయనకు మాత్రమే తెలుసు. ఆ క్షమాపణ పత్రంలో ఇలా ఉంది. "నా మీద విచారణ సక్రమంగానే జరిగిందని, నాకు విధించిన శిక్ష న్యాయమైనదేనని నేను అంగీకరిస్తున్నాను. గతంలో నేను అనుసరించిన హింసా పద్ధతులను మనస్ఫూర్తిగా ద్వేషిస్తున్నాను. బ్రిటిష్ రాజ్యాంగాన్నీ, చట్టాన్నీ, నాకు సాధ్యమైనంత మేరకు గౌరవించటం నా బాధ్యతగా నేను గుర్తిస్తున్నాను. భవిష్యత్తులో నాకు అవకాశం ఇచ్చినంత మేరకు, "సంస్కరణలను విజయవంతం చేయటానికి నేను ఇష్టపడుతున్నాను" (సావర్కర్ బ్రిటిష్ అధికారులకు రాసిన లేఖ నుండి ఫ్రంట్‌లైన్ ఏప్రిల్ 7, 1995 పేజి 94) ఇందులో ఆయన ప్రస్తావించిన సంస్కరణలు 1919 మాంటెగు చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు. అవి జాతీయోద్యమ డిమాండ్లను సంతృప్తి పరచలేకపోయాయి.

ఇందుకు ప్రతిగా బ్రిటిష్ ప్రభుత్వం ఆయన్ను విడుదల చేస్తూ ఆయన బాంబే రాష్ట్రంలోని రత్నగిరి జిల్లాలోనే నివసించాలని, జిల్లా దాటి వెళ్ళాలంటే ప్రభుత్వం అనుమతి తీసుకోవాలని షరతు విధించింది. అంతేకాదు, ప్రభుత్వ ఆమోదం లేకుండా ఆయన ఎలాంటి రాజకీయ కార్యక్రమాల్లోనూ పాల్గొనకూడదు. 1937లో కాంగ్రెస్ మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేసేంతవరకు ఈ షరతులు కొనసాగాయి. తదనంతరం ఆయన హిందూమహాసభ అధ్యక్ష పదవి చేపట్టారు. ఆయన ఈ లొంగుబాటు అంశాన్ని హిందుత్వ శక్తులు పూర్తిగా దాచిపెట్టి, ఆయనకు "వీర సావర్కర్" అనే విశేషణాన్ని తగిలిస్తున్నాయి.

బ్రిటిష్ ప్రభుత్వం ఆయన్ను ఎందుకు విడుదల చేసింది? విడుదల తర్వాత, ఆయన రాజకీయ పంథా ఎందుకు పూర్తిగా మారిపోయింది? హిందూ రాష్ట్ర సిద్ధాంత కిరీటాన్ని ఆయన ఎందుకు ధరించాడు? ఆ తర్వాత ఆయన ఎన్నడూ బ్రిటిష్ వ్యతిరేక ఆందోళనను చేపట్టలేదు. క్విట్ ఇండియా ఉద్యమం లాంటి పెద్ద ఉద్యమాలలో ఆయన ఎందుకు చేరలేదు? ఎందుకు సమర్థించలేదు? జాతీయోద్యమంలో భాగస్వామి కావటానికి బదులు బ్రిటిష్ సైన్యంలోకి భారతీయుల్ని రిక్రూట్ చేసి, బ్రిటన్‌కు సహాయపడాలని ఎందుకు నిర్ణయించుకున్నాడు? ఎవరు ఎలాంటి నిర్ధారణలకైనా రావచ్చును. కాని, బ్రిటిష్ పాలకులతో ఆయన చేసుకున్న రాజీ కారణంగా అప్పటి నుండి ఆయన రాజకీయాల స్వరూపమే మారిపోయింది.

ఆయన హిందూ మహాసభకు తిరుగులేని నాయకుడుగా రూపొందాడు. 1937 తర్వాత అనేకానేక సందర్భాలలో ఆయన రాజకీయ అభిప్రాయాలు గాంధీ నాయకత్వంలోని జాతీయోద్యమంతో పూర్తిగా విభేదించాయి. కాంగ్రెస్‌కు ఎలాంటి మద్దతు ఇవ్వకపోవటమనేది ఆయన అనుసరించిన ప్రాథమిక సూత్రం. 1942 క్విట్ ఇండియా ఉద్యమం దీనికి గొప్ప ఉదాహరణ. ఆ సందర్భంగా గాంధీ ప్రభుత్వోద్యోగాలు వదిలిపెట్టమని ప్రజలకు పిలుపునిచ్చాడు. అందుకు భిన్నంగా సావర్కర్ ఇలాంటి ఆదేశం జారీ చేసాడు- "ప్రభుత్వోద్యోగాల్లో కీలకమైన పదవులలో ఉన్న హిందూ సంఘటన సంబంధిత వ్యక్తులు, ఆ పదవులను అంటిపెట్టుకుని తమ విధులను నిర్వర్తిస్తూ ఉండాలని నేను ఆదేశిస్తున్నాను" (డిసెంబరు 1, 1995 ఫ్రంట్‌లైన్ వ్యాసంలో ఎ.జి.నూరాని) ఇంతేగాక, హిందూ మహాసభ కార్యనిర్వాహక వర్గం, తన కార్యకర్తలందరూ తమ ఉద్యోగాల్లో కొనసాగాలని కోరుతూ, 31 ఆగష్టు, 1942 న తీర్మానించింది.

బ్రాహ్మణవాద హిందుత్వను, జాతీయవాదాన్ని మిళితం చేసిన "గౌరవం" సావర్కర్‌కు దక్కుతుంది. ఆయన తొలి హిందుత్వ సిద్ధాంతకర్త. సావర్కర్ తొలినాళ్ళలో చేసిన బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాలు కొనియాడదగినవే! అయితే హిందుత్వ ప్రచారక బాధ్యతలను స్వీకరించిన తర్వాత ఆయన తన శక్తియుక్తులన్నింటినీ ద్వేషపూరిత రాజకీయాలను బలోపేతం చేయటానికీ, మతతత్వ హిందూ మహాసభను రూపొందించటానికీ, ఆర్.ఎస్.ఎస్.కు సహాయపడటానికి వినియోగించాడు. సావర్కర్ రచన "హిందుత్వ... ఎవరు హిందువు?" (1923) ఆయన రాజకీయ దృక్పథాన్ని నిర్వచించే ప్రాథమిక గ్రంథం. అదే కాలంలో ముస్లిం మతవాదం కూడా తలెత్తిన తర్వాత ముస్లిం బూచిని చూపించి హిందువులను సంఘటితపరచటం ప్రారంభమైంది. "అవతలి వాళ్ళ నుండి ప్రమాదం" అనే పునాది మీద ఆధారపడి ఈ జాతీయవాదం సంఘటితమైంది. అయితే "అవతలి వాళ్ళు" అంటే దేశాన్ని పరిపాలిస్తున్న బ్రిటిష్ సామ్రాజ్యవాదులు కాదు. అవతలి వాళ్ళు అంటే "మహమ్మదీయులు".

బ్రిటిష్ ప్రభుత్వం విడుదల చేసిన తర్వాత సావర్కర్ బ్రిటిష్ వ్యతిరేక పోరాటాలు, కార్యకలాపాలు ఆగిపోయాయనీ, అప్పటినుండీ ఆయన కార్యకలాపాలన్నీ ముస్లిం వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడ్డాయని మనం గుర్తించాలి. సావర్కార్ ఇలా వాదించారు. (తర్వాత కాలంలో హిందుత్వ సంస్థలన్నింటికీ ఇదే సైద్ధాంతిక ప్రాతిపదిక అయ్యింది) "చరిత్ర తొలిరేకలు విచ్చుకుంటున్నప్పుడు భారతదేశంలో నివసిస్తున్న ఆర్యులు అప్పటికే ఒక జాతిని రూపొందించారు. అదే ఇప్పుడు హిందువులలో మూర్తీభవించి ఉంది. ఉమ్మడి పితృభూమి పట్ల ఉన్న ప్రేమపాశం తమ రక్తనాళాల్లో, హృదయంలో ప్రవహిస్తోన్న ఒకే రకమైన రక్తం, మన మధ్య ఉండే వెచ్చని ప్రేమ ద్వారా మాత్రమే కాక మన గొప్ప నాగరికత, హిందూ సంస్కృతుల పట్ల మనకుండే ఉమ్మడి బంధం కారణంగా కూడా హిందువులం కలిసిమెలసి ఉండక తప్పదు" (హిందుత్వ-పేజి 108). ఆయన అభిప్రాయంలో హిందుత్వ మూడు స్తంభాలపై ఆధారపడి ఉంది. అవి భౌగోళిక ఐక్యత, జాతి లక్షణాలు, ఉమ్మడి సంస్కృతి. హిందువు అంటే ఎవరు? అనేదాన్ని నిర్ధారించటానికి అవసరమయ్యే లక్షణాలను కూడా ఆయన వివరించాడు.

ఈ భూమిని తమ పితృభూమిగా, పవిత్ర భూమిగా ఎవరైతే భావిస్తారో వారే హిందువులనీ, వారికే ఈ భూమి చెందుతుందని ఆయన అభిప్రాయం. జెరూసలేం, మక్కాలు తమ పవిత్ర స్థలాలుగా ఉన్న క్రైస్తవులు, మహమ్మదీయులు ఈ దేశ "యజమానులు" అయిన హిందువులతో సమానులు కారని దీని అర్థం. ముస్లింల దేశభక్తి సందేహాస్పదం అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ సావర్కర్ ఇలా అన్నారు. "సంస్కృతితో పాటు కొన్ని సందర్భాలలో ఉమ్మడి పవిత్రభూమి, మాతృభూమి అనే భావన బలమైన ఐక్యతను సిద్ధింపచేస్తుంది. మహమ్మదీయులను చూడండి! వాళ్ళకు ఢిల్లీ కంటే, ఆగ్రా కంటే 'మక్కా' యే ఒక కఠిన వాస్తవం"

సావర్కర్ రాజకీయాలు గాంధీ రాజకీయాలతో సరిపడనివి. భారత జాతీయ ప్రతినిధి అయిన గాంధీని ముస్లింలను సంతృప్తి పరచేవాడనీ, రాజీ పడేవాడని సావర్కర్ చిత్రించాడు. బ్రిటిష్ వాళ్ళు దేశం వదిలిపెట్టి వెళ్ళిన తర్వాత ఆధిపత్యం కోసం పోరాటం ప్రారంభమవుతుందనీ, క్రైస్తవులూ, ముస్లింలు నిజమైన శత్రువులనీ "హిందుత్వ" మాత్రమే వాళ్ళను ఓడించగలుగుతుందని సావర్కర్ ప్రతిపాదించాడు. ఇది హిందువులకు చెందిన భూమి అనీ, మక్కాను పవిత్ర భూమిగా ఎంచే ముస్లింలకు, జెరూసలెంను పవిత్రభూమిగా ఎంచే క్రైస్తవులకు హిందువులతో సమాన హోదా ఉండకూడదని ఆయన అభిప్రాయం.

గాంధీ హంతకుడైన గాడ్సే.. సావర్కర్‌కు విశ్వాసపాత్రుడైన అనుచరుడనేది మనం గుర్తుంచుకోవాలి. గాంధీ హత్య కేసులో సావర్కర్ కూడా సహ ముద్దాయి. అయితే గాడ్సే ఈ హత్య బాధ్యతనంతటినీ పూర్తిగా తనపై వేసుకోవటంతో సావర్కర్ శిక్ష నుండి తప్పించుకున్నాడు. సావర్కర్‌పై సినిమా తీస్తూ, ఆయన్ను గొప్పనాయకుడిగా చిత్రీకరిస్తున్న ఈ తరుణంలో తన జీవితంలోని రెండో భాగంలో ఆయన పాత్రను అందరూ అంచనా వేయాలి. మన గతాన్ని నిజాయితీగా అంచనా వేసుకున్నప్పుడే జాతీయతా వాదానికి ఉన్న వివిధ దృక్కోణాలు వాటి రాజకీయ వైఖరులూ స్పష్టమవుతాయి. వినాయక దామోదర్ సావర్కర్ పట్ల గుడ్డి విధేయతను ఉన్మాదంలా రెచ్చగొడుతున్న ప్రస్తుత తరుణం.. ఆయన జీవితపు రెండో పార్శ్వంలో మారిన ఆయన పాత్రను వస్తుగతంగా అంచనా వేయటానికి అడ్డంకి కాకూడదు.

రాజ్యహింసకూ, విస్థాపనకూ వ్యతిరేకంగా మార్చి 8 జరుపుకున్న దండకారణ్య మహిళలు

వి. శృతీ సాగర్

ఏటా జరుపుకున్నట్టే ఈ ఏడూ దండకారణ్య పోరు మహిళలు మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని స్ఫూర్తివంతంగా జరుపుకున్నారు. ఈసారి ఈ పోరాట దినాన్ని రాజ్యహింసకూ, విస్థాపనకు వ్యతిరేకంగా జరుపుకోవాలని, క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘం (కె.ఎ.ఎం.ఎస్) ఇచ్చిన పిలుపును మహిళలు విజయవంతం చేసారు. ఈ సందర్భంగా దండకారణ్య వ్యాప్తంగా పెచ్చరిల్లుతున్న రాజ్యహింస గురించి, విస్థాపన గురించి, ఈ రెండూ మహిళల జీవితాపై వేస్తున్న ప్రభావం గురించి, ఈ పరిస్థితికి వ్యతిరేకంగా మహిళలు తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేయాల్సిన ఆవశ్యకత గురించి మార్చి 8 నుండి 14 వరకూ గ్రామ గ్రామాన సభలూ, సమావేశాలు ఊరేగింపుల ద్వారా, కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేసారు. తీవ్ర నిర్బంధం మధ్యనే, నిర్బంధాన్ని ప్రతిఘటిస్తూనే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసారని విడిగా చెప్పుకోనవసరం లేదు.

ఏ దేశంలోనైనా, ఏ ప్రాంతంలోనైనా మహిళలపై హింస అనేది పాలకవర్గాల ఉద్యమ అణచివేత చర్యల్లో విడదీయరాని భాగంగా ఉంటుంది. అ హింస ప్రత్యక్షంగా ఉద్యమాల్లో పాల్గొనే మహిళలపైనా, ఉద్యమాలకు సహకరించే మహిళలపైనా అమలవుతుంది. ఉద్యమాలలో ప్రత్యక్ష, పరోక్ష భాగస్వామ్యం లేనప్పటికీ ఉద్యమాల్లో పాల్గొంటున్న, సహకరిస్తున్న పురుషులకు సంబంధించిన మహిళల పైనా అమలవుతుంది. ఇదేమీ కాకపోయినా కేవలం ఉద్యమ ప్రాంతాల్లో నివసిస్తున్న మహిళలపై కూడా అమలవుతుంది. సుదీర్ఘ కాలంగా విప్లవోద్యమం కొనసాగుతున్న దండకారణ్యంలో మహిళలపై రాజ్యహింస రోజు రోజుకూ పెచ్చరిల్లుతున్నది. గత కొన్నేళ్ళుగా ఇక్కడి మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఇదే. అందుకే గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడి మహిళలు మార్చి 8ని రాజ్యహింసకు వ్యతిరేకంగా జరుపుకుంటూ తమ గొంతుకను బయటి ప్రపంచానికి వినిపించే ప్రయత్నం చేస్తున్నారు. ఈసారి రాజ్యహింసకు తోడు తమ అస్తిత్వానికే పెను ముప్పుగా ముంచుకొస్తున్న నిర్వాసిత సమస్యను కూడా జోడించారు. ఇప్పుడిక్కడ ఈ రెండు సమస్యలూ పెనవేసుకుపోయాయి. రాజ్యహింస ఇప్పుడు విస్థాపన కోసమే జరుగుతున్నదని చెప్పుకోవచ్చు.

దండకారణ్యం వనరుల నిలయం. ఈ వనరులను దోచుకోవడానికీ, కాపాడుకోవడానికీ మధ్య జరుగుతున్న పెనుగులాటే ఇప్పుడు యుద్ధం రూపు దాల్చింది. ఒక్క బైలదిల్లా ఉదాహరణ ద్వారా ఇక్కడ కొనసాగుతున్న వనరుల దోపిడీ ఆదివాసుల బతుకులను ఎంత ఆగం చేస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడి బైలదిల్లా కొండల్లో మూడు వేల మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం ఉంది. 1968 నుండి ఒక్కడ ఖనిజం తవ్వకం ప్రారంభమైంది. దీని కోసం 22 ఆదివాసీ గ్రామాల్లోని 22 వేల మంది ఆదివాసులు నిర్వాసితులై, చెట్టుకొకరూ, పుట్టకొకరూ అయ్యారు. నష్ట పరిహారం, ఉద్యోగాలు ఇస్తామన్న హామీలు నీటిమూటలై పోగా పొట్ట చేత పట్టుకొని కొంతమంది మారుమూల అడవుల్లోకి తరలిపోయారు. మరి కొంత మంది నగరాలలో రోజు కూలీలుగానో, హోటళ్ళలో గిన్నెలు కడుగుతూనో, ఎంగిళ్ళు తుడుస్తూనో, రిక్షా లాగుతూనో, భిక్షమెత్తుకుంటూనో బతుకు వెళ్ళదీస్తున్నారు. కాగా పలువురు మహిళలు వేశ్యావృత్తిలోకి నెట్టబడ్డారు. ఈ విషాదం గురించి 'బైలదిల్లా కొండల్లో దగాపడ్డ చెల్లెళ్ళు' అనే పుస్తకంలో బి.డి. శర్మ వివరించే ఉన్నారు.

నేడు ఎన్ఎండిసిలోని తొమ్మిదివేల మంది ఉద్యోగులలో 127 మంది మాత్రమే బస్తర్‌వాసులు. తట్టలు మోయడం వంటి అధిక శ్రమ తక్కువ కూలీ కలిగిన పనులే ఇక్కడి స్థానిక ఆదివాసులు కొందరికి దక్కాయి. అది కూడా కాంట్రాక్టు పద్ధతిలోనే. ఈ పనులను పర్మనెంట్ చేయాలని కాంట్రాక్టు కూలీలు 1978లో ఉద్యమిస్తే కాల్పులు జరిపి దాదాపు పాతిక మంది కూలీలను పొట్టనపెట్టుకున్నారు.

ఈ ఇనుప ఖనిజం రవాణా చేయడం కోసం వేసిన బైలదిల్లా-జగదల్‌పూర్-విశాఖపట్టణం రైలు మార్గం కొన్ని భూములను మింగివేసింది. ఈ మధ్య దీన్ని విస్తరించడానికి మరిన్ని భూములను గుంజుకున్నారు. బైలదిల్లా గని తవ్వకాల వల్ల బస్తర్ ప్రాంతంలోని నదులన్నీ కలుషితమైపోతున్నాయి. నీళ్ళన్నీ ఎర్రబారిపోయాయి. ఇవి మనుషులు తాగడానికి కాదు కదా ఇతర అవసరాలకు కూడా

> **జాతీయపతాకం పై ఆర్.ఎస్.ఎస్. వైఖరి**
>
> మూడు రంగుల జెండాను జాతీయ పతాకంగా ఎంపిక చేసినప్పటి నుండి ఆర్.ఎస్.ఎస్. తన వ్యతిరేకతను తన పత్రికల ద్వారా తెలియజేస్తూనే ఉంది. కాషాయ జెండా జాతీయ పతాకం కావాలని వాళ్ళ ఆలోచన. 'ఆర్గనైజర్' పత్రిక 14 ఆగస్టు, 1947 న రాసిన సంపాదకీయంలో ఇలా ఉంది. "అదృష్టం తంతే అధికారంలోకి వచ్చిన వ్యక్తులు మన చేతికి మూడు రంగుల జెండాను ఇవ్వవచ్చు. కాని హిందువులెవ్వరూ దానిని ఎన్నటికీ తమదిగా భావించరు, గౌరవించరు. మూడు అనే సంఖ్యే చెడ్డది. మూడు రంగులు కలిగిన జెండా ఖచ్చితంగా మానసిక ప్రభావాన్ని కలిగిస్తుంది. అది దేశానికి నష్టదాయకమైనది". (గోవింద్ సహాయ్ రాసిన ద జెనిసిస్ ఆఫ్ ఆర్ఎస్ఎస్ అనే పుస్తకం నుంచి)

పనికి రాకుండా పోయాయి. పంటలు నాశనం అవుతున్నాయి. మనుషులే కాదు, పశువులు సైతం రోగాల బారిన పడుతున్నాయి. పర్యావరణం దెబ్బతింటున్నది. ఇక బైలదిల్లా కొండల నుండి సంవత్సరానికి 80 లక్షల టన్నుల ఇనుప రజను విశాఖపట్టణానికి పైప్‌లైన్ ద్వారా ఎస్సార్ తీసుకుపోతున్నది. దీనికి ఇక్కడి నదుల్లోని నీటిని వినియోగిస్తున్నారు. దీని వల్ల ఇక్కడి నదులు ఎండిపోతుండగా ఇనుప రజను తోసుకుంటూ వెళ్ళిన నీళ్ళు వృథాగా బంగాళాఖాతంలో కలిసిపోతున్నాయి.

ఇక్కడి ప్రజల్ని నిర్వాసితులను చేసి, వాళ్ళ జీవితాలను అస్తవ్యస్తం చేసి, కాలుష్యంతో ఇక్కడి జీవ వైవిధ్యాన్ని నాశనం చేసి, ఇక్కడి నదులను ఎండబెట్టి తవ్వుతున్న ఖనిజం ఎవరి ప్రయోజనాల కోసం? మన దేశంలోని పరిశ్రమల కోసం కానే కాదు. జపాన్, కొరియా, చైనాల్లోని బహుళజాతి కంపెనీలకు ఈ ఖనిజం ఎగుమతి అవుతుంది. పోనీ మన దేశానికి లాభమైనా వస్తుందా? అంతర్జాతీయ మార్కెట్లో ఇనుప ఖనిజం ధర టన్నుకు పదివేల రూపాయలు ఉంటే జపాన్‌కు టన్నుకు 160 రూపాయల చొప్పున అమ్ముతున్నారు. దీని మీద మన దేశ ప్రభుత్వానికి టన్నుకు 50 రూపాయలు కూడా రావడం లేదు. కాగా ఇంత విస్తారమైన ఇనుప ఖనిజాన్ని తన గర్భంలో దాచుకున్న ఛత్తీస్‌గఢ్‌లో మాత్రం 150కి పైగా స్పంజ్ ఐరన్ పరిశ్రమలు ఇనుప ఖనిజం కొరతతో మూతబడ్డాయి. వీటికి ఏటా 12 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం అవసరం కాగా, ఎన్ఎండిసి కేవలం మూడు మిలియన్ టన్నులు మాత్రమే ఇస్తున్నది. బైలదిల్లాలో ఉత్పత్తి అయ్యే ఖనిజంలో పది శాతం ఇవ్వాలని ఈ పరిశ్రమల యాజమాన్యం చేస్తున్న విన్నపాలను ఎన్ఎండిసి పెడచెవిన పెడుతున్నది. అంటే ఎవరి ప్రయోజనాల కోసం ఎవర్ని బలిపెడుతున్నారో విడమర్చి చెప్పాల్సిన అవసరం లేదు.

ఈ గనుల తవ్వకం ఇంత వినాశం సృష్టిస్తుండగా వీటిని విస్తరించాలని చూస్తున్నారు. దీన్ని ఇక్కడి ప్రజాపోరాటం అడ్డుకుంటున్నది. ఈ గనుల మూలంగా కలుషితమైన ఎర్రనీళ్ళకు వ్యతిరేకంగా ఇక్కడి ప్రజలు నిరంతరాయంగా పోరాడుతున్నారు. ఈ పోరాటాల్లో మహిళలు ముందుంటున్నారు.

ఇక దండకారణ్యం వాస్తవంగా అంటే ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నందగావ్ సహా బస్తర్ ప్రాంతంలోని ఏడు జిల్లాల్లో మహారాష్ట్రలోని గడ్‌చిరోలిలో ఎన్నో చిన్నా పెద్దా మైనింగ్ ప్రాజెక్టులు. బడా డ్యాములు. బడా పరిశ్రమల కోసం ఒప్పందాలు జరిగాయి. 'అబూజ్‌మాడ్' నడి మధ్యన మూడో వంతు భూభాగంలో సైనిక శిక్షణా కేంద్రం నిర్మించ తలపెట్టారు. ఇవన్నీ ఆచరణ రూపం దాల్చితే పెద్ద ఎత్తున ప్రజలు నిర్వాసితులవుతారు. ఇక్కడి ఎన్నో ప్రాచీన జాతుల సంస్కృతి మాట అటుంచి, వాటి అస్తిత్వమే కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. మరెన్నో అరుదైన జీవ, వృక్ష జాతులు, అమూల్యమైన ఔషధ సంపద నామరూపాలు లేకుండా పోయే అవకాశం ఉంది. ఇక పర్యావరణం మాటే చెప్పక్కర్లేదు. తాగే నీటినీ, చల్లటి గాలినీ సైతం కొనుక్కుంటున్న మానవాళికి ఇప్పటి దాకా ప్రాణ వాయువును కొనుక్కునే దుస్థితి దాపురించలేదంటే ఈ అడవులూ, వాటిని కాపాడుతున్న ఆదివాసులే కారణం. సమాజ అవసరాలకు మించి ప్రకృతిని విచ్చలవిడిగా ధ్వంసం చేసి, సరుకులను సృష్టించి లాభాలు చేసుకుంటున్న ఈ దోపిడీదారులు, ప్రకృతిని సృష్టించలేం అనే విచక్షణా జ్ఞానాన్ని విస్మరిస్తున్నారు.

అయితే ఈ విధ్వంసాన్ని అడ్డుకోవడానికి విప్లవోద్యమ నాయకత్వంలో ఇక్కడి ప్రజలు పోరాడుతున్నారు. ప్రజల పోరాటం మూలంగా కొన్ని ప్రాజెక్టులు ప్రారంభమే కాకపోగా, కొన్ని మొదలయ్యి, ఆగిపోయాయి. కొన్ని నత్త నడక నడుస్తున్నాయి. ఈ పోరాటాల్లో మహిళలు చురుకైన పాత్ర పోషిస్తున్నారు. కొన్ని పోరాటాల్లో మహిళలే కీలకపాత్ర వహిస్తున్నారు. సాయుధ బలగాలపై ఆధారపడి బోధ్‌ఘాట్ ప్రాజెక్టు నిర్మించాలనే తలంపుతో ఆ ప్రాంతంలోని కుదురు, హర్రాకోడేర్ గ్రామాలలో పోలీసు క్యాంపులు వేయడానికి చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవడంలో మహిళల పాత్ర కీలకమైనది. నిర్వాసిత సమస్య ప్రజలందరికీ సంబంధించినదే అయినా మహిళలపై దాని ప్రభావం అధికంగా ఉంటుంది. వ్యవసాయం చాలా ప్రాథమికంగా ఉన్న అటవీ ప్రాంతాల్లో జీవిక కోసం అడవి మీదే ఆధారపడుతారు. చెట్టు చెట్టూ తిరిగి అటవీ ఉత్పత్తులను సేకరించడంలో మహిళలదే ప్రధాన పాత్ర. విస్థాపన వల్ల జీవనోపాధిని కోల్పోయి మహిళల మీద కుటుంబ పోషణాభారం మరింత పెరుగుతుంది. గత్యంతరం లేక వలస కూలీలుగా వెళ్తున్నవారు అత్యాచారాల బారిన పడుతున్నారు. వేశ్యా వృత్తిలోకి సైతం నెట్టబడుతున్నరు. ఈ కారణాల రీత్యా మహిళలు నిర్వాసిత వ్యతిరేక పోరాటాల్లో చురుకైన పాత్ర వహిస్తున్నారు.

పెట్టుబడిదారుల, కార్పొరేట్ల లాభదాహం తీరాలంటే చేసుకున్న ఒప్పందాల మేరకు ప్రాజెక్టులన్నీ ప్రారంభం కావాలి. వేగవంతం కావాలి. దాని కోసమే, సల్వాజుడుం, సల్వాజుడుం-2, గ్రీన్‌హంట్, గ్రీన్‌హంట్ రెండవ దశ, మూడవ దశ, మిషన్-2016 అంటూ ఒకదానిని మించి మరొక బీభత్స నిర్బంధకాండను ప్రజల మీద రుద్దుతున్నారు. మోదీ 'మేక్ ఇన్ ఇండియా' అయినా, రమణ్‌సింగ్ 'మేక్ ఇన్ ఛత్తీస్‌గఢ్' అయినా నిర్బంధాన్ని ఆశ్రయించకుండా ఆచరణ రూపం దాల్చవు. సాయుధ బలగాల నిరంతర పహారాలో దల్లీ-రావ్‌ఘాట్-జగదల్‌పూర్ రైలు మార్గాన్ని వేస్తున్నారు. రావ్‌ఘాట్, ఆముదాయి, తులాడ గనులను ప్రారంభించే సన్నాహాలు చేస్తున్నారు.

దండకారణ్యంలో ఇప్పటికే సుమారు ఒక లక్షా ఇరవై వేల పోలీసు, అర్ధ సైనిక, కమాండో బలగాలు మోహరించి ఉన్నాయి. ఈ సంవత్సరం అదనంగా మరిన్ని బెటాలియన్లు పంపనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఫోర్టిఫైడ్ పోలీసు స్టేషన్లు, అర్ధ సైనిక బలగాల క్యాంపులు దండకారణ్యమంతా విస్తరించి ఉన్నాయి. గనులు, పరిశ్రమలు, ఆనకట్టలు, రైల్వే లైన్లు తలపెట్టిన చోట ఇవి మరింత ఎక్కువగా ఉన్నాయి. కొత్త క్యాంపులు వేసే ప్రయత్నాలు నిరంతరం కొనసాగుతున్నాయి. వైమానిక, వాయు సేవా కేంద్రాలు, విమానాశ్రయాల నిర్మాణ ప్రయత్నాలు జరుగుతున్నాయి. తాజాగా వైమానిక దాడులు చేసే పథకాలు సిద్ధమయ్యాయి.

ఈ నేపథ్యంలో ప్రజల మీద, ముఖ్యంగా మహిళల మీద నిర్బంధం తీవ్రమైంది. బతుకులు దిన దిన గండంగా మారాయి.

ఇండ్లలోనూ, గ్రామాల్లోనూ, పొలాల్లోనూ, అడవుల్లోనూ అంతటా ప్రభుత్వ సాయుధ బలగాల భయం వాళ్ళను వెంటాడుతున్నది. ఆహార సేకరణ, అటవీ ఉత్పత్తుల సేకరణలో ప్రధాన పాత్ర వహించే మహిళకు జీవన్మరణ సమస్యగా మారింది.

తిట్లు, తన్నులూ, చిత్రహింసలూ, అత్యాచారాలు, అరెస్టులూ ఆఖరికి హత్యలు కూడా సర్వసాధారణమయ్యాయి. అయితే ఈ దారుణాల్లో కొన్ని మాత్రమే వెలుగుచూస్తున్నాయి. పోలీసులు పాల్పడుతున్న దారుణాల గురించి విప్లవ పార్టీ నుండీ, ప్రజా సంఘాల నుండి వెలువడే పత్రికా ప్రకటనలు ప్రభుత్వమూ, పోలీసుల చెప్పుచేతల్లో ఉండే మీడియాలో చోటు చేసుకోవు. పోలీసు స్టేషన్లను ఘెరావ్ చేయడం ద్వారా, సమీప పట్టణాల్లో ర్యాలీలు చేయడం ద్వారా ఇటువంటి ఘటనలను బయటి ప్రపంచం దృష్టికి తీసుకురావడానికి ప్రజలు చేసే ప్రయత్నాలను కూడా పోలీసులు తరచూ అడ్డుకుంటారు. మార్గమధ్యంలోనే కాపుకాసి, మరోసారి తమ జులుంను ప్రదర్శించి ప్రజల గొంతు నొక్కుతున్నారు. కొన్ని ప్రజా సంఘాలు పూనుకున్నప్పుడు మాత్రమే కొన్ని ఘటనలు బయటి ప్రపంచం దృష్టికి వస్తున్నాయి. మహిళల మీద పెరుగుతున్న హింసను వ్యతిరేకిస్తూ బాధితుల పక్షాన నిలబడుతున్న వారిపై కూడా రాజ్యం విరుచుకు పడుతున్నది. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే తప్పుడు ఆరోపణలతో పోలీసులు 2011లో సోనీ సోరిని అరెస్టు చేసి ఘోరమైన రీతిలో చిత్రహింసలు పెట్టి అత్యాచారం చేసిన విషయం అందరికీ తెల్సినదే. ఆ తర్వాత ఆమ్ ఆద్మీ పార్టీలో చేరి ఆదివాసీలపై జరుగుతున్న హింసను ప్రశ్నిస్తున్న, సమాజం దృష్టికి తీసుకువస్తున్న ఆమెను పోలీసులు వేధిస్తున్నారు. ఆమె ఇంటిపై దాడి చేసారు. బీజాపూర్‌లో అడుగుపెడితే చంపుతామని పోస్టర్లు వేసారు. తాజాగా గుర్తు తెలియని వ్యక్తుల ముసుగులో పాలక వర్గాల కాపలా కుక్కలు ఆమె ముఖంపై ప్రమాదకరమైన రసాయనాలు గుప్పించారు. ఇదే విధంగా తన వృత్తి ధర్మంలో భాగంగా పోలీసుల ఆకృత్యాలను వెలికితీస్తున్న మాలినీ సుబ్రహ్మణ్యం అనే జర్నలిస్టు ఇంటిపై సామాజిక ఏకతా మంచ్ అనే ప్రతీఘాతక సంస్థకు చెందిన గూండాలు దాడి చేసి విధ్వంసం సృష్టించారు. ఆమెను కొట్టారు.

ఇట్లా రాజ్య హింసను, బెదిరింపులను ఎదుర్కొని కూడా కొంత మంది బాధితులు, వాళ్ళకు అండగా నిలబడుతున్న ఆందోళనాకారులు ఈ హింసను ప్రశ్నిస్తున్నారు. బయటి ప్రపంచం దృష్టికి తెస్తున్నారు. పోలీసుల ఆకృత్యాలు బహిర్గతం అయిన సందర్భాల్లోనూ వాళ్ళపై చర్య తీసుకున్న దాఖలా ఒక్కటి కూడా లేదు. పైగా నాడు సోనీ సోరిపై లైంగిక హింసకు పాల్పడ్డ దంతెవాడ ఎస్పీ అంకిత్‌గార్గ్‌కు ప్రమోషన్ ఇచ్చినట్టుగానే ఇప్పుడు సభ్య సమాజం నివ్వెరపోయేలా ఆమెను 'బజారు మహిళ'గా అభివర్ణించిన బస్తర్ ఐజీ ఎస్ఆర్‌పీ కల్లూరికి కూడా ప్రమోషన్ ఇచ్చే సన్నాహాలు జరుగుతున్నాయి.

గత సంవత్సర కాలంలో పోలీసులు పాల్పడిన మరిన్ని దారుణాల గురించి చెప్పుకుంటే....2015 అక్టోబర్ నెలలో పెద్ద గేలూరు, చిన్న చేలూరు, పెగిడేపల్లి, గుండం తదితర గ్రామాలపై దాడులు చేసి 40 మంది మహిళలను విచక్షణా రహితంగా కొట్టారు. పశువులను కాస్తున్న 14 ఏళ్ళ అమ్మాయి సహా నలుగురు మహిళలపై లైంగికాత్యాచారం చేసారు. ఆ నలుగురిలో ఒక గర్భవతి కూడా ఉంది. పక్కనే ఉన్న చెరువులో ముంచుతూ, తీస్తూ ఆమెపై అత్యాచారం చేసారు. మహిళలను వివస్త్రలను చేయడం, రొమ్ములు పిండడం వంటి నీచ కృత్యాలకు పాల్పడ్డారు. ఈ ఘటనపై పలు మహిళా సంఘాలు, ఆదివాసీ సంఘాలు, కొన్ని రాజకీయ పార్టీలు ఆందోళన చేసాయి. ఈ ఆందోళన వల్లనే ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. లేకుంటే ఇక్కడ జరుగుతున్న ఎన్నో ఘటనల తీరుగానే ఇది కూడా చరిత్ర చీకటి గర్భంలో కలిసిపోయేదే.

2015 సెప్టెంబర్‌లో కొండగావ్ జిల్లాలోని ఛింద్‌ఖడక్ అనే గ్రామంపై దాడి చేసి రెండు గంటల పాటు మహిళలనూ పురుషులను విచక్షణా రహితంగా కొట్టారు. మహిళల బట్టలు చింపేసారు. తలుపులు పగుల గొట్టి ఇండ్లలో దూరి సామాన్లు ధ్వంసం చేసారు. ఆ తర్వాత ఆ గ్రామ పోలీసు పటేల్‌ను దౌర్జన్యంగా కస్టడీలోకి తీసుకెళ్ళే ప్రయత్నం చేసారు. అప్పటికే పోలీసుల దౌర్జన్యాన్ని చవిచూసి ఉన్నప్పటికీ మహిళలూ, పురుషులు పోలీసుల దారికి అడ్డం తిరిగారు. పోలీసులు కాల్పులు జరుపుతామని బెదిరించినప్పటికీ, వెనుకడుగు వేయకుండా పోలీసుల చేతుల్లోంచి బందీని విడిపించుకున్నారు. ఆ తర్వాత పోలీసుల దౌర్జన్యానికి గుర్తులుగా మిగిలిన చినిగిన బట్టలూ, పగిలిన గాజులూ, సలుపుతున్న గాయాలూ, మండుతున్న హృదయాలతో మహిళల నాయకత్వంలో ఎస్పీ ఆఫీస్‌కు వెళ్ళి పోలీసుల దౌర్జన్యంపై ఫిర్యాదు చేసారు.

ఈయేడు జనవరి 12న సుక్‌మా జిల్లా కున్నా, పెద్దా గ్రామాలపై దాడి చేసి బీభత్సం సృష్టించారు. గ్రామంలోకి వస్తూనే దారి చూపడానికి నిరాకరించిన ఒక మహిళను విచక్షణా రహితంగా కొట్టారు. గ్రామంలోకి ప్రవేశించిన తర్వాత అనేక మంది మహిళలపై ఇదే తరహా దౌర్జన్యానికి పాల్పడ్డారు. మహిళల బట్టలు చింపి, అసభ్యంగా వ్యవహరించారు. తొమ్మిది మంది మహిళలపై అత్యాచారం చేసారు. ఇందులో తీవ్రంగా గాయపడ్డ 50 ఏళ్ళ మహిళనూ, 22 ఏళ్ళ యువతిని సోనీ సోరి ఆధ్వర్యంలో జగదల్‌పూర్‌లోని మెడికల్ కాలేజీలో చేర్పించారు. అయితే ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసు అధికారులు కనీసం కేసు నమోదు చేయలేదు.

2016 జనవరి 11 నుండి 15 వరకూ ప్రభుత్వ సాయుధ మూకలు బీజాపూర్ జిల్లాలోని పునూరు, నేంద్ర, గొటోడు తదితర గ్రామాల్లో బీభత్సం సృష్టించారు. ఈ సందర్భంగా ఏడుగురు మహిళలపై సామూహిక అత్యాచారం చేసారు. మరి కొంత మంది మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. ఈ దారుణాలకు పాల్పడ్డ జవానులపై కేసు నమోదు చేయడానికి సోనీ సోరి ప్రయత్నిస్తే కేసు నమోదు చేసుకోవడానికి అదనపు ఎస్పీ నిరాకరించాడు. పోలీసులకి ఎవరినైనా కొట్టే, చంపే అధికారాన్ని పాలకులు కట్టబెడుతున్నపుడు వాళ్ళ మీద కేసులు ఎలా నమోదు చేస్తారు?

2015 మే నెలలో గడ్‌చిరోలి జిల్లాలోని ఉడేర గ్రామంలో ఇప్పపూలు ఏరుతున్న తల్లీ కూతుళ్ళను చిత్రహింసలు పెట్టి,

సాహిత్యం, కళలపై రచయితలతో స్టాలిన్ చర్చ (1946)

నాగభూషణ్

సాహిత్యం, కళల ద్వారా ఈ రోజు మనల్ని ఎవరు ఏ విషయంపై ప్రభావితం చేస్తున్నారన్న దాన్ని చాలా జాగ్రత్తతో పరిశీలించాలి. అప్పుడే మనం దేన్ని దాని అంతం దాకా సైద్ధాంతికంగా దెబ్బ తియ్యాలో గ్రహించగలుగుతాం. సాంఘిక సిద్ధాంతంలో సంస్కృతి ఒక ప్రధానమైన పాత్ర అనీ, అంతేగాక పాలకవర్గాన్ని సురక్షితంగా ఉంచడానికి దాన్ని ఉపయోగిస్తారనీ మనం అర్థం చేసుకోవడమే కాదు, అంగీకరించాలి కూడా! మనమైతే శ్రామికవర్గాన్ని సురక్షితంగా ఉంచడానికీ, కార్మికవర్గ నియంతృత్వానికీ దాన్ని ఉపయోగించాలి.

స్టాలిన్ : మీరు నాతో ఏం చెప్పాలనుకుంటున్నారో చెప్పండి కామ్రేడ్ ఫెదయేవ్.

ఫెదయేవ్: (అలెక్సాండ్ర్ అలెక్సాంద్రోవిచ్ ఫెదయేవ్ సోవియట్ రచయితల సంఘం సెక్రటరీ జనరల్‌గా 1946-1956 దాకా ఉన్నాడు) కామ్రేడ్ స్టాలిన్! మేమంతా మీ సలహా కోసం వచ్చాం. మేం చాలా మందిమి అనుకునేది ఏమంటే, మన సాహిత్యం, కళలు చిట్టచివరి అంతానికి చేరుకున్నాయని. ఆ తర్వాత వీటిని ఎలా అభివృద్ధి చెయ్యాలో మాకేమీ అర్థం కావటం లేదు. ఈ రోజుల్లో ప్రతి సినిమా హాల్లో సినిమాలు ప్రదర్శిస్తున్నారు. వాటిలో కథానాయకులు శత్రువులతో అంతులేని యుద్ధాలు చేస్తూ మానవ రక్తాన్ని నదిలా పారిస్తున్నారు. ప్రతి చోటా కొరతా, కష్టాలూ చూపబడుతున్నాయి. ప్రజలంతా పోరాటాల వల్లా, రక్తపాతం వల్లా అలసిపోయారు. అందువల్ల మా కళల్లో దీనికి భిన్నమైన దాన్ని ఎలా చూపించాలన్న విషయంపై మీ సలహా మాక్కావాలి. ఎక్కడా రక్తపాతం, బలప్రయోగం ఉండకూడదు. మనదేశం ఎదుర్కొంటున్న లెక్కలేనన్ని కష్టాలు భవిష్యత్తు జీవితంలో ఉండకూడదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆనందాన్నీ, మేఘావృతం కాని భవిష్యత్తునూ వర్ణించే కాలం రావాలి!

స్టాలిన్ : మీ వాదనలో ముఖ్య విషయం లోపించింది. అందులో మార్క్సిస్టు-లెనినిస్టు విశ్లేషణ లోపించింది. ఏ సమస్యలైతే మీ సాహిత్యకారుల, కళాకారుల జీవితాల ముందున్నాయో, అవే మీమీ ప్రక్రియల్లో ప్రతిబింబించాయి.

ఒకసారి పీటర్ 1 (ఇతణ్ణే పీటర్ గ్రేట్ అంటారు. 1682-1725 ప్రాంతంలో రష్యా పాలకుడు. ఇతడు రష్యాను శక్తిమంతమైన రాజ్యంగా రూపొందించినప్పటికి ఇతడు సాగించిన దురాగతాలకు లెక్కలేదు. తన నిరంకుశ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి సంప్రదాయక ప్రభువర్గాన్ని రద్దు చేసి, తన తాబేదారుల్ని నియమించాడు. ప్రజల్లో కృత్రిమ కులీన వర్గాన్ని ఏర్పరచింది ఇతడే. విరోధుల గుట్టుమట్లులాగే రహస్య పోలీసు వలను దేశమంతా ఏర్పరచింది ఇతడే. ఇతడు ఎంత మూర్ఖుడంటే, జుట్టు, దుస్తులు వగైరా ప్రజల ఆచార వ్యవహారాల్లో జోక్యం చేసుకుని, బలవంతంగా పాశ్చాత్యీకరణ సాగించాడు. అంతా పొగతాగాలని నిర్బంధించాడు. ఈ పద్ధతుల్ని వ్యతిరేకించిన తన స్వంత కుటుంబ సభ్యుల పట్ల కూడా దాష్టీకాన్ని ప్రదర్శించాడు. భార్యకు విడాకులిచ్చాడు. కొడుకుని చనిపోయేదాకా కొరడాలతో కొట్టించాడు. జాతి వివక్షను పాటిస్తూ, స్లావ్ భావనను రెచ్చగొట్టి రష్యన్ జాతీయుల మద్దతు పొందటానికి కృషి చేసాడు. ఇలాంటివి చెప్పుకుంటూపోతే ఎన్నో-అను) యూరప్‌కి కిటికీ (మార్గం) తెరిచాడు. కానీ 1917 తర్వాత సోషలిజం తమ దేశాల్లో వ్యాపిస్తుందన్న భయం లేకుండా సామ్రాజ్యవాదులు దీర్ఘకాలం పాటు ఉండేందుకు దానిలో కాలుమోపారు.

మహాదేశభక్త యుద్ధం (1941-44 మధ్య జరిగిన రెండో ప్రపంచ యుద్ధాన్ని సోవియట్ ప్రజలు ఈ పేరుతో పిలుస్తారు. ఎందుకంటే ఈ యుద్ధంలో ఆ దేశ ప్రజలు యావత్తు ఇతర దేశాలు చేసిన త్యాగాల కన్నా ఎక్కువ త్యాగాలు చేసారు-అను) నకు ముందు రేడియోలు, సినిమాలూ, వార్తాపత్రికలూ, పత్రికల్లో మనలనంతా నెత్తురోడుతున్న కత్తుల్ని పళ్ళ మధ్య ఉంచుకున్న కిరాతకులంగా ప్రపంచం ముందు పరిచయం చేశారు. కార్మికవర్గ నియంతృత్వాన్ని వారు ఎలా చిత్రించారో ఇదంతా తెలియజేస్తోంది కదా!

మన ప్రజలు దారం లేని చొక్కాలు ధరిస్తారు (పేదలు కాబట్టి అసలు చొక్కాలే ధరించలేరు -అను) సమోవార్ నుంచి ఓడ్కా (ఓడ్కా అనేది రష్యాకు చెందిన ఒక రకమైన మద్యం. అది తాగేందుకు డబ్బు లేదు గనుక, తక్కువ ఖర్చయ్యే టీ-అను) తాగుతారు. ఇలా వెనకబడ్డ రష్యాలోని గుహల్లో నివసించే ఈ ఆది మానవులు - ఒక్కసారిగా ప్రపంచ బూర్జువాజీకి (మధ్య తరగతి వారికి-అను) ప్రతినిధులుగా మారి-ఎవరిముందు ప్రపంచమంతా

అసభ్యంగా ప్రవర్తించి, భయభ్రాంతులు చేయడం కోసం గాలిలోకి కాల్పులు జరిపారు. కాంకేర్ జిల్లాలోని గుందుల్ గ్రామంలో ఇప్పపూలు ఏరుతున్న ఇరవైయ్యేళ్ళ రమోతి, రుక్మయి అనే యువతులను పట్టుకొని జైల్లో పెట్టి ఇద్దరికీ పదేళ్ళ కఠిన కారాగార శిక్ష వేసారు. పోలీసులు హత్య చేయకుండా కనికరిస్తే ఆ లోటును పూరించడానికి ఇక్కడ క్రూర చట్టాలు, కఠిన శిక్షలు వేసే జడ్జీలు, మనుషులను కుక్కి మానసికంగా, శారీరకంగా కుంగదీసి జీవచ్ఛవాలుగా మార్చే జైళ్ళకు కొదవలేదు. ☆

భయంతో వణికిపోతుందో అటువంటి రెండు గొప్ప ప్రపంచ శక్తులైన జర్మన్ ఫాసిస్టుల్నీ, జపాను సామ్రాజ్యవాదుల్నీ ఓడించారు. ఇలా వీరోచిత సాహసకృత్యాల్ని నిర్వహించి, యావత్తు మానవజాతినీ రక్షించిన ఈ ప్రజలు ఎవరో తెలుసుకోవాలని ఈనాడు ప్రపంచమంతా కోరుకుంటోంది. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో సైతం ఎలాంటి గడబిడలు లేకుండా దేశాన్ని పారిశ్రామికీకరణ చెయ్యడమే గాక, సామూహిక శ్రమతత్వాన్ని కూడా సాధించిన సామాన్య సోవియట్ పౌరులే ఈ యావత్తు మానవజాతినీ రక్షించారు. వీరంతా కమ్యూనిస్టుల నాయకత్వంలో తమ జీవితాల్ని వెచ్చించి మరీ రక్షణస్థితిని పటిష్టపరిచి, శత్రుసమూహాల్ని బద్దలు కొట్టారు. కేవలం యుద్ధం మొదలైన మొదటి ఆర్నెలల్లోనే ఆయిదు లక్షల మందికి పైగా కమ్యూనిస్టులు యుద్ధరంగం ముందువరసలో చనిపోగా, యుద్ధం ముగిసే నాటికి మొత్తం ముప్పైలక్షల మందికి పైగా కమ్యూనిస్టులు చనిపోయారు. మనలోని ఉత్తములూ, ఉన్నతులూ, పూర్తి అంకితభావం కలిగిన, స్వార్థ త్యాగులూ, సోషలిజం కోసం పోరాడేవారూ, తమ ప్రజల సంతోషం కోసం పనిచేసేవారిని అనేక మందిని మనం కోల్పోయాం. వారంతా గనుక బతికి ఉన్నట్లయితే మన సమస్యల్లో అధికభాగం పరిష్కరిష్కారమయ్యేవి.

ఈరోజు మన సోవియట్ సృజనశీల మేధావుల కర్తవ్యం ఏమంటే...తమ తమ కళాకృతుల్లో ఈ సామాన్య సోవియట్ ప్రజల సకల రీతుల్నీ ప్రతిబింబించడంతో పాటు వీరి వ్యక్తిత్వంలోని ప్రత్యేక లక్షణాల్ని తెలియజెప్పడం! సాహిత్యం, కళల అభివృద్ధికి ఈనాడు ఉండాల్సిన సాధారణ పంథా ఇది!

ఫెదయేవ్ : నికొలాయ్ ఓస్ట్రోవ్స్కీ రాసిన 'హౌ ద స్టీల్ వాజ్ టెంపర్డ్' (ఈ నవల తెలుగులో కాకలు తీరిన యోధుడు పేర అనువదించబడింది- అను) నవలలోని కథానాయకుడు 'పావెల్ కోర్చాగిన్' మనకు ఎందుకు ఇష్టమైన వాడయ్యాడు?

స్టాలిన్ : విప్లవం పట్ల, సోషలిజం పట్ల, ప్రజల పట్ల అతడికి గల హద్దుల్లేని అంకిత భావం, స్వార్థం ఏ మాత్రం లేకపోవడం దీనికి కారణాలు. దీనికి తోడు మన కాలపు గొప్ప పైలట్‌గా ప్రసిద్ధికెక్కి, వేలాదిమంది సోవియట్ సాహసికులకు ఫాల్కన్ రక్షణ విమాన చోదకులుగా శిక్షణనిచ్చిన 'వలేరీ' ఈ సినిమాలో గొప్ప కళాత్మక ప్రతిభ కనబర్చడం కూడా! ఇక 'పట్నం నుంచి వచ్చిన యువకుడు' (యంగ్‌మాన్ ఫ్రం ద సిటీ) సినిమాలో నటించిన టాంక్ దళ కల్నల్ 'సెర్జీలుకోనిన్' కూడా వేలాది టాంక్ దళాల వారికి ఒక విశిష్ట కథానాయకుడు. ఈ ఆచారాన్ని కొనసాగించడం అవసరం. ఎవరితో సోవియట్ ప్రజలు సమానంగా ఉండేందుకూ, అనుకరించేందుకూ ప్రయత్నిస్తారో, అలాంటి కమ్యూనిస్టు పోరాటయోధుల్ని సాహిత్యంలో కథానాయకులుగా సృష్టించాలి! ఇప్పుడు నా దగ్గర ఓ ప్రశ్నల జాబితా ఉంది. ఇందులోని ప్రశ్నలన్నీ సోవియట్ సృజనశీల మేధావులకు ఆసక్తికరమైనవని భావిస్తున్నాను. ఇక్కడెవరికీ అభ్యంతరం లేనట్లయితే, వాటికి సమాధానాలివ్వడానికి ప్రయత్నిస్తాను.

(వాటికి సమాధానాలివ్వాలని కోరుతున్నాం అంటూ హాలు నుంచి చప్పట్లు)

ప్రశ్న : మీ దృష్టిలో ఆధునిక సోవియట్ రచయితల. నాటకకారుల, సినీ దర్శకుల కళాసృష్టిలో ప్రధానంగా ఉన్న లోపాలేమిటి?

స్టాలిన్ : దురదృష్టవశాత్తు అత్యంత తీవ్రంగా పరిగణింప దగ్గవే ఉన్నాయి. ఈ మధ్యకాలంలో వచ్చిన పలు సాహిత్య రచనల్లో ఈ ప్రమాదకర ధోరణి కనబడటం చూస్తున్నాం. పశ్చిమదేశాల్లో కుళ్ళిపోయిన హానికారకాల ప్రభావం వల్ల ఇవి తలెత్తుతున్నాయి. ఇక్కడి విలువల్ని క్షీణింప జేసేందుకూ, అక్కడ కుళ్ళిపోయిన వాటిని జీవింపజేసి ఇక్కడ ప్రవేశపెట్టేందుకూ ప్రయత్నించే విదేశీ గూఢచర్య సంస్థల వల్ల ఇది జరుగుతోంది. తరచుగా ఈ ప్రయత్నాలు సోవియట్ పత్రికల్లోనూ, రచనల్లోనూ కనుగొనబడ్డాయి. వాటిలో సోవియట్ ప్రజలూ, కమ్యూనిజం నిర్మాతలూ, జాలి పుట్టించేవారుగా, హాస్యగాళ్ళుగా చూపించబడటం కనిపిస్తోంది. అనుకూల ధోరణి గల కథానాయకుడు (పాజిటివ్ హీరో) కాస్తా వ్యతిరేక ధోరణిగలవానిగా, ఆత్మన్యూనత గలవానిగా విదేశీ వస్తు వ్యామోహితునిగా, 'నవ' నాగరికునిగా చూపిస్తున్నారు. అలాగే రాజకీయ వ్యతిరేకుల్ని పొగుడుతున్నారు. నాటకశాలల విషయానికి వస్తే అక్కడ నిత్యం చూపించే సోవియట్ నాటకాల్ని పక్కనబెట్టి, విదేశీ బూర్జువా రచయితలు రాసిన నాటకాలు ప్రదర్శిస్తున్నారు.

ఇక సినిమాల్లోనయితే అల్పమైన కథా వస్తువులు ప్రాచుర్యం పొంది పరాక్రమోపేతులైన రష్యన్ ప్రజల సాహసచరిత్రల సినిమాలను పక్కకు లాగేస్తున్నాయి.

ప్రశ్న : సంగీతంలో నూతన ప్రయోగాలు, చిత్రకళ, శిల్పాల్లో నైరూప్యత వంటివి సైద్ధాంతికంగా ఎలా ప్రమాదకరమవుతాయి?

స్టాలిన్ : నూతన కల్పనలతో నిబంధనల్ని అతిక్రమించే సంగీతం, నైరూప్య చిత్రకళ ఈరోజు పలుకుబడిపొందాయి. ఇలాంటి సమయంలో ఓ ప్రశ్న అప్పుడప్పుడూ వింటున్నాం. అదేమిటంటే బోల్షివిక్కులుగా, లెనినిస్టులుగా ఉన్న ఈ గొప్ప ప్రజలు అల్ప విషయాలైన నైరూప్య చిత్రకళనూ, నిబంధనల్ని అతిక్రమించే సంగీతాన్నీ విమర్శిస్తూ తమ సమయాన్ని వెచ్చించడం అవసరమా అని. ఈ సంగతి మనస్తత్వ శాస్త్రజ్ఞులకు వదిలేద్దాం.

అయితే ఇలాంటి ధోరణి గల ప్రశ్నలు అపార్థాన్ని కలిగించడమే గాక, సిద్ధాంతాల ప్రాముఖ్యతకు నష్టాన్ని కలిగించి, మన దేశానికి, ముఖ్యంగా మన యువతరానికి స్పష్టమైన వ్యతిరేక గుర్తింపును తెస్తాయి. మన కళలూ, సాహిత్యాలలోని 'సోషలిస్టు వాస్తవికత' (సోవియట్ దేశపాలనా కాలంలో గల సాహిత్య సిద్ధాంతం ఇది- అను)కు వ్యతిరేకంగా దాడులు చేసేందుకు ఇలాంటి వ్యతిరేక గుర్తింపు సహాయపడుతుంది. ఎందుకంటే మనమీద బహిరంగ దాడి చెయ్యడం అసాధ్యం గనుక.. ప్రజల సంతోషం కోసం, కమ్యూనిజం కోసం, అభ్యుదయ మార్గంలో పయనించడం కోసం పోరాటం చేసే ఏ ప్రజల్ని అనుసరించాలనుకుంటున్నారో, ఆ ప్రజల వాస్తవ ముఖాలు ఈ నైరూప్య చిత్రాల్లో కనిపించవు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సోషలిజం జరిపే వర్గపోరాట దృశ్యం గుప్తమైన నైరూప్య చిత్రాల్లో అస్పష్టపరచబడుతుంది.

యుద్ధం జరిగిన నాటి నుండి ఎర్రచౌకులో గల 'మినిన్',

'పెర్రూరోస్క్' విగ్రహం వద్దకు రావడం ద్వారా మనలో యుద్ధ విజయభావాన్ని గాఢంగా కలిగించగలరా? నడుం పైభాగం నుంచి ఉన్న తికమక పరిచే ఓ ఇనుప ముక్క ఒక నూతన ఆవిష్కరణకి ప్రతినిధి అయినంత మాత్రాన, ఒక కళగా మనల్ని ప్రభావితం చెయ్యగలదా? నైరూప్య చిత్రంలో ఏది మనల్ని ప్రభావితం చేస్తుంది? అమెరికన్ ధనిక ప్రభువులు ఆధునిక కళల్ని ప్రచారం చేస్తూ, వాటికి అధిక రాయల్టీలు చెల్లించడానికీ, వాస్తవికతను చిత్రించే కళాకారులకు ఎప్పటికీ అలా చెల్లించకపోవడానికీ ఇదే కారణం! ఈ కారణం వల్లనే పాశ్చాత్య జనప్రియ సంగీతంలోనూ, అలాగే విషయం కన్నా నిబంధనలు అధికంగా ఉండే ప్రాచీన సంగీతంలోనూ వర్గపోరాటాన్ని కించపరిచే ఆలోచన ఉన్నది.

ఈ సంగీతం గురించి ఒకరు ఏం చెప్పారంటే ఒక తీవ్రమైన దాడి చెయ్యనెంచిన ఒక పెద్ద గుంపులోని చిన్న గుంపు ఇతర ప్రజల్ని ప్రభావితం చేసేందుకుగాను తాము ఊగిపోతూ నృత్యం చేసి, వారిని మైమరపించి, జంతువులుగా ఆలోచనా రహితుల్ని చేసి, దాడి చేసేందుకు పురిగొల్పడానికి ఈ సంగీతాన్ని సృష్టించారు. మానసిక నిపుణుల సహాయంతో చేసినట్లుగా.. ఈ రకానికి చెందిన సంగీతాన్ని సృష్టించింది ప్రజల మనసుపైన, మెదడుపైన ప్రభావాన్ని చూపించడం కోసం! ఇది ఒక రకమైన సంగీతవు మత్తుమందనవచ్చు. దీనివల్ల ఎవరి ప్రభావం కింద ఒక మనిషి ఉంటాడో, అతడు స్వయంగా ఆలోచించలేడు. గొరిల్లా వారిని అనుకరిస్తుంటాడు. ఇలాంటి జనాన్ని విప్లవం కోసం, కమ్యూనిజాన్ని నిర్మించడం కోసం పిలుపునివ్వడం వల్ల ప్రయోజనం లేదు. అయితే సంగీతం కూడా పోరాటం చేస్తుందని నువ్వు చూడవచ్చు. 1944లో నాకు ఒక బ్రిటిష్ గూఢచర్య శాఖాధికారి రాసిన పుస్తకాన్ని చదివే అవకాశం వచ్చింది. ఆ పుస్తకం పేరు 'శత్రుసైన్యాన్ని అవినీతి పాలు చెయ్యడం కోసం సంప్రదాయక సంగీతాన్ని ఎలా ఉపయోగించాలి?'

ప్రశ్న : విదేశీ గూఢచారులు కళలూ సాహిత్యాలను దెబ్బతియ్యడానికి ఎలాంటి నిర్దిష్టమైన విచ్ఛిన్న చర్యలకు పాల్పడతారు?

స్టాలిన్ : సోవియట్ కళలు, సాహిత్యాల రంగంలో జరగబోయే భవిష్యత్ పరిణామాల్లో మనం ఇంతకు ముందెన్నడూ విననటువంటి ఓ రహస్య యుద్ధం గురించి మనం తప్పక పరిశీలించాలి. ఈ యుద్ధం ద్వారా ప్రపంచ సామ్రాజ్యవాద బృందాలు మన కళలూ, సాహిత్యాలను మన నుంచి స్వేచ్ఛగా ఉంచాలని ప్రయత్నిస్తాయి. ఈ విషయంలో విదేశీ గూఢచారులు చేసే పని ఏమంటే - వారు మన సోవియట్ సంఘాల్లోకి జొరబడి, మన పెద్ద వార్తాపత్రికలు, పత్రికల సంపాదక పదవుల్ని స్వాధీనం చేసుకోవడం ద్వారా, నాటకశాలలూ, సినిమాలలో నిరంతరం పనిచెయ్యడం ద్వారా, కల్పనా సాహిత్యం, కవిత్వాల ప్రచురణలు ద్వారా-తమ పలుకుబడిని నిర్ణయాత్మకం చేసుకుంటారు. తద్వారా, ఏ రచనలైతే దేశభక్తిని మేల్కొలిపి, సోవియట్ ప్రజలకు నాయకత్వం వహించి, కమ్యూనిజాన్ని స్థాపించడానికి తోడ్పడతాయో, అలాంటి విప్లవ రచనలను వీరు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రచురించబడకుండా అడ్డుకుంటారు! ఎక్కడైతే కమ్యూనిజం విమర్శించబడుతుందో అక్కడ ఆ విమర్శలకు మద్దతుగా గల రచనల్ని ప్రచురిస్తారు. అలాగే పెట్టుబడిదారీ పద్ధతిలో సాగే ఉత్పత్తి గురించీ, బూర్జువాల జీవిత విధానాల్ని గురించీ ఎంతో ఉత్సుకత కలిగేట్లు ప్రచారం చేస్తారు.

నిరాశావాదానికీ, స్వార్థపరత్వానికీ, నీతి రాహిత్యానికీ కళలు సాహిత్యాలలో ప్రాచుర్యం కలిగించాలని ఈ విదేశీ ఏజెంట్లు అడుగుతూంటారు.

ఓ పేరొందిన అమెరికన్ సెనేటర్ ఇలా చెప్పాడు : 'మాకు గనుక బోల్షివిక్ రష్యాను మా హర్రర్ సినిమాల్లో చూపించే సామర్థ్యం ఉన్నట్లయితే, ఆ పని చేయడం ద్వారా అక్కడి కమ్యూనిస్టు నిర్మాణాల్ని ధ్వంసం చెయ్యడానికి అక్కడి వారిని (రష్యా ప్రజలను-అను) దాదాపు ఒప్పించగలిగేంత సమర్థులమే' అని. అది లేదు గనుక, ఇది చెయ్యలేరు. లేవ్ తాల్‌స్తోయ్ చెప్పాడు.. కళలూ, సాహిత్యమూ అనేవి మన నమ్మకాల్ని గాఢంగా బలపరిచే పరికరాలు అని.

సాహిత్యం, కళల ద్వారా ఈ రోజు మనల్ని ఎవరు ఏ విషయంపై ప్రభావితం చేస్తున్నారనే విషయాన్ని చాలా జాగ్రత్తతో పరిశీలించినప్పుడే, మనం సైద్ధాంతికంగా దేన్ని దాని అంతం దాకా దెబ్బతియ్యాల్సి ఉన్నదో గ్రహించగలుగుతాం. సాంఘిక సిద్ధాంతంలో సంస్కృతి ఒక ప్రధానమైన పాత్ర అనీ, అంతేగాక పాలకవర్గాన్ని సురక్షితంగా ఉంచడానికి దాన్ని ఉపయోగిస్తారనీ మనం అర్థం చేసుకోవడమే గాక, అంగీకరించాలి కూడా! మనమైతే శ్రామికవర్గాన్ని సురక్షితంగా ఉంచడానికీ, కార్మికవర్గ నియంతృత్వానికీ దాన్ని ఉపయోగించాలి.

అక్కడ కళ కళకోసం కాదు. అక్కడ ఎన్నటికీ కళాకారులకూ, కవులకూ, దర్శకులకూ, నాటకకారులకూ, పత్రికా రచయితలకూ, సమాజానికి అతీతంగా ఉండడానికి స్వేచ్ఛ లేదు. అది అసలు ఎవరికీ అవసరం లేదు కూడా. అలాంటి ప్రజలు ఎన్నటికీ ఉండరు, ఉండలేరు కూడా.

విప్లవ ప్రతీఘాత బూర్జువాల పాత ఆచారాల వల్ల, లేదా వాళ్ళు మన ప్రత్యర్థులైనందు వల్ల సోవియట్ ప్రజలకు సేవ చేసేందుకు ఇష్టపడకుండా ఉన్నవారు- శ్రామికవర్గ అధికారమార్గంలో సోవియట్ ప్రజలకు సేవ చేస్తూ అంకితభావంలో ఉన్నప్పుడు వారు విదేశాలకు వెళ్ళేందుకూ, అక్కడే ఉండిపోయేందుకూ మనం అనుమతిస్తాం. ఎక్కడైతే ప్రతివస్తువూ అమ్మకానికి తీసుకురాబడుతుందో, అలాంటి క్రూరమైన బూర్జువా సమాజంలో, తమ సృజనాత్మకతతో తీవ్రంగా కృషి చేస్తూ, ధనిక ప్రభువుల ఆర్థిక తోడ్పాటుపై పూర్తిగా ఆధారపడే సృజనశీల మేధావులంతా, 'స్వేచ్ఛాసృజన' అన్న పదానికి గల పూర్తి అర్థంతో సంతృప్తి చెందనివ్వండి!

దురదృష్టవశాత్తు మిత్రులారా! సమయంలేనందున మన చర్చను ఇంతటితో ముగిద్దాం.

పార్టీ, సోవియట్ ప్రభుత్వం-వీటి పని పరిస్థితులపై ఆధారపడి ఈ చర్చకు కొనసాగింపు ఉంటుందని నమ్ముతున్నాను. అప్పుడు సోవియట్ సాహిత్యం తర్వాతి పరిణామాలపై మీ అందరి ప్రశ్నలకు సమాధానాలిచ్చి, మీ అనుమానాల్ని నివృత్తి చేయగలనని భావిస్తున్నాను.

(జాక్రయేవి -స్టాలిన్ .. ప్రావధా ఐలోజ్-..మాస్కో, 1996. పిపి. 245 నుంచి 251 దాకా. జెవి స్టాలిన్ రచనలు 16 సంపుటం పేజీలు 1946 నుంచి 1952 పేజీ దాకా)

అమెరికా అనుకూల వాణిజ్య ఒప్పందాలు (టిపిపిఎ- టిటిఐపి)

ఎ. నర్సింహ్మా రెడ్డి

అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా తన అధ్యక్ష పదవికాలం ముగిసేలోగా (2017 జనవరి 16) అమెరికా సామ్రాజ్య విస్తరణలో భాగంగా కొన్ని వాణిజ్య కూటములను సృష్టించి అమలులోకి తేవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా పసిఫిక్ మహాసముద్ర తీర ప్రాంత దేశాలతో ఒక ఒడంబడిక, దీన్ని ట్రాన్స్ పసిఫిక్ పార్టనర్ షిప్ అగ్రిమెంట్ (టిపిపిఎ) అంటాం. దేశాల రాజకీయ అంశాల కంటే ఆర్థికాంశాలే కీలకంగా మారుతున్న ప్రస్తుత ప్రపంచ వ్యవహారాల్లో 'ట్రాన్స్ పసిఫిక్ భాగస్వామ్య ఒప్పందం పసిఫిక్ మహాసముద్రం ఆధారంగా, భౌగోళిక అంశాలను ఆసరాగా చేసుకుని అమెరికా ఈ మహా వ్యాపార సామ్రాజ్య ఒప్పందం కుదుర్చుకుంది. అమెరికా దృష్టిలో ఇది కీలకమైంది, వ్యూహాత్మకమైంది. ఆరు సంవత్సరాల సుదీర్ఘ చర్చల అనంతరం పసిఫిక్ తీర ప్రాంత 12దేశాల వాణిజ్యమంత్రుల మధ్య ఫ్లోరిడాలో జరిగిన సమావేశంలో అక్టోబర్ 5, 2015న ట్రాన్స్ పసిఫిక్ పార్ట్‌నర్‌షిప్ వాణిజ్య ఒప్పందానికి (టి.పి.పి.ఎ) అంగీకారం తెలిపారు. ఆస్ట్రేలియా, బ్రూనై, కెనడా, చిలీ, జపాన్, మెక్సికో, న్యూజిలాండ్, పెరూ, సింగపూర్, మలేషియా, అమెరికా, వియత్నాం (మొత్తం 12 దేశాలు) తమ మధ్య వాణిజ్య అభివృద్ధి కోసం 'ట్రాన్స్ పసిఫిక్ భాగస్వామ్య ఒప్పందం' కుదుర్చుకున్నట్లు ప్రకటించాయి. టి.పి.పి. ఒప్పందంలో వాణిజ్య సంబంధిత అంశాలైన పెట్టుబడులు, మేధోసంపత్తి హక్కులు, కార్మికులు, పర్యావరణం, వాణిజ్య ప్రత్యామ్నాయాలు, సాంకేతికపరమైన అడ్డంకులు తదితర అంశాలపై పూర్తి వివరణల కోసం 30 చాప్టర్లుగా విభజించి, అందులో ప్రతి అంశంపై సమగ్ర సమాచారం పొందుపరిచారు. ఈ ఒప్పందంలోని సభ్య దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 40 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 24 శాతం, జనాభాలో 80 కోట్లు ఉంటుంది. ఈ వాణిజ్యంలో అమెరికా 57 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, 17 శాతంతో జపాన్ ఉండగా, వియత్నాం, కెనడాలు 6 శాతంతో ఉండగా, 4 శాతంతో మెక్సికో ఉంది. అతి తక్కువ, అంతకంటే తక్కువ శాతంతో చిలీ, మలేసియా, న్యూజిలాండ్, పెరూ, సింగపూర్ దేశాలున్నాయి.

చైనా ఆర్థిక వ్యవస్థను, వాణిజ్యాభివృద్ధిని అడ్డుకోటానికి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా వ్యూహరచన అయిన 'ఆసియా పివోట్'లో అంతర్భాగమే ఈ ఒడంబడిక నిర్దేశం. తొలుత చైనాను ఫ్లోరిడా సమావేశానికి ఆహ్వానించక పోయినప్పటికీ తర్వాత చైనాకు ఆహ్వానం అందినా ఈ సమావేశాల్లో చైనా పాల్గొనలేదు. ఆహ్వానానికి గల ప్రధాన కారణం అమెరికా కార్పొరేట్ కంపెనీలకు అనూహ్యామైన మార్కెట్‌ను చైనా పొంది ఉండటమే. అయినప్పటికీ చైనా బ్రిక్స్ దేశాల కలయికకే అధిక ప్రాధాన్యతనిస్తుంది. ఒకవైపు ప్రభుత్వాలు ఈ ఒప్పంద విషయంలో సంతోష పడుతుండగా, ఆయా దేశాల్లో శ్రామిక ప్రజలూ, స్వచ్ఛంద సంస్థలూ, మానవ హక్కుల సంఘాలూ, పర్యావరణ సంస్థలూ మాత్రం నాలుగుగోడల మధ్య జరిగిన ఈ ఒప్పందాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఈ ఒప్పందం ట్రేడ్‌యూనియన్ హక్కులకు భంగకరమనీ, కార్మికవర్గ వ్యతిరేక ఒప్పందంగా వర్ణిస్తూ, పర్యావరణాన్ని కాలరాచే బహుళజాతి కంపెనీలకు మాత్రం బహుళ ప్రయోజనకరంగా ఉంటుందని విమర్శిస్తున్నారు.

ట్రాన్స్ అట్లాంటిక్ ట్రేడ్ అండ్ ఇన్‌వెస్ట్‌మెంట్ పార్టనర్‌షిప్:

రెండవ వాణిజ్య ఒప్పందం ఉత్తర అట్లాంటిక్ ప్రాంతంలోని ఐరోపా యూనియన్‌తో చేసుకున్న ఒప్పందం దీన్ని ట్రాన్స్ అట్లాంటిక్ - ట్రేడ్ అండ్ ఇన్‌వెస్ట్‌మెంట్ పార్టనర్‌షిప్ అగ్రిమెంట్ (టిటిఐపీ) అంటాం. అమెరికా- 29 దేశాలతో కూడిన యూరపు యూనియన్ మధ్య వర్తక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ఈ టిటిఐపిలో 100 కోట్ల జనాభా వరకు ఉన్నారు. యూరోపియన్ యునియన్ దేశాలతో జరగబోయే ఈ ఒప్పందానికి తీవ్ర నిరసనలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా యూరపుకు నాణ్యత లేని కార్లు, జి.ఎం. వ్యవసాయ ఉత్పత్తులు అమెరికా ఎగుమతి చేయటానికి ప్రయత్నిస్తుందని ఎట్టి పరిస్థితుల్లోనైనా ప్రతిఘటించి తీరుతామని ప్రజలు రోడ్లపైకి వచ్చి అనేక రూపాల్లో ప్రదర్శనలు చేస్తున్నారు. మరోకవైపు "టిటిఐపి యూరప్‌దేశాల భద్రతను బలహీనపరచడానికే అమెరికా వ్యూహమని" యూరోపియన్ పార్లమెంటేరియన్ షాప్ హౌజర్ అన్నారు.

అమెరికా, యూరోపియన్ యూనియన్‌లకు కలిపి రూ. 20 వేల కోట్ల డాలర్ల వాణిజ్యం పెరుగుతుందని చెబుతున్నప్పటికీ దీని ద్వారా పర్యావరణ సమస్యలు తలెత్తనున్నాయని, యూరపులోని కార్మికుల జీతాలు పడిపోతాయని, ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తులు యూరపు ప్రమాణాలకు లోబడి ఉండవని, అమెరికా రైతాంగ సబ్సిడీలతో ఈయూ దేశాలు పోటీపడలేవని తద్వారా వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టబడుతుందని తెలియజేస్తూ, ఇటీవల హాలెండ్‌లో గ్రీన్ పార్టీ బయటపెట్టిన రహస్య టిటిఐపి పత్రాలు తెలియపరుస్తున్నాయి. ఈ పత్రాల్లో కార్పొరేట్ కంపెనీలకు ఎక్కువ హక్కులు ఉంటాయని, భాగస్వామ్య దేశాల మాటల్ని

న్యాయసంస్థలు పట్టించుకోనవసరం లేదని తెలియపరుస్తున్నారు. ఇప్పటి వరకూ 14 రౌండ్ల సమావేశాలు జరిగినప్పటికీ అత్యంత గోప్యంగా ప్రజా వ్యతిరేక అంశాల్ని దాస్తున్నారని, ఈ లీకు పత్రాల ద్వారా మాత్రమే కొన్ని అంశాలు వెలుగులోకి వచ్చాయని గ్రీన్ పార్టీ నాయకుడు ఏమొన్ అంటున్నారు. పత్రాల ననుసరించి వినియోగదార్ల రక్షణ, పర్యావరణ రక్షణ, ప్రజా సర్వీసులు, ఆరోగ్యం ఇబ్బందులకు గురికానున్నందున యూరపు దేశాల పౌరులు రహస్య ఒప్పందాల విషయాన్ని బయట పెట్టాలని డిమాండు చేస్తున్నారు. యూరోపియన్ కౌన్సిల్ ఈ ఒప్పందాన్ని అడ్డుకోవాలని గ్రీన్ పార్టీ ఉద్యమాలు చేస్తోంది. ఈ ఒప్పందాలను ఆయా దేశాల చట్టసభలు ఆమోదం తెలుపవలసి ఉంటుంది.

ట్రాన్స్ పసిఫిక్ పార్టనర్‌షిప్ అగ్రిమెంట్ :

టిపిపిఎలో దక్షిణ కొరియా, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్, తైవాన్ దేశాలు భవిష్యత్తులో చేరే అవకాశాలు ఉన్నాయి. ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్యం (నాఫ్టా), అమెరికా ఈయు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, టిపిపిఎల కలయిక వల్ల ధనిక దేశాలు ఇంకా ధనికదేశాలై వర్తమాన దేశాలు మరింత వ్యత్యాసంతో కునారిల్లుతాయని ఆర్థిక శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఇది కేవలం ప్రపంచదేశాల మొదటిశ్రేణి 200 కార్పొరేషన్ సంస్థల ప్రయోజనాలకు మాత్రమే ఉపయుక్తంగా ఉంటుందనీ ఆందోళనకారులు అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు. "ఒప్పందంలోని షరతులు ప్రజలకు తెలియవు. ప్రజలతో పాటు ఆయా దేశాల చట్ట సభలకు కూడా తెలియనివ్వకుండా నాలుగుగోడల మధ్య సంప్రదింపులు జరిపారు. తద్వారా ఈ ఒప్పందం వలన ఒనగూరే ప్రయోజనాలు, దుష్ప్రయోజనాలపై చర్చ జరగనీయకుండా దేశాధినేతలు సంతకాలు చేయడం దారుణం" అంటున్నారు.ఈ ఒప్పందం ఉద్యోగభద్రత, వేతన ఆదాయం, రక్షిత ఆహారం, ఆరోగ్యానికి సంబంధించి మందుల ధరలపై నియంత్రణ లేకపోవటంతో అనేక సాంఘిక సమస్యలు ఎదురవుతాయంటున్నారు మానవహక్కుల సంఘ ప్రతినిధి క్లాడియో రూయిజ్.

వ్యాపార, ఆర్థిక, వాణిజ్య, శాస్త్ర, సాంకేతిక, పర్యావరణం మొదలైన అంశాల్లో పరస్పర సహాయ సహకారాలకు 2006లో బ్రూనై, చిలి, న్యూజిలాండ్, సింగపూర్ దేశాలు ట్రాన్స్ పసిఫిక్ వ్యూహాత్మక ఆర్థిక భాగస్వామ్యం (పి-4) పేరిట ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయి. దానిని ఇంకా విస్తృతపరిచి ఇంకొన్ని దేశాలను సభ్యులుగా చేర్చుకోవాలనే ప్రతిపాదనను అమెరికా చేసింది. దాంతో 2008 నుంచి ట్రాన్స్ పసిఫిక్ ఒప్పందం కొరకు 19 సార్లు మంతనాలు జరిగాయి. ఎనిమిదేళ్లపాటు చర్చించుకున్నా అందులోని అంశాలు కొస్తయినా వెల్లడికాకుండా అత్యంత గోప్యంగా ఉండిపోయాయంటే ఆ చర్చలు లోక కల్యాణానికి అయి ఉండకపోవచ్చునని ఎవరికైనా అనుమానం వస్తుంది. విశాల పిసిఫిక్ భాగస్వామ్య ఒప్పందం (టిపిపిఎ)పై వివిధ వర్గాలు గత కొన్నేళ్లుగా వ్యక్తం చేస్తూ వస్తున్న సందేహాల్లో నిజం ఉందని ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తున్న ఆ ఒప్పందం వివరాలు తెలియజెబుతున్నాయి.

పసిఫిక్ మహా సముద్ర తీర ప్రాంతాల్లోని 12 దేశాలు కుదుర్చుకున్న ఈ ఒప్పందంపై ఇప్పుడు అనేక అభ్యంతరాలూ, ఆందోళనలూ వ్యక్తమవుతున్నాయి.టిపిపి ఒప్పందంపై ఆయా దేశాల పార్లమెంట్‌లో కూడా ఆమోదం పొందాల్సి ఉంటుంది. అంతకుముందు ఆయా దేశాల్లో అమలవుతున్న అనేక చట్టాలను సవరించుకోవాల్సి ఉంటుంది.

ప్రస్తుతం అమెరికా వస్తు ఉత్పత్తులకు వివిధ దేశాల్లో 18 వేల రకాల పన్నులు వేయబడుతున్నాయి. ఈ ఒప్పందం ద్వారా అమెరికా ఉత్పత్తులకు పన్నుల రాయితీ లభించి తొలుత చౌకగా వస్తువులు లభ్యమైనప్పటికీ తదుపరి కాలంలో స్వదేశీ పరిశ్రమలూ, ఉత్పత్తులూ మూలనపడి భాగస్వామ్య దేశాల ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నమైపోయే ప్రమాదం పొంచి ఉంది. 'తద్వారా అప్పుల ఊబిలో కూరుకుపోయి తక్కువ ధరలకు ముడిసరుకులు విక్రయించడం ద్వారా దేశ సంపద తగ్గి ప్రజలు పేదరికంలోకి వెళ్లే ప్రమాదముంది. కొనుగోలు శక్తి దిగజారే ప్రమాదం ఉంది. వాణిజ్య ద్రవ్య సంస్థల ఒప్పందాల వల్ల అంతిమంగా ప్రయోజనాలు పొందుతున్నవి బహుళజాతి కంపెనీలు మాత్రమే. ఈ ఒప్పందాల ద్వారా భాగస్వామ్య దేశాల్లోని వస్తు తయారీకి కావలసిన పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందవు. అధికలాభాల మూలంగా అమెరికా, జపాన్ దేశాలు ఆటోమేషన్‌వైపు వెళుతూ నిరుద్యోగాన్ని పెంచుతాయి. దీనికితోడు భాగస్వామ్య దేశాలలో ప్రజా సంక్షేమ రంగాలకు వ్యయం తగ్గించడం ద్వారా ఆర్థిక అసమానతలు పెరుగుతాయి.

టి.పి.పి. ఒప్పందం తమ జాతీయ ప్రయోజనాలను దెబ్బతీస్తుందని సభ్య దేశాలన్నిటా విపక్షాల నుండి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వచ్చే నవంబర్‌లో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అమెరికాలోనే విపక్షమైన రిపబ్లికన్ పార్టీతోపాటు అధికార డెమోక్రటిక్ పార్టీలోని కీలకమైన నాయకులు కూడా దీన్ని వ్యతిరేకిస్తున్నారు. అందులో డెమోక్రటిక్ పార్టీ తరపున అధ్యక్ష పదవి అభ్యర్థిత్వానికి పోటీపడుతున్న హిల్లరీ క్లింటన్ కూడా ఉన్నారు. అయితే, ఎన్నికల ప్రచారానికి కార్పొరేట్ విరాళాలపై ఆధారపడే అమెరికా రాజకీయ నేతలు ఎంతకాలం టిపిపిని వ్యతిరేకించగలరన్నది ప్రశ్న. అమెరికాతోపాటు చిలీ, పెరూ, వియత్నాంవంటి దేశాలలో సైతం అభ్యంతరాలున్నాయి. న్యూజిలాండ్, జపాన్, ఆస్ట్రేలియా, కెనడాలో విపక్షాలు గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి.అయితే అందరి అభ్యంతరాలూ ఒకే రకమైనవి కావు. తమ మార్కెట్‌కు సభ్య దేశాలనుంచి చవక ఉత్పత్తులు వచ్చిపడతాయని, ఉన్న ఉద్యోగాలు కోల్పోవలసి వస్తుందని అమెరికాలో ఆందోళన వ్యక్తమవుతుంటే... ప్రాణావసరమైన ఔషధాల పేటెంట్లను గుప్పెట్లో పెట్టుకుని భారీయెత్తున లాభాలు ఆర్జించేందుకు సంపన్న దేశాలు పూనుకుంటాయని పేద దేశాల్లోని పౌర సమాజ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా తన ఫార్మసీ కంపెనీలైన ఫైజర్, రొచే గ్రూపు జనిటిక్స్, జపాన్ టకేడా ఫార్మసీ కంపెనీలు ఔషధాల విక్రయాన్ని అధిక రేట్లతో లాభాల వేటకు ఈ ఒప్పందం చాలా తోడ్పడుతుందని ఆందోళనలు ప్రారంభమై అమెరికాలాంటి దేశాల్లో ప్రదర్శనలు

జరుగుతున్నాయి.

టిపిపి ఒప్పందంలోని అంశాలు మాత్రం అమెరికాకు విపరీత ప్రయోజనాలు చేకూర్చేవిగా ఉన్నాయని అమెరికా వాణిజ్యశాఖ అధికారిక పత్రాల ద్వారా వెల్లడవుతోంది. లీడర్‌షిప్, జాబ్స్ అండ్ గ్రోత్, వ్యాల్యూస్ ప్రధాన అంశాలుగా అనేక ఉప అంశాలను ఒప్పందంలో చేర్చింది. ఇందులో ముఖ్యంగా ప్రస్తుత అమెరికా వాణిజ్య వ్యాపార ఉద్దీపనకు, డిజిటల్ ఆధార వ్యాపారం, ఆర్థిక లాభాలు, అమెరికా చిన్న, మధ్య తరహా వాణిజ్య అభివృద్ధి, అమెరికా తయారీ, వ్యవసాయరంగ వృద్ధి, ఆటోమొబైల్ రంగ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఆహార భద్రత, బహిరంగ, స్వేచ్ఛాయుత ఇంటర్‌నెట్ వినియోగం (వ్యాపారం కోసం) తదితర అంశాలు ప్రధానంగా ఉన్నాయి. ఇవన్నీ కూడా అమెరికా స్వలాభం, స్వప్రయోజనాలు, వ్యాపార వ్యాణిజ్య అభివృద్ధి, ఆధిపత్యం కోసం సాగేవే అని విమర్శకులు ఇప్పటికే పేర్కొన్నారు. ఈ టిపిపి అమలులోకి వస్తే ఆసియాలోని రెండు ప్రధాన దేశాలైన చైనా, భారత్‌లపై దాని ప్రతికూల ప్రభావం తీవ్రస్థాయిలో ఉంటుందని ఒక అంచనా.

భౌగోళిక రాజకీయ వ్యూహంలో భాగమే టిపిపి :

చైనా ఆర్థిక ప్రాబల్యాన్ని దెబ్బతీయడం లక్ష్యంగా అమెరికా చొరవతో ఈ చర్చలు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో 2008లో మొదలై... అమెరికాలోని అట్లాంటాలో 2015 అక్టోబర్ 5తో ముగిశాయి. ఆసియా పసిఫిక్ ఎకనామిక్ కార్పోరేషన్, ప్రపంచ వాణిజ్య సంస్థల విషయాలలో లాగానే టిపిపి నిబంధనలు అంగీకరించేటట్లు ఖచ్చితంగా భవిష్యత్తులో చైనా మెడలను వంచుతామని అమెరికా నిర్ధారితంగా ఆశిస్తుంది. కార్పొరేట్ లాభార్జననూ, ఆధిపత్యాన్ని మరింతగా పెంచుకునేందుకు ఇది అమెరికా పన్నిన వ్యూహమని నోమ్ చోమ్‌స్కీ, జోసెఫ్ స్టిగ్లిజ్ వంటి మేధావులు విమర్శిస్తున్నారు. ఇప్పడి వరకు సామ్రాజ్యవాద దేశాలతో కుదుర్చుకున్న ద్వైపాక్షిక, బహుళపక్ష ఒప్పందాలు అన్నీ అసమాన వాణిజ్య ఒప్పందాలే.

ఈ ఒప్పందాల ద్వారా జరగబోయే వాణిజ్యం రెండు ప్రధాన లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని అమెరికా పావులు కదుపుతోంది. 1. అమెరికా కార్పొరేట్లకు అధిక లాభాలను సృష్టించేందుకు, 2. చైనాను వాణిజ్య పరంగా ఈ కూటమి దేశాల్లో దెబ్బతీసేందుకు తద్వారా చైనా ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధిని అడ్డుకొనేందుకు, కోటి మంది మధ్యతరగతి ప్రజలకు వస్తు మార్కెటింగ్ కలిగిన ఆసియా ఖండంలో చైనా వస్తువుల గిరాకీ తగ్గించటమే అమెరికా వ్యూహం. చైనా వస్తువులను బహిష్కరించటం ద్వారా చైనా ఆర్థిక వ్యవస్థను నిరుత్సాహ పర్చటానికి పూనుకొంటుంది. ఈ కూటమి బహుళజాతి కంపెనీలకు అనుకూలంగా స్వదేశీ కంపెనీలు నడవాల్సి వస్తాయని ఈ దేశాల్లోని చట్టాలు, నిబంధనలు, పరిశోధన సంస్థలన్నీ ప్రత్యేక న్యాయహోదాలతో నడపబడతాయని ఇప్పటికే విమర్శలు ఎదురవుతున్నాయి.

వాషింగ్టన్ పోస్టు పత్రికలో ఒబామా ఒక వ్యాసాన్ని రాస్తూ "పబ్లిక్ రంగ పరిశ్రమలకన్నా, ప్రైవేటు రంగ పరిశ్రమలు ముందంజలో ఉండి ఆర్థిక ఆశయాలను సాధించగలవని, అంతర్జాల స్వేచ్ఛతో నవ్యత, సృజనాత్మకత, అపాయాల్ని ఎదుర్కొనే ధైర్య సాహసాలతో ముందుకు వెళ్తాం" అని అన్నారు. ఇది పైకి మేడి పండువలె చూడటానికి చాలా అందంగా ఉండొచ్చు. వినటానికి చక్కగా ఉండొచ్చు. కానీ ఆచరణలో పబ్లిక్ రంగం నుంచి ప్రైవేటు రంగ మార్పిడి అంటే ముందుగా మనకు గుర్తుకొచ్చేది సాంఘిక భద్రత కరువవ్వటం. అంటే విద్య, వైద్యం, ఇళ్లు, రవాణా ఖరీదవ్వటం. పబ్లిక్ రంగం అభివృద్ధి సమాజాభివృద్ధిగా మనం పరిగణించాలి. ప్రైవేటు రంగం అభివృద్ధి అంటే కార్పొరేట్ అనుకూల కొద్దిపాటి ధనవంతుల లాభాలకోసమని గ్రహించాలి.

రెండవ విషయం. ఆస్తుల పరిరక్షణ అంటే పేటెంట్లు, టెక్నాలజీ నోహౌవ్‌లు. వీటి ద్వారా వస్తువులు తయారీకి అనేక ఆంక్షలు విధించబడతాయి. ఒక వేళ చిన్నదేశాలకు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు తయారీ అనుమతినిచ్చినా అమెరికా వంటి దేశాల్లో నిషేధించబడ్డ పర్యావరణ ప్రతికూల పరిశ్రమలకు అగ్రతాంబూలం లభిస్తుంది. కనక కూటమిలోని వియత్నాం, మెక్సికో, చిలీ పెరూ వంటి దేశాలు తీవ్ర ప్రతికూల ఫలితాలను భరించవలసి వస్తుంది. మూడవ విషయానికొస్తే "అపాయాన్ని ఎదుర్కొవడం" అంటే చైనా వ్యతిరేక యుద్ధకూటమిని పసిఫిక్ ప్రాంతంలో మోహరించి చైనా వ్యతిరేకతను కవ్విస్తున్నారు. మూడున్నర లక్షల సైనికులు తిష్ఠ వేయటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ కూటమిలో పాల్గొనేందుకు భారతదేశంపై కూడా ఒత్తిడి వస్తుంది. మరోవైపు ఈ టిటిపి ఒప్పందం "మాకు యుద్ధ విమానాల నౌక లాంటిది" అని అమెరికా రక్షణ మంత్రి తన యుద్ధ వ్యూహాల్ని చెప్పకనే చెప్పాడు. మరొక మాటలో చెప్పాలంటే యూరప్‌లో ప్రచ్ఛన్న యుద్ధం, మధ్య ప్రాచ్యంలో కార్టర్ డాక్ట్రిన్‌ల వంటి ప్రణాళికనే ఈ టిటిపి సకల సౌభాగ్యాలతో తులతూగాల్సిన యూరపు ప్రజలు, అరబ్ దేశాలు నేడు ఆర్థిక సంక్షోభాలతో, అశాంతులతో, ఉగ్రవాదంతో, శరణార్థుల సమస్యలతో అమెరికా ఎత్తుగడలకు బలై పోయారు. నేడు మరలా పసిఫిక్ ప్రాంతానికి ఈ వ్యూహం పాకటంతో యుద్ధ వాతావరణం నెలకొనడం విచారకరం.

టిపిపి ఒప్పందం కుదిరిన తర్వాత అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా చేసిన అధికారిక ప్రకటనలో పేర్కొన్న అంశాలు విస్మయం కలిగిస్తున్నాయి. విశ్వవాణిజ్యంలో చైనా ఆధిపత్య ధోరణి, ప్రపంచాన్ని నిర్దేశించే లక్షణం అమెరికాకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని మరీ తెగేసి చెప్పారు. దీంతో దీని వెనుక అమెరికా రాజకీయ, వాణిజ్య, వ్యాపార విశాల ప్రయోజనాలు ఎలా ఉన్నాయన్నది సులభంగానే అంచనా వేయొచ్చు. అంతేకాదు 21వ శతాబ్దం అంతా ఈ వాణిజ్యం, వ్యాపారం సాగుతుందని, అది అమెరికాకు ఎంతో మేలు చేకూరుస్తుందని బరాక్ ఒబామా ప్రకటించడంతోపాటు ఒప్పందం అంతిమ లక్ష్యం అమెరికా ప్రయోజనాలే అని చెప్పడం ఆశ్చర్యకరం. ఆసియాలో జపాన్‌ను ఎంపిక చేసుకోవడం వ్యూహాత్మకమే. ఇప్పటికే తూర్పు, దక్షిణ చైనా సముద్రజలాల్లో పాగా కోసం, ఆధిపత్యం కోసం దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న

జపాన్‌ను భాగస్వామిగా చేసుకొని చైనాకు వ్యతిరేకంగా అమెరికా పావులు కదిపింది. ఇప్పుడు భారత్‌ను కూడా అమెరికాకు ఉపగ్రహంగా చైనా వ్యతిరేక కూటమిలోకి లాగుతోంది

ఆసియా పసిఫిక్ ప్రాంతంలో వాణిజ్యంపై చైనా గుత్తాధిపత్యాన్ని దెబ్బతీసే సత్తా టిపిపిఎకి ఉందని అమెరికా బహిరంగంగా ప్రకటించింది. టిపిపిఎ కారణంగా 2025 నాటికి చైనా రూ. 4,600 కోట్ల డాలర్ల మేరకు వ్యాపారం కోల్పోతుందని అంచనా. దక్షిణ చైనా సముద్రంలో ఆగ్నేయాసియా దేశాలతో, తూర్పు చైనా సముద్రంలో జపాన్‌తో చైనా వివాదం పెట్టుకోవడంవల్లే తీర దేశాలు టిపిపిఎ ద్వారా అమెరికా కౌగిట్లోకి చేరుకున్నాయి. దీనితో పసిఫిక్ ప్రాంతంలో చైనా పట్ల వ్యతిరేకత మరింత పెరగబోతోంది. టిపిపిఎ సభ్య దేశాల మధ్య ఐటీ, ఆర్థిక సేవల వ్యాపారం పెరగడం భారత్ మార్కెట్ వాటాను తగ్గించవచ్చు. రాబోయే అయిదేళ్లలో తన ఎగుమతులను రెట్టింపు (రూ. 90 వేల కోట్ల డాలర్లకు) పెంచాలన్న భారతదేశ లక్ష్యానికి టిపిపిఎ గండి కొట్టవచ్చునని సింగపూర్‌కు చెందిన డిబిఎస్ గ్రూప్ పేర్కొంది. టిపిపిఎ నిర్దేశించిన పర్యావరణ, కార్మిక ప్రమాణాలను పాటించి వస్తు సేవలను ఉత్పత్తి చేయడం చైనాకే కాదు భారత్‌కు కష్టమే. ఔషధ తయారీపై టిపిపిఎ నియంత్రణలు భారతీయ ఫార్మా కంపెనీలకు తీవ్ర నష్టం కలిగించక మానవు.

కార్పొరేట్ అనుకూల ప్రజావ్యతిరేక టిపిపి ఒప్పందం :

టిపిపి ఒప్పందం అమలైతే ఎలాంటి అప్రజాస్వామిక విధానాలు అమలవుతాయో అర్థం చేసుకోవాలంటే అందులోని కార్పొరేట్లు ప్రభుత్వాల మధ్య వివాద పరిష్కార ప్రక్రియ ఇన్వెస్టర్ స్టేట్ డిస్ప్యూట్ సెటిల్‌మెంట్ (ఐఎస్‌డిఎస్) నిబంధనను గమనించాలి. ఒక దేశంలో పెట్టుబడులు పెట్టిన విదేశీ సంస్థలు తమ పెట్టుబడులకు, లాభాలకు, ఆస్తులకు సదరు దేశ చట్టాలు, విధానాలు భంగం కలిగిస్తున్నాయని భావిస్తే, వాటిని ఆ దేశం వెలుపల కోర్టుల్లో, రహస్య ట్రిబ్యునళ్లలో సవాలు చేయవచ్చు. సాధారణంగా అంతర్జాతీయ న్యాయస్థానాలు ఒక దేశం మీద మరో దేశం వేసిన దావాను మాత్రమే విచారణకు స్వీకరిస్తాయి. కానీ, ఐఎస్‌డిఎస్ కింద కంపెనీలు నేరుగా ప్రభుత్వాల మీద దావా వేయవచ్చు. ప్రభుత్వాలు మాత్రం కంపెనీల మీద దావా వేసే వీలు లేదు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్లూటీఓ) నిబంధనల ప్రకారమైతే కంపెనీలు తమ దేశాల ప్రభుత్వాల ద్వారా ఇతర దేశాలపై దావాలు వేయవలసి ఉంటుంది. ప్రస్తుతం అంతర్జాతీయ ఒప్పందాల్లోని ఐఎస్‌డిఎస్ నిబంధనల ప్రకారం ప్రభుత్వాల మీద దావా వేసే అధికారాన్ని విదేశీ కంపెనీలకు ఇస్తున్నా, స్వదేశీ కంపెనీలకు ఆ అధికారం ఇవ్వలేదు. 1990 నుంచి ఇప్పటివరకు 100 దేశాల ప్రభుత్వాలపై 550 సార్లు దావా వేశారు. వీటిలో 65శాతం కేసుల్లో బహుళజాతి కంపెనీలకు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఇంతవరకు విదేశీ ప్రభుత్వాలపై దావాలు వేసిన కంపెనీల్లో అత్యధికం అమెరికాకు చెందినవే.

ఒప్పందం అమలు ప్రారంభమయ్యాక భాగస్వామ్య ప్రభుత్వం కొత్తగా ఏవైనా నియంత్రణ చట్టాలను తీసుకొస్తే... ఆ చర్య తమ ప్రయోజనాలను దెబ్బతీస్తుందంటూ ప్రభుత్వంపై కంపెనీలు వేరే దేశాల్లోని కోర్టుల్లో, ట్రిబ్యునళ్లలో దావా వేయడానికి ఈ నిబంధన వీలు కల్పిస్తోంది. ఆ దావాల విచారణ రహస్యంగా ఉంటుంది. మరోవైపు కార్పొరేట్ పరిశ్రమలు ఏ చట్టాలనైనా ఉల్లంఘిస్తే వాటిపై చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వాలకు ఉండదు. ఆ కంపెనీల కారణంగా నేల, నీరు, పర్యావరణం కాలుష్యం బారిన పడినా నోరెత్తడం సాధ్యం కాదు. నియంత్రణలు విధించడానికి ప్రభుత్వాలకున్న సార్వభౌమాధికారాన్ని ఐఎస్‌డీఎస్ దెబ్బతీస్తోంది. ప్రజారోగ్యం, నైతిక విలువలు, ఆహారభద్రత, పర్యావరణ, జీవజాలం, సహజ వనరుల రక్షణ కోసం నియమ నిబంధనలను రూపొందించుకునే హక్కు సభ్యదేశాలకు ఉండేది. టిపిపి నిబంధనల ద్వారా కార్పొరేట్లదే పైచేయి అవుతుందన్న భయాలు వ్యక్తమవుతున్నాయి.

విదేశీ కంపెనీల అక్రమాలను ఎవరైనా ఇంటర్నెట్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి మాధ్యమం ద్వారా ప్రపంచానికి వెల్లడించడానికి ప్రయత్నిస్తే అలాంటివారిపై కేసులు పెట్టొచ్చు. ఆ సమాచారాన్ని తొలగించమని కంపెనీలు కోరినప్పుడు ఫేస్‌బుక్ వంటి సంస్థలు అంగీకరించక తప్పదు. కార్పొరేట్ అక్రమాలు వెల్లడి చేయడం నేరంగా టిపిపి పరిగణించడంపై సర్వత్రా హాహాకారాలు రేగుతున్నాయి. ఎలాంటి వాణిజ్య ప్రయోజనం లేని ఫైల్ షేరింగ్‌ల విషయంలో సైతం ఎవరిపైన అయినా సివిల్, క్రిమినల్ కేసులు పెట్టేందుకు టిపిపి నిబంధనలు వీలు కల్పిస్తున్నాయి. ఇది అంతర్జాలంలో సమాచార వ్యాప్తికి, నవీకరణకు, కొత్త ఐటీ కంపెనీలకు, ప్రజావేగులకు పిడుగుపాటు అవుతుంది.

ఇక పేటెంట్లకు సంబంధించిన నిబంధనలు మరీ కఠినంగా ఉన్నాయి. అవి వాణిజ్య సంబంధ మేథోపరమైన హక్కుల (ట్రిప్స్)ను మించిపోయాయి. టిపిపిఎ అమలైతే ప్రాణావసరమైన ఔషధాల పేటెంట్లు బడా కంపెనీల వద్ద దీర్ఘకాలం ఉండిపోతాయని, వాటిని ఇతర సంస్థలు చవగ్గా ఉత్పత్తి చేయడం సాధ్యపడదని ఆ రంగంలోని నిపుణులు చెబుతున్నారు. నేడు టీకాలు, ప్రొటీన్లు, యాంటీ టాక్సిన్లతోపాటు జికా, డెంగ్, ఎబోలా, క్యాన్సర్ వంటి వ్యాధుల చికిత్సకు ఔషధాలను జెనెటిక్ ఇంజినీరింగ్ ప్రక్రియలో చేస్తున్నారు. వీటిని బయో లాజిక్స్ అంటారు. ఇవి రసాయన ఔషధాలకన్నా సమర్థమైనవి. అయితే 22 రెట్లు ఎక్కువ ఖరీదైనవి. బయో లాజిక్స్‌ను అనుకరించి తయారుచేసే బయో సిమిలర్ ఔషధాలు బాగా చవక ధరలకు లభిస్తాయి. కానీ, టిపిపి వల్ల బయో లాజిక్స్ తయారీ పరిజ్ఞానానికి ఎనిమిదేళ్లపాటు పేటెంట్ రక్షణ లభించడం వల్ల పేదలకు చవక బయో సిమిలర్స్ అందుబాటులో లేకుండా పోతాయి. పర్యవసానంగా టిపిపిఎలో భాగం కాబోతున్న మెక్సికో, వియత్నాం, చిలీ, మలేసియా దేశాల్లోని రోగులకు చావు తప్ప మరో గత్యంతరంలేని స్థితి కలగబోతున్నది.

టిపిపి, టిటిఐపి గుట్టును రట్టు చేసి అందులోని ప్రమాదకర అంశాలను ప్రజల ప్రయోజనం కొరకు ధ్వంసం చేయాలని విఖ్యాత ఆర్థికవేత్త జగదీశ్ భగవతి సూచించారు. దీనికి ఆయన 'డ్రాక్యులా

భస్మీకరణ' అని నామకరణం చేశారు. ప్రధానంగా అయిదు ప్రమాదకర అంశాలపై ప్రజా నిరసనాగ్రహాలు వ్యక్తమవుతున్నా యన్నారు. 1. ప్రపంచ వాణిజ్య ద్రవ్య సంస్థల ఒప్పందాల వల్ల అంతిమంగా ప్రయోజనాలు పొందుతున్నవి బహుళజాతి కంపెనీలు మాత్రమే. 2. ఈ ఒప్పందాల ద్వారా వర్ధమాన దేశాల్లోని వస్తు తయారీకి కావలసిన పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందవు.3. వాణిజ్య పోటీని తట్టుకోవడానికి అధికలాభాలు పొందడానికి పారిశ్రామిక అగ్ర దేశాలు ఆటోమేషన్‌వైపు వెళుతూ నిరుద్యోగాన్ని పెంచుతుంటాయి. 4. దీనికితోడు సాంఘిక సంక్షేమానికి కోత విధించడం ద్వారా ఆర్థిక అసమానతలు పెంచుతోంది. 5. వర్ధమాన దేశాల నుండి అగ్ర దేశాలకు మేధోవలస ద్వారా ఆయా దేశాల స్వావలంబనలు కుంటు పడుతున్నాయి. ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఈ మాదిరి అభివృద్ధి నమూనాకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు నిర్మించాల్సిన కర్తవ్యం బుద్ధిజీవులపై ఉంది.

ముగింపు :

ఇప్పటికే ప్రపంచ బ్యాంకు, ఐ.ఎం.ఎఫ్ వంటివి వర్ధమాన దేశాలకు అప్పులు ఇచ్చి నిబంధనల్లి రుద్దడం ద్వారా ఆయా దేశాల జాతీయ చట్టాల్ని, పథకాల్ని నిర్వీర్యం చేస్తున్నాయి. జాతీయ ప్రభుత్వాలు ప్రజలకోసం పని చేయడం కాకుండా ఐ.ఎం.ఎఫ్: ప్రపంచ బ్యాంకు కనుసన్నలలో సంపన్న దేశాల కార్పొరేట్‌ల కోసం పనిచేసే స్థితికి నెట్టబడ్డాయి. ఇప్పుడు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్యం జరిపించడం కోసం ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటిఓ) ను ముందుకు తీసుక వచ్చింది. స్వేచ్ఛా వాణిజ్యంలో పేద దేశాలు పాల్గొనడమంటే సంపన్న దేశాలతో సమాన స్థాయిలో వ్యాపారం చేయడానికి కాదు. అవి సంపన్న దేశాలతో సమాన భాగస్వాములుగా వ్యాపారం చేయలేవు. సంపన్న దేశాల వ్యాపార ప్రయోజనాల్ని పేద దేశాలు కాపాడాలి. సంపన్న దేశాల వస్తువులకు మార్కెట్‌గా ఉపయోగపడాలి. పేద దేశాల సహజ వనరులు, చౌక శ్రమను లూటీ చేయడానికే నన్నది అక్షర సత్యం.

1995లో డబ్ల్యూటిఓ ఏర్పడిన తర్వాతనే ఈ ప్రాంతీయ వాణిజ్య ఒప్పందాల ఏర్పాటు జోరందుకున్నాయి. నిజానికి డబ్ల్యూటిఓనే ఇటువంటి ఒప్పందాలను ప్రోత్సహిస్తున్నది. ముందుగా ఒక ప్రాంతంలో స్వేచ్ఛ వాణిజ్యం నెలకొంటే అది ప్రపంచ వ్యాపిత ఒప్పందాలకు దారి తీస్తుందని దాని ఉద్దేశం. ప్రపంచ వాణిజ్య సంస్థ దోహా ఏజెండా ముందుకు సాగుకుండా అమెరికా, ఫ్రాన్స్, ఇంగ్లాండ్ వంటి అగ్ర దేశాలు తీవ్రంగానే ప్రయత్నాలు చేశాయి. వర్ధమాన దేశాల ఐక్యతను చీల్చగలిగాయి. ఆ దేశాలు ప్రయోజనాలను దెబ్బతీసి అగ్రరాజ్యాల వ్యాపార ప్రయోజనాలు పరిరక్షించుకునే విధంగా నైరోబీ సమావేశంలో కొన్ని ఒప్పందాలు కుదుర్చుకున్నాయి కూడ. టిపిపి, టిటిఐపి లాంటి ప్రాంతీయ వాణిజ్య మండళ్ల ఏర్పాటు ద్వారా వర్ధమాన దేశాలను లొంగ దీసుకోవాలనే వ్యూహం ఉంది. తద్వారా కార్పొరేట్లకు లాభాలు సాధించాలన్న లక్ష్యం సామ్రాజ్యవాద దేశాలకు ఉందన్నది స్పష్టం.

కె.వి.ఆర్., శారదాంబ స్మారక కమిటీ ప్రచురణలుగా వస్తున్న

కెవిఆర్ రచనలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి.



కె.వి.ఆర్.
సాహిత్య వ్యాసాలు
మొదటి భాగం
వెల : రు. 300/-
పేజీలు : 798



కె.వి.ఆర్.
సాహిత్య వ్యాసాలు
రెండో భాగం
వెల : రు. 250/-
పేజీలు : 678



కె.వి.ఆర్.
సాహిత్య వ్యాసాలు
మూడో భాగం
వెల : రు. 250/-
పేజీలు : 598



కె.వి.ఆర్.
సామాజిక వ్యాసాలు
వెల : రు. 300/-
పేజీలు : 748



కె.వి.ఆర్.
డిటెన్యూ డైరీ
వెల : రు. 170/-
పేజీలు : 340

మరిన్ని వివరాలకు సంప్రదించండి : డి.వి. రామక్రిష్ణారావు, అరుణతార ఎడిటర్,
ఫోన్ : 99891 89250 (ఉదయం 9 లోపు సాయంత్రం 8 తరువాత మాత్రమే) ఈమెయిల్ : arunatara1977@gmail.com
మా ప్రచురణలు : నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ ఎదురుగా, కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్‌లోనూ లభిస్తాయి. ఫోన్ నెం: 040-24652387

రాయలసీమ - చిన్న రాష్ట్రాలు

అరుణ్

రాష్ట్రాల విభజనను వ్యతిరేకించేవారు, ముఖ్యంగా ప్రత్యేక రాయలసీమ రాష్ట్రాన్ని వ్యతిరేకిస్తున్న వారు పదేపదే విన్పిస్తున్న అభ్యంతరం - నాలుగు జిల్లాలతో రాయలసీమ రాష్ట్రంగా మనజాలదనే వాదన. చిన్న రాష్ట్రాలు అభివృద్ధి చెందజాలవని, అందుకై రాయలసీమ రాష్ట్రంగా అభివృద్ధి చెందదని మేధావులనబడేవారూ, అందులోనూ మార్క్సిస్టులని పిలవబడేవారు వాదించడం చూస్తుంటే చోద్యమనిపిస్తుంది.

అభివృద్ధికి చిన్న, పెద్ద అనే పరిధులను గురించి మాట్లాడటం అటుంచి, రాయలసీమ (నాలుగు జిల్లాలు) చిన్న రాష్ట్రం జాబితాలో చేరుతుందా? అనేది మౌలికమైన ప్రశ్న. జనాభా ప్రాతిపదికన చూసినా, విస్తీర్ణం దృష్ట్యా చూసినా, 'ప్రత్యేక రాష్ట్రం'గా రాయలసీమ దేశంలోని 19/17 రాష్ట్రాల కన్నా పెద్దది. ముఖ్యంగా మార్క్సిస్టు పార్టీ చాలా కాలంగా పరిపాలించి, అభివృద్ధి చేశామన్న కేరళ, త్రిపురలకన్నా పెద్దది. అభివృద్ధికి రాష్ట్రాల విస్తీర్ణం కొలమానం కావడం, అదీ మార్క్సిస్టులకూ కొలమానం కావడమే ఆశ్చర్యకరమైన విషయం. అయినా ప్రత్యేక రాయలసీమ రాష్ట్రాన్ని వ్యతిరేకించడానికి వారికి ఏదో ఒక సొడ్డు కావాలి గదా!

ప్రపంచంలోని 40 దేశాలకన్నా పెద్దది రాయలసీమ ప్రాంతం. 'అభివృద్ధి'కి ఇప్పటి వ్యవస్థలో ఇచ్చే నిర్వచనం ప్రకారం జీడీపీ పెరుగుదల - అది కేవలం రాష్ట్ర విస్తీర్ణాలపై ఆధారపడదు. చివరకు రాష్ట్రంలోని వనరులపైన మాత్రమే అధారపడదు. ఆ రాష్ట్రపు పాలకవర్గాలు, ఆ రాష్ట్రంలోని మానవ, సహజ వనరులను వినియోగించుకొనే విధానంపై ఆధారపడి ఉంటుంది. పెద్ద రాష్ట్రాలే అభివృద్ధి చెందుతాయనుకుంటే బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల మాటేమిటి? అవిభక్త బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లు దేశంలో అన్ని రంగాలలో అత్యంత వెనుకబడిన రాష్ట్రాలుగా మిగిలిపోయింది ఎందుకు? అనే ప్రశ్న ఉదయించక మానదు. ఆయా దేశాలు, రాష్ట్రాలు వనరులు కల్గివుండి వెనుకబడి ఉండడానికి చారిత్రక కారణాలుంటాయి. అత్యంత సహజ సంపద కల్గిన ఆఫ్రికన్ దేశాలు పేదరికంలో మగ్గడానికి, ఏ సహజవనరులూ లేక, కేవలం మానవ వనరులపై ఆధారపడ్డ సింగపూర్, మలేషియా, థాయ్‌లాండ్ లాంటి దేశాలు అభివృద్ధి చెందినవిగా పేరు పొందడం ఎందుకు? చారిత్రక నేపథ్యం, పాలకవర్గ స్వభావాలను పరిగణన లోనికి తీసుకోకుండా, ఒకరాష్ట్రం, దేశం అభివృద్ధికి, ఆయా రాష్ట్రాల, దేశాల భౌగోళిక విస్తీర్ణం కారణమనడం అహేతుకం గాదా!

విస్తీర్ణం ప్రకారం 67,299 చ.మీ.లతో 19 రాష్ట్రాల కన్నా రాయలసీమ పెద్దది. జనాభా (2001 జనాభా లెక్కల ప్రకారం) 1,34,60,253. జనాభాలో కూడా 17 రాష్ట్రాల కన్నా పెద్దది.

ఇక చిన్న రాష్ట్రాలు అభివృద్ధి చెందవా? జాతీయ అభివృద్ధి సంస్థ ఆమోదించిన 11వ పంచవర్ష ప్రణాళిక నివేదిక.

వ.నెం.	రాష్ట్రం పేరు	సంవత్సరానికి లక్ష్యం	అభివృద్ధి సాధించినది
1.	చత్తీస్‌గడ్	6.1 శాతం	9.2 శాతం
2.	మధ్యప్రదేశ్	7 శాతం	4.3 శాతం
3.	జార్ఖండ్	6.9 శాతం	11.1 శాతం
4.	బీహార్	6.2 శాతం	4.7 శాతం
5.	ఉత్తరాంచల్	6.8 శాతం	8.8 శాతం
6.	ఉత్తరప్రదేశ్	7.6 శాతం	4.6 శాతం

పెద్దరాష్ట్రాలు - అభివృద్ధి చెందని ప్రాంతాలు

అభివృద్ధి చెందిన దేశాలు, ప్రాంతాలు అప్పటికే అభివృద్ధి చెందని దేశాలను, ప్రాంతాలను వనరుల కోసం, ముడిసరుకు కోసం, తయారీ సరుకుల మార్కెట్ కోసం, తమ వలసలుగా మార్చుకొనడం ఈ యుగలక్షణం. అందుకే, అభివృద్ధి చెందిన దేశాలు, ప్రాంతాలు, తమ వలస (నయావలస) దేశాలను, ప్రాంతాలను అభివృద్ధి చెందనీయవు. జాతుల విషయంలోనూ ఇదే పరిపాటి. గతంలో మన దేశంలో హిందీ భాషా రాష్ట్రాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా, దక్షిణాదివారు ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర ఉంది. అదేవిధంగా తమిళుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా తెలుగువారు 'తెలుగుజాతి' ఆత్మగౌరవం పేరుతో చేసిన పోరాటం 'ఆంధ్రరాష్ట్ర' ఆవిర్భావానికి దారితీసింది. అలాగే, ఒకే జాతిలో అభివృద్ధి చెందిన కోస్తా ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్వహించి 'ప్రత్యేక రాష్ట్రం' సాధించుకున్నారు తెలంగాణ ప్రజలు.

సమైక్య రాష్ట్రంలో అన్ని రంగాలలో వివక్షతకు గురై దాదాపు 62 సంవత్సరాలు కోస్తా ఆధిపత్యం కింద నలిగిన రాయలసీమ ప్రజలు, నేడు అవశేష ఆంధ్రప్రదేశ్‌లో అదేరకమైన, అంతకన్నా ఘోరమైన అనుభవాలు పొందుతున్నారు. కొత్త అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టక పోగా, జి.ఓ. 120తో రాయలసీమ బాలికల మెడికల్ సీట్లను కోస్తాకు మరలించడం, తిరుపతిలో ఏర్పాటయిన 'కాన్సర్ సంస్థ'ను రాజమండ్రికి, అనంతపురానికి మంజూరు చేస్తామన్న ఆల్ ఇండియా మెడికల్ సైన్సు సంస్థను గుంటూరుకు తరలించడం, అనంతపురం మెడికల్ కాలేజీకి మంజూరు చేయబడ్డ రూ. 9 కోట్ల రూపాయలను విశాఖ మెడికల్ కాలేజీకి తరలించడం ఇవన్నీ నేటి ప్రభుత్వం సీమ ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా చూడటంలేదనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అందుకే,

సీమవాసులు తమ వనరులు, తమ పాలన, తమ అభివృద్ధి 'ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం'లోనే సాధ్యమనే హేతుబద్ధమైన నిర్ణయానికొచ్చారు.

పెద్ద రాష్ట్రాలలో వెనుకబడ్డ (వెనుకకు నెట్టివేయబడ్డ) ప్రాంతాలు వివక్షకు గురికావడం పార్లమెంటరీ వ్యవస్థలో సర్వసాధారణమే. ఏ ప్రభుత్వం అయినా, ఆ రాష్ట్ర మెజారిటీ శాసన సభ్యుల ఆకాంక్షలకనుగుణంగా పని చేయాల్సిందే. ఇక, కాంట్రాక్టర్ల మంజూరు, ప్రైవేట్‌రంగ సంస్థలకు స్థల కేటాయింపులు, సాంకేతిక సంస్థల, విద్యా, వైద్య సంస్థల ఏర్పాటు, భూసేకరణ, నష్టపరిహార విధానం, రకరకాల ప్రభుత్వ రాయితీలు వీటన్నిటిలో ప్రభుత్వ పాత్ర ప్రధానం అనే విషయం ఎవ్వరూ కాదనలేని నిజం. దాంతో, సహజంగానే పెద్ద రాష్ట్రాలలో ప్రభుత్వాలు అప్పటికే వనరులు, నైపుణ్యం, అధికారం, ప్రాబల్యం కల్గిన ప్రాంతాలకే పై కేటాయింపులలో ప్రాధాన్యత ఇస్తుంది. గతంలో హైద్రాబాద్‌లో అభివృద్ధి కేంద్రీకరణ, ఇప్పుడు అవశేష ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు - విశాఖ కారిడార్‌కు అన్ని రంగాలలో ప్రాముఖ్యత ఇవ్వడం చూస్తూనే ఉన్నాం. ఈ విధానం వల్ల అభివృద్ధి చెందని ప్రాంతాలు, అభివృద్ధికి నోచుకోవు. ఆ అనుభవం గత 62 సంవత్సరాల నుండి రాయలసీమ, శ్రీకాకుళాంధ్ర ప్రాంతాలు రుచిచూస్తూనే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలే గాదు, కేంద్ర కార్యాలయాలు, సంస్థలు, చివరకు 7 వెనుకబడిన జిల్లాలకై కేంద్ర ప్రభుత్వం విదిల్చిన ఎంగిలి మెతుకులూ రు. 350 కోట్లు కూడా ఆ జిల్లాలలో వినియోగించలేదనేది చేదు వాస్తవం.

ఇక్కడే 'ప్రత్యేక హోదా' అనే ఎండమావి వెంట ప్రజల్ని పరిగెత్తించాలనుకుంటున్న రాజకీయ పార్టీల గురించి చెప్పాల్సి ఉంది. 'హోదా' రాదు. వచ్చినా పరిశ్రమలు సీమలో పెట్టరని మొన్న విశాఖలో జరిగిన పారిశ్రామికవేత్తల భాగస్వామ్య సదస్సులో రాయలసీమ వాటాను పరిశీలిస్తే అర్థమవుతుంది. ఆ భాగస్వామ్య సదస్సులో, ఎం.ఓ.యు. (విశాఖ) జరిగిన ఒప్పందాల మొత్తం 3.89 లక్షల కోట్లలో, రాయలసీమలో పెట్టుబడులు కేవలం రూ. 1,570 కోట్లు మాత్రమే. (ఆ ఒప్పందాలన్నీ అమలులోకి వస్తాయా, రావా? అనే మరో విషయం) పోతే, తెలిసేదేమంటే 'ప్రత్యేక హోదా' వచ్చినా, గిచ్చినా సీమలో పెట్టే పరిశ్రమలు ఏవీ ఉండవని అర్థమవుతోంది. ఇప్పటికే రాయలసీమ వాసులకు కోస్తా వివక్ష అనుభవం ఉంది. 2015-16 బడ్జెట్‌లో పెండింగ్ ప్రాజెక్టులకై కేంద్రం ఇచ్చిన రు. 900 కోట్లలో ఒక్క రూపాయి సీమ ప్రాజెక్టులకు కేటాయించలేదు. పోగా, అప్పుడే మొదలెట్టిన పట్టిసీమకు రు. 750 కోట్లు కేటాయించారు. ఇక ప్రత్యేక హోదా వచ్చినా సీమకు ఒరిగేదేముంటుంది. చట్టంలో లేని ప్రత్యేక హోదా గురించి ఆందోళనలను చేయిస్తున్న అన్ని పార్టీలు విభజన చట్టంలోని హామీలు నెరవేర్చాలని మాత్రం ఆందోళనలు చేయడం లేదు. వీరా రాయలసీమ అభివృద్ధి కాముకులు?

పెద్ద రాష్ట్రాలలో ప్రభుత్వ నిర్లక్ష్యం, వివక్ష అలా ఉంటే, "అభివృద్ధి"కై పోరాటాలు చేయాలనే మార్క్సిస్టుల సూచనలు పరిశీలిద్దాం. నేటి ప్రభుత్వాలు విజ్ఞప్తులకు, అప్పుడప్పుడు అక్కడక్కడా ప్రజలు నిర్వహించే 'ధర్నా'లు, 'రాస్తారోకో'లకు స్పందించవు. పెద్ద ఎత్తున ప్రజల్ని కదిలించాలి. దీర్ఘకాలిక పోరాటాలు నిర్వహించాలి. రాజకీయ పార్టీలు, నాయకులు తూతూ మంత్రంగా అడపదడపా నిరసనలు తెల్పినా ప్రభుత్వాలు కదలవు. నేడు అమరావతిలో భూసేకరణ విషయంలోనూ, రాయలసీమ ఆడపిల్లల మెడికల్ సీట్లను కొల్లగొట్టడానికి విడుదల చేసిన జి.ఓ. 120 విషయంలోనూ, అనంతపురం జిల్లా రైతాంగపు ఆత్మహత్యల విషయంలోనూ ప్రజల ఆందోళనలను ప్రభుత్వం ఖాతరు చేయలేదు. ఇక ఉద్యమాలు నిర్వహించిన అంగన్‌వాడీల ఉద్యోగాలనే పీకేసారు. పెద్దరాష్ట్రాలలో అభివృద్ధి చెందని ప్రాంతాలకు అధికార కేంద్రాలు ఆమడదూరంలో ఉంటాయి. ప్రజలకు తమకు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా, పెద్దయెత్తున సమీకరణం కావడం అంత సాధ్యం కాదు. ఎక్కడో చిత్తూరు జిల్లాలోని ప్రజలు, మరీ ముఖ్యంగా, దళితులు, పేదలు పెద్ద ఎత్తున కదిలి 'అమరావతి'కెళ్ళి నిరసన తెల్పడం సాధ్యం కాదు. ఒకవేళ పెద్దఎత్తున కదలినా, వారి ఆర్థికపరిస్థితి వల్ల వారా ఉద్యమాలను చాలాకాలం కొనసాగించడం కష్టమవుతుంది. అదే, అధికారకేంద్రాలు దగ్గరగా ఉంటే, ప్రజలు కార్యాలయాలనూ, ప్రజా ప్రతినిధులనూ నిలదీసే అవకాశం ఎక్కువ, సులభసాధ్యం కూడా. ఈ విషయం మనకు గత తాలుకాల్లో, నేటి మండలాలలో ప్రజల అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి.

గతంలో మైళ్ళ దూరంలో వున్న తాలుకా కార్యాలయాల ముందు నిరసన తెల్పి, తమ హక్కులను సాధించుకొనడం సామాన్య ప్రజలకు అంతగా సాధ్యమయ్యేది కాదు. వారికొక రాజకీయనాయకుని అండ అవసరమయ్యేది. నేడు మండల కేంద్రం దాదాపు 10 కిలోమీటర్ల లోపు అన్ని గ్రామాలకు అందుబాటులో ఉంటుంది. కనుక సామాన్య ప్రజలు, తమ హక్కులకోసం పెద్ద ఇబ్బందులకు గురి కాకుండా మండల కార్యాలయాలకు వచ్చి తమ పనులు సమకూర్చుకుంటున్నారు. చిన్న రాష్ట్రాలు ప్రజలు ఉద్యమించడానికి, సంఘటితమవ్వడానికి దోహదం చేస్తాయి. రాష్ట్రం విస్తీర్ణం చిన్నదిగా ఉంటుంది కాబట్టి, ఆ రాష్ట్రంలోని నలుమూల ప్రాంతాల పీడితులు ఏకం అయ్యేందుకు సాధ్యమవుతుంది. ప్రజల సంఘటిత శక్తి బలోపేతమవుతుంది. ఒక ప్రాంతంలో జరుగుతున్న పాలకవర్గ, సామాజిక అణచివేతలకు వ్యతిరేకంగా మిగతా ప్రాంతాల ప్రజలు, సంఘీభావంగా ఉద్యమాలలో కలిసి పనిచేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మరీ ముఖ్యంగా ఎన్నికయిన ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో లేకుండా ఎక్కువ కాలం ఉండలేరు కూడా.

ఇక, భారత రాజ్యాంగ చట్టం ఆర్టికల్ 170(1)3 ప్రకారం ఒక రాష్ట్రం చిన్నదయితే 60కి తగ్గకుండా శాసనసభ్యులుండాలి. ఒక లక్ష జనాభాకు ఒక శాసనసభ్యులుండాలి. నేడు రాయలసీమ జనాభా దాదాపు 2 కోట్లు కాబట్టి 200 మంది శాసనసభ్యులుండాలి. వాటిలో కొన్నయినా బడుగు, బలహీన వర్గాలకు లభిస్తాయి.

రాయలసీమలో - కర్నూలు జిల్లాను, కర్నూలు, నంద్యాల, ఆదోని, కడప జిల్లాను - కడప, పొద్దుటూరు, అనంతపురం జిల్లాను - అనంతపురం, గుంతకల్, హిందూపురం, చిత్తూరు జిల్లాను -

చిత్తూరు, తిరుపతి జిల్లాలుగా విభజించాల్సిన అవసరముంది. 10 జిల్లాల ఏర్పాటుతో కొత్తగా కార్యాలయాలు, ఉద్యోగాలు, ఉపాధి ఏర్పడటమే గాక, పాలన కార్యాలయాలు ప్రజలకు మరింత అందుబాటులో ఉంటాయి.

ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుతో, కొత్తగా రాష్ట్ర, కేంద్ర కార్యాలయాలు, విద్యా, వైద్య సంస్థలూ ఏర్పాటవుతాయి. మన ఖనిజ సంపదను, అటవీ సంపదను మన రాష్ట్రంలో అభివృద్ధికే వినియోగించుకోవచ్చు. ఇప్పటి వరకు, ముడిసరుకుగా అవన్నీ అభివృద్ధి చెందిన ప్రాంతాలకు తరలివెళ్ళాయి. దాంతో, సహజవనరులు సీమవి. ఉపాధి, ఉద్యోగాలు అభివృద్ధి చెందిన ప్రాంతాలవి. ఈ దోపిడీకి, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతో అడ్డుపడుతుంది.

అయితే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుతో, అభివృద్ధి అందరికీ సమానస్థాయిలో అందుతుందా? అంటే లేదనే చెప్పాలి. ప్రత్యేక రాష్ట్ర మేర్పడినా, ఈ వ్యవస్థలో, పాలకవర్గ స్వభావంలో మౌలిక మార్పు రాదు. వ్యవస్థ మార్పుకు జరపాల్సిన పోరాటం దీర్ఘకాలికమైనది, ఎన్నో త్యాగాలతో కూడినది. పోతే రాయలసీమ రాష్ట్ర మేర్పడడం వల్ల, ఇక్కడి జలవనరులు, అటవీ, ఖనిజ సంపదలు ఈ ప్రాంత అభివృద్ధికే వినియోగించేలా చూడవచ్చు. అందువల్ల ఈ ప్రాంత ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. పేదప్రజల జీవితాలు కొంతవరకైనా మెరుగుపడుతాయి.

'ప్రత్యేకరాష్ట్ర' డిమాండ్ ఈ వ్యవస్థలోనే, ఇప్పుడున్న రాజ్యాంగ పరిధిలోనే చేస్తున్న ప్రజాస్వామిక డిమాండ్. 'అభివృద్ధి'కి ఇదేమీ వ్యతిరేకం కాదు. పోగా, 62 సంవత్సరాల అనుభవం వల్ల రాయలసీమ వాసులు, ఇప్పుడున్న రాష్ట్ర పరిధిలో, కోస్తాదోపిడీ నుండి విముక్తి పొందలేమని, ఈ ప్రాంతం అభివృద్ధిచెందే అవకాశంలేదని గ్రహించాలి. దేశాలు స్వాతంత్ర్యం కోరడం విదేశీదోపిడీ నుండి విముక్తి చెందడానికే గాని, సమస్త ఆర్థిక, సామాజిక, అంతరాలు దాని వల్లే తొలగిపోతాయని విజ్ఞులు అనుకోలేదు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంతరాల నుండి విముక్తి, దోపిడీ, పీడన నుండి విముక్తికై చేసే పోరాటానికి, విదేశీశక్తుల నుండి విముక్తి చెందడం తొలి అడుగు. 1947లో స్వాతంత్ర్యం పొందామనుకున్నవారంతా నేడు దళిత, బలహీన, మైనారిటీ, మహిళా వర్గాలు వివిధ రకాల పీడనల నుండి పూర్తిగా విముక్తి చెందలేదనే విషయం అంగీకరిస్తారు. అదేవిధంగా 'ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం' ప్రజాస్వామ్య రాయలసీమ రాష్ట్ర సాధనాక్రమంలో తొలి అడుగు మాత్రమే గాదు, అవసరమైన అడుగు కూడా.

రాయలసీమ అభివృద్ధి కాముకులమని చెప్పుకునేవారు "ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం" ఏర్పాటుతో ఏర్పడబోయే ప్రమాదాల గురించి వాపోతున్నారు. అందులో...

1) ఫెడరల్ వ్యవస్థకు విఘాతం :

అసలు ఫెడరల్ వ్యవస్థ ఇప్పుడుందా? అనేది ప్రశ్నించుకోవాలి. పేరుకు ఫెడరల్ వ్యవస్థేగాని అమలులో యూనిటరీ వ్యవస్థనే. రాష్ట్రాలను తొలి నుంచి కేంద్ర ప్రభుత్వాలు, మున్సిపాలిటీలుగా కాదుగదా, కనీసం గ్రామ పంచాయితీలుగా చూడటం లేదు. రాజ్యాంగపరంగా ఎన్నుకున్న ప్రభుత్వాలను, నాటి సోషలిస్టు నెహ్రూ కాలం నుండి, నేటి హిందూత్వ మోడీ ప్రభుత్వం వరకు, కూలగొట్టేందుకు ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. కూలగొట్టాయి కూడా. ఆ ప్రయత్నంలో, నేడు ఫెడరల్ వ్యవస్థ ఉందని ప్రజలకు భ్రమ కల్పించే మార్క్సిస్టులకు, నాటి తమ కేరళ ప్రభుత్వానికి పట్టిన గతి జ్ఞాపకం రాకపోవడం విచిత్రం. అన్ని పార్టీలు, ఒక్కసారి కేంద్రంలోకి అధికారంలోకి రాగానే వివిధ రాష్ట్రాల ప్రజలను, తమ పార్టీకి ఓట్లు వేస్తేనే, రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయంటున్నాయి. అంటే, రాష్ట్రాలు చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా, కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉంటే, రాష్ట్రంలో అదే పార్టీ ప్రభుత్వముండాలనడం ఫెడరల్ వ్యవస్థకు భగ్నం కాదా? అంతెందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా, కర్నూల్, కడప జిల్లాల ప్రజలు తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేయలేదని, అందుకని ఈ ప్రాంతపు అభివృద్ధికి తామెందుకు పాటుపడాలన్నట్లు మాట్లాడారు కూడా. అదేవిధంగా ఉభయగోదావరి జిల్లాల ప్రజలు, తమ పార్టీకి బ్రహ్మరథం పట్టారు కాబట్టి, ఆ జిల్లాల సర్వతోముఖాభివృద్ధి తమ ధ్యేయమని ప్రకటించాడు. ఇక తమ స్వంత ప్రయోజనాల కోసం అధికార పార్టీలోకి మారుతున్న వారు కూడా, తమ నియోజక అభివృద్ధి కోసమే పార్టీలు మారుతున్నామని చేసుకుంటున్న సమర్థనలో కొంతమేరకు నిజముందని, చంద్రబాబు, మోడీ చేతలు రుజువు చేస్తున్నాయి. ఇవన్నీ ఫెడరల్ వ్యవస్థకు భగ్నం కానపుడు, ఒక రాయలసీమ రాష్ట్రం ఏర్పాటుతోనే ఫెడరల్ వ్యవస్థ దెబ్బ తింటుందనడం హాస్యాస్పదం. ఉదాహరణకు నాటి ఉత్తరప్రదేశ్ నుండి నేటి అరుణాచల్‌ప్రదేశ్ వరకు గవర్నర్లను గుప్పిట్లో పెట్టుకొని కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయలేదా? 'రాయలసీమ రాష్ట్రం' అనగానే ఫెడరల్ వ్యవస్థకు భగ్నం అనే మార్క్సిస్టులకు గతంలో గోవా, ఢిల్లీ, హర్యాణ, పంజాబ్ రాష్ట్రాల ఏర్పాటు సమయంలో ఫెడరల్ వ్యవస్థ గుర్తుకు రాలేదా? మార్క్సిజాన్ని నిరంతరం మారుతున్న పరిస్థితుల కనుగుణంగా అన్వయించకుండా, ఒక 'మతం'గా భావించేవారికి ఎవరైనా యేం చెప్పగలరు?

2) చిన్న రాష్ట్రాలలో మాఫియాలు :

చిన్న రాష్ట్రాలేర్పడితే మాఫియాల పాలన ఉంటుందని భయాందోళన వ్యక్తం చేసేవారికి, అవిభక్త బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లలో మాఫియాల రాజ్యం గుర్తుకు రాలేదా. ఝార్ఖండ్‌లో మాఫియా గురించి మాట్లాడేవారికి ఆ ప్రాంతం విడిగా ఏర్పడనప్పుడు ఆ ప్రాంతంలో మాఫియాల రాజ్యం ఉన్న సంగతి గుర్తులేదా? నిన్నటి, మొన్నటి గనుల మాఫియా నాయకుడు గాలి జనార్ధన్‌రెడ్డి చిన్న రాష్ట్రానికి చెందినవాడు కాడే. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో గనుల, సారా కాంట్రాక్టర్ల మాఫియాలు కాదా! 'కాల్‌మనీ' మాటేమిటి? భూకబ్జాదారులకు మాఫియాలకు, ప్రభుత్వ సహకారాలున్నంత కాలం, ప్రజల్లో వారినెదిరించే చైతన్యం, ఆత్మస్థైర్యం లేనంత కాలం, మాఫియాలు రాజకీయ నాయకుల ముసుగులో కొనసాగుతుంటారు. నేటి ఆంధ్రప్రదేశ్‌లో విద్యా రంగంలో, వైద్యరంగంలో ఉన్న మాఫియాల మాటేమిటి? వారికి

చిన్న, పెద్ద రాష్ట్రాలనేవి అడ్డంకులు కావు. ప్రభుత్వాలే వారి గుప్పిట్లో ఉన్నప్పుడు తెగువ చూపి, వారికెదురునిలిచే ప్రజాస్వామిక శక్తులు లేనపుడు, చిన్న రాష్ట్రాలనే గాదు, పెద్ద రాష్ట్రాలనూ వారే ఏలుతున్నారు, ఏలుతారు కూడా.

3) కేంద్రంతో బేరసారాలు :

చిన్న రాష్ట్రాలలో పార్లమెంట్ సభ్యులు తక్కువ మంది ఉంటారు గనుక కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు సంపాదించడం కష్టమని మరొకవాదం. ఈ వాదనలో రెండు బలహీనతలున్నాయి. పెద్ద రాష్ట్రమైనా పార్లమెంట్ సభ్యులు ఎక్కువగా ఉన్నా, ఆ సభ్యులు కేంద్రంలో అధికారమున్న పార్టీవారు గాకపోతే, వారికనుకూలురుగా లేకపోతే ఆ రాష్ట్రానికి నిధులందవు. ఇప్పుడు జరుగుతున్నదదే. కేంద్రంలో పూర్తి మెజారిటీ ఉన్నప్పుడు, కేంద్ర ప్రభుత్వం ఎవ్వరినీ పట్టించుకోదు. చివరకు తమ పార్టీ అధికారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ (39 పార్లమెంటరీ సభ్యులున్నప్పుడూ), కేంద్రంలో చిన్నాచితక పార్టీలతో ప్రభుత్వమేర్పరిచిన యుపిఏ 1 గాని యుపిఏ 2 గాని ఆంధ్రప్రదేశ్‌కు పెద్దగా సహాయం చేసిన దాఖలాలేమీలేవు. అంటే కేంద్రంలో బేరసారాల విషయంలో చిన్న రాష్ట్రమా, పెద్ద రాష్ట్రమా అని గాకుండా కేంద్రంలో ఉన్న ప్రభుత్వం పూర్తి మెజారిటీ ఉందా లేదా? కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ, రాష్ట్రాలలో అధికారంలో ఉన్న పార్టీలు ఒకటేనా, వేర్వేరా, మిత్రపక్షాలా? కాదా? అనేదానిపై ఆధారపడి ఉంటాయి. కేంద్రప్రభుత్వంలో అధికారంలో ఉన్న పార్టీల రాజకీయఅవసరాలబట్టి రాష్ట్రాలకు నిధుల కేటాయింపులుంటాయి. అంతెందుకు మార్క్సిస్టులు దశాబ్దాలు పాలించిన పశ్చిమ బెంగాల్ పెద్ద రాష్ట్రాలలో ఒకటేగదా! మరి వారు పాలించినంత కాలం, కేంద్ర ప్రభుత్వాలు తమ రాష్ట్రానికి తగినన్ని నిధులు కేటాయించడం లేదని ఆరోపిస్తూనే ఉన్నారు కదా? మరి పెద్ద రాష్ట్రమయినా, అధిక సంఖ్యాకులు పార్లమెంట్ సభ్యులున్నా, ఎందుకు మార్క్సిస్టు ప్రభుత్వం కేంద్రం నుండి నిధులు రాబట్టలేకపోయింది? అదేవిధంగా, బీహార్‌లో ఎన్నికల అవసరానికై లక్షల కోట్లు మంజూరు చేసిన కేంద్రప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లో విభజన చట్టంలో వున్న హామీలను నెరవేర్చడం లేదంటే కారణాలను రాజకీయ కోణంలో విశ్లేషించాలి తప్ప చిన్న, పెద్ద రాష్ట్రాల దృష్టితో కాదనేది గ్రహించాల్సిన అవసరం, 'రాయలసీమ రాష్ట్రాన్ని' వ్యతిరేకించే పెద్దలు గ్రహించాలి.

'ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం'లో రెడ్డి సామాజికవర్గపు పీడన ఎక్కువగా ఉంటుందని, బడుగు, బలహీన వర్గాల, కులాల అణచివేత పెరుగుతుందనే భయాందోళనలు, రాయలసీమ రాష్ట్రాన్ని వ్యతిరేకించేవారు. ముందుకు తెస్తున్న మరోవాదన. ఇలాంటి వాదన చేస్తున్నవారు రాయలసీమ ప్రాంత రాజకీయ చరిత్రపై అవగాహన లేనివారై ఉండాలి, లేక తమకు తెలిసీ, ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్న వారైనా ఉండాలి. ఈ ప్రశ్న వేస్తున్నవారు, నేడు విద్యావంతులుగా, మేధావులుగా పిలవబడుతున్నవారు కాబట్టి, వారి చేస్తున్న వాదన, వారి అవగాహన రాహిత్యం గాక, ప్రజల్ని తప్పుదారి పట్టించే కుట్రగా చెప్పవచ్చు.

దళిత, బహుజనవర్గాల నిస్సహాయతకు, వారి పేదరికం, కులవ్యవస్థ కారణమని చెప్పవచ్చు. అవి రెండూ జమిలిగా ఉన్నాయి కూడా. విద్యావంతులైన దళిత, బహుజనులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నప్పుడు, అగ్రవర్ణాల పంచన చేరాల్సిన అవసరం ఉండదు. 'విద్య' వారికి ఆత్మగౌరవ చైతన్యాన్నిస్తే, 'ఉపాధి' వారిని స్వతంత్రంగా నిలబడేలా చేస్తుంది. ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం ఏర్పడడంతో జలవనరుల సద్వినియోగంతో సహజంగానే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అంతో, కొంత భూములున్న దళితులకూ, బహుజనులకూ నీటివసతి కల్గుతుంది. కొత్త కార్యాలయాలు, విద్యాసంస్థల, వైద్యసంస్థల వల్ల, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండవుతాయి. ఎప్పుడైతే పీడితవర్గాలు ఆర్థికంగా స్వతంత్ర్యం సంపాదించుకోగలరో, అప్పుడు వారికి ప్రశ్నించే ధైర్యం, ఎదిరించే శక్తి ఒనగూరుతుంది.

ప్రత్యేక రాయలసీమ రాష్ట్రంలో బలమైన సామాజిక ఆధిపత్యం గురించి మాట్లాడేవారు, ప్రస్తుత పరిస్థితి సజావుగా ఉన్నట్టు, దళితులు ఆధిపత్యానికి గురికానట్టుగా భ్రమిస్తున్నారా? లేక పీడిత కులాలను భ్రమల్లో ఉంచాలనుకుంటున్నారా? సమైక్య రాష్ట్రంలోనే కారంచేడు, చుండూరు, పదిరికుప్పం, వేంపెంట మారణాలు జరిగింది. అప్పుడు ఆధిపత్యం ఎవరిది? ఇప్పుడు వారు రెండురకాల ఆధిపత్యాల కింద నలుగుతున్నారు. (1) మిగతా ప్రజలతో పాటు, కోస్తా ముఖ్యంగా గుంటూరు, కృష్ణా జిల్లాల ధనిక రైతాంగపు, వారి తొత్తులయిన సీమ ప్రజాప్రతినిధుల ఆధిపత్యం. (2) అగ్రవర్ణాల ఆధిపత్యం. ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం వారిని మొదటితరహా ఆధిపత్యం నుండి విముక్తి చేసే అవకాశం ఉంది. ఇక తరతరాలుగా వారు అనుభవిస్తున్న అగ్రకులాల ఆధిపత్యానికి ఇప్పుడూ, అప్పుడూ మందు సామూహిక తిరుగుబాట్లు, ప్రజాస్వామ్య ఉద్యమాలు. అంతేగాని, ఇప్పటి అవశేష ఆంధ్రప్రదేశ్‌లో దళిత, బహుజనులు సర్వహక్కులు అనుభవిస్తున్నారని, ప్రత్యేక రాయలసీమ ఏర్పడితే వారిపై కొత్తగా ఆధిపత్యవర్గాలు స్వారీ చేస్తాయనడం చర్చను పక్కదోవ పట్టించడమే. పీడిత కులాలను మోసం చేయడమే. అమరుడు కాళోజి అన్నట్టు..

ప్రాంతేతరుడు దోపిడి చేస్తే
ప్రాంతం బయటికి తన్ని తరుముతాం
ప్రాంతం వాడే దోపిడి చేస్తే
ప్రాంతంలోనే పాతరపెడుతాం

రాయలసీమ విద్యావంతుల వేదిక గాని, రాయలసీమ ఐక్య కార్యాచరణ కమిటీ గాని మొదటి నుండి చెబుతున్నది రాయలసీమ రాష్ట్ర డిమాండ్ కేవలం ఒక ప్రజాస్వామిక డిమాండ్. ఈ వ్యవస్థలోనే, ఈ రాజ్యాంగ పరిధిలోనే, వెనుకకు నెట్టబడిన, దోపిడీకి గురవుతున్న ప్రాంతం స్వయంపాలనకై పడుతున్న ఆరాటం, చేస్తున్న పోరాటం. ఇదేమీ ఈ దోపిడి వ్యవస్థను కూల్చే విప్లవోద్యమం కాదు. ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర పరిమితులు, ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుతున్నవారికి తెలుసు. అదే సమయంలో, ఈ ఉద్యమ క్రమంలో ప్రభుత్వం చిన్నాచితకా రాయితీలను రాయలసీమకై ప్రకటిస్తుందనీ తెలుసు. అవి మౌలికంగా సీమప్రాంతాన్ని వనరుల దోపిడీ నుండి రక్షించవు.

అంతమాత్రాన వచ్చే అభివృద్ధిని అడ్డుకోవడం అజ్ఞానం. ఈ లక్ష్య సాధనలో ప్రజల్ని బుజ్జగించడానికి, గతంలో 'శ్రీబాగ్ ఒడంబడిక' తరహా పుచ్చు వాగ్దానాలు ప్రభుత్వం చేస్తుందనీ తెలుసు.

'కొందరిని ఎల్లప్పుడూ మోసం చేయగలరు
అందరినీ కొంతకాలం మోసం చేయగలమేమో
కాని
అందరినీ ఎల్లకాలం మోసం చేయలేరు'

అదీ, గత అనుభవ నేపథ్యంలో సీమవాసులెంతమాత్రం తిరిగి "అభివృద్ధి" ఎండమావుల వెంట మోసపోయేందుకు సిద్ధంగా లేరు. ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర సాధనే లక్ష్యం, కర్తవ్యం.

చివరగా కోస్తా ఆధిపత్యం కింద చంద్రబాబు ప్రభుత్వంలో రాయలసీమ అభివృద్ధి అవుతుందనే అభివృద్ధివాదులకు కొన్ని ప్రశ్నలు.

విభజన తర్వాత నూతన ప్రభుత్వమేర్పడ్డాక రాయలసీమ ప్రజలు పొందిన ఈ అనుభవాల గురించి ఏం చెబుతారు.?

1) విభజన తర్వాత, భౌగోళికంగా 1956 పూర్వపు 'ఆంధ్రరాష్ట్ర' మేర్పడింది కదా! మరి శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం, కర్నూల్‌లో రాజధాని ఏర్పాటు చేయక 'అమరావతి' అని ప్రతిపాదిస్తే ఏ రాజకీయపార్టీ వ్యతిరేకించలేదు సరికదా, డూ డూ బసవన్నల్లా తలలూపాయి. రాజధాని సీమలో ఏర్పాటైతే రాయలసీమ అభివృద్ధి చెందదని మీరు భావించారా?
2) జి.ఓ. 120 ద్వారా రాయలసీమకు రావాల్సిన మెడికల్ కాలేజీ సీట్లను కోస్తాకు కట్టబెట్టడమే గాక, ప్రభుత్వ నిధులతో సుప్రీంకోర్టులో ప్రభుత్వం సవాలు చేస్తున్నప్పుడు, యే రాజకీయ పార్టీ నిరసించలేదు. సీమ పిల్లలు వైద్యులు కావడం నష్టదాయకమా?
3) అనంతపురం మెడికల్ కాలేజీకి మంజూరు అయిన రూ. 6 కోట్ల రూపాయల నిధులు, రూ. 3 కోట్ల రూపాయల విలువగల యంత్రాన్ని విశాఖకు తరలించినప్పుడు మీరెందుకు నోరిప్పలేదు? అదీ రాయలసీమ అభివృద్ధిలో భాగమేనా?
4) సిఆర్‌డిఏ ప్రాంతంలో నియామకం చేసిన 3, 000 తాత్కాలిక ఉద్యోగులలో ఒక్కరూ రాయలసీమ వాసులు లేకపోవడంపై మీరు మౌనం వహించారు కదా!
5) టాటా సంస్థ రాష్ట్రంలో 330 గ్రామాలను దత్తత తీసుకుంటామన్నప్పుడు, చంద్రబాబు ప్రభుత్వం సూచించిన గ్రామాల్లో ఒక్కటైనా రాయలసీమ ప్రాంతానికి చెందినది లేకపోవడానికి కారణమేమిటి? అభివృద్ధి వాదులు ఎందుకు ప్రశ్నించలేదు?
6) రైల్వేజోన్ కార్యాలయం విశాఖలోనా, విజయవాడలోనా అని కోస్తావాళ్ళే తన్నుక చస్తున్నారు గదా - గుంతకల్‌లో ఏర్పాటు చేయాలని అభివృద్ధివాదులెవ్వరూ కోరలేదెందుకు? పై తన్నులాట, గతంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం విజయవాడలోనా లేక విశాఖలోనా అని వారు, వారు తగువులాడిన సందర్భాన్ని గుర్తుకు చేయడం లేదా? తద్వారా గుంతకల్ రైల్వేజోన్ ఏర్పాటును అడ్డుకొనడం కాదా?
7) తిరుపతిలో ప్రారంభోత్సవం జరిగిన కాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను రాజమండ్రికి తరలించడంపై మీ గొంతుకలెందుకు పెగలలేదు?
8) ఎఐఎం సంస్థను హామీ ఇచ్చిన మేరకు అనంతపురంలో గాక, విజయవాడకు తరలిస్తున్నప్పుడు అభివృద్ధివాదుల గొంతుకలెందుకు మూగపోయాయి.
9) కృష్ణా జలాల పంపిణీ కార్యాలయాన్ని, కృష్ణా జలాల రిజర్వాయర్ (శ్రీశైలం) ఉన్న కర్నూల్ జిల్లాలోగాక, విజయవాడలో ఏర్పాటు చేయాలనుకుంటున్న ప్రయత్నాలను మీరు నిలపగలరా?
10) అంతెందుకు, ప్రాముఖ్యత కల్గిన కేంద్ర, రాష్ట్ర కార్యాలయాలు గాని, విద్యా, వైద్య సంస్థలనుగాని ఒక్కటి కూడా రాయలసీమలో ఏర్పాటు చేయకపోవడంలో వివక్షత కన్పడటం లేదా? పదిమందికి ఉపాధి కల్పించే ఒక్క సంస్థ సీమకు రాకపోవడాన్ని మీరేమంటారు?
11) క్రిష్ణా జలాల పంపిణీ బోర్డులో "కె.సి. కాలువకు కేటాయించిన నీటికన్నా ఒక్క చుక్క నీరు ఎక్కువగా విడుదల చేయరాదని" తీర్మానం చేసారు గదా. మరి అలాంటి తీర్మానమే సాగర్‌కు ఎక్కువ నీటి విడుదలపై ఎందుకు చేయలేదు?
(2014లో సాగర్‌కు శ్రీశైలం నుండి 859 టిఎంసిలు విడుదల చేసారు. వాస్తవంలో కేటాయించినది కేవలం 263 టిఎంసిలు మాత్రమే)
12) గుండ్రేవుల, వేదవతి నీటి పథకాలపై రాష్ట్రం చేస్తున్న జాప్యం గురించి మీరేనాడైనా ప్రశ్నించారా?

చివరగా ఒక సూటిప్రశ్న - జి.ఓ. 69 రద్దు చేయాలని, శ్రీశైలం జలాశయంలో కనీస నీటిమట్టాన్ని 854 అడుగులుగా ఉంచాలని, మరి ఇతర రాయలసీమ సమస్యలపై రాయలసీమ నాలుగు జిల్లాలకే పరిమితమై గొంతుచించుకుంటున్న అభివృద్ధి వాదులు ధైర్యంతో ఆ డిమాండ్లనే, విజయవాడలో పత్రికాముఖంగా చేయగలరా? మీ, మీ పార్టీల రాష్ట్ర, కేంద్ర కమిటీలతో తీర్మానాలు చేయించగలరా?. ☆

మీ రచనలను అరుణతారకు ఈ-మెయిల్ కూడా చేయవచ్చు!

పేజ్‌మేకర్ ఓపెన్ ఫైల్, పి. డి. ఎఫ్. పద్ధతులలో (అను 6.0లో అయితే మేలు),
మైక్రోసాఫ్ట్ వర్డ్, ఎం. ఎస్. భాషలో కూడా అరుణతారకు మెయిల్ చేయగలరు
ఈ-మెయిల్ : arunatara1977@gmail. com
Like Page://viplava rachayitala sangham arunatara
Website : www. virasam. org, www. virasam. in

బోయ జంగయ్యకు నివాళి

విరసం



బోయ జంగయ్య (74) తెలంగాణ జీవన చిత్రకారుడు. అట్టడుగు ప్రజల బతుకును, వెతలను తన సాహిత్యంలోకి తీసుకొని వచ్చారు. అనేక కథలు, నవలలు రాశారు. వాటిలో దళిత, బహుజన జీవితం గొప్పగా కనిపిస్తుంది. అదీ తెలంగాణ ప్రాంతీయ నేపథ్యంలో. తన సాహిత్యం మొత్తానికి ఒక నిర్దిష్ట ప్రాంత, సామాజిక సంబంధాల నేపథ్యం ఉంది. ఆ స్థల కాలాల్లోని సామాజిక జీవితమే ఆయన సాహిత్య వస్తువు. ఎప్పుడో రాసిన గొర్రెలు కథా సంపుటం, జాతర, జగడం నవలలు చాలు ఆయనను అర్థం చేసుకోడానికి, అంచనా వేయడానికి.

ఆయన కథల్లో. నవలల్లో తెలంగాణ జీవితం ఉన్నా మొత్తంగా అవి తెలుగు సామాజిక జీవితానికి సంబంధించినవి. ఆ రకంగా అవి మన తెలుగు ప్రగతిశీల సాహిత్యంలోంచి విడదీయలేని భాగం.

ఇంకా బాగా చెప్పాలంటే మన దళిత సాహిత్యంలో బోయ జంగయ్య చిత్రించిన జీవితం చాలా విలువైనది. బహుశా ఆయనకు తెలిసిన జీవితం, అర్థమైన జీవిత సంఘర్షణ అదే కాబట్టి అదే రాస్తూ వచ్చారు. సహజంగానే ఆర్ద్రమైన చిత్రణలో స్త్రీల కోణం తప్పని సరిగా ఉంటుంది. ఆ రకంగా జంగయ్య రచనల్లో అట్టడుగు కులాల జీవితం వలెనే, ఆ కులాల్లోని మహిళా జీవితంలోని వేదన, సంఘర్షణ, ఔన్నత్యమూ ఉంటాయి.

ఇవన్నీ మన సాహిత్యానుభవాన్ని సున్నితం చేసే విషయాలు. అవి పుష్కలంగా జంగయ్య సాహిత్యంలో ఉన్నాయి. నిజానికి గత ముప్పై నలభై ఏళ్లుగా తెలుగు నేల మీద కొనసాగుతున్న సామాజిక సంచలనాలల కంటే ముందే జంగయ్య కథల్లో ఈ దృష్టి కోణాలు ఉన్నాయి. ఇది వాస్తవ జీవితంపట్ల ఆయనకు ఉన్న చూపును తెలియజేస్తాయి. దాదాపుగా అన్ని రచనల్లో తనదైన ఒక రకమైన సామాజిక విమర్శా కంఠ స్వరం వినిపిస్తుంది. జంగయ్య రాసిన బొమ్మలు అనే నవలలో బ్రాహ్మణిజం మీద దళిత జీవితానుభవం, అందులోని దోపిడీ, వివక్ష, పరాయీకరణ వైపు నుంచి ఇలాంటి సామాజిక విమర్శ శక్తివంతంగా ఉంది. దళితులు ఎన్ని రకాలుగా దోపిడీకి, వెలికి గురవుతున్నారో, గుర్తింపుకూ దూరమవుతున్నారో ఆయన చాలా సూక్ష్మదృష్టితో రాశారు.

కథల్లో, నవలల్లో ఆయన అనుసరించిన శిల్పం చాలా సాదాసీదాగా ఉంటుంది. అదే ఒక రకమైన ఆకర్షణ. తను ఎంచుకున్న వస్తువులకు బాగా సరిపోయే శిల్ప పద్ధతి అది. అందువల్ల చదువుకోడానికి బాగుంటుంది. ముఖ్యంగా జీవితానుభవ గాఢత పాఠకులను నేరుగా, దానికదిగా చేరవేసే కథన పద్ధతి ఆయనది. కొత్త ప్రయోగాలు, అలాంటి రచనా సంవిధానాలు జంగయ్య రచనల్లో ఉండకపోవచ్చు. అయితే చదివినవి పాఠకుల మీద ఆయన కథలు, నవలలు ప్రభావం చూపుతాయి. గుర్తుంటాయి. జాతర అనే నవల చదవండి. మనకు అదంతా అలాగే గుర్తుండిపోతుంది. ఇది మంచి రచనా పద్ధతి కాదని ఎవరు అనగలరు? సాదాసీదాగా ఉన్నట్టనిపించడంలోని ప్రత్యేకత, విశిష్టత ఇవే.

ఇలాంటి మంచి రచనలు అందించినందుకు ఆయన్ను తలచుకోవాలి. గుర్తు పెట్టుకోవాలి. ముఖ్యంగా మన సామాజిక జీవితానుభవాన్ని మెరుగుపరుచుకోడానికి జంగయ్య రచనలు ఎప్పటికైనా అవసరమే. దళిత జీవితంలో ఆయన చూసి చిత్రించిన వివరాలు, విశేషాలు అందరూ తెలుసుకోవాలి. వాస్తవాన్ని వాస్తవంగా గుర్తించడానికి అవసరమైన దృక్పథాన్ని ఆయన రూపొందించుకున్నారు. ఇతరత్రా ఆయన రచనలను ఎంతో విశ్లేషించవలసి ఉన్నా ఆయన మరణించిన ఈ సమయంలో తనదే అయిన ప్రత్యేకతలను గుర్తు చేసుకోడానికే ఈ నాలుగు మాటలు.

'సఫాయీ'ల విముక్తి ఎన్నడు?

గీతాంజలి

'మానవ మలాన్ని చేత్తో ఇక ఎంత మాత్రమూ నేను ఎత్తలేను. పని పూర్తయ్యాక, ఇంటికొచ్చాక, స్నానం చేసాక కూడా నా నాసికా రంధ్రాల్లోంచి మలం దుర్గంధం వస్తూనే ఉంటుంది. నా బట్టల పైన గోళ్ళలో ఆఖరికి నా ముందు తినే అన్నం కంచంలో కూడా మలం కనిపిస్తూనే ఉంటుంది. ఆ తిండి ఇక నేనెలా తినగలను?' రాణి ముఖంలో అంతులేని వేదన సుళ్ళు తిరుగుతుంటే ఆమె కళ్ళు దించుకుంది.

'నాకిద్దరు చిన్న పిల్లలు. నా భర్త గత ఏడాదే మ్యాన్‌హోల్ శుభ్రం చేయడానికి దిగి అందులోంచి వచ్చిన విషవాయువులకి ఉక్కిరిబిక్కిరై చనిపోయాడు. నాకెవ్వరు దిక్కు....' ముప్పై సంవత్సరాల అంగూరీ దుఃఖిస్తూ అడిగింది.

గత మూడు సంవత్సరాలలో ఒక్క కర్ణాటకలోనే 18 మంది సఫాయి కర్మచారులు చనిపోయారు. ఆ లెక్కన దేశవ్యాప్తంగా ఎంతమంది చనిపోతుంటారో అంచనా వెయ్యడం కష్టం కాదు. గత ఏడాది ఆదిలాబాద్‌లో, ఈ ఏడాది విజయవాడలో ఇద్దరిద్దరు చొప్పున మరణించారు. లోకంలో మనుషులు ఎన్నో రకాల వృత్తులు చేసుకొని బతుకుతుంటారు. ప్రతీ పనికి ఎంతో కొంత వృత్తిపరంగా, కుల, సమాజ పరంగా కొద్దో గొప్పో ఆమోదం ఉంటుంది. కానీ మానవ మలాన్ని మరో మనిషి చేతులతో ఎత్తి శుభ్రం చేసే అమానవీయ వృత్తికి మానవీయ ఆమోదం ఎలా లభిస్తుంది. ఎంత అసహ్యంగా ఉన్నా తామే ఆ పని చేయాల్సిన నిస్సహాయ స్థితిలోకి హిందూ అగ్రకుల మనువాద బ్రాహ్మణ సమాజం సఫాయి కర్మచారులను నెట్టివేసింది. ఏ వృత్తులనైతే సమాజంలో తక్కువగా భావిస్తారో ఆ వృత్తులలో దళితులున్నారు. శుభ్రం చేయడం, ఊడ్చటం, మనుషుల మలం, ఇతర మలినాలను శుభ్రం చేయడం జంతువుల, మనుషుల శవాలను ఎత్తడం, తీయడం-మలాన్ని తీసేందుకు పందుల్ని పెంచడం దళితులు చేయాలని మనుస్మృతిలో అమానవీయమైన సూత్రీకరణ. దళితుల్లో అనేకమైన ఉపకులాలున్నప్పటికీ తెలుగు రాష్ట్రాల్లో యానాది, రెల్లి కులస్తులు ఎక్కువగా ఈ పని చేస్తారు.

కాని చాలా మంది తెలంగాణ-ఆంధ్ర ప్రాంతాలకు కరువు కాటకాల వలన వ్యవసాయాన్ని బంధు పెట్టి ఉత్తరాది రాష్ట్రాల నుంచి 150 ఏళ్ళ క్రితం ఆనాటి పాలకులచే తీసుకురాబడ్డ వారే. వీరిని పాకీ పనివారుగా, మెహతర్‌లుగా పిలుస్తున్నారు. ప్రతి గ్రామంలో- పట్టణంలో కూడా మెహతర్ బస్తీలున్నాయి. ప్రధాన ఊరికి, దళిత వాడలకూ కూడా దూరాన అత్యంత దుర్భరమైన పరిస్థితిలో చిన్న చిన్న గుడిసెల్లో సమాజానికి వెలియైన మనుషులుగా కూడా గుర్తింపునకు నోచుకోని స్థితిలో వీరు ఉన్నారు. డాక్టర్ అంబేద్కర్ ఆశించిన పద్ధతిలో సమాజంలోని ప్రతి వ్యక్తి గౌరవంగా జీవించడం, స్వేచ్ఛ సమానత్వంతో, సౌభ్రాతృత్వంతో జీవించాలన్నది (భారత రాజ్యాంగంలోని అధికరణ 21) ఒట్టి మాటలైనాయి. తరతరాలుగా సఫాయి కర్మచారులు సమాజంలో అగ్ర కులస్తుల ఇండ్లలోని నీళ్ళు వాడని డ్రై లెట్రిన్‌లలో మలమూత్రాలను ఎత్తివేసే వారుగా, భూగర్భ డ్రైనేజీలైన మ్యాన్‌హోల్స్, సెప్టిక్ ట్యాంకులలో మలాన్ని ఎత్తివేసే వారిగా భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థ రాజ్యంలోని ఆధిపత్య కులవ్యవస్థ ద్వారా బలవంతంగా నెట్టివేయబడుతున్నారు. వీరు ఈ వృత్తి వలన అంటరానివారిలో కూడా అంటరానివారిగా భావించడంతో పాటుగా, నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కులను అనుభవించడానికి సఫాయి కర్మచారులను అనర్హులుగా పరిగణిస్తున్నది. ఇప్పుడు డ్రై లెట్రిన్లు తగ్గి, సులభ్ సౌచాలయాల్లో, ప్రైవేటు సర్కారు ఆసుపత్రులు, బస్సు స్టాపులలో బాత్‌రూములు, స్కూళ్లు కాలేజీల్లో ఫ్లష్ టాయిలెట్లు శుభ్రం చేయడానికి ఈ సఫాయి కర్మచారులనే వాడుకొంటారు. అదీ కాంట్రాక్టు బేసిక్ మీద. అతి తక్కువ జీతాలతో సెప్టిక్-మ్యాన్‌హోల్స్ శుభ్రపరుస్తూ అకాల మరణాలు చెందేది ఈ కులస్తులే. వీరు పేదరికం- అకాల మరణాలు- అశుభ్ర జీవనం, సాంఘిక వెలివేత, పిల్లలు చదువుకు దూరమవడం లాంటి సమస్యలతో బాధపడుతున్నారు.

అయితే సఫాయి కర్మచారుల ఆందోళన ఫలితంగా 1993లో భారత పార్లమెంటు చట్టం చేసింది. అలాగే 2013లో అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చేతులతో మలమూత్రాలను ఎత్తివేసే నిషేధిత చట్టం వచ్చింది. దీని ప్రకారం భారతదేశంలో మానవ మలమూత్రాలను ఎత్తి వేసే వృత్తిని కొనసాగించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 ప్రకారం నేరం. అంటరానితనం ఏ రూపంలోనూ ఆమోదయోగ్యం కాదు. నేరం కూడా. క్షమార్హం కానిది. శిక్షింపబడేది. ఈ పనిని చేయించే వారికి చట్టబద్ధమైన శిక్ష ఉంటుంది. 1993 నుంచి, మ్యాన్‌హోల్స్‌లో, సెప్టిక్ ట్యాంకుల్లో మరణించిన వారి కుటుంబాలను కనుక్కొని ఒక్కో కుటుంబానికి పది లక్షల రూపాయల చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఇదంతా చీఫ్ జస్టిస్ పి.సదాశివం అధ్వర్యంలో నిర్ణయించబడింది. అలాగే ఈ అమానవీయమైన వృత్తి నుంచి భవిష్యత్తు తరాల వారిని కాపాడేందుకు వీరిని ఈ వృత్తిలోంచి తప్పిస్తూనే ప్రత్యామ్నాయమైన, గౌరవనీయమైన వృత్తుల్లో వీరికి శిక్షణ ఇవ్వాలి. ముఖ్యంగా రైల్వే డిపార్ట్‌మెంటుకు చాలా సీరియస్‌గా ఆదేశాలు ఇచ్చింది. రైల్వే ట్రాక్ మీది మల పదార్థాల్ని చేతులతో శుభ్రం చేయిస్తుంది రైల్వే వ్యవస్థ. పైగా మ్యాన్‌హోల్స్‌లోకి వెళ్ళే ఈ సఫాయీ కర్మచారులకు ఏరకమైన

రక్షణ కవచాలూ ఇవ్వరు. ఒక్క నూనె, సబ్బులు తప్పిస్తే వీరికి పోర్టబుల్ ఎయిర్ బ్లోయర్లు, సేఫ్టీ బెల్ట్స్, ఇన్‌హేలేటర్స్ గమ్ బూట్స్, డైవర్ సూట్స్, రబ్బరు గౌస్, ఆక్సిజన్ సిలిండర్స్, గ్యాస్ మాస్కులు ఇవ్వాలి. ఇవ్వకుండానే పనిలోకి పంపే ముందు వాటిని ఇచ్చినట్లు సంతకం చేయించుకుంటారు. అందుకే దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో డ్రైనేజీ-సెప్టిక్ ట్యాంకు మరణాలు ఎక్కువ అవుతున్నాయి. అయినా సర్కారు పట్టించుకోవడం లేదు.

"సుప్రీం కోర్టు ఒక రకంగా ఒక విజయంగా చెప్పుకున్నా, ఇంకా 10 లక్షల నష్టపరిహారం ఇవ్వడంలో గాని, ఈ వృత్తిని నిషేధించి ప్రత్యామ్నాయ వృత్తిని కొనసాగించే ఏర్పాట్లు చేసే విషయంలో కానీ ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం లేదని" సఫాయి కర్మచారులు జాతీయ కన్వీనర్ బెజవాడ విల్సన్ ఆవేదన వ్యక్తం చేసారు. చాలా మంది సఫాయి కర్మచారులకు రాజ్యాంగంలో తమకున్న హక్కుల గురించి, నష్టపరిహారాల గురించి, గౌరవప్రదమైన జీవితాన్ని గడపగలిగే ప్రత్యామ్నాయ వృత్తుల గురించి అవగాహన లేదు. గాంధి లాంటి వాళ్ళు చాలా హిపోక్రసీతో తల్లి బిడ్డకు చేసే సపర్యగా పాకీవారు-సమాజాన్ని శుభ్రపరిచే పని చేస్తున్నందుకు గర్వపడమంటారు. కానీ ఎవరి మలాన్ని వాళ్ళే శుభ్రం చేసుకోవాలనీ-ఇతర ఆధిపత్య కులస్తులు కూడా ఈ పని చేసుకోవచ్చని, దళితులే ఈ పని ఎందుకు చేయాలనీ మాత్రం చెప్పరు. అందుకే అంబేద్కర్ ఈ మాయలో పడవద్దనీ ఈ అపరిశుభ్రమైన పనుల నుంచి దళితులు పూర్తిగా బయటకు రావాలని చెప్పారు. 'మీ మలం మేమెందుకు ఎత్తాలి? ఎత్తం' అన్న చైతన్యంతో సఫాయి కర్మచారుల ఆందోళన చాలా కాలంగా బెజవాడ విల్సన్ నాయకత్వంలో దేశ వ్యాప్తంగా నడుస్తున్నది!

దేశాన్ని డిజిటల్ ఇండియాగా మారుస్తున్నది ప్రభుత్వం. మరి శానిటేషన్ రంగంలో కూడా నూతన యాంత్రీకరణ ద్వారా శానిటేషన్ స్వరూప స్వభావాల్ని మార్చాలని, భూగర్భ డ్రైనేజీ, సెప్టిక్ ట్యాంకులలో సఫాయి కర్మచారులను దింపి చంపకుండా ఈ యాంత్రీకరణ ప్రవేశపెట్టాలని, చనిపోయిన వారికి 1993 నుంచి రూ. 10 లక్షల నష్ట పరిహారాన్ని ఇవ్వాలని, చేతులతో మలాన్ని ఎత్తే పని నుంచి విముక్తి పొందినటువంటి వారికి ఇచ్చే తక్షణ సహాయం 40 వేల రూపాయల నుంచి లక్ష రూపాయలకు పెంచి వెంటనే మంజూరు చేయాలని, కాంట్రాక్టు పద్ధతిని నిరోధించి, సఫాయి కర్మచారులకు గౌరవప్రదమైన జీవనోపాధి కోసం 5 ఎకరాల సాగుభూమి ఇవ్వాలని ముఖ్యంగా కేసిఆర్ దళితుల కిస్తానన్న 3 ఎకరాల భూమి లిస్టులో పాకీ పనివారిని చేర్చాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ లిస్టులో సఫాయి కర్మచారులను చేర్చి అంత్యోదయ కార్డులివ్వాలని, ఒంటరి వృద్ధ సఫాయి కర్మచారులకు పెన్షన్ ఇవ్వాలన్న డిమాండ్‌లతో పాటుగా, సఫాయి కర్మచారుల పిల్లలకు వారి పూర్వీకులు మలాన్ని ఎత్తినన్ని తరాలకు ఉచిత విద్యతో పాటుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ప్రాధాన్యం ఇస్తూ నెలసరి స్కాలర్‌షిప్స్ ఇవ్వాల విల్సన్ అంటున్నారు. అలాగే వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణను ఇవ్వాలి. సఫాయి కర్మచారులకు ఇచ్చే ఆస్తులు భూమి, ఇల్లు ఆ కుటుంబ స్త్రీల పేరున రిజిస్టరు చేయాలి. అన్నింటి కంటే ముఖ్యమైన డిమాండు ఆత్మగౌరవ డిమాండు. తమ చేతులతో మలమూత్రాలను ఎత్తివేసే పనులను చేయించినందుకు తరతరాలుగా తమకు జరిగిన అన్యాయానికి తమ జాతికి భారత ప్రభుత్వం బేషరతుగా క్షమాపణ చెప్పాలి. తక్షణమే యుద్ధ ప్రాతిపదికన మరోమాట లేకుండా చేతులతో మరో మనిషి మలమూత్రాలను ఎత్తివేసే ఈ నీచాతి నీచమైన దురాచారాన్ని రూపుమాపాలి అన్న ముఖ్యమైన డిమాండ్లతో 'సఫాయి కర్మచారి ఆందోళన్' ఆధ్వర్యంలో భీమ్ యాత్ర-బస్సు యాత్ర డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 125 జయంతోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా 30 రాష్ట్రాలు, 500 జిల్లాలలో, విశ్వమానవ హక్కుల దినోత్సవం అయిన డిసెంబర్ 10, 2015న దిబ్రూగర్, అస్సాం మీదుగా దక్షిణ భారతదేశం కన్యాకుమారి గుండా పడమర బొంబాయి మీదుగా ఉత్తరాన జమ్మూకశ్మీర్ వరకూ సాగి చివరగా 2016, ఏప్రిల్ 13న ఢిల్లీలో ముగిసింది. ఈ యాత్ర తెలంగాణలో హైదరాబాదుకు ఫిబ్రవరి నెలలో వచ్చి ఇందిరా పార్కులో సభ నిర్వహించనపుడు తెలంగాణ నుంచి వందల సంఖ్యలో సఫాయి కర్మచారులు వచ్చి వారి వేదన వెళ్ళబోసుకున్నారు. ఈ అద్భుతమైన మానవీయమైన జై భీమ్ యాత్రకు, సఫాయి కర్మచారుల ఆందోళన ఉద్యమానికి నాగరీకులుగా మానవజాతి మలాన్ని ఎత్తిపోసిన ఆ నిజమైన నాగరీకులకు ఉద్యమాభివందనాలు తెలుపుదాం. అమానవీయమైన ఈ వృత్తిని రూపుమాపే దిశగా మనమూ వారితో కలిసి ముందుకు నడుద్దాం.

విరసం ఆన్‌లైన్ మ్యాగజైన్ www. virasam. org 15 మే 2016 నుంచి ప్రారంభమయ్యింది.
ప్రతి 15 రోజులకు ఒకసారి కథ, కవిత్వం, వ్యాసాలు, నివేదికలు, పుస్తక పరిచయాలు, సమీక్షలు, ప్రకటనలు, ఇతర సాహిత్య ప్రక్రియలతో అప్‌డేట్ చేస్తూ అందిస్తున్నాం.
మీ రచనలను యూనికోడ్ ఫాంట్‌తో virasam1970@gmail.com కు మెయిల్ చేయగలరు.

- ఆన్‌లైన్ మ్యాగజైన్ ఎడిటోరియల్ టీం

విరసం
Revolutionary Writers Association

పాలమూరు వ్యథార్థ బతుకు చిత్రాలు

మాతంగి

పాలమూరు బతుకే ప్రత్యేకం. ఆమాటకొస్తే ఏ నిర్దిష్ట ప్రాంతంలోని జీవితమైనా అంతే. దేని ప్రత్యేక అర్థం దానికి ఉంటుంది. అదే సమయంలో సాధారణీకరణ కూడా ఉంటుంది. సృజనాత్మక సాహిత్యం తప్పక నిర్దిష్ట జీవితాన్నే వస్తువుగా ఎంచుకుంటుంది. అయితే అందులో ఒక సాధారణార్థం, సాధారణ సత్యం ఇమిడి ఉంటుంది. గీతాంజలి రాసిన పాలమూరు బతుకు చిత్రాలు చదివితే పాలమూరు జీవితం కనిపిస్తుంది. ఈ పుస్తకమంతా పాలమూరు గురించే. ఇందులో కొన్ని కథలు, కవితలు, ఒక నవలిక వగైరా ఉన్నాయి. అందువల్లే కావచ్చుబతుకు చిత్రాలు అనే శీర్షిక పెట్టినట్లుంది. బతుకు చిత్రాలు అనే సరికి జీవన రేఖలనీ, అనుభవ శకలాలనీ అనిపించే అవకాశం కూడా ఉంది. కానీ ఇందులోని ప్రతి కథా దానకదే ఒక ప్రత్యేకమైన కథ.



పాలమూరు వలస బతుకు చిత్రాలు
గీతాంజలి
ప్రచురణ : వెన్నెల ప్రచురణలు
ఏప్రిల్ 2015, వెల : రు. 150/-

విరసం సీనియర్ సభ్యురాలు గీతాంజలి కథ, నవల ఎలా ఉంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఆమె అడవిని జయించింది అనే నవల, బచ్చేదాని అనే కథా సంకలనం వంటివి ఆమె గతంలో విడుదల చేశారు. పాలమూరు బతుకు చిత్రాల్లో ఉన్న నేను పోలేపల్లి పీనుగను.. అనే కథ ఒక పుస్తకంగా విడిగా ఇంతక ముందు అచ్చయింది. అప్పట్లో అది బాగా ప్రచారం కూడా అయింది. పాలమూరు జిల్లా పోలేపల్లి సెజ్ దుర్మార్గాల గురించి ఎందరో వ్యాసాలు, విశ్లేషణలు రాశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతటా సెజ్‌లకు భూముల ధారాదత్తం ముమ్మరంగా సాగింది. వాటిలో పోలేపల్లి భూ నిర్వాసితుల గురించి కూడా సమాజం బాగా స్పందించింది. గీతాంజలి క్షేత్ర పర్యటన అనుభవాల నుంచి పైన చెప్పిన కథ రాశారు. ఆ పుస్తకాన్ని ఆ ఊళ్లో బాధితుల మధ్యే ఆవిష్కరించారు. బాధితులుగా కన్నీళ్లు కారుస్తూ కాదు, సెజ్ వ్యతిరేక పోరాటకారులుగా.

అంత ప్రత్యేకమైన కథ అది. మిగతా కథలన్నీ ఆ తరువాత రాసినవే కావచ్చు. పంట పొలాలు పోగొట్టుకున్న పోలేపల్లేగాక, మొత్తంగా పాలమూరు వలస జీవితమంతా ఈ కథల్లో మాట్లాడుతుంది. దు:ఖిస్తుంది.

వలస ఎలా ఉంటుంది? వలసపోవడం అంటే ఏమిటి? వలసపోతే మనుషులు ఏమవుతారు? అనే ప్రశ్నలకు వలస వెళ్లని వాళ్లకు, లేదా అలాంటి వాళ్ల మనసుపై చెవియొగ్గి వినని వాళ్లకు అర్థం కావడం కొంచెం కష్టమే. ఎందుకంటే అది చాలా బాధామయం. విధ్వంసకరం. ఎన్నెన్ని రకాలుగా మనుషులు ఛిద్రమవుతారో ఊహించడం కష్టం. ఇంత వ్యథాభరితమైన అనుభవాన్ని గీతాంజలి తన దృక్పథం వల్ల, ప్రజలంటే ఉన్న ప్రేమ వల్ల, బాధ్యత వల్ల సొంతం చేసుకోవాలనుకున్నారు. లేకపోతే ఈ సంపుటిలోని ఒక్క కథ కూడా రాయడం ఆమె వల్ల అయ్యేది కాదు. ఈ పుస్తకం చదువుతూ ఉంటే కరువు, వలస విషాదంలోని భారంతోపాటు ఇవన్నీ తన అనుభవంగా మార్చుకొని రాయడంలో ఉండే బరువు కూడా మన గుండెలపైకి ఎక్కుతుంది.

వలసపోవడం ఎవరికైనా ఒకటే అనిపిస్తుందిగాని తరచి చూస్తే ఆడవాళ్లకు, పిల్లలకు తేడా ఉంటుంది. కరువును, పేదరికాన్ని అనుభవించడంలో కూడా అంతే. వీటి మధ్యనే సకల ఆధిక్యాలను ఎదుర్కోవడం కూడా అంతే. చాలా కష్టం. ఇవన్నీ ఇలా రాసుకుంటూపోవడం అంత సులభం కాదు. బాగా రంధిపడితేగాని ఇలాంటి బతుకు చిత్రాలకు అక్షరాలు కూర్చడం సాధ్యం కాదు. బహుశా ప్రతి కథ వెనుక ఒక నిజగాథ ఉండి ఉండవచ్చని చదువుతుంటే ఎవరికైనా అనిపిస్తుంది. లేకుంటే అంత పచ్చిగా జీవితం అక్షరాల్లోకి రాదు. ప్రతి పాత్ర వెనుక ఒక నిజ మానవుడు, మానవి ఉండే ఉంటారని స్ఫురిస్తుంటుంది.

ఇందులో ఉన్నదంతా నిజమే. నిజాన్ని కాల్పనికం చేసి మరింత గాఢ పరచడం, ప్రభావశీలం చేయడమే సాహిత్యం పని. గీతాంజలి ఆ పని ఎంత బాగా చేశారంటే.. ఈ జీవితం అనుభవిస్తున్న వాళ్ల విషాదాన్ని చదువుతూ ఉంటే మనమూ దాన్ని కొంత సొంతం చేసుకుంటాం. మంచి సాహిత్యానికి ఉండాల్సిన లక్షణాల్లో ఇది ఒకటి కదా. జీవిత సత్యమేదో మనకు అందుతూ ఉంటుంది. చావు అనే కథ, లక్ష్మి అనే నవలిక మొదలైనవి చదవండి. మీకే తెలుస్తుంది. పాలమూరు జీవితాన్ని గొప్పగా ఆవిష్కరించిన రచన అది. మనచుట్టూ మనుషులు ఇంత దుర్భరంగా బతుకుతున్నారా? అనిపించడం, దాని మర్మం తెలియజెప్పడం కంటే మంచి సాహిత్యానికి బాధ్యత ఏముంది?

మళ్లీ మొదటికే వస్తే... ఇవి అచ్చమైన పాలమూరు రచనలు. మహబూబ్‌నగర్ జిల్లా సామాజిక పరిణామాల చరిత్రను అధ్యయనం చేయడానికి ఇందులోని కథలు పనికి వస్తాయి. అంత నిర్దిష్టత వీటిలో ఉంది. ఇదే కరువు, వలస అనంతపురంలో కూడా ఉన్నాయి. ఇంకొన్ని ప్రాంతాల్లో కూడా ఉన్నాయి. ఆ సాధారణార్థం కూడా ఈ కథల్లో కొంచెం పలికింది. ఇలాంటి కథలు వేర్వేరు ప్రాంతాల నుంచి కూడా వస్తే బాగుండని మనుషులందరినీ ప్రేమించే పాఠకులకు తప్పక అనిపిస్తుంది.

నిస్సందేహంగా ఇప్పటికే ఎంతో సాహిత్యం రాసిన గీతాంజలి ఈ సంకలనం ద్వారా మరింత ఎక్స్‌టెన్షన్ సాధించారని చెప్పవచ్చు. ఇదంతా విప్లవ కథా విస్తృతిలో భాగం. ఇట్లా అనేక ప్రాంతాల అట్టడుగు ప్రజా జీవితాన్ని రాయడానికి విప్లవ కథకులను పురికొల్పే శక్తి ఈ సంపుటంలో ఉంది.

'జనతన రాజ్యం'

బి.ఎస్.రాజు

అడివి అమ్మలా ఉంటుంది, చింపిరి జుట్టులా చికాగ్గా ఉంటుంది. అడివి అందంగా, సుందరంగా ఉంటుంది. అడివి ఆదివాసుల మనసులా చల్లగా, ప్రశాంతంగా ఉంటుంది. అడివి కార్పొరేట్ కంపెనీల దురాక్రమణలా, ఇండియా రాజ్యవ్యవస్థలా కర్కశంగా క్రూరంగా ఉంటుంది. అడివి కల్లోల కడలిలా ఉంటుంది, విస్ఫోటనంలా ఉంటుంది. అడివి ప్రజాయుద్ధ నగారాలా, మంద్ర స్థాయి యుద్ధంలా, రగులుకుంటున్న బొగ్గులా ఉంటుంది. అడివి సల్వాజుడుంలా ఉంటుంది. అడివి కూల్చి కాల్చి బూడిద చేయబడ్డ ఆదివాసీ గూడేల్లా, సైనిక మృగాలు చెరిచి చంపిన ఆదివాసీ మహిళా శవాల్లా హృదయ విదారకంగా ఉంటుంది. అడివి జనతన రాజ్యంలా ఉంటుంది. జనతన రాజ్యం ప్రస్తుతం పాణి చూసి విశ్లేషించి రాసిన పుస్తకంలా ఉంటుంది.

సర్కారంట ఆహా సర్కారంట! ఓహో సర్కారంట !
భలే భలే భలే సర్కారంట!
జన జన జన జనతన సర్కారంట!

అదేనంట అదేనంట
చత్తీస్‌ఘడ్ అడవుల్లో
ఊరూరా వెలిసెనంట
ప్రతిగూడెం గుండెనది గెలిచెనంట

సర్కారంట ఆహా సర్కారంట! ఓహో సర్కారంట !
భలే భలే భలే సర్కారంట
జన జన జన జనతనా సర్కారంట

గిరిజనుల కలల పంట
వనవాసుల వెన్నంట
దన్నంట గన్నంట
ఝూటా సర్కారుకు
దడ దడ దడ
గుండె దడ పుట్టెనంట

సర్కారంట అన్నా.. సర్కారంట
భలే భలే భలే సర్కారంట
జన జన జన జనతనా సర్కారంట



జనతన రాజ్యం
పాణి
ప్రచురణ : విప్లవ రచయితల సంఘం
జనవరి 2016, వెల : రు. 300/-

పాణి రాసిన 'జనతన రాజ్యం, దండకారణ్యంలో మావోయిస్టు ఆచరణ' అనే 565 పేజీల నిడివి గల పుస్తకం, బూర్జువా వ్యవస్థకు ప్రత్యామ్నాయమైన విప్లవకర ప్రజారాజ్య వ్యవస్థ నిర్మాణానికి సంబంధించిన సుదీర్ఘమైన సీరియస్ చర్చ. ఈ చర్చ ఊహాజనితమైనది కాదు. స్వాప్నికమూ కాదు. మన కళ్ళముందున్న వాస్తవం. ఈ వాస్తవ రూపాన్ని 'పాణి' ఫీల్డై, తపించి, దర్శించి, రికార్డు చేసిన దండకారణ్య జనతన రాజ్య వ్యవస్థ చిత్తరువు.

ఇండియాలో పార్లమెంటరీ కమ్యూనిస్ట్ పార్టీలు రివిజనిజంలో కూరుకుపోయి భారత దేశ విప్లవానికి ద్రోహం చేస్తున్నాయని ' ఏక్ హీ రాస్తా, ఏక్ హీ రాస్తా - నక్సల్బరీ ఏక్ హీ రాస్తా' అని తిరుగుబాటు బావుటా ఎగరేసిన మార్క్సిస్ట్ - లెనినిస్ట్ రాజకీయాలు 50 ఏళ్ళ సుదీర్ఘ కాలంలో, ప్రస్తుతం సి.పి.ఐ (మావోయిస్ట్) పార్టీ రాజకీయ నాయకత్వంలో దండకారణ్యంలో ఏర్పడి నడుస్తున్న గ్రామ జనతన రాజ్య నిర్మాణాలపై రచయిత పాణి సూక్ష్మ పరిశీలన చేసి రాసిన పుస్తకం.. 'జనతన రాజ్యం, దండకారణ్యంలో మావోయిస్టు ఆచరణ'. ఈ పుస్తకాన్ని 2015 డిసెంబర్ నెలలో విప్లవ రచయితల సంఘం (విరసం) ప్రచురించి, జనవరి నెలలో ఆవిష్కరించి, చదువరులకు అందుబాటులోనికి తెచ్చింది.

దండకారణ్యంలో ఏమి జరుగుతోంది? అని చెప్పడానికి ఇదివరలో కొన్ని పుస్తకాలు వచ్చాయి. సత్నామ్ పంజాబీ భాషలో రాసిన జంగల్ నామా, అరుంధతీ రాయ్ ఆంగ్లంలో రాసిన వాకింగ్ విత్ ద కామ్రేడ్స్, గౌతమ్ నవల్ఖా - యాన్ మిర్డాల్ ల దండకారణ్య రిపోర్ట్ (ఇది రెడ్ స్టార్ ఓవర్ ఇండియా - యాన్ మిర్డాల్ రచనగ అచ్చయ్యింది). ఇవేకాక రాహుల్ పండిట్ వంటి వాళ్ళు ఆంగ్లంలో రాసిన 'హలో బస్తర్' పుస్తకాలు కూడా వచ్చాయి.

దండకారణ్య విప్లవోద్యమం, జనతన సర్కార్ల పై సమాచారం నిషేధిత మావోయిస్ట్ పార్టీ ఉద్యమ పత్రాల్లో ఉన్నప్పటికీ, ఈ ఉద్యమం పై విపులమైన సమాచారం పైన ఉదహరించిన పుస్తకాల ద్వారా దేశ విదేశాల్లో విస్తృత ప్రజానీకానికి అందుబాటులోనికి వచ్చింది. ప్రజలకే కాకుండా భారత పాలకులకు, ప్రభుత్వాలకు

కూడా ఈ పుస్తకాలు అందించిన సమాచారం చాలా విలువైనదే-

నిజానికి, 1917 బోల్షివిక్ విప్లవం గురించి గాని, విప్లవానంతర సోవియెట్ రాజ్యవ్యవస్థల నిర్మాణాలపై గాని, చైనా విప్లవం తర్వాత అక్కడ ఏర్పడ్డ నూతన వ్యవస్థ నిర్మాణాలపై గాని, వియత్నాం విముక్త పోరాటంపై గాని బహుముఖ సమాచారం ఉద్యమాల లోపలి నుండి అధికారికంగా వెలువడిన దానికన్నా మిన్నగా, విపులంగా, బయటి రచయితల నుండే ప్రపంచ ప్రజలకు అందింది. గతంలో ఆ విప్లవాలకి సంబంధించిన సాధారణ సమాచారమే గాక, ఎంతో విలువైన క్షేత్ర సమాచారం, సూక్ష్మ పరిశీలనల రూపంలో చాలానే వచ్చింది. ఇటువంటి వాస్తవాలను ఇవాల్టి సామ్రాజ్యవాద కారుమేఘాల వాతావరణంలో గుర్తుచేసుకుంటే నమ్మ సక్యంగా ఉండకపోవచ్చు కూడా.

ఉదాహరణకు 1928 మార్చ్ నెలలో అమెరికాలోని 'యేల్' యూనివర్సిటీ సామాజిక శాస్త్రవేత్త 'జెరోం డేవిస్' ఆధ్వర్యంలో 'వాన్గార్డ్ స్టడీస్ ఆఫ్ సోవియెట్ రష్యా' అనే ఔత్సాహిక బృంద మొకటి ఏర్పడి 12 అధ్యయన రంగాలను ఎంచుకుని సోవియెట్ రష్యాలో విస్తృతంగా పర్యటించి, క్షేత్ర పరిశీలనలు చేసింది. ఆ పరిశీలనలను వాన్గార్డ్ సిరీస్ పేరున 'యేల్' యూనివర్సిటీ 12 పుస్తకాలుగా ప్రచురించింది.

అమెరికా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంపై 'దుబారా విషాదం' (ట్రాజెడీ ఆఫ్ వేస్ట్) అనే విమర్శా గ్రంథాన్ని రచించిన 'స్టువర్ట్ చేజ్' అధ్వర్యంలో 'రెండవ దశాబ్దంలో సోవియెట్ రష్యా' అనే అమెరికన్ పరిశీలకుల వ్యాస సంకలనం అప్పటి సోవియెట్ రష్యాపై విలువైన సమాచారం ప్రపంచ ప్రజలకు అందించింది.

సోవియెట్ రష్యా నిర్మాణం, మహిళ, విద్యా, విజ్ఞాన, వికాసాలపైనా, స్టాలిన్ పైనా 'అన్నా లూయిస్ట్రాంగ్' అందించిన విస్తృత క్షేత్ర పరిశీలనా సమాచారం అమెరికా చేసిన సోషలిస్ట్ వ్యతిరేక ప్రచారానికి అప్పట్లో కొంత అడ్డుకట్ట వేసింది. ఇక చైనా విషయానికొస్తే అప్పటికీ, ఇప్పటికి కూడా ఆ దేశ సమాచారాన్ని అమెరికా, యూరోప్ దేశాల నుండి చైనాలో అభిలాషక పరిశీలకులు పర్యటించి అందించిన సమాచారమే ఎక్కువ. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, 'జనతన రాజ్యం' పుస్తక రచయిత పాణి కూడా దేశీయుడైనా ఆ కోవకు చెందిన అన్వేష రచయితని చెప్ప డానికే.

ఈ పుస్తక రచయిత పాణి 'ఎందుకంటే' అనే 11 పేజీల తన ముందుమాటలో ఎన్నో విషయాలను తడుముతూ, రచనకు తాను ఎన్నుకున్న ప్రక్రియ, పద్ధతి గురించి వివరించాడు. "దండకారణ్యంలో కలిగిన జ్ఞానదాయకమైన అనుభవాలను, ఆలోచనలను రాయడానికి ఒక రకమైన పద్ధతి ఎంచుకున్నాను. కథనం, డాక్యుమెంటరీ, విశ్లేషణ అనే మూడు రూపాల్లో ఈ రచన సాగింది" అని ఆయనే అన్నాడు. అంచేత ఇది కేవలం కథనంగా ఉండదు. కాబట్టి, ఈ పుస్తకం ఆసాంతం చదవడానికి, రచయిత చెప్పదలచుకున్న విషయం పట్ల పాఠకునికి తెలుసుకోవాలనే అభిలాష, ఒకింత కసి, ఓర్మి అవసరమౌతాయి.

ఇప్పటి సంక్లిష్ట దేశ రాజకీయ సందర్భంలో ఈ పుస్తకం ఓపిగ్గాను జిజ్ఞాసను పెంపొందించుకుంటూ చదవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా ఈ దేశ యువతకు ఈ అవసరం మరింత ఎక్కువగా ఉంది. వారు, వీరని కాక పెట్టుబడికి ఈవల మోహరించబడుతున్న సర్వ శ్రామిక శక్తులకు, బుద్ధిజీవులకు ఈ అవసరం ఉంది. ఇంతపాటి ఉద్గ్రంథాన్ని వీరంతా చదవ గలరా? చదవడానికి ఉత్సాహంగా ముందుకొస్తారా? ఏమో చెప్పలేం. చదవాల్సిన అవసరం ఉందని నేను గట్టిగా చెప్పగలను.

పాణి ఒక చోట ఇలా అంటాడు- "గత విప్లవాలపై, సోషలిజాలపై ప్రపంచవ్యాప్తంగా బూర్జువా వర్గం చేసిన దుష్ప్రచారం పెంటకుప్పలా పోగై దుర్వాసన వెదజల్లుతున్న తరుణంలో అసలైన ప్రజారాజ్యాధికారం ఎలా ఉంటుందో చెప్పి మానవాళికి సోషలిజమే ఏకైక ప్రత్యామ్నాయమని ఒప్పించడానికి కూడా ఈ చర్చ ప్రేరణ ఔతుంది. బూర్జువా రాజ్యం సంక్షేమం, జి.డి.పిల గణాంకాల్లో అమానవీయంగా, వికృతంగా, ఫాసిజంగా మారిపోయిన తరుణంలో దానిపై అన్ని వైపుల నుండి విమర్శలు సంధించడానికి కూడా ఈ చర్చ అవసరం. మన కాలానికి అలాంటి ఆలోచనలు కేవలం చర్చగా మిగలకుండా ప్రాథమిక రూపంలోని ప్రజా రాజ్యా ధికారం ఒక భౌతిక వాస్తవంగా నిలబడి ఉన్నది. చారిత్రకంగా ఇవ్వాల్టి విప్లవ తరానికి ఇది అపు రూపమైన అవకాశం" అని రచయిత రాయడం ఇప్పటి చారిత్రక సందర్భానికి అద్దం పట్టడమే!

అయితే ఇంకొక్క ముఖ్యమైన అంశం కూడా ఉంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యమనే భ్రమలకు ఇంకా ఇంకా ఊపిరులూది విప్లవమార్గానికి దారులు మూసేయాలనే తిరోగమనవాదులపై సైద్ధాంతిక విమర్శ, ఖండనలను ఎక్కుపెట్టడానికి కూడా 'జనతన రాజ్యం' ఒక ప్రధాన ఆయుధంగా నవతరపు యువతకు, శ్రామిక శ్రేణులకు ఉపయోగపడుతుంది.

ఇవ్వాళ చాలా మట్టుకు సమాజంలో సోషలిజం గురించి అభ్యంతరాలు లేవు. అయితే పదే పదే అది ఎందుకు వీగిపోతోంది? రద్దయిపోతోంది ? అన్న దగ్గరే ప్రశ్నలు జవాబులకై ఎదురు చూస్తు న్నాయి. ఇక్కడే మనం చెయ్యాల్సిన పని చాలా ఉంది.

సోషలిస్ట్ నిజచరిత్ర పాతివేయబడింది. శ్రామిక, మధ్యతరగతి ప్రజలకు ఎదైతే చెప్పాలో అది చెప్పడం మానేసి తమ తిరోగమనాన్ని కప్పిపుచ్చుకోవడానికి ముఖ్యంగా ఈ దేశంలో పార్లమెంటరీ కమ్యూనిస్ట్ పార్టీలు సైద్ధాంతిక చర్చ పేర పనికిమాలిన రాతలు, దస్త్రాలు, పత్రాలు బండ్లకొద్దీ గుప్పించి ప్రజలకు సోషలిజమంటేనే విముఖత కల్గేట్లు చేసాయ్. ఇక సోషలిజంపై సామ్రాజ్యవాదుల దుష్ప్రచారానికి అంతే లేదు. ఎడతెరిపి లేకుండా కా.స్టాలిన్, కా. మావోలపై వారు జరుపుతున్న ఈ దుష్ప్రచారమంతా కమ్యూనిస్ట్ భావజాలానికి, కమ్యూనిస్ట్ ఉన్నత నాయకత్వానికి, నియంతృత్వ ముద్రవేసి, ప్రపంచ శ్రామిక జనావళికి వారు చేసిన సేవలను వారి కంట్రిబ్యూషన్ను కనుమరుగుచేసి సోషలిస్ట్, కమ్యూనిస్ట్ భావజాలానికి శ్రామిక రాశులకు మధ్య అధిగమించలేని అగాథాన్ని సృష్టించే తాపత్రయమే.

అయితే మన దేశంలో ఈ దుష్ప్రచారాన్నంతా ప్రభావవంతంగా తిప్పికొట్టి, సోషలిస్ట్ చరిత్రను, అది సాధించిన విజయాలను, అది ఎదుర్కొంటున్న అడ్డంకులను, అంతర్గత

విద్రోహాలను విడమర్చి చెప్పి ప్రజలకు సోషలిజం వినా వేరే ప్రత్యామ్నాయం లేదనే ఆశాభావాన్ని, అది సాధించుకోవడానికి అవసరమైన పోరాట పటిమను ప్రోదిచేయడంలో కమ్యూనిస్ట్ ఆలోచనాపరులు ఫెయిల్ అయ్యారని ఒప్పుకోవాలి. ఇది ఇప్పటికీ ఒక సవాలుగానే మిగిలి ఉంది.

అంతులేని శ్రమదోపిడీ, పర్యావరణ వినాశనం, శ్రామిక మానవ విస్థాపనతో కూడుకున్న అభివృద్ధి భారత దేశ సమాజాన్ని అతలాకుతలం చేస్తున్నది. దేశ వికాసం, దేశాభివృద్ధి పేర్లతో చలామణిలో ఉన్న పాలకాభివృద్ధి ప్రజాభివృద్ధికి బద్ధ శత్రువు. ఈ పాలకాభివృద్ధి ఎవరికి ధనరాశులు పోగేసి పెడుతున్నది? ఎవరిని వంచించి, ఎవరిని హింసించి, ఎవరిని కాలరాచి తను ప్రకాశిస్తున్నది? గుప్పెడు మంది కార్పొరేట్ ఆంబోతులను తయారు చేసేందుకు కోట్లాది మానవుల జీవన ప్రమాణాలను, మాన ప్రాణాలను, స్వాభిమానాలను, సహజీవనాన్ని హరించి వేస్తున్న ఈ దుర్మార్గపు విషవృక్ష వ్యవస్థను కూకటి వేళ్ళతో పెళ్ళగించి పీకి పారేయకుండా అలాగే విస్తరించనిస్తే ప్రజలకు మిగిలేది ఏముంటుంది? అప్పుల తిప్పల విషాదమే కదా!

ఈ దేశంలో మతోన్మాదం, నకిలీ దేశభక్తి, దేశీయ పెట్టుబడి ముప్పేటగా పెనవేసుకుని అంతర్జాతీయ పెట్టుబడికై అర్రులు చాస్తున్నది. అందుకోసమై తెగబడి స్థానిక వనరులను, శ్రమశక్తిని కారుచవగ్గా మలచి పెట్టుబడికి పాదాక్రాంతం చేస్తోంది. ఇటువంటి దుర్మార్గం సహిస్తూ, భరిస్తూ జీవించడం తప్ప ఈ దేశ ప్రజలకు వేరే మార్గమేలేదని బుకాయిస్తున్నది. దీనికి విరుగుడుందని, స్వావలంబనతో, స్వాభిమానంతో కూడుకున్న స్వతంత్ర శ్రామిక ప్రజా ప్రత్యామ్నాయమున్నదని, ఇటువంటి ప్రత్యామ్నాయాలు కొన్ని దశాబ్దాల పాటు సమీప గతంలో దేదీప్యమానంగా విలసిల్లాయని, వాటిని అందిపుచ్చుకుని, సానబెట్టుకుని అటువంటి మార్గంలో పయనించి నూతన ప్రజాతంత్ర వ్యవస్థను భారత దేశంలో సుసాధ్యం చేసుకోవచ్చని చెబుతున్న విప్లవ శక్తుల గొంతుకలపై రాజ్యం తుపాకుల గుళ్ళవర్షం కురిపిస్తున్నది.

దేశంలో అనేక ఆదివాసీ సమూహాలలో పాటిస్తున్న సామాజిక సహజీవన విధానాలను కాపాడుకుంటూ, పర్యావరణంతో స్నేహపూరితంగా పెనవేసుకుని సుఖ-శాంత సమాజ జీవనాన్ని సౌందర్య భరితంగా మలుచుకోవచ్చని విప్లవ శక్తులు దంకారణ్యంలో సుసాధ్యం చేసి చూపిస్తున్నాయి. మనసుపెట్టి, ఆ మనసుకు కళ్ళుపెట్టి చూడాలనుకునే వాళ్లకు అది కనిపిస్తూనే ఉంది. పాణి రాసిన 'జనతన రాజ్యం' పుస్తకం ఈ దృశ్యాన్ని మరింత విస్తృత పరుస్తున్నది.

ఈ దృశ్యాన్ని విస్తృత పరిచే ఉద్దేశంతోనే పాణి కంకణం కట్టుకుని దండకారణ్య జనతన రాజ్య చిత్తరువును మన ముందు పరిచాడు.

ఐతే ఇంతటి పచ్చదనం, ఇంతటి మానవీయ వెచ్చదనం, ఇంతటి వెలుగు పీడక పార్లమెంటరీ రక్త పిపాస రాజ్యం ఒంటికి కంటికి పడుతుందా? గిడుతుందా? తన పీఠాన్ని, తన ఉనికినీ కదిపి కుదిపే ప్రత్యామ్నాయాన్ని అది సహిస్తుందా ? భరిస్తుందా? నో - నెవ్వర్.

అందుకే సాయుధ ప్రజాసైన్యం లేనిదే ప్రజలకు ఒరిగేదేమీ లేదనే ప్రజా పోరాట రాజనీతి ఊపిరి పోసుకుంది. ఉనికిలో ఉన్న రాజ్యాన్ని, రాజ్య స్వభావాన్ని అర్థం చేసుకో నిరాకరిస్తే పాలకులకు లాభం, ప్రజలకు అపార నష్టం జరుగుతుంది.

సమాజంలోని ఉదారవాద మధ్యేమార్గీయులు, మధ్యతరగతి చదువరులు, దోపిడీ చెట్టునీడన సేదతీరుతున్న సంఘటిత ఉద్యోగ వర్గాలు, శాంతి ప్రవచకులు, ప్రశాంత పర్యావరణ వాదులు నిత్యం తమ కళ్ళముందు జరుగుతున్న విస్థాపనకు, దోపిడీ పీడనలకు, పర్యావరణ హననానికి కారణ భూతమైన మూలసారాల్లోకి వెళ్ళడానికి భయపడి, నిజాలు తెలిసి కూడా కళ్ళు, చెవులు, నోళ్ళూ మూసుకుంటున్నారు. రాజ్యమే సాధువై వరాలిస్తుందనే భ్రమలో ఉండిపోదల్చుకున్నారు. ఇప్పుడు ఈ దేశంలో కొనసాగుతున్న విప్లవోద్యమానికి బడా స్పీడ్ బ్రేకర్, పెద్ద అడ్డంకి ఇదే. ఇది గుర్తించి, ఈ స్పృహ ఉండి, ఈ స్థితిని అధిగమించేందుకు బుద్ధిజీవుల తరపునుండి తోటి బుద్ధిజీవులకు పాణి తన స్నేహ హస్తాన్ని, జనతన రాజ్య స్పిరిట్‌ను, తాత్వికతను అందించ దల్చుకున్నాడు. అంతేగాక, దండకారణ్య ఆదివాసులకు- మైదాన వాసులకు, మేధావులకు మధ్య ఒక వంతెనలా 'జనతన రాజ్యం' పుస్తకం ద్వారా నిలవాలని పాణి పనిచేసినట్లు ఈ పుస్తకం చదివేక నాకనిపించింది.

'జనతన రాజ్యం' పుస్తకం చదువుతున్నంత సేపు, ఆదిలో బోల్షెవిక్ సోవియెట్ల నిర్మాణపు ప్రాథమిక దశ నుండి స్టాలిన్ కన్‌స్టిట్యూషన్ వరకు, అతని మరణానికి ముందు జరిగిన 19వ సోవియెట్ మహాసభ వరకు, ఈ మొత్తం ప్రాసెస్‌లో ప్రజల భాగస్వామ్యం ఏ రకంగా ఉండినదీ, ఆ తదనంతరం ఈ క్రమం ఎలా మారుతూ వచ్చింది నా కళ్ళ ముందు రీలులా తిరుగుతూనే ఉంది. చైనాలో తదనంతర విప్లవకర మార్పులక్కూడా సోవియెట్ నిర్మాణాలే ఊతం.

కా. ప్రతాప్ రాసిన 'దండకారణ్య నిర్మాణ చిత్తరువు' అనే ముందుమాటతో 'జనతన రాజ్యం' పుస్తకం మొదలౌతుంది. 19 పేజీల ఈ ముందుమాట దండకారణ్య ఉద్యమాన్ని, దాని చారిత్రక పూర్వాపరాలను, అందులో భాగంగా ఏర్పడ్డ జనతన సర్కార్ (జనతన రాజ్-(ప్రజారాజ్యాధికార) వ్యవస్థను, ఇప్పటి పార్లమెంటరీ బూటకపు ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయంగా మావోయిస్ట్ పార్టీ నిర్మిస్తున్న విప్లవోద్యమం... గురించి స్థూలంగా, సూటిగా, శాస్త్రీయంగా, నిజాయితీగా వివరించింది. అంతేగాక ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్ళను, రాజ్య హింస, అణచివేతలను, ఉద్యమానికి దండకారణ్యేతర ప్రాంత ప్రజలనుండి విస్తృతంగా అందవలసి ఉన్న బహుముఖీన మద్దతు ఆవశ్యకతను కూడా ఈ ముందుమాట తెలియచెప్పింది. కామ్రేడ్ ప్రతాప్ ఈ ముందు మాట ద్వారా జనతన రాజ్యం పుస్తకాన్ని పరిచయం చేస్తూ దేశ ప్రజల పరిశీలనకు, అవగాహనకు, ఆచరణకు దీనిని వారిచేతుల్లో పెట్టాడు. దండకారణ్య ఉద్యమాన్ని, జనతన రాజ్యాన్ని కాపాడుకోవాల్సిన, విస్తృత పర్చాల్సిన ఆవశ్యకతను భారత ప్రజలకు వివరించి ఆ బాధ్యతను నిర్వర్తించవలసిందిగా పిలుపు నిచ్చాడు.

జనతన రాజ్యం ఆలోచన, ప్రయోగం కొత్తదేమీ కాదు. ప్యారిస్

కమ్యూన్ కన్నా పాతది. లెక్క, 1871 పేరిస్ కమ్యూన్నుండి మొదలుపెట్టినా, ఆ నాటి నుండి చైనా సాంస్కృతిక విప్లవం వరకు ఓ 100 ఏళ్ళ వయస్సు దానిది. ఆ తదనంతరం, నక్సల్బరీ నుండి ఇప్పటి దండకారణ్యం వరకూ లెక్కకడితే ఈ ప్రయోగం వయస్సు ఇంకో 50 ఏళ్ళు. వెరసి ఒకటిన్నర శతాబ్దం. ఈ ఆచరణ , ఈ కాలమంతా పడుతూ, లేస్తూ, వెలుగులు ప్రసరిస్తూ, వీగిపోతూ ప్రపంచపటం మీద చెరిగిపోతున్న ముద్రగా, మరుగున పడిపోతున్న జ్ఞాపకంగా, ఇప్పుడు దండకారణ్యంలో ఓ ఆశా రేఖగా మిగిలి ఉంది. బహుశా, ఫిలిప్పీన్స్‌లో మెండనోవా భూభాగంలో ఇటువంటి ఆశావహ రూపం ఉన్నట్లు వినిపిస్తున్నప్పటికీ, దండకారణ్య జనతన రాజ్యంలా దాని గురించి విస్తృత సమాచారం మన వద్ద లేదు.

అసలు ఏది ప్రజాస్వామ్యం? అనే ప్రశ్నకు పెట్టుబడి తానే ప్రజాస్వామ్యం అని, తనకు మించిన ప్రజాస్వామ్యం ఉండదని, అసలు తనకు ప్రత్యామ్నాయమే లేదని నిర్ధారించుకుంటూ, తనను తాను నిలబెట్టుకుంటూ వస్తున్నది. బ్రిటన్ తరహా పార్లమెంటరీ ఎన్నికలు లేక అమెరికా తరహా అధ్యక్ష ఎన్నికలు తప్ప అసలు వేరొక ప్రజాస్వామ్యం అనేదే ఉండదని, ఉండటానికి వీలు లేదని పెట్టుబడి శాసిస్తుంది. సైనిక ధనస్వామ్యం చెప్పుచేతల్లో ఉండే రాజ్య వ్యవస్థ ప్రజాస్వామ్యంగా చెలామణీ ఔతున్న దశ ఇంకా కొనసాగుతూనే ఉన్నది. అది ఇంకా మరణ శయ్యపైకి ఎక్కలేదు. ఎందుకనంటే పెట్టుబడి కనుసన్నల్లో, పెట్టుబడి ఆధిపత్యంలో నడుస్తున్న ప్రజాస్వామ్యా నికి కన్సెంట్ ను అది సదా తయారుచేసి పెట్టుకోవడంలో దాని కొనసాగింపు, విజయం ఉన్నాయి. దీన్ని ప్రజా ఉద్యమాలు బహుముఖీన ప్రయత్నాల ద్వారా ఛేదించగల్గాలి. ఇటు వంటి సీరియస్ ప్రయత్నాలకు పాణి రాసిన జనతన రాజ్యం పుస్తకం దోహద పడుతుంది.

ధనస్వామ్యం చెప్పుచేతల్లో, దాని నియంతృత్వంలో కొనసాగుతున్న భారత పార్లమెంటరీ వ్యవస్థను రద్దుచేసి దాని స్థానంలో నూతన ప్రజాస్వామిక జనతంత్ర రాజ్యాన్ని స్థాపించాలనే విప్లవోద్దేశంతో, గత 55 ఏళ్ళుగా భారత (ఇప్పుడు) మావోయిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ పనిచేస్తున్న చరిత్ర మన ముందున్నది. పాణి రాసిన 'జనతన రాజ్యం' పుస్తకంలో కూడా ఈ విషయాల పట్ల సుదీర్ఘ వివరణ (పీపుల్స్ వార్, మావోయిస్ట్ పత్రాల నుండి) ఉంది. అంటే, పాణి ఈ పుస్తకం ద్వారా కేవలం దంకారణ్యంలో మావోయిస్ట్ పార్టీ అధ్వర్యంలో ఏర్పడి నడుస్తున్న ఆదివాసీ ప్రజల భాగస్వామ్య ప్రజాతంత్ర వ్యవస్థ తీరుతెన్నుల గురించి మాత్రమే కాక, నక్సల్బరీ సాయుధ విప్లవోద్యమ చరిత్రపైనే ఒక పరిశీలన, ఓ విశ్లేషణ చేయదల్చుకున్నాడు కాబట్టే ఈ జనతన రాజ్యం అనే పుస్తకానికి దండకారణ్యంలో మావోయిస్టు ఆచరణ అనే పేరు జోడించి ఉండాలి.

1980 లో 'సుమంతా బెనర్జీ' ఆంగ్లంలో రాసిన 'ఇన్ ద వేక్ ఆఫ్ నక్సల్బరీ' అనే పుస్తకం 'నక్సల్బరీ వెలుగులో' అనే పేరుతో 1982 లో తెలుగులో మొదటిసారి అచ్చైయ్యింది. ఈ పుస్తకం నక్సల్బరీ ఉద్యమ తొలి దశ చరిత్రను విమర్శనాత్మకంగా విశ్లేషించింది. పాణీ ఈ ఉద్యమ మలి దశను విశ్లేషణకై ఎన్నుకున్నట్లు అనిపిస్తుంది. ఐతే ఇరువురి రచయితల స్థలకాల సందర్భాలలో, రచనా సంవిధానంలో చాలా తేడాలున్నాయన్నది గమనించాలి. ఉద్యమాభిలాషులకు, ఉద్యమ చరిత్ర గురించి వాస్తవాలు తెలుసుకో గోరే వారికి ఈ రెండు పుస్తకాలు చాలా విలువైనవే!

ఐతే, ఈ రెండు పుస్తకాలు ఉద్యమం లోపల, బయిట ఉన్న ఉద్యమకారులకు, హితులకు, సన్నిహితులకు ఉపయోగపడినంతగా ఈ ఉద్యమ వృత్తానికి బయట ప్రశ్నార్థకంగా దిగడిపోయిన ప్రజారాశులకు పెద్దగా ఉపయోగ పడవు. ఎందుకనంటే, ఈ వృత్తానికి బయిట ఉన్నవారు ఈ ఉద్యమం పట్ల ఏ ప్రశ్నలను, సందేహాలను కలిగి ఉన్నారో ఏ ప్రశ్నలకు, ఏ సందేహాలకు సమాధానాలు వెదుక్కుంటున్నారో వాటికి జవాబులు ఈ పుస్తకాల్లో దొరకవు. ఇటువంటి సమూహాల సందేహాల నివృత్తికై ఈ పుస్తక రచయితలు ఈ పుస్తకాలు రాయలేదు. ఆ పని ఇంకెవరైనా చెయ్యాలి. ఆ అవసరమైతే ఉంది.

ఈ విషయం అలా ఉంచి, జనతన రాజ్యం చర్చలోకి వస్తే.. అసలు ఇప్పటి దేశ రాజకీయ ఆవరణంలో జనతన రాజ్యపు సుదీర్ఘ ప్రస్థావన, ప్రాధాన్యత, ప్రత్యేకత, ఆవశ్యకత లేమిటి? ఎన్ని ఉద్వేగాలు, అగాథాలు, అడ్డంకులు, రక్త తర్పణలు, బలిదానాలు, ఊచకోతలు, అణచి వేతలు సహిస్తూ, భరిస్తూ, దాటుకుంటూ భారత శ్రామిక ప్రజా విముక్త విప్లవోద్యమం దండకారణ్య భూభాగంలో తిరిగి పెట్టుబడికి ప్రత్యర్థి శక్తిగా ఎదిగి నిలబడింది. పోరాడి విజయం సాధించగల్గే సత్తా ఉన్న శ్రామిక ప్రత్యామ్నాయ శక్తిగా, మార్గ నిర్దేశికంగా, ప్రపంచ శ్రామిక మానవాళికి వెలుగునిస్తున్న కరదీపికగా రూపు దిద్దుకున్నది. ఈ సమాచారం ఈ రెండు పుస్తకాలు పుష్కలంగా అందిస్తాయి.

ఇప్పటి మావోయిస్ట్ పార్టీ తన సుదీర్ఘ పోరాట చరిత్రలో ప్రజాయుద్ధ పంథాను, త్యాగనిరతిని విడనాడక ఎప్పటి కప్పుడు తన్నుతాను మార్క్సిజమనే కొలిమిలో పుటం పెట్టుకోవడం ద్వారానే జనతన రాజ్య ప్రత్యామ్నాయాన్ని వాస్తవ ఆచరణలో భారత దేశ ప్రజల ముందు ఉంచగల్గింది.

విప్లవ యుద్ధాన్ని ప్రత్యర్థితో యుద్ధం చేయడం ద్వారానే నేర్చుకోగలమని, తీరాన కూర్చుని తీర్మానాల దొంతర్లలో కూరుకు పోయి విప్లవోద్యమాన్ని నిర్మించలేమని, ప్రజానదీ ప్రవాహంలో వర్గపోరాట అలలపై ఆటుపోటులతో దృఢంగా పయనిస్తూ మాత్రమే విప్లవోద్యమాన్ని నిర్మించగలమని, ప్రజా రాజ్యాధికారాన్ని స్థాపించగలమని ఇప్పటి మావోయిస్ట్ శక్తులుగా కూడుకున్న వారు ఆది నుండి కూడా తమ సిద్ధాంతంగా, ఆచరణగా ఎన్నుకుని ప్రజాయుద్ధాన్ని కొనసాగి స్తూ వస్తున్నారు. ఈ మార్గానికి చెల్లు చీటీ రాసేసి పార్లమెంటరీ పందుల దొడ్డిలో సొల్లు సీట్లకై తంటాలు పడుతూ శ్రామిక శక్తులను పెట్టుబడి పాదాల చెంతకు చేర్చిన ఘనులకు కలిగేనా ఎన్నటికైనా కనువిప్పు?

ఈ విప్లవ పోరాట పయనంలో కొందరి నాయకుల తిరోగమనం, మరి కొందరి నాయకుల ఉద్వేగాలు వర్గకసి పేరున

చలామణీ అయి, అశాస్త్రీయ వైఖరులు మొత్తం భారత దేశ విప్లవోద్యమాన్ని చిన్నాభిన్నం చేసాయనడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. విప్లవోద్యమానికి అత్యంత హానికరమైన ఇటువంటి శ్రామిక వర్గ వ్యతిరేక ధోరణుల మూలంగా జరిగిన నష్టాలు తక్కువేమీ కాదు. ఈ చరిత్ర అందిస్తున్న గుణపాఠాలను, స్వీయ విమర్శ పాఠాలను ఇప్పటి, ముందటి విప్లవ శ్రేణులు విస్మరించకూడనివి.

జనతన రాజ్య గ్రంథ రచయిత పాణి, ఈ సమాచారాన్నంత విప్లవోద్యమ పక్షపాతంతో, విప్లవ నిబద్ధతతో వినయంగా, శాస్త్రీయంగా మన ముందుంచాడు. దండకారణ్యంలో నివశిస్తున్న ఆదివాసీ ప్రజలు, మావోయిస్ట్ పార్టీ, ప్రజారాజ్య పాలన, ఉత్పత్తి, విద్య, వైద్య, న్యాయ, ప్రజా రక్షక, సైనిక వ్యవస్థలు, సాంస్కృతిక అంగాలు ఒక్కటై ఎలా పనిచేస్తున్నాయో ఏక పక్షంగా కాక భిన్న కోణాల నుండి ఆ దృశ్యాన్ని చిత్రీకరించి అక్షర రూపం ఇచ్చాడు. కాని అది నిజంగా దృశ్యరూపంలో ఉండి ఉంటే మరింత బేషుగ్గా ఉండేది. కక్ష కట్టిన రాజ్యం పడగ నీడన నివసిస్తున్న ప్రజలు, ప్రజా ఉద్యమం ఇప్పటి పరిస్థితుల్లో ఆ పని చేయడం దుస్సాహసమే ఔతుంది. కాబట్టి ఆ పని చేసి ఉండక పోవచ్చు. గ్రాఫిక్స్ రూపంలోనూ, చిత్ర రూపంలోనూ ఈ చరిత్ర మున్ముందు అందరికీ అందుబాటులోకి వస్తుందని ఆశించవచ్చు.

కొద్ది నెలలు గడిస్తే నా జీవితానికి 70 ఏళ్ళు. నా 18 వ ఏట చైనా సాంస్కృతిక విప్లవం గురించి అమెరికా నుండి వచ్చే లైఫ్ మేగ్జైన్‌లో అచ్చైన బొమ్మలు, కథనాలు చదివేను. ఆ తదనంతరం చారుమజుందార్ని చదివేను. చారుమజుందార్ సృష్టించిన ప్రభంజనాన్ని, అంతకు మించి పంచిన ఉద్వేగాన్ని అందు మూలంగా జరిగిన నష్టాలను నేనెరుగుదును. అప్పట్లో ఎందరో యువకులు చారు మజుందార్ రాతలు చదివి వెర్రిగా ఎర్ర సైన్యం కలకత్తా వీథుల్లోనూ హైదరాబాద్ శివార్లలోనూ కదం తొక్కుతుందని నమ్మేవాళ్ళు. కాదంటే విరుచుకు పడేవాళ్ళు.

శ్రీకాకుళ ఉద్యమంలో వరుస అమరత్వాలు, సర్వత్రా విషాద ఛాయలు, నిరాశా నిస్పృహలు, విప్లవోద్యమం చీలికలు-పీలికలౌతున్న కాలం. ఈ కాలంలో కె.ఎస్ ప్రయాస, సైద్ధాంతిక పోరాటం, ఎడ్యుకేషన్, నిర్మాణం నాకు తెలుసు. ప్రజా సంఘాలు అనే మాట ఉచ్చరిస్తేనే విప్లవ ద్రోహులనే ముద్ర పడే రోజులు. ప్రజా సంఘాలు పెట్టాలనే మాట ఆయన అన్నప్పుడు ఆయనపై ఎగిరిపడ్డ ఒక బృందంలో నేనూ ఉన్నాను.

మహాదేవ్ ముఖర్జీ నాయకత్వంలో ఉండే లిన్ పియావో బృందం కె.ఎస్ తో చర్చలకై ఈ రాష్ట్రం వచ్చినపుడు 'సుమంతా బెనర్జీ' ఆ గ్రూపులో ఉన్నాడు. చర్చల్లో ఆయనే ప్రధాన దుబాసీగా కూడా వ్యవహరించాడు. వాళ్లకు వారం రోజుల పాటు నేను ఆతిథ్య మిచ్చాను. వాళ్ళు రాష్ట్రమంతా తిరిగేరు. వాళ్ళ ఆర్యుమెంట్ వాళ్లకుండేది. ఇప్పటికీ ఆ చర్చ సమసి పోలేదు. అంతర్జాతీయ స్థాయిలో ఒక మావోయిస్ట్ సెక్షన్ ఇంకా ఆ చర్చ కొనసాగిస్తున్నది. ఆ కాలమంతా ఉద్వేగ కాలమని నా లెక్క. ఆ ఉద్వేగ కాలానికి చరిత్ర అందించిన టీచర్, షాక్ ఎబ్జార్బర్ కె.ఎస్.

రాయాల్సిన విషయాలు, జ్ఞాపకాలు చాలానే ఉన్నాయి. ప్రస్తుతానికి 'జనతన రాజ్యం' పుస్తకంపై నా స్పందనకే పరిమితమౌతూ ఈ రాత ముగిస్తాను. ముందు ముందు సమయ సందర్భాలను బట్టి, వీలును బట్టి వాటికి అక్షర రూపం ఇవ్వడానికి ప్రయత్నిస్తాను.

ఆఖరిగా పాణి రచనా పద్ధతిపై రెండు ముక్కలు. 'జనతన రాజ్యం' పుస్తకాన్ని చదివే క్రమంలో నేనర్థం చేసుకున్న పాణి రచనా పద్ధతి గురించి:

పాణి రచన, విశ్లేషణా పద్ధతి వింతగా ఉంటుంది, భిన్నంగా ఉంటుంది. తనను తాను ఖండించుకుంటూ, ఛేదించుకుంటూ ఉంటుంది. కావచ్చు, అయి ఉండ వచ్చు, వచ్చు వచ్చు లుగా సాగు తుంది. సాధారణంగా చాలామంది రచయితలు, విశ్లేషకులు తమకు తోచినది తము నమ్మినది ఖచ్చితంగా చెప్పేస్తారు, డిక్లేర్ చేస్తారు. పాణి అలా చెప్పడు. ఏదైనా ఒక విషయాన్ని నమ్ముతు న్నట్లే ఉంటాడు, అలా ఉంటూనే తిరిగి నమ్మనట్లుంటాడు. అందుకే చ్చు- చ్చు- లుగా రచన సాగిస్తాడు. ఈ పాణి మార్కు పద్ధతిని ఫార్వర్డ్ - రివర్స్ - ఫార్వర్డ్ పద్ధతని నేను పిలుస్తాను. అంచేత పాణి రచనా వాహనం కుదుపులతో కూడుకుని ఉంటుంది. ఈ కుదుపులు పడని వాళ్ళు బండి మధ్యలో దిగిపోవచ్చు. కాని, ఈ పద్ధతిని పాణి ఎందుకు పాటిస్తు న్నాడో బండి దిగకుండా ఆలోచిస్తే ఆయన విప్లవోద్యమం సరైన దారిలో పురోగమించి, మానవాళి సామ్రాజ్యవాద పెట్టుబడి కబంధ హస్తాల నుండి విముక్తి చెంది ఒక పచ్చని ప్రజాస్వామిక కమ్యూన్ వ్యవస్థ విరాజిల్లాలని చాలా ఖచ్చితంగా మనసారా కోరుకునే విశాల హృదయుడని అర్థమౌతుంది.

చాలా మంది రచయితలు, చింతనాపరులు బండిని వేగంగా ఫార్వర్డ్‌లో నడిపి తిరిగి అంతే వేగంగా రివర్స్‌లో నడిపించి విప్లవ వ్యతిరేకులుగా మారి పాలక వర్గ భావజాల తీర్థం పుచ్చుకోవడం చరిత్ర పొడుగునా కనిపిస్తుంది. పాణి అలా కాక నిలకడగా బండిని ఫార్వర్డ్ గేర్లో నడిపించే ఉద్దేశంతోనే మధ్య మధ్యలో రివర్స్ గేర్ వేసి, చుట్టూ సమాజం నుండి వస్తున్న ప్రశ్నలు తనే వేసుకుంటూ, పరిచూసుకుంటూ విప్లవ పథంలో వాహనం నిలకడగా సాగాలని కోరుకునే ఫార్వర్డ్ దృష్టి కలవాడు. కాబట్టే ఈ పద్ధతిని ఎంచుకున్నట్లు నాకనిపించింది.

అలానే అతను ఒక బూచిని, తనను సదా వెంటాడే బూచిని సృష్టించుకుంటాడు. ఈ బూచి తన చుట్టూ సమాజంలో తన ఆలోచనలను, తాత్వికతను ప్రశ్నించే, విమర్శించే బృందానికి రిప్రెజెంటేటివ్. ఈ బూచి ఏమోయ్! మిస్టర్ పాణి! తుమ్ క్యా బాత్ కర్ రహా హై! తుమారా బాతోంసే హంకో సమ్మత్ నహీ హై! అంటూ బెదిరిస్తూ, బ్రేకులు వేస్తూ ఉంటుంది. ఈ బూచిని సముదాయించి, ఒప్పించడం కోసం కూడా పాణి ఎఫ్-ఆర్-ఎఫ్ పద్ధతిని పాటిస్తాడని నా అభిప్రాయం.

ఇది రాజ్యం తెచ్చిన కరువు

ఎం. రాఘవాచారి

కరువైంది. ఏలినవారు అల్లుతూ వచ్చిన విధానాలు ఫలిస్తూ ఈ ఏడాది మునుపెన్నడూలేనంత తీవ్రమైన కరువయింది. దేశం దేశమే కరువుబారిన పడింది. గడిచిన వంద ఏండ్లల్లో ఇంత తీవ్ర వర్షాభావం దేశాన్నంతటినీ సమస్యకు గురి చేయటం ఇది రెండోసారని వర్షపాతపు లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వం, అధికార యంత్రాంగం, అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, సాధారణ మధ్య తరగతి కరువుకు కారణాలను ప్రధానంగా ప్రకృతిలో మాత్రమే చూస్తారు. చెట్లు నరికేసి నీడ లేదని గులుక్కునే బాపతు. వీళ్ళు కరువులకు కారణాలను ప్రకృతిలో మాత్రమే చూడటంలో వీళ్ళకి చాలా సౌకర్యం ఉంది. నెపం ప్రకృతి మీద పెట్టి కరువు మూలాలను ప్రకృతిపరంగా నమోదు చేసి విశ్లేషించి నివారణ చర్యలు ప్రతిపాదిస్తారు. రుతువు మారిందంటే చర్చ మారుతుంది. చర్యలు ముడుచుకుపోతాయి. మారిపోతాయి. కాలాన్ని నమ్ముకుని కరువులను ఈదే సామాన్య ప్రజల పీడిత రైతాంగం అనుభవించిన దుఃఖాన్ని వలపోస్తు రాబోయే కాలం వైపు అడుగులేస్తూ ఉంటారు. ఈ వలయం ఏండ్లకేండ్లు దశాబ్దాలకు దశాబ్దాలు ఇట్లా కొనసాగుతూ ఉంటుంది. కొనగలిగినవారి అనుభవాలు తినగలిగినవిగా, మనగలిగినవిగా కొనలేని వారి అనుభవాలు అసలు మనలేనివిగా మిగులుతూ భయంకరమైన జ్ఞాపకాలలోకి మారిపోతుంటాయి. ఇది తరతరాల అనుభవం. స్వతంత్ర భారతదేశపు ఏడు దశాబ్దాల అనుభవం.

కరువు అంటే కొరత అని. దేనికి కొరత. అన్నింటికీ కొరతే. అయినా ప్రధానంగా నీటి కొరత అనే. నీటి కొరతను ప్రధానంగా రెండు రకాలుగా చూస్తున్నారు. 1. వర్షపాతం తగ్గిపోవటం, 2. భూగర్భ జలమట్టం పడిపోవటం. ఇటీవల తగ్గిన వర్షమైనా సాగుకు అనువుగా ఉండకపోగా సాగును దెబ్బతీసేదిగా ఉండటాన్ని మూడో కారణంగా చూస్తున్నారు. కరువు పరిశీలన అధ్యయనాలు, నిర్ధారణలు ఈ మూడు అంశాల మీద ఆధారపడిచేస్తున్నారు. ఈ మూడు విషయాల పరిశీలనతో ఇప్పుడు ఎదుర్కొంటున్న కరువు బీభత్సమైన కరువు. మునుపెన్నటికన్నా కూడా తీవ్రమైన కరువు. చదువుకున్న, వసతులున్న మధ్యతరగతి వివిధ కారణాలతో పల్లెలు ఖాళీ చేసినందువల్ల, కరువును సామాజిక రాజకీయార్థిక నేపథ్యంతో పరిశీలించగల బుద్ధిజీవులు ఇతరేతర విషయాలలో నిమగ్నులైనందువల్ల ఈ తీవ్రమైన కరువు రావలసినంతగా చర్చకు రాకుండా పోతున్నది.

వర్షపాతం ఆధారంగా కరువును పరిశీలిస్తే భారతదేశపు సగటు వర్షపాతం 1150 మి.మీ. ప్రపంచంలో చాలా దేశాలకంటే ఇది ఎక్కువ వర్షపాతం. దీనిలో 73 శాతం వర్షపాతం నైరుతి రుతుపవనాలలో వందకన్నా తక్కువ వర్షపు రోజులలో నమోదవుతుంది. ఈశాన్య రుతుపవన రోజులు, వేసవికాలం కలిపి 27 శాతం నమోదవుతుంది. వర్షపాతం నమోదులో దేశంలో అనేక అంతరాలుంటాయి. ఈ అంతరాలు దేశంలోని ముప్పై మూడు శాతం ప్రాంతాన్ని తీవ్ర వర్షాభావ ప్రాంతంగా, దుర్భిక్ష కరువు పీడిత ప్రాంతంగా మిగుల్చుతున్నాయి. రాజస్థాన్, సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాలు ఇందుకు ఉదాహరణలుగా చర్చలో ఉంటాయి. సాధారణం వర్షపాతం 750 మి.మీ. కన్నా తక్కువగా నమోదయ్యే ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా గుర్తిస్తుంటారు. దేశంలో ముప్పై మూడు శాతం భూభాగంలో 750 మి.మీ. కన్నా తక్కువ వర్షపాతం నమోదవుతున్నది. తెలంగాణలో మహబూబ్‌నగర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లో అనంతపూర్ జిల్లాలు సగటున 400 నుండి 600 లోపు మి.మీ. వర్షం కురిసే జిల్లాలు. ప్రభుత్వాలే ఈ లెక్కలు ప్రకటిస్తున్నాయి. గడిచిన వంద సంవత్సరాల వర్షపాతపు లెక్కలు నిజాయితీగా పరిశీలించి ఇలాంటి జిల్లాలను, ప్రాంతాలను శాశ్వత కరువు పీడిత ప్రాంతాలుగా గుర్తించి నివారణ చర్యలు చేపట్టవచ్చు. పాలకులు చిత్తశుద్ధి కూడా రుతువుల లాగా చక్రభ్రమణం చేస్తూనే ఉంటుంది. ప్రజలు బలవుతుంటారు.

ప్రభుత్వాలు వర్షపాతపు లెక్కలను మండలానికి ఒక చోట చూస్తున్నాయి. ప్రభుత్వాలు, పాలకవర్గాలు పర్యావరణ విధ్వంసానికి, ప్రకృతి సంపదను ముఖ్యంగా అటవీ సంపదను అడ్డూ అదుపు లేకుండా నాశనం చేసే విధానాలకు పాల్పడుతున్నందువల్ల రుతుగమనంలోను, స్వభావంలోను పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. కురిసే వానలు ఒక పల్లె పరిసరాలలోనే అనేక తేడాలతో కురుస్తున్నాయి. కరువుకి వర్షపాతాన్ని ప్రమాణంగా తీసుకుంటున్నపుడు వ్యవసాయాధారిత ప్రాంతాలలో అన్ని జనావాసాలలో వర్షపాతపు లెక్కలు సేకరించవచ్చు. ఏ గ్రామం, ఏ మండలం, ఏ జిల్లా వర్షపాతాన్ని పొందలేకపోయాయో నిర్ధారించి ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టవచ్చు. ఏటా వేల మిల్లీమీటర్లలో వర్షం కురిసే చిరపుంజి ప్రాంతాలలో కూడా కురిసిన నీటిని కాపాడే చర్యలు తీసుకోనందువల్ల అక్కడ కూడా ప్రజలు తాగునీటికి కటకట పడుతున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వర్షం అందించే అనుభవాలను కనీస పాఠాలుగా కూడా తీసుకోకుండా ప్రభుత్వాలు నెపం వానల మీద నెట్టి ప్రజల్ని బలవంతపు కరువులకు గురిచేస్తున్నాయి.

భూమి లేకుండా ప్రాణికోటి మనుగడ అసంభవం. సమస్త సంపదలకు నెలవు భూమే. భూమి ఆధారంగా ప్రకృతి మానవులకు అందివచ్చిన అద్భుతమైన సంపద. అనేక పరిమితులలోనే అయినా

చెప్పుకోదగ్గ స్థాయిలోనే భూమి జలరాశిని తన గర్భంలో ఇముడ్చుకుని ఉంది. కడుపులో నీరున్నందుకే భూమి ప్రకృతిని, ప్రాణిని బతికించగలుగుతున్నది. భూమి మీద డెబ్భై శాతానికి పైబడి నీరున్నా అదంతా సముద్రపు ఉప్పు నీరు. తాగటానికి ఉపయోగించలేం. వర్షం కురిసినపుడు నిలువ చేసుకున్న నీరో, భూమి తన కడుపులో దాచుకున్న నీరో, మంచు కరిగి పారే నీరో తప్ప దిక్కులేదు. సముద్రపు నీరు శుద్ధి చేసుకోవటం వగైరాలు ఇతర విషయాలు. అయితే 750 మి.మీ. కన్నా తక్కువ వర్షం పడే ప్రాంతాలలో చాలా ఎక్కువగా, ఇతర నీటి పారుదల ఉన్న ప్రాంతాలలో తక్కువగానే అయినా పాతకాలపు బావుల పద్ధతి స్థానంలో బోర్ టెక్నాలజీ వచ్చిన తరువాత భూమి జల్లెడ అవుతున్నదా అన్నంతగా బోర్లు వేయడం జరుగుతున్నది. బోర్లు వేయడం వల్ల, వందల ఏండ్లుగా మేటవేసిన ఇసుకంతా తవ్వి తరలించటం వల్ల బావులు ఉత్త బొందలుగా మిగిలిపోయాయి. లోలోతుకు వేస్తూ పోతున్న బోర్లనించి తోడిపోస్తున్నకొద్దీ ప్రతిపల్లెలో వందలు, వేలలో బోర్లు ఎండిపోయాయి. ముందే వర్షం తక్కువ. భూమిలోకి నీరు ఇంకటమూ తక్కువ. భూగర్భజలం తోడకం ఎక్కువ. లోతు తవ్వుతూ పోతే భూమికి ఇంకోవైపు చిల్లులు పడేలా ఉన్నాయి కానీ నీరు ఉబికి వచ్చేలాలేదు. భూమిలో తేమ చచ్చిపోతున్నది. భూమి ఇసుక భూమిగా మారిపోతున్నది. కురిసి కురవని వానలకు, గాలులకు నేల క్రమక్షయానికి గురవుతున్నది.

భూమి గర్భంలో 30-50 ఫీట్ల మధ్య తగిలే నీరు వందల ఫీట్లు తవ్వినా తగలటం లేదు. ఏటా మూడు నుండి పదిహేను, ఇరవై మీటర్ల దాకా భూగర్భ జలమట్టం పడిపోతున్నది. 400 నుండి 600 వందల ఫీట్లు అంతకన్నా ఎక్కువ లోతుకు బోరు వేసినా నీటి చుక్క రావటం లేదని రైతులు అనుభవిస్తున్న దుఃఖానికి, బోర్లలో గుమ్మరించిన పెట్టుబడులకు లెక్కలు తీసే మొనగాళ్ళు లేనేలేరు. ప్రభుత్వాలు, పాలకవర్గాలు రైతుతో వ్యాపారజూదం ఆడుకుంటున్నాయి. భూగర్భజల మట్టం పడిపోతున్నందువల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వేడిగాలులు పెరుగుతున్నాయి. పశువులు, పక్షులు, ప్రాణులు, మనుషులు వడదెబ్బకు రాలిపోతున్నారు. అడువుల, గుట్టలమీద, మైదానాలలో చెట్లు ఎండిపోతున్నాయి. అడవులు కాలిపోతున్నాయి. ఒక కఠినమైన విపత్తు ఆవహిస్తున్నది. ఇదంతా మన కండ్లముందర, పాలకులకు ప్రభుత్వాలకు తెలిసి జరుగుతున్నది. ఇంత జరుగుతుంటే ఇదంతా పేద ప్రజల మీద ఎక్కుపెట్టి జరుగుతుంటే ప్రభుత్వాలు కొన్ని భూభాగాలను గ్రే ఏరియాలు, సెమీ డార్క్ ఏరియాలు, డార్క్ ఏరియాలుగా ప్రకటించి చేతులు దులిపేసుకుంటున్నాయి. అంది వచ్చిన శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని ఇలాంటి ప్రకటనలు విడుదల చేయడానికి ఉపయోగించుకుంటున్నాయి. ప్రభుత్వాల పాలనా విధానాల దెబ్బకు తాగునీరు మార్కెట్లో తప్ప దొరకని దుస్థితి దాపురించింది.

వర్షపాతం తక్కువ ఉన్న ప్రాంతాల ప్రజలు భూగర్భజలం మీదనే ఆధారపడతారు. అదీ తగ్గిపోవటం ఎంత దుస్తరంగా ఉంటుంది. మానవ నాగరికతా వికాసానికి ఆధారమైంది నదీ తీరం కదా! అంటే నీటి మీద కదా! నీటి కటకట మానవాళి నాగరికతను మాత్రమే కాదు, మొత్తంగా ప్రాణికోటి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నది. నీరుంటేనే కదా.. పాడి పంట. భూమిని సిద్ధం చేసుకుని రైతు మొగుళ్ళ దిక్కు చూస్తుంటే సూర్యుడు చిమ్మే నిప్పులు కురుస్తున్నాయి తప్ప నీళ్ళు లేవు. ఆకాశం వట్టిపోయింది. భూమి వట్టిపోయింది. సగటున వానలు కురిసే రోజులు వంద ఉంటాయని అంటారు కానీ అవి 50-40 రోజులకు పడిపోతున్నాయి. ఆ రోజులలో కూడా అరకొర వర్షమే నమోదు అవుతున్నది. వ్యవసాయ నిర్వహణ కష్టమవుతున్నది. వారం వారం వాన కురిస్తే సేద్యానికి చాలా మంచిది. కనీసం నెలకు మూడు వానలైన నిలిచి కురవకుండా విత్తటం, మొక్క పెరగటం, కలుపు తొలగించటం, క్రమంగా చేను పెరుగుతూ పూత, కోత వచ్చి, గింజగట్టిపడి పంట చేతికి అందటం అసాధ్యం. ఇదంతా నీటి అందుబాటు మీద నడుస్తుంది. ఏ దశలో నీరు అందకపోయినా పంటరాదు. ఉండి గింజపోతుంది. రెక్కల కష్టం పోతుంది. వ్యవసాయం కుప్పకూలిపోతుంది. వ్యవసాయం ఆధారంగా కూడా ప్రభుత్వాలు అందీ, అందని వర్షం మీద, సాగు జరిగిన జరగని నేల మీద లెక్కలు తీసి కరువులను అంచనా వేస్తున్నాయి. కానీ వ్యవసాయం చేయని వారి చేతిలో, ఫామ్‌హౌజ్‌ల విలాసపరుల చేతిలో, రియల్ ఎస్టేట్ దందాగాళ్ళ చేతిలో, సెజ్‌ల వంటి కంపెనీల చేతిలో భూమి బందీ అవుతూ, రకరకాల కంపెనీల కాలుష్యపు కోరల పాలబడి నాశనమవుతూ ఎంతెంత భూమి పాడవుతున్నదో? భూమి కోల్పోతూ ఎందరు రైతులు వ్యవసాయపు జూదంలో ఓడిపోయి వలసల పాలవుతున్నారో ఎక్కడా లెక్కలుండవు.

పైన ప్రస్తావించిన మూడు విధాల సమస్యలతో దేశంలో ముప్పై మూడు శాతం భూభాగం దశాబ్దాలుగా కరువుల పాలబడుతున్నది. కరువు అనుభవాలు ప్రభుత్వాలకు కళ్ళు తెరిపించటం లేదు. కరువులను ప్రకృతి విపత్తుగా, కేవలం సాంకేతికమైందిగా మాత్రమే చూస్తున్నారు. 2009లో కేంద్ర ప్రభుత్వం ఒక కరువు మాన్యువల్ రూపొందించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1981లో ఒక హాండ్ బుక్ రూపొందించే పనులలో ఉండింది. అయితే దృష్టిలో మార్పు లేకుండా చేస్తున్న పనులు కరువులను అధిగమించటానికి సరైన ప్రతిపాదనలతో ముందుకు వస్తాయని ఎంత మాత్రమూ ఆశించలేం. కరువు కాలపు కష్టాలను, కడగండ్లను అనుభవంలోకి తీసుకుని ప్రభుత్వాలు బాధ్యతగా పనిచేయటానికి అనేక ఆధారాలున్నాయి. తొలినాళ్ళ శాసనాలు, మౌఖిక ప్రజాసాహిత్యం, లిఖిత సాహిత్యం, వలసపాలన కాలపు లిఖిత ఆధారాలు, స్వతంత్ర భారత దేశపు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఏటా నమోదు చేసిన ఆధారాలున్నాయి. ప్రత్యక్షంగా లెక్కకు మిక్కిలిగా ఈ ఏడు దశాబ్దాల ప్రజల అనుభవాలున్నాయి. వీటిని స్వీకరించటానికి, నివారణ చర్యలు చేపట్టటానికి ప్రభుత్వాలకు సంకల్పం కావాలి. సంకల్ప శుద్ధి కావాలి. అది లేదు. ప్రభుత్వాలు పాలక వర్గాల ప్రయోజనం కోసమే కరువులను నిర్లక్ష్యం చేస్తున్నాయని అనుభవాలు చెబుతున్నాయి. అంతమాత్రమే కాక ప్రభుత్వాల విధానాలు సమాజాన్ని, పీడితుల్ని కరువుల దిశగా నడిపిస్తున్నాయి.

వ్యవసాయంపై పెట్టుబడులదాడి, మార్కెట్ దాడి రైతాంగాన్ని విశ్వాసం కోల్పోయే వైపు మరణం వైపు తరుముతున్నది. అయినా ప్రభుత్వాలు కరువు కారణాలను ప్రకృతిలో మాత్రమే చూపుతున్నాయి.

దేశంలో 750 మి.మీ. నుండి 1150 మి.మీ. సగటు వర్షం కురిసే ప్రాంతం 67 శాతం ఉన్నపుడు, అలాంటి చోట్ల భూగర్భ జలం కూడా అందుబాటులో ఉన్నపుడు కేవలం రెండేండ్లు సరిగా వర్షాలు కురవకపోతే దేశం ఇంత దుర్భిక్షాన్ని, క్షామాన్ని ఎదుర్కోవలసి ఉంటుందా? 1871 నుండి అందుబాటులో ఉన్న వర్షపాతపు లెక్కలు పరిశీలిస్తే 2002 నాటికి దేశం 22 కరువు సంవత్సరాలను ఎదుర్కొన్నట్టు ప్రభుత్వ నివేదికలు తెల్పుతున్నాయి. వీటిల్లో కూడా 1967-70లు, 1987, 2002లలో 19 శాతం వర్షపాతం తగ్గి 50-60 శాతం సాగు తగ్గి 18 రాష్ట్రాలలో 300 మిలియన్ల ప్రజలు తీవ్ర దుర్భిక్షం ఎదుర్కోవలసి వచ్చింది. దుర్మరణాలకు గురి కావలసి వచ్చింది. ఇప్పుడు వరుసగా రెండు సంవత్సరాల వర్షాభావం. భూగర్భ జలసంపద తగ్గిపోయిన దుస్థితి దీనికి తోడైంది. ఈసారి సగటున 23 శాతం వర్షపాతం తగ్గిందని చెబుతున్నా కొన్ని చోట్ల ఇది 40 శాతానికి పైబడి తగ్గింది. ఇది 23 రాష్ట్రాల ప్రజలను అతలాకుతలం చేస్తున్నది. ఇంత కరువు మునుపెన్నడూ చూడలేదని ప్రజలు వాపోతున్నారు. గత కరువు కాలాలలో కనీసం భూగర్భజలం అందుబాటులో ఉండి తాగునీరు దొరికేది. ఇప్పుడదీ కరువైంది. దొరికే కొద్ది నీటినీ చెరపట్టి నీటి శుద్ధి ప్లాంట్లు పెట్టి అమ్ముకుంటున్నారు. కోట్లకు పడగలెత్తు తున్నారు.

ప్రభుత్వాల అభివృద్ధి విధానాలు దేశంలో సగానికి పైబడిన జనాభాను నిత్య కరువులో ముంచుతున్నాయి. కరువు పీడిత ప్రజల శ్రమమీదనే దేశంలో కొద్దిమంది కోట్లకు పడగలెత్తుతుండగా, ప్రపంచ కుబేరులతో పోటీపడగల రికార్డులకు మరికొద్ది మంది ఎగబాకుతుండగా, గణనకెక్కగలిగిన ఒకానొక సంఖ్య విలాస జీవితం గడుపుతుండగా ఇతర ప్రజలంతా అభివృద్ధి ప్రాంగణానికి వెలుపల ప్రాణాలు నిలుపుకోవటానికే అనునిత్యం ప్రాణాంతకమైన చాకిరీలో తలమునకలవుతున్నారు. అటువైపు నిలిచి ప్రభుత్వాలు స్వచ్ఛ భారత్, శ్రమదానం వంటి నినాదాలతో ఈ ప్రజలతో ఎట్టి చేయిస్తున్నాయి. పెట్టుబడికి చవక లేబరును సమకూర్చే పనిలో ఉన్నాయి.

ఈ ప్రజలకే ఒంట్లో సత్తువలేదు. సత్తువ పొందగల స్థాయిలో ఆహారం లేదు. ఆహారం కొనగల స్థాయిలో ఆదాయం లేదు. పని గంటలు ఎక్కువ. ఆదాయం తక్కువ. తక్కువ పని గంటలలో ఎక్కువ ఆదాయం పొందగల పని అవకాశాలు లేవు. వాతావరణ సానుకూలత లేదు. తీవ్రమైన వేడి. వేడి వేడి గాడ్పులు. కనుచూపు మేర నీరుండదు. నీరింకి తేమ కోల్పోయిన మండుతున్న నేల మీద గుక్కెడు మంచినీరు సమయానికి అందక ఆకాశం నించి పిట్టలు రాలిపడ్డట్టు మనుషులు రాలి పడుతున్నారు. తెలంగాణ పది జిల్లాల్లోనే ఈ సంఖ్య గత మూడు నెలలుగా రోజుకు పది నుండి యాభైలు, అరవైలు దాటుతున్నదంటే దేశమంతటా ఈ విపత్తుకు ఎంతమంది ఎట్లా బలవుతున్నారో కనీసం లెక్కలు నమోదు కావటం లేదు. ఒకవేళ పత్రికలు నమోదు చేసినా ఆదుకోవటానికి ముందుకు రాకుండా ప్రభుత్వాలు వడదెబ్బ మృతుల కుటుంబాల పొట్టలు కొడుతున్నాయి.

ఇన్ని అనుభవాల తరువాత కూడా నిర్మాణాత్మకమైన విధానాలు లేక కరువులను ఎదుర్కోవటంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయి. ప్రకృతి సంపదతో దేశాన్ని సంపద్వంతం చేస్తున్న శ్రమశక్తిని అందిస్తున్న మానవులను ప్రభుత్వాలే తమ విధానాలతో దుర్మరణాల తీరం చేరుస్తున్నాయి. కరువులు, కరువుల నేపథ్యం, కరువుల పరిణామాలు, కరువు మరణాలన్నీ పాలక వర్గాలు చేస్తున్న హత్యలేనని నిరూపిస్తున్నాయి. ఇది కరువుల పట్ల ఉదాసీనంగా ఉండే మధ్యతరగతి తమ హృదయాలను పరీక్షించు కోవలసిన కాలం.

కరువులు ఎట్లా వస్తాయి? ఉరిమినట్టుగా రావు. పిడుగులు పడ్డట్టుగా రావు. రాళ్ళ వానలాగానో, తుఫానుల్లాగానో రావు. యుద్ధాలు వచ్చినట్టుగా గురి చూసి వస్తాయి. ప్రత్యక్షంగా తలపడే పాతకాలపు యుద్ధాల్లా రావు. మదించిన పాలక వర్గాలు తమ దోపిడీని విస్తరించటానికి, వ్యవస్థితం చేయటానికి దేశ సంపదను ప్రజల అవసరాల వైపు కాకుండా ఆయుధాల వైపు మళ్ళించి పంపిణీలో ప్రజలకేమీ దక్కకుండా చేసి నిర్వహించే యుద్ధాల్లాగా వస్తాయి. పీడితుల మీద గురిపెట్టి వస్తాయి. అందుకే కరువు కాలపు పరిస్థితులు 'నిండినోనిది నిండుతుంది. ఎండినోనిది ఎండుతుంది' అన్నట్టు ఉంటాయి. ప్రభుత్వాలు కరువులను శాశ్వతం చేస్తుంటాయి.

కరువు కాలంలో ఏం జరుగుతుంది? కరువు పీడిత కుటుంబాల పిల్లల చదువులు ఆగుతాయి. స్థిర చర ఆస్తులు చవకగా నష్టమవుతాయి. సామాజిక ఆర్థిక స్థాయి పడిపోతుంది. కుటుంబాలు ఉపయోగించే ఆహారం తగ్గిపోతుంది. మనుషులు నెత్తురు కోల్పోయి రోగాల పాలవుతారు. వైద్యం పొందలేకపోతారు. న్యూనతతో కుమిలిపోతారు. ఆకలితో చచ్చిపోతారు. ఆత్మహత్యల పాలవుతారు. ఈ విపత్తునంతా తమకు తాముగా ఎదుర్కోవటానికి వలసల విష వలయంలో బందీలవుతారు. బానిసలవుతారు. కష్టతరమైన పనులలోకి దిగుతారు. ప్రమాదాల బారిన పడి వికలాంగులవుతారు. మరణిస్తారు. కరువులకి ప్రధాన నెపంగా చూపే నీటి అంశం పరిశీలిస్తే చాలు. తాగునీరందదు. నీటి పంచాయితీలు పెరుగుతాయి. సాగునీటి కొట్లాటలు రైతుల మధ్య కొట్లాటలుగా మాత్రమే కాక ప్రభుత్వాల మధ్యకు విస్తరిస్తాయి. నీటి చక్కును తమ వశంలోకి తీసుకున్న వ్యాపార జలగలు కార్పొరేట్ల స్థాయికి ఎదిగి కోట్లలో నీటి వ్యాపారం చేస్తాయి. ప్రకృతి సంపద, శ్రమ సంపద కొద్ది మంది సంపదగా మారి పోవటానికి కరువులు నిచ్చెన మెట్లలా ఉపయోగపడతాయి. ఒక కరువు సంవత్సరం నించి మరో కరువు సంవత్సరంలోకి మారేటప్పటికి సమాజంలో అంతరాలు విపరీతంగా పెరుగుతూ పోతాయి.

తొలకరి ఆలస్యమైందంటే గ్రామాలలో పేద ప్రజలు కప్పను వేలాడకట్టుకుని వానల కోసం పాటలు పాడుతూ తిరుగుతారు. రైతులు, కూలీలు వరదపాశాలు పోస్తారు. పూజలు చేస్తారు. ప్రజల

నమ్మకాలను ప్రభుత్వాలు తప్పుడుగా ఉపయోగించుకుంటున్నాయి. పరిస్థితి ఎంతదాకా పోయిందంటే ప్రకృతి చలన నియమాలు, పరిణామం; పాలకవర్గం ప్రకృతికి చేస్తున్న దుర్మార్గం తెలిసిన ప్రభుత్వాలు ఏకంగా యజ్ఞాలు చేస్తున్నాయి. మత సంబంధమైన మూఢ నమ్మకాలు పాటిస్తున్నాయి. తాము తప్పుదారిన పోతూ, ప్రజాధన దుర్వినియోగానికి, చట్టపరంగా నేరానికి పాల్పడటం మాత్రమే కాక ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నారు. కరువు కారణాలను నమ్మకాలలో కర్మసిద్ధాంతంలో చూపుతు నీడతో యుద్ధంలోకి దింపుతున్నారు. నిజానికి ప్రకృతి తాను ఇవ్వగలిగిందంతా ఇచ్చింది. మానవాళి తరతరాల శ్రమతో చైతన్యంతో ప్రకృతితో వ్యవహరించగల జ్ఞానాన్ని ఇచ్చింది. కానీ, మానవుల జీవించే హక్కును, స్వేచ్ఛను కాపాడటానికే ఏర్పడిందని చెప్పుకుంటున్న రాజ్యం, రాజ్యం చేతిలోని ప్రభుత్వం అసంఖ్యాక ప్రజల శ్రమశక్తిని, ప్రకృతి సంపదను అన్ని సందర్భాలలో దురాశతో దోచుకునే విధానాలతో, కుతంత్రాలతో పని చేస్తున్నందువల్లనే కరువులు పేదప్రజల రక్తమాంసాలను, సమస్తాన్ని సంపన్నులకు దోచిపెట్టే సాధనాలయినాయి.

దేశ మిశ్రమ ఆర్థిక విధానం క్రమంగా నూతన ఆర్థిక విధానంలోకి ముదిరింది. ప్రైవేటు ఆర్థిక విధానంగా పరిణమించింది. సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ తరతరాలుగా కాపాడుతూ వచ్చిన ప్రకృతి సంపదను అభివృద్ధి పేరు మీద ధ్వంసం చేస్తున్నాయి. దోచుకుంటున్నాయి. హరిత విప్లవం, శ్వేతవిప్లవం, నీలి విప్లవం, భారీ ప్రాజెక్టుల నీటి విప్లవం, వ్యవసాయ పనిముట్ల వాడకంలోకి తెచ్చిన పనిముట్ల విప్లవం దేశం మీద, కరువు ప్రాంతాల మీద, పీడితుల మీద విషపు పడగలు పరిచాయి. మనకాలపు అభివృద్ధి కరువు కోరలతో ప్రజల్ని కాటు వేస్తున్నది. దీనికి ఆదివాసులు, దళితులు, మహిళలు, నిరుపేదలు, పసిపిల్లలు, వృద్ధులు తొలుత బలవుతున్నారు. ఈ బీభత్సాన్ని ప్రశ్నించకుండా నిలదీయకుండా ప్రభుత్వాలు సమాచార సాధనాల దన్నుతో చర్చను, సమస్యను దారి మళ్ళిస్తు కాలం గడుపుతుంటాయి. పోరాటాలను అణచివేస్తుంటాయి.

ఈ నేపథ్యంలో దేశంలోని 23 వర్షాభావ రాష్ట్రాలను, ఆయా రాష్ట్రాలలోని తీవ్ర వర్షాభావ జిల్లాలను, ప్రాంతాలను పరిశీలించినపుడు లాతూరు వంటి తాగునీటి విలయం చుట్టుకున్న ప్రాంతాలు, గుక్కెడు మంచినీరందక ఆదిలాబాద్ వంటి అడవు దారుల్లో మరణించిన బాలలు, తట్టుకోలేక పడిపోయిన తల్లులు, పని చేసుకోకపోతే బతుకలేక వాహనం నడుపుతు నడుపుతూనే సీటు మీదనే పడి చచ్చిపోయిన తండ్రులు, అసెంబ్లీలు, పార్లమెంటు భవనాల ముందు ఉరేసుకున్న రైతులు, లక్షలాది ప్రజల వలసలతో కరువుకు, వలసలకు, అసహజ మరణాలకు నెలవుగా నిలిచిన మహబూబ్‌నగర్, అనంతపూర్ వంటి జిల్లాలు ప్రభుత్వాలకు తీవ్రమైన పలు విధాలైన హెచ్చరికలు జారీ చేస్తుండటం మనం చూస్తుంటాం. అనుభవిస్తుంటాం. కాలం గడుస్తున్నకొద్దీ స్పందనలు మొద్దుబారిపోతూనే ఉంటాం. దోపిడీ ప్రభుత్వాలు దాతృత్వపు పథకాలు కొన్ని ముందుకు తెచ్చి సమస్యను తప్పుదారి పట్టిస్తు ఒక తీవ్ర కరువు నించి మరో తీవ్ర కరువు వైపు సమాజాన్ని నడిపిస్తూనే ఉంటాయి.

ప్రకృతి చలనం అర్థమైన కాలం ఇది. ఈ కాలపు కరువులకి మూలాలు కేవలం ప్రకృతిలో లేవు. దేశంలో 750 మి.మీ. నుంచి 400 మి.మీ. లోపు వర్షంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులను ప్రతి ఏటా ఎదుర్కొంటున్న ప్రాంతాల విషయంలో నిర్దిష్టమైన కార్యాచరణ రూపొందించకపోవటంలో, అమలు పరచకపోవటంలో ఉన్నాయి. ఈ ప్రాంతాలలో ఉన్న సహజ వనరులు, మానవ శ్రమ స్థానిక ప్రజలకి అందకుండా దోచుకోవటంలో ఉన్నాయి. మహబూబ్‌నగర్, అనంతపూర్ వంటి జిల్లాలు కరువులు షోకేసులో బొమ్మల్లాగా మిగిలి ఉన్న మర్మం ఇదే. పాలక వర్గాలు కరువు ప్రాంతాలను ప్రదర్శించి సొమ్ము చేసుకుంటున్నాయి. కరువు ప్రాంతాలను తమ దోపిడీకి సాధనం చేసుకుంటున్నాయి.

ఏడు దశాబ్దాల స్వతంత్ర పాలనలో కరవు ప్రాంతాల, పీడిత ప్రజల దుస్థితి దేన్ని తెలుపుతుంది? పరిస్థితులు మౌలికంగా మారకపోవటం, దుఃఖం అలవాటైపోవటం, అసలు దుఃఖమే కలగని నిర్వికారస్థితిలో నెట్టబడటం, పునరావృతమవుతున్న ఈదైన్యం మనకి బోధపరచవలసింది ఏమిటి?

సామ్రాజ్యవాదానికి భారత ప్రభుత్వం, పాలకవర్గాలు దళారీలు, బందీలు. వీళ్ళకి స్థానిక నేతలు దళారీలు. అడుగడుగునా విస్తరించిన దళారీ వ్యవస్థ కరువులను పెంచి పోషిస్తున్నది. సహజమైన మానవ సంబంధాలన్నింటినీ ఈ వ్యవస్థ వికృతం చేస్తున్నది. అమానవీయం చేస్తున్నది. అధికారం ఆస్తులు ఎవరి నించి పొందుతున్నారో వాళ్ళ పట్ల ప్రేమ లేని, స్వీయ గౌరవం కూడా లేని పాలకుల దురాశ, దోపిడీవర్గ పక్షపాతమే పీడిత ప్రజలను తీవ్రమైన కరువులో కడతేర్చుతున్నది. వచ్చే ఏడాది వానలు పడతాయంటున్నారు. పడితే ఏం జరుగుతుంది? కాస్త ఉపశమనం మాత్రమే దొరుకుతుంది. ప్రజలలో వ్యవస్థ స్వభావం పట్ల చైతన్యం పెరిగితే కరువుకు పరిష్కారం దొరుకుతుంది.

అరుణతార సాఫ్ట్ కాపీలను

www. arunatara.com సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

- సం.

మార్క్స్ పెట్టుబడి - రచనా క్రమం

ఫ్రాన్సిస్ వీన్
అనువాదం: ముక్తవరం పార్థసారథి

(9)

(గత సంచిక తరువాయి...)

పెట్టుబడిదారీ విధానాన్ని కూలంకషంగా అధ్యయనం చెయ్యటం మార్క్స్ లక్ష్యం. "వలస దేశాలలోని పెట్టుబడి సంబంధాలను చాలా చక్కగా వివరించాడు వేక్‌ఫీల్డ్. అక్కడి సంగతెలా ఉన్నా, ఆయన్ను చదివితే, మాతృదేశంలోని పెట్టుబడి అవసరాల గురించి మనకు మరింత బాగా అర్థమవుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి, సంచయం- అంటే పెట్టుబడిదారీ ఆస్తి- కార్మికుల శ్రమను, ఆస్తిని దోచుకోవటం ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది" ఈ చివరి వాక్యం దాస్‌క్యాపిటల్ రాయటంలోని రచయిత ఉద్దేశ్యాన్ని స్పష్టం చేస్తుంది. పెట్టుబడిదారీ విధానం కప్పుకొన్న ముసుగుల్ని తొలగిస్తుంది దాస్‌క్యాపిటల్. చివరికి అది అంతం కాక తప్పదని జోస్యం కూడా చెబుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంతకాలం కొనసాగుతుందో ఎవరికీ తెలియదు కానీ అది దోపిడీ ఆధారంగానే మనుగడ సాగించగలదన్నది మాత్రం నిర్వివాదాంశం.

ఇదంతా మనం ఉంటున్న, అనుభవిస్తున్న, చూస్తున్న సమాజం గురించిన చర్చే. కానీ ఈ సమాజం డాంతె (ఇటాలియన్ మహాకవి) రాసిన ఇన్‌ఫెర్నో (నరకం) కు ఏమీ తీసిపోదు. (కవి వర్జిల్, డాంతెకు గైడ్‌గా ఉండి నరకం మొత్తం చూపిస్తాడు) కాని ఈ భూలోక నరకాన్ని చూపించటానికి మార్క్స్‌కు ఏ వర్జిల్ సహాయమూ లభించలేదు. అందువల్ల దాస్‌క్యాపిటల్ మొదటి సంపుటానికి రాసిన ముందుమాటలో "ఎవరేమనుకున్నా, ఎవరేమన్నా, నీ దారిలో సాగిపో" అంటాడు. మార్క్స్ తన 'దాస్ క్యాపిటల్' లో పాఠకులకు

భూలోక నరకాన్ని దర్శింపచేసాడు. లెక్కలు, సూత్రీకరణలు, సిద్ధాంతాలు, వాదాలు, చర్చలు ఎన్ని ఉన్నా, తరచూ మనం నరకంలో ఉన్నామన్న విషయం గుర్తుకు చేస్తూనే ఉంటాడు.

"అక్కడంతా బహిరంగమే. దాచటానికేమీ ఉండదు. ఆ రణగొణ ధ్వనుల విపణి వీథులను వీడి, డబ్బు మూటల గాళ్ళనూ, శ్రమ శక్తిని కొనుక్కొనే వాళ్ళనూ, ఉత్పత్తి జరిగే రహస్య స్థలాలలోకి అనుసరిద్దాం "వ్యాపార నిమిత్తం తప్ప ఎవరూ లోపలికి రావద్దు" అని రాసుంటుందక్కడ. ఇక్కడ పెట్టుబడి ఎలా ఉత్పత్తికి కారణమవుతుందో మాత్రమే కాదు, పెట్టుబడి స్వయంగా ఎలా ఉత్పత్తి అవుతుందో కూడ మనం చూడవచ్చు. అదనపు విలువకు జన్మస్థానం ఇదే".

ఇలాంటి పేరాగ్రాపులు చదువుతుంటే మనకు మార్క్స్ సాహిత్య నేపథ్యం గుర్తుకు వస్తుంది. ఇంగ్లండులో అగ్గిపెట్టెలు తయారుచేసే ఫాక్టరీల గురించి రాస్తూ "అక్కడ సగం మంది బాలకార్మికులే. కొందరు ఆరేళ్ళ పిల్లలు. కార్మికులలో కూడా ఏ ఆధారమూ లేని నిర్భాగ్యులు- ఆకలితో అలమటించే వితంతువులు మాత్రమే పని చేస్తారక్కడ" అంటాడు.

"రోజుకు 12 నుండి 14 లేదా 15 గంటలు పనిచెయ్యాలి. రాత్రి కూడా విశ్రాంతి ఉండదు. ఎప్పుడు క్షణం తీరిక చిక్కితే అప్పుడే తినాలి. అదీ గంధకం పొగలు వ్యాపించే ఆ ఇరుగ్గదుల్లోనే. డాంతె తన ఇన్‌ఫెర్నో లో కూడా ఇంతటి దారుణ పరిస్థితుల్ని చూసి ఉండడు".

ఇలాంటిదే మరో నరకం. అనుభవిస్తే తప్ప తెలియదు.

"కార్మికులు ఏ పని చేస్తున్నారు? ఎంత వయసు? ఆడా?మగా? అన్నది కాదు. యులిసీస్ చేతిలో హతులైన విగత జీవుల్లా మన చుట్టూ కనిపిస్తారు. పని ఎక్కువై, మృత్యువు వాళ్ళను పలకరిస్తున్నది. బ్లూబుక్స్ సంగతెందుకు కాని (బ్రిటిష్ ఫాక్టరీ ఇనస్పెక్టర్ల రిపోర్టులే బ్లూబుక్స్) మరో ఇద్దరు జీవచ్ఛవాల గురించి మాట్లాడుకుందాం...దర్జీలైనా, కమ్మరి వాళ్ళైనా సుదీర్ఘమైన పనిగంటలు వాళ్ళను పీల్చి పిప్పి చేసాయి."

మరీ ఆన్ వాక్లీ గురించి రాయటానికి ప్రస్తావన ఇది. 1863లో, ఈ ఇరవై ఆరేళ్ళ మహిళ ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్ ఇచ్చిన విందులో అతిథులకు డ్రెస్సులు కుట్టే క్రమంలో విరామం లేకుండా 26 గంటలు పనిచేసి, కేవలం 'అధిక శ్రమ'తో మరణించింది. ఆమె చావుకు ఇంతకన్నా పెద్ద కారణమేమీ లేదు ("వినసొంపుగా ఉన్న 'ఎలీస్' అనబడే ఆమె యాజమానురాలు" అంటాడు మార్క్స్ వ్యంగ్యంగా) తన దగ్గర ఉద్యోగం చేస్తున్న మనిషి పని ముగించకుండానే మరణించినందుకు చాలా బాధపడిందట యజమానురాలు.

నిజ జీవితంలో ఇలాంటి మనుషుల్ని చూసి ఉండకపోతే, చార్ల్స్

డికెన్స్ తప్పక తన కల్పనా శక్తితో సృష్టించి ఉండేవాడే. జాగ్రత్తగా చదివితే, దాస్‌కాపిటల్‌లో డికెన్స్ నవలల వాతావరణం కనిపిస్తుంది. (మార్క్స్ బాగా అభిమానించిన రచయితల్లో డికెన్స్ ఒకడు)

యంత్రీకరణను తను సమర్థించటం లేదని విమర్శించే వాళ్ళను ఎలా ఎద్దేవా చేస్తున్నాడో చూడండి.

"కోర్టులో బిల్‌సైక్స్ వాదన ఇలాగే ఉంటుంది. జడ్జిగారూ, నేను అతణ్ణి పొడిచి చంపిన మాట నిజమే. కాని అది కత్తి చేసిన నేరం. దానికి నేనెలా బాధ్యుణ్ణవుతాను? కత్తి వల్ల గొంతు తెగుతుంది గనక కత్తుల్ని నిషేధిస్తామా? వ్యవసాయంలో, వ్యాపారంలో, శస్త్రచికిత్సలో చివరికి డైనింగ్ టేబుల్ మీద కత్తుల్ని వాడరా? కత్తిని నిషేధిస్తే మనం తిరిగి ఆటవిక దశకు చేరుకుంటాం"

నిజానికి, ఆలివర్ ట్విస్ట్ నవలలో బిల్‌సైక్స్ ఇచ్చిన ఉపన్యాసం కాదిది. ఆ పాత్ర మనస్తత్వాన్ని మార్క్స్ తన అవసరానికి వాడుకున్నాడంతే. బీరువాలలోని పుస్తకాలను చూపిస్తూ, "అవి నా బానిసలు. నేను చెప్పినట్టు వినాలి. నాకు ఉపయోగపడాలి" అనేవాడు. తిండి పెట్టి పోషించవసరం లేని ఈ 'బానిసల' పని ముడిసరుకును సప్లై చెయ్యడం, దాన్ని తన అవసరాని కనువుగా మలచుకుంటాడు మార్క్స్. "ఆయనతో సంభాషణ ఏక దిశగా సాగదు. లైబ్రరీలో ఉన్న పుస్తకాల జ్ఞానమంతా ఆయన మాటల్లో ప్రతిఫలిస్తుంది" అన్నాడు 1878లో ఆయనను ఇంటర్వ్యూ చేసిన షికాగో ట్రిబ్యూన్ విలేఖరి. "ఒక వ్యక్తి చదివిన పుస్తకాలను బట్టి అతడెలాంటివాడో అంచనా వెయ్యొచ్చు. ఆయన షెల్ఫ్‌లోని రచయితల్ని చూస్తే తెలిసిపోతుంది. షేక్స్‌పియర్, డికెన్స్, థాకరే, మొలియేర్, రసీన్, మాంటెన్, బేకన్, వోల్టేర్, పెయిన్ వగైరాలే గ క, ఇంగ్లిష్, అమెరికన్, ఫ్రెంచ్ బ్లూబుక్స్, రష్యన్, జర్మన్, ఇటాలియన్ రాజకీయ, తాత్విక రచనలు అక్కడ దర్శనమిస్తాయి. 1976లో ప్రొఫెసర్ ఎస్.ఎస్.పవార్ మార్క్స్ సాహిత్య ప్రస్తావనల గురించి 450 పేజీల పుస్తకం ఒకటి ప్రచురించాడు. దాస్‌కాపిటల్ మొదటి భాగంలో బైబిల్, షేక్స్‌పియర్, గోతె, మిల్టన్, వోల్టేర్, హోమర్, బాల్జాక్, డాంతె, షిల్లర్, సోఫోక్లీస్, ప్లేటో, తూసిడైడ్స్, జెనోఫాన్, డీఫో, సెర్వాంటెస్, డ్రైడెన్, హైన్, జువెనాల్, హోరేస్, థామస్‌మోర్, సామ్యూల్ బట్లర్‌ల నుండి కొటేషన్స్ మాత్రమే కాదు, దయ్యాలు, వాంపైర్ల (డ్రాక్యులా) ల గురించిన ప్రస్తావనలతో ఇది ఒక హారర్ నవలను తలపిస్తుంది. అంతేనా, రొమాంటిక్ నవలలు, జానపద గీతాలు, వీరగాథలు, పాటలు, చిన్నపిల్లల రైమ్స్, నాటకాలు, పార్సులు, నానుడులు కూడా ఇందులో తొంగిచూస్తాయి.

సాహిత్య ప్రస్తావనలు సరే. దాస్‌కాపిటల్‌లో సాహిత్య విలువలున్నాయా? అని కూడా ప్రశ్నించారు. ఇతర్ల రచనల్ని ఉదహరించినంత మాత్రాన అది సాహిత్య గ్రంథమైపోదు. ఆర్థిక శాస్త్రజ్ఞులను మార్క్స్ ఎలా చీదరించుకున్నాడో చూడండి. "సాహిత్యం, చరిత్ర అని పాండిత్య ప్రకర్ష చేసేనంత మాత్రాన సరిపోదు. అసంబద్ధమైన విషయాల గురించి రాయటం సంస్కారం అనిపించుకోదు. తమకే తెలియని లేదా తామే అంగీకరించని విషయాల్ని ఇతర్లకు బోధించటానికి ప్రయత్నించటం ఎంత మూర్ఖమో!" ఈ వ్యాఖ్యల్ని తనకే ఆపాదించుకన్నాడేమో గాని, దాస్ కాపిటల్ రెండవ ముద్రణకు రాసిన ముందుమాటలో "ఇందులోని సాహిత్య పరమైన లోపాలు నా కన్నా ఎక్కువ ఎవరికీ తెలియవు" అన్నాడు. అయితే ఇంత రాసినా, దాస్‌కాపిటల్‌ను సాహిత్యంగా పరిగణించేవారు అరుదు. ఇందులోని ఆర్థిక సిద్ధాంతాల గురించి ఎంతమంది ఎన్ని పుస్తకాలు ప్రచురించారో లెక్కలేదు గాని, "ఇదో కళాఖండం" అని మార్క్స్ చేసిన ప్రకటనను గురించి ఎవరూ సీరియస్‌గా తీసుకున్నట్టు లేదు.

దీనికో ప్రధాన కారణం- పొరలు, పొరలుగా ఉన్న (మల్టీ-లేయర్డ్) ఈ గ్రంథ నిర్మాణం. (దీన్ని ఆర్థిక విషయాల గురించి చేసిన సాహిత్య సృష్టి అందామా లేక సాహిత్యంగా మలచిన ఆర్థికశాస్త్ర గ్రంథమందామా?) దాస్‌కాపిటల్‌ను గోతిక్ నవలలాగ చదవవచ్చు. ఇందులోని కథానాయకులు (కార్మికులు) తాము సృష్టించిన భూతాలకు (సరుకులు, పెట్టుబడి) బానిసలు - "కార్మికుల రక్తమాంసాలతో తడిసిన పెట్టుబడి" తన 1962 నాటి అధ్యయనం ద టాంగిల్డ్ బ్యాంక్ : డార్విన్, మార్క్స్, ఫ్రేజర్ అండ్ ఫ్రెండ్ యాస్ ఇమాజినేటివ్ రైటర్స్ లో ఎస్.ఇ.హిమ్స్ దీనికో మంచి పేరు సూచిస్తాడు. "ద మార్టిగేజ్ ఆన్ లేబర్ పవర్ ఫోర్‌క్లోజ్డ్" (తాకట్టు పెట్టబడిన శ్రమశక్తిని లాగేసుకోవటం). లేదా ఒక ప్రహసనంగా కూడా (ముసుగువీరుని (సరుకులు) రహస్యం బట్టబయలు చేసి వాడి మరుగుజ్జు రూపం, బానపొట్టా ప్రజలకు చూపించాడు మార్క్స్) దీన్ని చూడవచ్చు. లేదా గ్రీక్ విషాదాంత నాటకంగా- విధి చేతిలో కీలుబొమ్మలు మనుషులు. "దీనికి కారణం, వీళ్ళు కళ్ళముందు కనిపించే వాస్తవాన్ని చూడలేకపోవడమే పరిస్థితులను బట్టి మార్చుకోలేని స్థిరమైన అభిప్రాయాలు, మూఢ నమ్మకాలుండటమే" అంటాడు. సి.ఫ్రాంకెల్ తన మార్క్స్ అండ్ కాన్టెంపరరీ సైంటిఫిక్ థాట్ లో అసలుదీన్ని గలివర్స్ సాహసయాత్రల వంటి గొప్ప వ్యంగ్య రచనగా ఎందుకు చూడకూడదు? (అందులోని Houyhnhnms దేశాన్ని గుర్తుచేసు కొండొకసారి) లోకం స్వర్గధామమే. మనిషే చీడపురుగు. జొనథన్ స్విఫ్ట్ లాగ, మార్క్స్ కూడా "ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ మనుషుల్ని యాహూ లుగా, నపుంసకులుగా, నిర్వీర్యులుగా మార్చింది" అంటాడు.

పెట్టుబడిదారీ విధానమంటేనే ఒక పిచ్చివాడి స్వర్గం. హేతుబద్ధంగా దాన్ని విశ్లేషించడం సాధ్యం కాదు గనక 140 ఏళ్ళుగా ఇతర్లు చెయ్యలేని పని మార్క్స్ చేసాడు. వ్యంగ్యంగా ఎద్దేవా చేసినట్టు తప్ప మరో రకంగా దాని గురించి రాయలేం. అమెరికన్ రచయిత ఎడ్మండ్ విల్సన్ తన To The Finland Station : A study in the writing and acting in history (1940) లో "క్లాసికల్ ఎకనమిక్స్‌కు పేరడీ దాస్‌కాపిటల్" అన్నాడు. ఒకసారి దీన్ని చదివిన తర్వాత, సాంప్రదాయ ఆర్థిక శాస్త్ర గ్రంథాలను మనం చదివే దృష్టే మారిపోతుంది. వాళ్ళు ఎంత గంభీరంగా, ఎంత ఉదాత్తంగా తమ సిద్ధాంతాలను ప్రవచించినా కఠిన, కర్కశ మానవ సంబంధాలకు తొడగని ముసుగులవి. అని అర్థమవుతేనే ఉంటుంది. మార్క్స్ మనోవైజ్ఞానిక దృష్టి గొప్పది. కళ్ళముందు కనిపిస్తున్న కఠోర వాస్తవాన్ని మనుషులెందుకు గ్రహించలేకపోయారు. జరిగిన తప్పులను సరిదిద్ది మనుషుల మధ్య సౌహార్ద సంబంధాలను నెలకొల్పలేమా? ఈ విషయాలన్నీ వివరించటానికే మార్క్స్ వ్యంగ్య రచనా ధోరణిని

ఎంచుకున్నాడు. ప్రపంచ సాహిత్యంలో స్విఫ్ట్ తర్వాత అంతటి గొప్ప రచయిత నిస్సందేహంగా మార్క్స్. ఇద్దరికీ చాలా పోలికలున్నాయి.

ఇది నమ్మశక్యంగా లేదుగదూ! పోనీ మనవాదనకు కొన్ని ఆధారాలను వెదుకుదాం. దాస్‌కాపిటల్ నాల్గవ సంపుటాన్ని థియరీస్ ఆఫ్ సర్ప్లస్ వాల్యూ అంటారు. ఇందులో 'ఉత్పాదక', 'అనుత్పాదక' శ్రమ గురించి వివిధ ఆర్థిక శాస్త్రజ్ఞుల అభిప్రాయాలను ఉదహరిస్తాడు. మతాధికారులు, న్యాయవాదులు, డాక్టర్లు, అన్ని రకాల రచయితలు, క్రీడాకారులు (వృత్తి), జోకర్లు (విదూషకులు), సంగీతకారులు, నాటకాల వాళ్ళు వగైరాలను అనుత్పాదక కార్మికులంటాడు ఆడం స్మిత్. "ఇతరులు ఉత్పత్తి చేసిన సంపద వీళ్ళను పోషిస్తున్నది". కాని ఉత్పాదక, అనుత్పాదక శ్రమల మధ్య తేడా చూడటం అంత సులభమా? ప్రతి వృత్తికారుడూ ఉత్పాదక శ్రామికుడే అంటాడు మార్క్స్. ఇదిగో, ఇది చదవండి :

"ఒక తత్త్వవేత్త ఆలోచనల్ని ఉత్పత్తి చేస్తాడు. కవి-పద్యాలు రాస్తాడు. మతాధికార్లు ప్రవచనాలు చెబుతారు. ఒక ప్రొఫెసర్ గారు బృహద్గ్రంథాలు రాస్తాడు. అలాగే, నేరస్తుడు నేరాలు "సృష్టిస్తాడు" - ఈ రకమైన 'ఉత్పత్తి' కీ, సమాజానికీ ఉన్న సంబంధాన్ని చూడగలిగితే మనకు చాలా భ్రమలు తొలగిపోతాయి".

నేరస్తుడు నేరాలను మాత్రమే కాదు నేర స్మృతిని కూడా సృష్టిస్తాడు. ఈ చట్టాలను విరించటానికి ప్రొఫెసర్లను సృష్టిస్తాడు. (ప్రొఫెసర్ ఆఫ్ క్రిమినల్ లా). ఈ లెక్చర్ల సారాంశమే మరో పుస్తకం. మార్కెట్లో అవి మరో సరుకు (కమోడిటీ) గా మారిపోతుంది.

నేరస్తుడు, పోలీసులనూ, న్యాయవ్యవస్థను కూడా సృష్టిస్తాడు. ఆ 'వ్యవస్థ' అంటే కానిస్టేబుల్స్, జడ్జీలు, తలారులు వగైరా. ఇలా అనేక రకాల వ్యాపారాలు, వృత్తులను పెంచి పోషిస్తాడు. ఇదంతా శ్రమ విభజనే. కొత్త అవసరాలు తీర్చుకోవటానికి కొత్త పద్ధతులు అన్వేషిస్తారు మనుషులు. ఉదాహరణకి 'చిత్రహింస' నే చూడండి. టార్చర్ కోసం ఎన్ని పరికరాలను సృష్టించామో! ఎంతమంది వృత్తి నిపుణుల ప్రతిభతో ఇది సాధ్యమైందో! నేరస్తులు నైతిక విలువల గురించిన చర్చకు తెరలేపుతారు. వాళ్ళను చూస్తే కోపం వస్తుంది. జాలి కలుగుతుంది. ప్రజలలో ఈ మీమాంసను సృష్టించి అతడు సేవ చేస్తున్నాడు. నేరస్తుడు క్రిమినల్ లా పుస్తకాలను, పీనల్ కోడ్‌ను, న్యాయవాదులను, చట్ట ప్రతినిధులను మాత్రమే కాదు, కళా సృష్టి కూడా చేస్తున్నాడు. ఎన్ని వ్యాసాలు, నవలలు, ట్రాజిడీ నాటకాలు వీళ్ళ గురించి రాయలేదని! మల్నర్ షెల్డ్, హిల్లర్ రాబర్స్‌లు ఈడిపస్, రిచర్డ్ ది థర్డ్‌లు కొన్ని ఉదాహరణలు. (ఈ నాడు మార్క్స్ ఈ విషయం రాస్తే, ఆర్థర్ కానన్ డాయల్ నుండి జాన్ గ్రిషాం దాకా ఎంతమంది క్రైం, డిటెక్టివ్ రచయితల పేర్లు ఉదహరించేవాడో!) నిస్సారమైన బూర్జువా జీవితాలను ఒక కుదుపు కుదుపుతాడు నేరస్తుడు. కనీసం స్తబ్దత లేకుండా చేస్తాడు. మనలో జాగరూకత పెంచుతాడు. పోటీ తత్వం అవసరమని తెలుస్తుంది.

"ఉత్పాదకత మీద నేరస్తుని ప్రభావం చాలా ఉంటుంది. దొంగలు లేకపోతే, ఇంత మంచి తాళాలు తయాలు చెయ్యగలిగే వాళ్ళమా! ఫోర్జరీలను అత్యంత క్లిష్టతరం చేసే అత్యాధునిక కరెన్సీ నోట్లను ముద్రించగలిగేవారమా? ఇవన్నీ ప్రైవేటు నేరాలే అనుకున్నా, నేటి అంతర్జాతీయ విపణి, జాతీయ నేరాల సమ్మేళనమే కాదా! ఆదం కాలం నుండీ పాప వృక్షం లేకుండా జ్ఞానవృక్షం పెరిగిందా?"

స్విఫ్ట్ తన "ఎ మాడెస్ట్ ప్రపోజల్" లో పుట్టిన పిల్లల్ని ఇంగ్లండుకు ఆహారంగా ఎగుమతి చేయటం ద్వారా ఐర్లాండ్‌లోని పేదరికాన్ని నిర్మూలించవచ్చని సూచిస్తాడు. పైనుదహరించిన మార్క్స్ వాదన కూడా అలాగే ఉంటుంది" అంటాడు ఎడ్మండ్ విల్సన్.

ఇంతకూ, ఈ పుస్తకాన్ని మార్క్స్ ఇలాగే ఎందుకు రాసాడు? సింపుల్‌గా ఓ ఆర్థిక శాస్త్ర గ్రంథంలా రాస్తే సరిపోయేదిగా? హెగెల్‌నూ గతితార్కిక వాదనలనూ తెచ్చి ఎందుకు దీన్ని 'ఇనుపగుగ్గిళ్ళ' లాగ వండాడు? నిజానికి ఆయన 1865లో ఇచ్చిన రెండు ఉపన్యాసాలు 'వెల, ధర, లాభం' గా పుస్తక రూపంలో వెలువడ్డాయి. అందులో ఆయన ఎంత సరళంగా ఇదే విషయాన్ని వివరిస్తాడో! "ఒక వ్యక్తి కేవలం తను వాడుకోవటం కోసం ఒక వస్తువును తయారు చేస్తే అది వస్తువే. సరుకు కాదు. 'సరుకు' ఉత్పత్తిలో సామాజిక శ్రమ ఉంటుంది. డబ్బు రూపంలో వ్యక్తపరిచిన విలువే 'ధర'...కార్మికుడు తన శ్రమను కాదు, శ్రమశక్తిని అమ్ముతాడు...వగైరా ఆర్థిక విశ్లేషణల సంగతి పక్కన పెట్టండి. చిన్న పిల్లలకు కూడా అర్థమవుతుంది. జటిలమైన వాదోపవాదాలు లేవు. తాత్విక చర్చలు లేవు. సాహిత్య ప్రస్తావనలు లేవు. మరి ఇదే విషయం గురించి రాసిన దాస్‌కాపిటల్ ఎందుకు "మేడ్ డిఫికల్ట్" లాగుంది? సరళంగా, స్పష్టంగా రాయటం మరిచిపోయాడా మార్క్స్? ఎంత మాత్రం కాదు. ఆ ఉపన్యాసాలు ఇచ్చిన సమయంలోనే ఆయన దాస్‌కాపిటల్ రాయటంలో నిమగ్నమై ఉన్నాడు. 'విలువ, ధర, లాభం' లో సరుకును అసలు (రియల్) విలువకు అమ్మటం వల్ల - అందరూ అనుకొన్నట్టుగా 'సర్చార్జ్' కలిపి అమ్మటం వల్ల కాదు- లాభం వస్తుంది అంటాడు. నిత్యానుభవంలో ఇదో తిరకాసు లాగ కనిపిస్తుంది. కాని భూమి సూర్యుడి చుట్టూ తిరుగుతుందన్నా, ఆక్సిజన్, హైడ్రోజన్ కలిసి నీరు ఏర్పడుతుందన్నా తిరకాసు (పారడాక్స్) లాగే కనిపిస్తుంది. నిత్యానుభవానికీ, శాస్త్రీయ సత్యానికీ ఉండే తేడా అది. కళ్ళ ముందు కనిపించేదే నిజమనుకుంటాం. పరిశోధిస్తే మరో ఫలితం వస్తుంది.

(వ్యాకరణంలో) అలంకారమంటే, ఒక వస్తువు లక్షణాలను మరొక దానికి ఆపాదించటం. లుడ్విగో సిల్వా అనబడే మెక్సికన్ విమర్శకుడు 'పెట్టుబడిదారీ విధానం' అనే పదమే ఒక అలంకారం అన్నాడు. ఉపయోగపు విలువ నుండి మారకపు విలువకు జరిగే మానవ స్వభావం నుండి రాక్షస స్వభావానికి పరాయికరణకు మారుపేరు కాపిటలిజం. పుస్తకాన్ని క్లిష్టతరం చేయడం ఆయన లక్ష్యం కాదు. సాహిత్య విలువలు ఉండక తప్పదనుకొని రాసిందీ కాదు. భ్రమల లోకం నుండి ముసుగులు కప్పుకొన్న విషయాల నుండి మనం వాస్తవం గ్రహించాలంటే అలాగే రాయక తప్పదు. చివరగా దాస్‌కాపిటల్ అలా ఎందుకున్నదంటే, అదలా ఉండక తప్పదు గనక. మార్క్స్ చెప్పదలచుకొన్న విషయాన్ని చెప్పటానికి మరో పద్ధతి లేదు. అంతే. ప్రపంచ చరిత్రలో అలాంటి పుస్తకం ఇంతవరకూ రాలేదు. బహుశా, ఈ కారణం వల్లే అదింత నిరాదరణకు గురైంది. ఘోర అపార్థాలకూ దారితీసింది.

-: స్వీకారం :-



ఎవరిదీ ముఖం
కవిత్వం
రెడ్డి రామకృష్ణ
ప్రచురణ :
వెలుగు
వెల : రు. 80/-
పేజీలు : 112

గాలి అద్దం
ఎం ఎస్ నాయుడు
ప్రచురణ :
వాసిరెడ్డి పబ్లికేషన్స్
వెల : రు. 120/-
పేజీలు : 182



వింటిని గురిపెట్టు...
ఆదివాసీ పోరు పాటలు
నల్లెల్ల రాజయ్య
ప్రచురణ :
వరంగల్ రచయితల సంఘం
వెల : రు. 60/-
పేజీలు : 64



తెలంగాణ ప్రజాఫ్రంట్ సారథ్యంలో...
త్యాగాల వనం
పాటల సి.డి.
సమర్పణ :
ప్రజా కళామండలి
సంగీతం :
విష్ణుకిషోర్
వెల : రు. 50/-

మోడీ రెండేళ్ల పాలన
వైఫల్యాల పుట్ట
ప్రచురణ :
తెలంగాణ' ప్రజా ఫ్రంట్
వెల : రు. 30/-
పేజీలు : 56

మొగ్గ పూసలు
తప్పెట ఓదయ్య
ప్రచురణ :
సాహితీ సోపతి
వెల : రు. 80/-
పేజీలు : 108



ఏది దేశభక్తి?
ఏది జాతీయత?
ఏది దేశాభిమానము?
ఏది దేశద్రోహము?
ఏది రాజద్రోహము?
ప్రచురణ :
లౌకికవాద పరిరక్షణా వేదిక
గుంటూరు
వెల : లేదు
పేజీలు :72



జ్ఞాపకాల చేద బొక్కెన
కవిత్వం
డా॥ వాణి దేవులపల్లి
ప్రచురణ :
సప్నీ ప్రచురణలు
వెల : రు. 90/-
పేజీలు : 79



మొట్టమొదటి
కన్యాశుల్కము
గురజాడ అప్పారావుగారు
బం.గో.రె.
ప్రచురణ :
కావ్య పబ్లిషింగ్ హౌస్
వెల : రు. 175/-
పేజీలు : 271



కొండపందికొక్కు
అరుణతార కథలు
(1988-89)
సంకలనం - 12
ప్రచురణ :
చరిత
వెల : రు. 30/-
పేజీలు : 96



ఓడిపోయిన కథలు
అరుణతార కథలు
(1989-90)
సంకలనం - 13
ప్రచురణ :
చరిత
వెల : రు. 30/-
పేజీలు : 96



దాడి
అరుణతార కథలు
(1990-91)
సంకలనం - 14
ప్రచురణ :
చరిత
వెల : రు. 30/-
పేజీలు : 88



విప్లవ ప్రజాపంథా కోసం
భారతదేశపు గ్రేట్ డిబేట్
కా. డి.వి. రచనలు - 8
కా. దేవులపల్లి
వెంకటేశ్వరరావు
ప్రచురణ :
పోరునేల ప్రచురణలు
వెల : రు. 200/-
పేజీలు : 582



విప్లవ ప్రజాపంథా
అమలుకోసం పోరాటం
కా. డి.వి. రచనలు - 9
కా. దేవులపల్లి
వెంకటేశ్వరరావు
ప్రచురణ :
పోరునేల ప్రచురణలు
వెల : రు. 150/-
పేజీలు : 326



కమ్యూనిస్టు విప్లవకారుల
ఐక్యతా సమస్యలు
కా. డి.వి. రచనలు - 10
కా. దేవులపల్లి
వెంకటేశ్వరరావు
ప్రచురణ :
పోరునేల ప్రచురణలు
వెల : రు. 140/-
పేజీలు : 271

KLVA101M 188

ARUNATARA RNI Regn.No.21152/72 Published on 7/6/2016 June, 2016 Vol. : 44 Issue : 5 Hyderabad
A Literary and Cultural Telugu Monthly Journal of Viplava Rachayitala Sangham (VIRASAM - Revolutionary Writers' Association)

అరుణతార నిర్వహణకు విరాళాలివ్వండి
శాశ్వత నిధి ఏర్పాటుకు సహకరించండి

విప్లవ రచయితల సంఘం అధికార పత్రిక అరుణతార 1977 నవంబర్ నుంచి మాస పత్రికగా వస్తోంది. సాహిత్య సాంస్కృతిక సంస్థగా విరసం విప్లవ, విప్లవ సాహితోద్యమాల్లో నిర్వచించుకున్న తన రాజకీయ, సాహిత్య, మేధో పాత్రకు వాహికగా తెలుగు సమాజంపై ప్రభావం వేస్తున్నది. గత మూడు తరాలుగా ఎందరో రచయితల, బుద్ధిజీవుల ఆలోచనా వికాసానికి వేదికగా ఉన్నది. సాహిత్య పత్రిక అయినప్పటికీ సామాజిక, రాజకీయార్థిక, సిద్ధాంత విశ్లేషణలకు, చర్చలకు, అన్వేషణకు సృజనశీలమైన మాధ్యమంగా కొనసాగుతున్నది. నక్సల్బరీ శిశువుగా విరసం తాను ఎంచుకున్న విప్లవోద్యమ ప్రచార కర్తవ్యంలో అరుణతార పాత్ర గణనీయం. 1970లలో ఉత్తర తెలంగాణలో విప్లవోద్యమ పునర్నిర్మాణ దశ నుంచి ఇవాళ దేశవ్యాప్తంగా [illegible] విప్లవ, ప్రజా పోరాటాల సంచనాలను అరుణతార తన శక్తినంతా వెచ్చించి అక్షరబద్ధం చేస్తున్నది. మరీ ముఖ్యం[illegible]డలో సల్వాజుడుం దుర్మార్గాలు మొదలైనప్పటి నుంచి ఇవ్వాల్టి ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడో దశ, సల్వాజుడుం రెండో దశ దాకా దండకారణ్య ప్రజా యుద్ధాన్ని, ప్రజారాజ్యాధికారాన్ని, ప్రత్యామ్నాయ రాజకీయార్థిక విధానాన్నీ, అక్కడి సాహిత్య, సాంస్కృతిక వికాసాన్నీ తెలుగు పాఠకులకు పరిచయం చేస్తున్నది. విశ్లేషిస్తున్నది. దండకారణ్య విప్లవోద్యమానికి సంఘీభావ హస్తాన్ని అందిస్తున్నది. ఈ పనిలో ఇతర ప్రజాస్వామిక పత్రికల పాత్ర కూడా ఉన్నప్పటికీ అరుణతార దాన్నే ఒక ప్రధాన కర్తవ్యంగా స్వీకరించింది. ఇటీవల పెరిగిపోయిన హిందూ ఫాసిస్టు ప్రమాదానికి వ్యతిరేకంగా లౌకిక ప్రజాస్వామిక కంఠస్వరాన్ని బలంగా వినిపిస్తున్నది. వేర్వేరు సామాజిక ఉద్యమాల ఆకాంక్షలను ఎత్తిపడుతూ వాటి న్యాయబద్ధతను విశ్లేషిస్తున్నది.

ప్రజా ఉద్యమాల్లోని కార్యకర్తల సృజనాత్మక వ్యక్తీకరణలకు అరుణతార అవకాశం ఇవ్వడం వల్ల వాళ్లలోంచి ఎందరో ప్రతిభావంతులైన ఆలోచనాపరులు, రచయితలు తయారువుతున్నారు. అరుణతార ఈ పని ఆది నుంచి చేస్తున్నది. అందువల్ల ఒక పక్క లబ్ధప్రతిష్టుల రచనలతోపాటు ఎప్పటికప్పుడు కొత్త గొంతులు అరుణతారలో వినిపిస్తుంటాయి.

అయితే మొదటి నుంచీ అరుణతార అనేక ఆర్థిక, నిర్వహణ సమస్యలను ఎదుర్కొంటున్నది. ఒక్కోసారి ఈ ఇబ్బందులు కాస్త తక్కువగా ఉన్నా, ఇటీవల తీవ్రమైన సంక్షోభాల మధ్య ఎప్పటికప్పుడు అభిమానుల, మిత్రుల అండదండలతో నడుస్తున్నది. గతంలో ఒకసారి అరుణతారకు విరాళాలు వద్దు.. చందాలు కట్టండనే ఆదర్శాన్ని కూడా అమలు చేసింది. అయితే నానాటికి పెరుగుతున్న ప్రెస్ ఛార్జీలు, నిర్వహణ ఖర్చులు మోయలేని భారమయ్యాయి. దీంతో రెండు నెల్లకో సంచిక వచ్చిన సందర్భాలూ ఉన్నాయి. అయితే పేజీలు పెంచి పాఠకులకు మరిన్ని రచనలు అందిస్తూ వచ్చాం.

ఈ అన్ని అనుభవాల దృష్ట్యా అరుణతారకు శాశ్వత నిధి తయారు చేయకుండా ఇక పత్రికను నాలుగుకాలాల పాటు నడపడం అయ్యేపని కాదని తేలింది. ఇంత కాలం అభిమానుల సహకారంతోనే నడుస్తూ వచ్చిన అరుణతార ఈసారి శాశ్వత నిధి కోసం మీ ముందుకు వచ్చింది. ఇవాళ ఉన్న విప్లవోద్యమ ప్రత్యేక పరిస్థితుల్లో అరుణతార అవసరం ఎంత ఉన్నదో పాఠకులకు తెలుసు. తెలుగు నేల మీద, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో ఉన్న అసంఖ్యాక విప్లవాభిమానులు తలాఒక చేయి వేస్తే శాశ్వత నిధి సమకూరడం కష్టమేమీ కాదని మా నమ్మకం. దాంతోనే మీ ముందుకు వచ్చాం. విప్లవోద్యమ [illegible]జకీయ, సాంస్కృతిక వేదిక అరుణతారకు మీవంతు విరాళాలు ఇవ్వాలని, ఇప్పించాలని కోరుకుంటూ...

డి.వి. రామక్రిష్ణారావు, అరుణతార సంపాదకుడు
పి. వరలక్ష్మి, విరసం కార్యదర్శి

విరాళాలు ఆన్‌లైన్‌లో పంపడానికి / డ్రాఫ్ట్, చెక్‌ల రూపంలో పంపడానికి వివరాలు :
డి.వి. రామక్రిష్ణారావు, అకౌంట్ నెం. 10243583773, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్.బి.ఐ.)
ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్ నెం. ఎస్.బి.ఐ.ఎన్.0007112, లాలాగుడ, సికింద్రాబాద్.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DUVVURI VENKATA RAMAKRISHNA RAO, PRINTED AT CHARITA IMPRESSIONS, DOOR NO: 1-9-1126/B, AZAMABAD, HYDERABAD – 500020, TELANGANA STATE, PUBLISHED AT 12-15-963, MANIKESWARNAGAR, OSMANIA UNIVERSITY CAMPUS, TARANAKA, HYDERABAD – 500007, TELANGANA STATE, EDITOR: DUVVURI VENKATA RAMAKRISHNA RAO.

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M188
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	08 February 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	164
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Nazima
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	Naveeda
పరీక్ష చేసినది	sireesha
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	[illegible]